

'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50 సంపుటి: 16 సంచిక: 62

బుధవారం 24-5-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



చెన్నై 'విజిల్ పాడు'

ఐపీఎల్ ఫైనల్లోకి సూపర్‌కింగ్స్. క్వాలిఫయర్-1లో గుజరాత్‌పై గెలుపు. - 12లో



అవకాశాలను సృష్టించుకోవాలి

తన అనుభవాలను 'సాక్షి'తో పంచుకున్న ఇమాజియా కంపెనీ సీఈవో వీణ. - 11లో



కేంద్రంపై పోరులో మీవెంటే...

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌పై పోరులో కేజ్రీవాల్‌కు మద్దతుగా నిలుస్తామని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ప్రకటించారు. - వివరాలు 6లో



సిసోడియా పట్ల అనుచిత ప్రవర్తన

కోర్టుకు హాజరైన సిసోడియా మీడియాతో మాట్లాడేందుకు యత్నించగా, పోలీసులు ఆయన్న మెడపట్టి లాగడం వివాదమైంది. - వివరాలు 6లో



ఇక వందే భారత్ స్లీపర్ రైళ్లు

ప్రస్తుతం కేవలం చైర్ కార్ కోచ్‌లతో నడుస్తున్న వందేభారత్ రైళ్లలో స్లీపర్ కోచ్‌లను ప్రవేశపెట్టాలని రైల్వే శాఖ నిర్ణయించింది. - వివరాలు 14లో



బీకాం.. భారీగా ఇన్‌కం

ఈ-మార్కెటింగ్‌తో ఉపాధి అవకాశాలు భారీగా పెరగడంతో కామర్స్ విద్యార్థులకు డిమాండ్ పెరిగింది. - వివరాలు 2లో

న్యూస్‌రీల్

6.84 లక్షల మందికి కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లు



ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 6.84 లక్షల గర్భిణులకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లు అందజేస్తామని మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు. 24 జిల్లాల్లోని 111 కేంద్రాల్లో కిట్ల పంపిణీ ఉంటుందని తెలిపారు.

- వివరాలు 14లో

జూన్ 5 నుంచి రెండో విడత గొర్రెల పంపిణీ



రెండో విడత సబ్సిడీ గొర్రెల పంపిణీకి రంగం సిద్ధమైంది. వచ్చే నెల 5వ తేదీ నుంచి రాష్ట్రంలో రెండో విడత గొర్రెల పంపిణీని ప్రారంభించనున్నట్లు రాష్ట్ర పశుసంవర్థక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రకటించారు.

- వివరాలు 3లో

9న చేప ప్రసాదం పంపిణీ



మృగశిరకార్తె సందర్భంగా నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జూన్ 9న చేప ప్రసాదం పంపిణీ చేయనున్నట్లు మంత్రి తలసాని పేర్కొన్నారు. సచివాలయంలో మంగళవారం చేప ప్రసాదం పంపిణీ చేసే బత్తిన సోదరులతో మంత్రి సమావేశం నిర్వహించారు.

- వివరాలు 14లో

సివిల్స్‌లో మనోళ్లు మెరిశారు

తుది ఫలితాల్లో ర్యాంకులు సాధించిన 50 మంది అభ్యర్థులు

- నారాయణపేట జిల్లా ఎస్పీ కుమార్తె ఉమా హారతికి ఆలిండియా 3వ ర్యాంకు
- ప్రతిభ చాటిన పేదింటి బిడ్డలు...
- విజేతలకు సీఎంలు కేసీఆర్, వైఎస్ జగన్ శుభాకాంక్షలు


1 ఇషితా కిశోర్


2 గరిమా లోహియా


4 స్మృతీ మిశ్రా


3 ఉమా హారతి

సివిల్స్‌లో నారీభేరీ
- మొదటి నాలుగు ర్యాంకులు వారివే... ఫస్ట్ ర్యాంకర్ ఇషితా కిశోర్
- తెలుగు యువతి నూకల ఉమా హారతికి మూడో ర్యాంక్
- అర్హత సాధించిన 933 మంది అభ్యర్థులు - వివరాలు 6లో


సాక్షి, హైదరాబాద్: సివిల్స్-2022 తుది ఫలితాల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు సత్తా చాటారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) మొత్తం 933 మంది అభ్యర్థులను అఖిల భారత సర్వీసులకు ఎంపిక చేయగా వారిలో జాతీయ స్థాయిలో మూడో ర్యాంకుతో పాటు 50 వరకు ర్యాంకులను తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు కైవసం చేసుకున్నట్లు ఫలితాల ప్రాథమిక సమాచారం ఆధారంగా తెలుస్తోంది. ర్యాంకర్లలో పేదింటి కుటుంబాలకు చెందిన వారితో పాటు సాధారణ వ్యవసాయ కుటుంబాలకు చెందిన వారు సైతం ఉన్నారు. నారాయణపేట జిల్లా ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు కుమార్తె నూకల ఉమా హారతి ఆలిండియా 3వ ర్యాంకు కైవసం చేసుకున్నారు. ఆమె ఐదో ప్రయత్నంలో ఈ ర్యాంక్ సాధించారు. అలాగే జీవీఎస్ పవన్ దత్తా 22వ ర్యాంకు, మంచిర్యాల జిల్లాకు చెందిన అజ్మీరా సంకేత్ 35వ ర్యాంకు, హనుమకొండకు చెందిన శ్రీసాయి అశ్రిత్ శాఖమూరికి 40వ ర్యాంకు, హెచ్ఎస్ భావనకు 55వ ర్యాంకు, సాయి ప్రణవ్‌కు 60వ ర్యాంకు, ఆవుల సాయికృష్ణకు 94వ ర్యాంకులు సాధించారు. వారితోపాటు నిధిపాయ్ 110, అనుగు శివమారుతీరెడ్డి 132, రాళ్లపల్లి సంపత్‌కుమార్ 157, కమతం మహేశ్‌కుమార్ 200, రావుల జయసింహారెడ్డి 217, సాహిత్య 243, అంకుర్ కుమార్ 257, బొల్లం మహేశ్వర్‌రెడ్డి 270, చల్లా కళ్యాణి 285, పాలువాయి విష్ణువర్ధన్‌రెడ్డి 292, సాయికృష్ణ 293 ర్యాంకు పొందారు. అలాగే 222, 285, 384, 410, 460, 510, 558, 583, 593, 640, 759, 801, 827, 885 వంటి ర్యాంకులను తెలుగు అభ్యర్థులు

మిగతా 3వ పేజీలో ▶

పోడు పట్టాల పండగ!

జూన్ 24 నుంచి 30 వరకు పంపిణీ.. స్వయంగా హాజరుకానున్న సీఎం కేసీఆర్

- లబ్ధిదారులైన గిరిజనులకు రైతుబంధు కూడా వర్తింపు
- బ్యాంకు ఖాతాలు తెరిచి నగదు జమ చేయనున్న ప్రభుత్వం
- గ్రామాల్లో నివాసయోగ్య భూములు నిరుపేదలకు పంపిణీ
- జూలై నుంచి గృహలక్ష్మి షురూ
- సచివాలయంలో ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష


మంగళవారం సచివాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: గిరిజనులకు పోడు భూములకు సంబంధించిన పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని జూన్ 24 నుంచి 30 వరకు నిర్వహించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. పోడు పట్టాలు పొందిన గిరిజనుల వివరాలు సేకరించి రైతుబంధు పథకాన్ని వర్తింప చేయాలని ఆదేశించారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రోజు వారీ కార్యక్రమాల షెడ్యూల్ ఖరారు, పోడు పట్టాల పంపిణీ, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై మంగళవారం సచివాలయంలో సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పోడు పట్టాల పంపిణీ కార్యక్రమానికి తాను స్వయంగా హాజరవుతానని సీఎం తెలిపారు. అటవీ హక్కుల గుర్తింపు చట్టం (ఆర్ఓఎఫ్ఆర్)-2006 కింద పట్టాలు పొంది రైతుబంధు అందుకుంటున్న గిరిజన రైతులతో, కొత్తగా పోడు పట్టాలు అందుకోబోతున్న గిరిజన లబ్ధిదారులను క్రోడీకరించాలని సూచించారు. ఇతర రైతుల తరహాలోనే వీరికీ రైతుబంధు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వమే బ్యాంకు ఖాతాలను తెరిచి పోడు భూముల పట్టాలు యజమానులకు నేరుగా వారి ఖాతాల్లో రైతుబంధు మొత్తాన్ని జమ చేస్తుందని చెప్పారు. కొత్తగా పోడు పట్టాలు అందుకుంటున్న గిరిజన రైతుల బ్యాంకు ఖాతాల వివరాలను ఆర్థిక శాఖకు అందజేయాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌ను కేసీఆర్ ఆదేశించారు.

అర్హులైన నిరుపేదలకు భూములు

గ్రామాల్లో ఇంకా మిగిలి వున్న నివాస యోగ్యమైన ప్రభుత్వ భూములను గుర్తించి, దశాబ్ది ఉత్సవాల సందర్భంగా అర్హులైన నిరుపేదల ఇళ్ల నిర్మాణాల కోసం పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. సొంత జాగాలో ఇళ్ల నిర్మాణానికి రూ.3 లక్షల ఆర్థిక సహాయం అందించేందుకు ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం విధివిధానాలను త్వరితగతిన తయారు చేయాలని, జూలైలో

మిగతా 5వ పేజీలో ▶

జూన్ 2 నుంచి 22 వరకు.. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు

ఉత్సవాల షెడ్యూల్‌ను ఖరారు చేసిన సీఎం కేసీఆర్ - 2లో





మంగళవారం సిడ్నీలోని కుడోస్ బ్యాంక్ ఎరీనాలో జరిగిన కార్యక్రమంలో ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో భారత ప్రధాని మోదీ. దేశంలోని పెద్ద ఇండోర్ స్టేడియాల్లో ఒకటైన 20 వేల మంది సామర్థ్యమున్న ఎరీనా పూర్తిగా మోదీ అభిమానులతో కిక్కిరిసిపోయింది.

నమ్మకమే పునాది

ఆస్ట్రేలియాతో సుదృఢ బంధం: మోదీ

కిక్కిరిసిన సిడ్నీ ఇండోర్ స్టేడియం

20 వేల మందికి పైగా హాజరు

ఆద్యంతం మోదీ నినాదాలే

ఆస్ట్రేలియా ప్రధాని విస్మయం

6లో

"భారత్-ఆస్ట్రేలియా మధ్య భౌగోళికంగా చాలా దూరమున్నా హిందూ మహాసముద్రం రెండింటినీ నిరంతరం కలిపే ఉంచుతోంది. ఇరు దేశాల బంధాలకు ఒకప్పుడు '3సి'లు (కామన్వెల్త్, క్రికెట్, కర్రీ) ప్రతీకగా ఉండేవి. తర్వాత '3డి'లు (డెమొక్రసీ, దయాస్పొరా, దోస్తీ)గా మారింది. ఇప్పుడది '3ఇ'లు (ఎనర్జీ, ఎకానమీ, ఎడ్యుకేషన్)గా రూపాంతరం చెందింది. ఇరు దేశాల బంధాల్లోని గాఢత ఈ నిర్వచనాలన్నింటినీ ఎప్పుడో అధిగమించింది. క్రికెట్ అయితే ఎన్నో దశాబ్దాలుగా కలిపి ఉంచుతూ వచ్చింది. కొన్నేళ్లుగా ఈ జాబితాలో యోగా కూడా చేరింది. - మోదీ

అవినాశ్ ముందస్తు బెయిల్‌పై నిర్ణయానికి ఇన్ని రోజులా!

- ఆదేశాలిచ్చినా ఉత్తర్వులు జారీ చేయకపోవడమేమిటి?
- 25న అవినాశ్‌రెడ్డి పిటిషన్‌పై నిర్ణయం తీసుకోండి
- తెలంగాణ హైకోర్టు వెకేషన్ బెంచ్‌కు సుప్రీంకోర్టు ధర్మాసనం సూచన
- బెయిల్ కోరే హక్కు పిటిషనర్‌కు ఉంది
- సునీత తరఫు న్యాయవాదితో జస్టిస్ నరసింహ

- వివరాలు 10లో


స్టేట్ స్ట్రీట్ ప్రతినిధులతో మంత్రి కేటీఆర్. చిత్రంలో ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్

'స్టేట్ స్ట్రీట్'తో మరో 5వేల ఉద్యోగాలు

- హైదరాబాద్‌లో విస్తరించనున్న ఆ సంస్థ కార్యకలాపాలు
- అమెరికాలో మంత్రి కేటీఆర్‌తో 'స్టేట్ స్ట్రీట్' ప్రతినిధుల భేటీ
- రాష్ట్రంలో బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్ రంగాలకు ఊతం

2లో

ఇతర రాష్ట్రాల్లోనూ 'కర్ణాటక' ఫలితం!



రోడ్‌మ్యాప్ రెడీ చేయనున్న ఏఐసీసీ
- 26న ఢిల్లీకి రావాల్సిందిగా టీపీసీసీ ముఖ్య నేతలకు పిలుపు
- ఎన్నికల వ్యూహానికి పదును పెట్టే యోచన
- తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో నేతల మధ్య ఐక్యతే ప్రధానాంశం

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది చివరలో ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లోనూ కర్ణాటక తరహా ఫలితం వెలువడేలా చేయాలని పట్టుదలగా ఉన్న కాంగ్రెస్ పార్టీ ఆ మేరకు రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసే ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఎన్నికలను ఎదుర్కొనే వ్యూహానికి పదును పెట్టే క్రమంలో తెలంగాణతో పాటు ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్తాన్, మిజోరం రాష్ట్రాల నేతలతో చర్చించేందుకు సమాయత్తమైంది. దీనిలో భాగంగా 26న ఢిల్లీకి రావాల్సిందిగా టీపీసీసీ ముఖ్య నేతలకు ఆహ్వానం పంపినట్లు ఏఐసీసీ వర్గాలు వెల్లడించాయి.

నివేదికల ఆధారంగా కీలక సూచనలు!


ఐదు రాష్ట్రాల నేతలతో జరిగే భేటీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు, మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, పార్టీ సంస్థాగత వ్యవహారాల కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పాల్గొననున్నారు. ఈ భేటీలో ప్రధానంగా ఆయా రాష్ట్రాల్లో నేతల మధ్య భేదాభిప్రాయాలు, ఐక్యతా యత్నాలు, ఎన్నికల వ్యూహాలు, సంస్థాగతంగా బలోపేతంపై చర్చించనున్నారు. రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌తో పాటు తెలంగాణలకు సంబంధించి నేతల ఐక్యతకే తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డితో ముఖ్య నేతలకు విభేదాలు తీవ్రంగా ఉన్నాయి. పీసీసీ కమిటీలు మొదలు, కొన్ని నియోజకవర్గాల్లో సొంతంగా అభ్యర్థుల ప్రకటన వంటి అంశాల్లో రేవంత్ తీరుపై కొందరు గుర్రుగా ఉన్నారు. పీసీసీ నిర్వహించే

మిగతా 5వ పేజీలో ▶


విపక్షాల భేటీలో మనదే పై'చేయి' ఉండేట్లు కీలకంగా వ్యవహరించాలి

కాళేశ్వరం మూడో లింక్ పూర్తి..

- తొలి పంప్‌హౌస్ వెట్‌రన్ సక్సెస్
- మధ్యమానేరు నుంచి మల్కాపేటకు గోదావరి పరవళ్లు
- 2వారాల్లో రెండో పంప్‌హౌస్‌కు వెట్‌రన్




సాక్షి, హైదరాబాద్/సిరిసిల్ల: ప్రతిష్టాత్మక కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. ప్రాజెక్టు 9వ ప్యాకేజీలో భాగంగా..రాజరాజేశ్వర జలాశయం (మధ్యమానేరు) నుంచి ఎగువ మానేరు జలాశయానికి గోదావరి జలాలను ఎత్తిపోయడానికి చేపట్టిన లింక్ -3 లోని ప్రధాన పనులు (హెడ్ వర్క్స్) పూర్తయ్యాయి. నీటిపారుదల శాఖ రామగుండం ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు, ఎత్తిపోతల పథకాల సలహాదారులు పెంటారెడ్డి ఆధ్వర్యంలో తొలి పంప్‌హౌస్‌కు మంగళవారం ఉదయం 7 గంటలకు నిర్వహించిన వెట్‌రన్ విజయవంతమైంది. మధ్యమానేరు జలాశయం నుంచి అప్రోచ్ కాల్వ ద్వారా 12 కి.మీ.లకు పైగా సొరంగ మార్గంలో తరలివచ్చిన గోదావరి జలాలను ధర్మారం వద్ద నిర్మించిన తొలి పంప్‌హౌస్ ద్వారా మల్కాపేట జలాశయంలోకి ఎత్తిపోశారు. అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా మైసమ్మ చెరువు, సింగసముద్రంకు గోదావరి జలాలు తరలివెళ్లనున్నాయి. ఆ తర్వాత రెండో

మిగతా 2వ పేజీలో ▶

పంచాయతీలకు రూ.1,190 కోట్లు విడుదల

- గ్రామాల్లో వివిధ పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం
- అధికారులతో భేటీలో నిర్ణయించిన మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి




సాక్షి, హైదరాబాద్: గ్రామ పంచాయతీలకు రూ.1,190 కోట్లు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పంచాయతీల్లో వివిధ పనులకు సంబంధించి నిధుల విడుదలలో భాగంగా ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయించింది. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రెండు రోజుల కిందట సీఎస్ శాంతికుమారితో జరిపిన భేటీలో ఆర్థిక మంత్రి టి.హరీశ్ రావు, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు గ్రామ పంచాయతీలకు నిధుల విడుదల అంశంపై చర్చించారు. దీనికి కొనసాగింపుగా మంగళవారం హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు మరోసారి సమావేశమైన సందర్భంగా ఈ మేరకు నిధులను విడుదల చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పల్లెల్లో ప్రగతిని దృష్టిలో పెట్టుకుని ఎన్ని ఇబ్బందులున్నా సీఎం నిధులు విడుదల చేశారని మంత్రి ఎర్రబెల్లి వెల్లడించారు. కాగా, మంగళవారం మంత్రి ఎర్రబెల్లిని సర్పంచ్‌ల సంఘం ప్రతినిధులు కలిసి పెండింగ్‌లో ఉన్న నిధుల విడుదల పట్ల హర్షం వ్యక్తం

మిగతా 5వ పేజీలో ▶

సీఎం అంటే అంతా కలిసి ఓడిస్తారు!

- పుట్టినరోజు సందర్భంగా అనుచరులు సీఎం అంటూ నినాదాలు చేయడంపై ఎంపీ కోమటిరెడ్డి వ్యాఖ్య



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం తన 60వ పుట్టిన రోజు సందర్భంగా హడావుడి చేశారు. అనుచర గణంతో కలిసి హంగామా సృష్టించారు. ఆయన ఓ రకంగా బల ప్రదర్శనకు దిగడం రాష్ట్ర కాంగ్రెస్‌తో పాటు జిల్లా రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తన జన్మదినాన్ని ఎప్పుడూ ఓ మోస్తరు హడావుడితో జరుపుకొనే వెంకట్‌రెడ్డి.. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ హైదరాబాద్ నుంచి బ్రాహ్మణ వెల్లెంల వరకు భారీ ప్రదర్శనగా రావడం, అక్కడ వేలాది మంది అనుచరుల సమక్షంలో కేక్ కట్ చేసి రాజకీయ వేడి పుట్టించే వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశమైంది. తాను మంత్రిగా ఉన్న సమయంలో మంజూరు చేయించిన బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టు సాక్షిగా తనదైన శైలిలో మాట్లాడి కేడర్‌లో ఉత్తేజాన్ని కలిగించే ప్రయత్నం చేశారు. ప్రాజెక్టు వద్ద కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు చేసి కేక్ కట్ చేసిన సందర్భంగా ఆయన అనుచరులు సీఎం.. సీఎం.. అంటూ

మిగతా 5వ పేజీలో ▶

క్లుప్తంగా...

టీపీసీసీ ప్రొటోకాల్ చైర్మన్‌గా హర్కర



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ప్రొటోకాల్ కమిటీ చైర్మన్‌గా సీనియర్ నేత హర్కర వేణుగోపాల్ రావు మరోమారు నియమితులయ్యారు. ఏఐసీసీ ముఖ్య నేతల రాష్ట్ర పర్యటనలను సమన్వయం చేసుకోవడం, వారి పర్యటనల సందర్భంగా అవసరమైన ఏర్పాట్లు చేయడంలో కీలక భూమిక పోషించే ఈ ప్రొటోకాల్ కమిటీని పునర్వ్యవస్థీకరిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్ రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రొటోకాల్ కమిటీ చైర్మన్‌గా హర్కర వేణుగోపాల్ రావు, వైస్ చైర్మన్‌గా ఎంఏ ఫహీమ్, సభ్యులుగా అజయ్ కుమార్, సూదిని మహేందర్, కర్నె శ్రీనివాస్, సూరజ్ తివారి, బంగారు బాబులను నియమిస్తున్నట్లు ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. త్వరలోనే రాష్ట్రంలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రొటోకాల్ కమిటీని పూర్తి స్థాయిలో నియమించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

బీసీ డిక్లరేషన్ ప్రకటించకపోతే గుణపాఠం



కాచిగూడ (హైదరాబాద్): బీసీ డిక్లరేషన్ ప్రకటించని పార్టీలకు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన మంగళవారం జరిగిన బీసీ కోర్ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు బీసీలకు 50% సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్ గౌడ్

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శిగా మండవ శ్రీనివాస్ గౌడ్‌ను నియమిస్తూ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నియామకపు పత్రాన్ని అందజేశారు.

రేవంత్ క్షమాపణ చెప్పాల్సిందే

యాదవ, కురుమ జేఏసీ హెచ్చరిక



పంజగుట్ట (హైదరాబాద్): గొల్ల, కురుమలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఈ నెల 24వ తేదీలోపు బహిరంగ క్షమాపణ చెప్పకపోతే 25న ఇందిరా పార్క్ నుంచి వందలాది దున్నపోతులు, బర్రెలు, గొర్లతో మహా ర్యాలీ నిర్వహించి గాంధీ భవన్‌ను ముట్టడిస్తామని యాదవ, కురుమ జేఏసీ హెచ్చరించింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జేఏసీ కన్వీనర్ కడారి అంజయ్య యాదవ్, కో–కన్వీనర్ గోసుల శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు రాజారామ్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్ విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 11న రేవంత్‌రెడ్డి మంత్రి తలసానిని ఉద్దేశించి దున్నపోతులు కాస్తాడు, పేడ పిసుక్కుంటాడు.. అని అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజల్లోకి పదేళ్ల విజయాలు

మంత్రి సత్యవతి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ పదేళ్లలో సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అధికారులను ఆదేశించారు. ఆమె సచివాలయంలో మంగళవారం అధికారులు, డాక్యుమెంటరీ ఏజెన్సీ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ, వచ్చే నెల 2 నుంచి ప్రారంభమయ్యే 21రోజుల దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అంగన్ వాడీలు, మహిళా సమాఖ్యల వద్ద కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో మహిళా అభివృద్ధి సంక్షేమశాఖ కార్యదర్శి భారతి హోలీ కెరీ పాల్గొన్నారు.

శ్రీరాం సాగర్ నిర్వాసితులకు పరిహారం ఇవ్వరా?

ప్రభుత్వ తీరును తప్పుబట్టిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: శ్రీరాంసాగర్ నిర్మాణ సమయంలో భూమిని తీసుకుని పునరావాసం కింద జీవో ప్రకారం భూమి ఇవ్వని ప్రభుత్వ తీరును హైకోర్టు తప్పుబట్టింది. ఈ కేసులో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలని అధికారులను ఆదేశించింది. ప్రభుత్వ పనుల కోసం ప్రజల నుంచి భూమి తీసుకున్నప్పుడు పునరావాసం కల్పించడం అధికారుల బాధ్యతని చెప్పింది. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం మగ్గిడి గ్రామ పరిధిలోని తన 7.39 ఎకరాల భూమిని, అర ఎకరం విస్తీర్ణంలోని రెండు ఇళ్లను అధికారులు శ్రీరాంసాగర్ నిర్మాణ సమయంలో సేకరించారని, ఇప్పటివరకు పరిహారం అందించలేదని పేర్కొంటూ కె.యెమ్మారెడ్డి 2021లో హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు విన్న ధర్మాసనం.. అన్ని అంశాలను పరిశీలించిన తర్వాతే సింగిల్ జడ్జి తీర్పు వెలువరించారని, అందులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదంటూ ప్రభుత్వ అప్పీల్‌ను కొట్టివేసింది. సింగిల్ జడ్జి తీర్పును సమర్థించింది.

బీకాం.. భారీగా ఇన్‌కం!



సాక్షి, హైదరాబాద్

కొన్నేళ్లుగా తెలంగాణ సహా దేశవ్యాప్తంగా బీకాం డిగ్రీ కోర్సుకు గిరాకీ పెరుగుతోంది. 2022–23 విద్యా సంవత్సరంలో మొత్తం డిగ్రీ సీట్లు 2,10,970 ఉంటే, అందులో 87,480 మంది కామర్స్ కోర్సుల్లోనే చేరారు. అంటే 40 శాతంపైగా ఈ కోర్సును ఎంచుకుంటున్నారు. ఈ విద్యా సంవత్సరంలోనూ ఇదే ట్రెండ్ కొనసాగొచ్చని అధికార వర్గాలు అంటున్నాయి. ఈ–కామర్స్ పెరిగిన తర్వాత ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉండటమే దీనికి కారణమని నిపుణులు చెబుతున్నారు. ఆరేళ్ల కిందట 46 శాతం సైన్స్ విద్యార్థులు డిగ్రీలో చేరితే, ఇప్పుడు వీరి సంఖ్య 36 శాతానికి పడిపోయింది. రాష్ట్రంలోనూ మిగతా డిగ్రీ కోర్సులకన్నా, కామర్స్‌ను అన్ని ప్రాంతాల్లోనూ ఆధునీకరించారు. కంప్యూటర్స్, అనాలసిస్ వంటివి జోడించడం వల్ల ప్రపంచవ్యాప్తంగా కామర్స్ ద్వారా ఉపాధి లభిస్తోందని చెబుతున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల మాదిరి వేతనాలు వస్తున్నాయనే అభిప్రాయం బలపడుతోంది. 2023లో స్కిల్ ఇండియా వెలువరించిన నివేదికలోనూ ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. బీటెక్ విద్యార్థుల కన్నా.. బీకాం విద్యార్థులే 2023లో ఎక్కువ ఉద్యోగాలు పొందనున్నట్లు నివేదిక అంచనావేసింది. 2017లో 37.98 శాతం బీకాం విద్యార్థులు ఉద్యోగాలు పొందితే, 2023లో ఇది ఏకంగా 60.62 శాతానికి చేరనున్నట్లు విశ్లేషించింది. ఈ– కామర్స్ పెరగడం వల్ల అనలిస్టుల అవసరం పెరిగిందని, జీఎస్టీ తెచ్చిన తర్వాత ట్యాక్స్ నిపుణుల ప్రాధాన్యత ఎక్కువైందని 'స్కిల్ ఇండియా' తెలిపింది. బ్యాంకింగ్, ఫైనాన్స్, రిటైల్ బిజినెస్ వ్యవస్థ కూడా కామర్స్ కోర్సుల విద్యార్థులకు ఉపాధి పెంచేలా చేసినట్లు చెప్పింది. అనలిస్ట్ ఉద్యోగుల వేతనం కూడా మూడేళ్లలో 98 శాతం పెరిగినట్లు పేర్కొంది.

కొత్త సబ్జెక్టుల మేళవింపు

కామర్స్ కోర్సులో అనేక మార్పులు తెచ్చారు. కంప్యూటర్స్, ట్యాక్సేషన్, ఆనర్స్, బిజినెస్ అనలిటిక్స్ వంటి కొత్త సబ్జెక్టులు తెచ్చారు. స్టాక్ మార్కెట్ ట్రెండ్‌ను అంచనా వేసే టెక్నాలజీని కూడా మేళవించారు. బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల్లో కామర్స్ నేపథ్యం ఉన్న సిబ్బంది అవసరం పెరిగింది.

ఈ-మార్కెటింగ్‌తో పెరిగిన ఉపాధి అవకాశాలు.. డేటా అనాలసిస్ తోడైతే మరీ మోజు..

జీఎస్టీ వచ్చాక పెరిగిన టాక్స్ నిపుణుల ప్రాధాన్యత.. 60% ఉద్యోగాలు వారివే..

డిగ్రీ కామర్స్‌లో భారీగా చేరికలు... కోవిడ్ తర్వాత పెరిగిన డిమాండ్

స్కిల్ ఇండియా నివేదిక ప్రకారం... కొన్నేళ్లుగా ఏ కోర్సుతో ఎంత ఉపాధి (శాతంలో)?

కోర్సు	2017	2018	2019	2020	2021	2022	2023
బీటెక్	50.69	51.52	57.09	49.00	46.82	55.15	57.44
ఎంబీఏ	42.28	39.4	36.44	54.00	46.59	55.09	60.1
బీఏ (ఆనర్స్)	35.66	37.39	29.3	48.00	42.72	44.2	49.2
బీకాం	37.98	33.93	30.6	47.00	40.3	42.62	60.62
బీఎస్సీ	31.76	33.62	47.37	34.00	30.34	38.06	37.69
ఎంసీఏ	31.36	43.85	43.19	25.00	22.42	29.3	30.64
ఐటీఐ	42.22	29.46	-	-	-	31.3	34.2
పాలిటెక్నిక్	25.77	32.67	18.05	32	25.02	21.42	27.61
బీఫార్మసీ	42.30	47.78	36.29	45	37.24	44.63	57.51

సాఫ్ట్‌వేర్‌తో పోటీ...



మారిన వాణిజ్య విధానం సరికొత్త టెక్నాలజీతో కూడిన అనలిస్టుల కోసం ఎదురుచూస్తోంది. విస్తృతమైన మార్కెట్ అవసరాలను పెంచింది. దీన్ని దృష్టిలో ఉంచుకునే బీకాం కోర్సును మరింత అభివృద్ధి చేస్తున్నాం. అంతర్జాతీయ ప్రమాణాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. దీన్ని ఏ హైదరాబాద్ నగరానికో పరిమితం చేయకుండా, అన్ని జిల్లాలకూ విస్తరించేలా జాగ్రత్తలు తీసుకున్నాం.

– ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, ఉన్నత విద్యామండలి చైర్మన్

మూడు రోజులు అధిక ఉష్ణోగ్రతలు


నేడు అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు



సాక్షి, హైదరాబాద్: రాగల మూడు రోజులు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల సెల్సియస్ నుండి 43 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. హైదరాబాద్, చుట్టుపక్కల జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు 38 డిగ్రీల నుంచి 40 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. మరోవైపు ఉత్తర – దక్షిణ ద్రోణి విదర్భ నుండి మరఠ్వాడ మీదుగా ఉత్తర ఇంటీరియర్ కర్ణాటక వరకు సగటు సముద్ర మట్టానికి కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోంది. దీంతో తెలంగాణ రాష్ట్రంలో బుధవారం అక్కడక్కడ తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించింది. గురువారం పొడి వాతావరణం నెలకొనే అవకాశం ఉంది.

మంగళవారం రాష్ట్రంలో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలివి

ప్రాంతం	గరిష్ట ఉష్ణోగ్రత		
ఈసాల తక్కళ్లపల్లి (పెద్దపల్లి)	44.7	రామగుండం	41.6
అర్లి (ఆదిలాబాద్)	44.4	నిజామాబాద్	41.5
తాళమడుగు (ఆదిలాబాద్)	44.2	నల్లగొండ	40.5
చాప్రాల (ఆదిలాబాద్)	44.2	మెదక్	40.4
మల్లాపూర్ (జగిత్యాల)	44.1	ఖమ్మం	40.0
నాస్పూర్ (మంచిర్యాల)	44.1	హనుమకొండ	39.0
కెరమెరి (కొమురంభీం)	44.0	భద్రాచలం	38.8
మెండోరా (నిజామాబాద్)	43.8	మహబూబ్‌నగర్	38.6
మల్యాలపల్లి (పెద్దపల్లి)	43.5	పటాన్‌చెరు	37.4
కుంతల (నిర్మల్)	43.5	హైదరాబాద్	37.4
ఆదిలాబాద్	42.5	రాజేంద్రనగర్	36.5
		హయత్‌నగర్	36.0



మల్కపేట రిజర్వాయర్‌లోకి చేరుతున్న గోదావరి జలాలు

కాళేశ్వరం మూడో లింక్ పూర్తి

▶ మొదటి పేజీ తరువాయి

పంప్‌హౌస్ ద్వారా ఎగువ మానేరు జలాశయంలోకి నీళ్లను ఎత్తిపోయనున్నారు. ప్యాకేజీలో భాగంగానే 3 టీఎంసీల సామర్థ్యంతో మల్కాపేట జలాశయం, 0.112 టీఎంసీల సామర్థ్యంతో బట్టల చెరువును కొత్తగా నిర్మించడంతో పాటు మరో ఐదు చెరువుల నిల్వ సామర్థ్యాన్ని పెంచారు. మరో వారం 15 రోజుల్లో దమ్మన్నపేట వద్ద నిర్మించిన రెండో పంప్‌హౌస్‌కు వెట్‌రన్ నిర్వహించి గోదావరి జలాలను ఎత్తిపోయనున్నట్టు నీటిపారుదల శాఖ వర్గాలు తెలిపాయి.

70 వేల ఎకరాల కొత్త ఆయకట్టు..

కాళేశ్వరం ప్రాజెక్టు లింక్–3 ప్యాకేజీలో భాగంగా 120 రోజుల్లో 11.635 టీఎంసీల గోదావరి జలాలను మధ్యమానేరు నుంచి ఎగువ మానేరు జలాశయానికి తరలించాల్సి ఉంది. మధ్యమానేరు నుంచి ధర్మావరం వరకు 12 కి.మీల సొరంగమార్గం నిర్మాణంలో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. సొరంగం కూలిపోవడం, వర్షపు నీళ్లతో నిండిపోవడం వంటి ఘటనలతో పనులు ఆలస్యమయ్యాయి. ఇలావుండగా లింక్–3 ప్రాజెక్టు ద్వారా రాజన్న సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో 70 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీటి సరఫరాతో పాటు 26,150 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణను ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఆయకట్టు స్థిరీకరణలో భాగంగా 156 చెరువులను నింపనుంది.

ఖరీఫ్‌లో 12వేల ఎకరాలకు నీరు...

కాళేశ్వరం లింక్–3 ప్రాజెక్టులో భాగంగా వచ్చే ఖరీఫ్‌లో 8 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు, 4 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు కలిపి మొత్తం 12వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉంది. మొత్తం 9 డిస్ట్రిబ్యూటరీలను నిర్మించాల్సి ఉండగా, 5 డిస్ట్రిబ్యూటరీల పనులు జరుగుతున్నాయి. భూసేకరణ సమస్యలతో డిస్ట్రిబ్యూటరీలు, మైనర్ల పనుల్లో కొంత జాప్యం జరుగుతోంది. వీటి నిర్మాణం పూర్తైతే లక్ష్యం మేరకు మొత్తం ఆయకట్టుకు సాగునీరు అందించగలమని అధికారులు తెలిపారు.

'స్టేట్ స్ట్రీట్'తో మరో ఐదువేల ఉద్యోగాలు

- హైదరాబాద్‌లో విస్తరించనున్న సంస్థ కార్యకలాపాలు
- అమెరికాలో మంత్రి కేటీఆర్‌తో సంస్థ ప్రతినిధుల భేటీ

సాక్షి, హైదరాబాద్: ప్రపంచంలోనే అతిపెద్ద అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ స్టేట్ స్ట్రీట్ హైదరాబాద్‌లో తన కార్యకలాపాలు విస్తరించాలని నిర్ణయించింది. తద్వారా కొత్తగా 5వేల కొత్త ఉద్యోగాలు కల్పించాలని భావిస్తోంది. దీంతో రాష్ట్రంలో బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్ రంగాలకు ఊతం లభిస్తుందని అంచనా వేస్తున్నారు. అమెరికా పర్యటనలో ఉన్న ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్‌తో బోస్టన్ నగరంలో మంగళవారం స్టేట్ స్ట్రీట్ ప్రతినిధులు భేటీ అయ్యారు. స్టేట్ స్ట్రీట్ ప్రకటన ద్వారా ప్రధానంగా నిధుల నిర్వహణ, కస్టోడియన్ సర్వీసెస్, అసెట్ మేనేజ్‌మెంట్ రంగాల్లో కొత్త అవకాశాలు లభించనున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్ సహా ఇతర ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఆధారిత ఉద్యోగాలను సంస్థ భర్తీ చేయనుంది. 2017 నవంబర్‌లో హైదరాబాద్‌లో కార్యకలాపాలు ప్రారంభించిన స్టేట్ స్ట్రీట్ కార్పొరేషన్ ఇప్పటికే వెయ్యి మందికి ఉపాధి కల్పిస్తోంది. కొత్త నియామకాల అనంతరం బోస్టన్ తర్వాత అతిపెద్ద కార్యాలయాన్ని ఈ సంస్థ హైదరాబాద్‌లో కలిగి ఉండనుంది. ఈ భేటీలో సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ అనోయ్ బెనర్జీ, ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్, పెట్టుబడుల ప్రోత్సాహక విభాగం ముఖ్యకార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, చీఫ్ రిలేషన్ ఆఫీసర్ అమర్నాథరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు

క్లీన్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ లక్ష్యంగా కాలిఫోర్నియా వర్సిటీ ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: అమెరికాలో తెలంగాణ ప్రతినిధి బృందం పర్యటనలో మంగళవారం కూడా పెట్టుబడులు రావడంతోపాటు పలు భాగస్వామ్య ఒప్పందాలు కుదిరాయి. ఐటీ పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్ నేతృత్వంలోని బృందం మంగళవారం పలు సంస్థలతో చర్చలు జరిపింది. ఈ సందర్భంగా డిజిటల్ సేవల రంగంలో పేరొందిన 'గ్రిడ్ డైనమిక్స్ లిమిటెడ్' హైదరాబాద్‌లో ఉన్న ప్రస్తుత డెలివరీ సెంటర్ కార్యకలాపాలు విస్తరిస్తున్నట్లు ప్రకటించింది. సంస్థ చైర్మన్ లాయిడ్ కార్నీ, సీటీవో రాజీవ్ శర్మ ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్‌తో జరిగిన భేటీలో పాల్గొన్నారు. తెలంగాణ ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా పర్యావరణహిత రవాణా వ్యవస్థను అభివృద్ధి పరిచేందుకు తెలంగాణలో జీరో ఎమిషన్ వెహికల్ (జెడ్‌ఈవీ) పరిశోధన కేంద్రం ఏర్పాటు చేస్తామని వర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా ప్రకటించింది. రెండేళ్లపాటు పరిశోధన చేసేందుకు తెలంగాణ ప్రభుత్వంతో వర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా ఒప్పందం కుదుర్చుకుంది.

కాళేశ్వరం నుంచి ప్రపంచం పాఠాలు నేర్చుకోవచ్చు

- అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ ప్రతినిధుల ప్రశంసలు
- అమెరికాలో మంత్రి కేటీఆర్‌తో ప్రతినిధుల భేటీ

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజనీరింగ్ అద్భుతమని అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ (ఏఎస్‌సీఈ) ప్రెసిడెంట్ మరియా సి లెహ్మన్ ప్రశంసించారు. అమెరికాలోని నెవడా రాష్ట్రంలో సోమవారం ప్రారంభమైన ప్రపంచ ఎన్విరాన్‌మెంటల్ అండ్ వాటర్ రిసోర్స్ కాంగ్రెస్ సమావేశం అనంతరం మంత్రి కె.తారకరామారావు ఏఎస్‌సీఈ సీనియర్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించినప్పటి అనుభవాలను పంచుకున్నారు. కాళేశ్వరం లాంటి అద్భుత ప్రాజెక్టులను ప్రపంచానికి పరిచయం చేయడం తమ సంస్థ ఉద్దేశమని లెహ్మన్ అన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అనుభవాలను వీడియోలు, ఇతర రూపాల్లో ప్రపంచానికి చాటుతామని తెలిపారు. తన విద్యార్థులకు కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్, నిర్మాణం వంటి అంశాలపై చెబుతానన్నారు. ఏఎస్‌సీఈ తదుపరి ప్రెసిడెంట్ షిరిల్ క్లార్క్ కాళేశ్వరం ప్రాజెక్టు అత్యద్భుతమని కొనియాడారు. ఈ ప్రాజెక్టు ద్వారా తెలంగాణ ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పు గొప్పదన్నారు. సముద్రమట్టానికి 500 మీటర్ల కంటే ఎత్తుకు జలాలను తీసుకురావడం ఊహకు అందని గొప్ప ఆలోచన అని పేర్కొన్నారు. ఏఎస్‌సీఈ డైరెక్టర్ బ్రయాన్ పర్సన్స్ మాట్లాడుతూ ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాగునీటిని సంతృప్త స్థాయికి ఉపయోగించుకోవడం ప్రపంచవ్యాప్తంగా ఎదురవుతున్న సవాల్ అని, తెలంగాణ ఈ విషయంలో ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. కాళేశ్వరంపై ప్రశంసలు కురిపించిన ఏఎస్‌సీఈ ప్రతినిధులకు కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు.

13 మంది డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ రెవెన్యూ డివిజన్లకు అధికారులుగా పనిచేస్తోన్న 13 మంది డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల హోదాలో పనిచేస్తున్న వీరిని బదిలీ చేస్తూ రాష్ట్ర రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిత్తల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం ఒకరిని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌వో)గా నియమించగా, ముగ్గురిని రిపోర్టు చేయాల్సిందిగా కోరారు. మిగిలిన వారిని వివిధ డివిజన్లకు ఆర్డీవోలుగా బదిలీ చేశారు.

ఎస్‌డీసీల బదిలీల వివరాలివి..

డిప్యూటీ కలెక్టర్	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
ఎం.నగేశ్	ఆర్డీవో, సంగారెడ్డి	డీఆర్వో, సంగారెడ్డి
అంబదాస్ రాజేశ్వర్	ఆర్డీవో, నారాయణఖేడ్	ఆర్డీవో, మెదక్
ఎస్.రమేశ్‌బాబు	ఆర్డీవో, జహీరాబాద్	ఆర్డీవో, సిద్దిపేట
కె.వెంకారెడ్డి	ఆర్డీవో, హుజూర్‌నగర్	ఆర్డీవో, జహీరాబాద్
సి.హెచ్.రవీందర్‌రెడ్డి	ఎస్‌డీసీ, ఉట్నూరు	ఆర్డీవో, సంగారెడ్డి
పి.బెన్ షాలోమ్	ఏఎస్, సీసీఎల్ఏ	ఆర్డీవో, హుస్నాబాద్
కె.నర్సింహమూర్తి	ఎస్‌డీసీ, సింగరేణి కాలరీస్	ఆర్డీవో, నారాయణ్‌ఖేడ్
ఎం.జయచంద్రారెడ్డి	ఆర్డీవో, నల్లగొండ	ఆర్డీవో, తూప్రాన్
కె.గోపీరాం	ఆర్డీవో, దేవరకొండ	ఆర్డీవో, ఆంథోల్
వి.శ్రీనివాసులు	ఆర్డీవో, ఆర్మూరు	ఆర్డీవో, నర్సాపూర్

(డిప్యూటీ కలెక్టర్లు పి.సాయిరాం, కె.అనంతరెడ్డి, టి.శ్యాంప్రకాశ్‌ను ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు)

జూన్ 2 నుంచి 22 వరకు..

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు

ఉత్సవాల షెడ్యూల్‌ను ఖరారు చేసిన సీఎం కేసీఆర్



దశాబ్ది ఉత్సవాలపై ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను జూన్ 2వ తేదీ నుంచి 22 వరకు ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం సంకల్పించింది. 21 రోజుల పాటు జరిగే ఉత్సవాల షెడ్యూల్‌ను ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు మంగళవారం ఖరారు చేశారు. సచివాలయంలోని తన చాంబర్‌లో మంత్రులు, శాసనసభ్యులు, అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. జూన్ 2న అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి, జూన్ 3 నుంచి ఒక్కోరోజు ఒక్కో శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగేలా షెడ్యూల్ రూపొందించారు.

ఉత్సవాల రోజువారీ షెడ్యూల్...

జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారు. గన్‌పార్క్‌లోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తారు. అనంతరం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయ ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, దశాబ్ది ఉత్సవ సందేశాన్నిస్తారు. అన్ని జిల్లాల్లో మంత్రుల ఆధ్వర్యంలో జాతీయ పతాక వందనం, దశాబ్ది ఉత్సవ సందేశాలు వంటి కార్యక్రమాలుంటాయి.

- **జూన్ 3న** 'తెలంగాణ రైతు దినోత్సవం'గా జరుపుతారు. రాష్ట్రంలోని అన్ని రైతువేదికల వద్ద వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తారు. వ్యవసాయ రంగంలో సాధించిన విజయాలు, ఉచిత కరెంటు, రైతుబంధు, రైతు బీమా పథకాల విశిష్టతను తెలియజేసేలా కార్యక్రమాలుంటాయి. రైతులందరితో కలిసి ప్రజా ప్రతినిధులు, అధికారులు భోజనాలు చేస్తారు.
- **జూన్ 4న** పోలీసుశాఖ ఆధ్వర్యంలో 'సురక్షా దినోత్సవం' నిర్వహిస్తారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చేస్తున్న కృషిని, ఫ్రెండ్లీ పోలీస్ విధానాన్ని, రాష్ట్ర పోలీసు శాఖ సమర్థవంతమైన సేవలను వివరించే విధంగా రాష్ట్ర, జిల్లా స్థాయిలో కార్యక్రమాలుంటాయి.
- **జూన్ 5వ** తేదీన 'తెలంగాణ విద్యుత్ విజయోత్సవం' జరుపుతారు. నియోజకవర్గ స్థాయిలో రైతులు, వినియోగదారులు, విద్యుత్ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులతో సమావేశం ఉంటుంది. విద్యుత్ రంగంలో రాష్ట్రం సాధించిన గుణాత్మక మార్పును సభల్లో వివరిస్తారు. సాయంత్రం హైదరాబాద్ రవీంద్రభారతిలో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహిస్తారు. ఇదేరోజు సింగరేణి సంబరాలు సైతం జరుపుతారు.
- **జూన్ 6న** 'తెలంగాణ పారిశ్రామిక ప్రగతి ఉత్సవం' జరుగుతుంది. ఈ రోజున పారిశ్రామిక వాడలు, ఐటీ కారిడార్లలో సభలు నిర్వహిస్తారు. ఆయా రంగాల్లో ప్రగతిని వివరిస్తారు.
- **జూన్ 7న** 'సాగునీటి దినోత్సవం' నిర్వహిస్తారు. సాగునీటి రంగంలో ప్రగతిని వివరిస్తూ ప్రతి నియోజకవర్గంలో సభలు ఉంటాయి. నీటి పారుదలశాఖ ఆధ్వర్యంలో సాధించిన విజయాలపై హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించే సమావేశానికి సీఎం హాజరవుతారు.
- **జూన్ 8న** 'ఊరూరా చెరువుల పండుగ' నిర్వహిస్తారు. ఈ సందర్భంగా డప్పులు, బోనాలు, బతుకమ్మలతో కూడిన సాంస్కృతిక కార్యక్రమాలుంటాయి. కవి గోరటి వెంకన్న రాసిన చెరువు పాటలు సహా చెరువు మీద ఇతర కవులు రాసిన పాటలను వినిపిస్తారు. మత్స్యకారులు వలల ఊరేగింపులు నిర్వహిస్తారు. చెరువు కట్టలపై సభలు, చెరువు కట్టమీద సహపంక్తి భోజనాలు తదితర కార్యక్రమాలు ఉంటాయి.
- **జూన్ 9న** 'తెలంగాణ సంక్షేమ సంబురాలు' పేరుతో ఉత్సవాలు ఉంటాయి. నియోజకవర్గాల వారీ ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి వంటి సంక్షేమ పథకాల లబ్ధిదారులతో సభలు జరుపుతారు. సంక్షేమంలో సాధించిన ప్రగతిని వివరిస్తూ రవీంద్రభారతిలో సభ ఉంటుంది.
- **జూన్ 10న** 'తెలంగాణ సుపరిపాలన దినోత్సవం' నిర్వహిస్తారు. అన్ని జిల్లా కేంద్రాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి, రాష్ట్రంలో పాలన సంస్కరణలతో ప్రభుత్వ వ్యవస్థలను ప్రజలకు చేరువ చేయడం, దానివల్ల కలిగిన మేలును తెలియజేసే కార్యక్రమాలు ఉంటాయి.
- **జూన్ 11న** 'తెలంగాణ సాహిత్య దినోత్సవం' ఉంటుంది. జిల్లాస్థాయిలో కవి సమ్మేళనాలు, రవీంద్రభారతిలో రాష్ట్రస్థాయి కవి సమ్మేళనం ఉంటుంది. తెలంగాణ అస్తిత్వం, రాష్ట్ర ప్రగతి ప్రతిబింబించేలా జిల్లా, రాష్ట్రస్థాయిలో కవితల పోటీలు నిర్వహించి బహుమతులందజేస్తారు.
- **జూన్ 12న** 'తెలంగాణ రన్' ఉంటుంది. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో యువకులు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలతో ఉదయం 6 గంటలకు తెలంగాణ రన్ నిర్వహిస్తారు.
- **జూన్ 13న** 'తెలంగాణ మహిళా సంక్షేమ దినోత్సవం' నిర్వహిస్తారు. ఉత్తమ మహిళా ఉద్యోగులకు సన్మానం చేస్తారు.
- **జూన్ 14వ** తేదీన 'తెలంగాణ వైద్యారోగ్య దినోత్సవం' జరుపుతారు. ప్రభుత్వం వైద్య విధానాల ద్వారా ప్రజలకు చేకూరుతున్న లబ్ధి గురించి వివరిస్తారు. హైదరాబాద్‌లోని నిమ్స్‌లో 2 వేల పడకల సూపర్ స్పెషాలిటీ దవాఖానా నూతన భవన నిర్మాణానికి, నిమ్స్ విస్తరణ పనులకు సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేస్తారు.
- **జూన్ 15న** 'తెలంగాణ పల్లె ప్రగతి దినోత్సవం' జరుపుతారు. పల్లెలు సాధించిన ప్రగతిని తెలిపే పలు కార్యక్రమాలుంటాయి. ఉత్తమ గ్రామ పంచాయతీల సర్పంచులకు, ఉత్తమ మండలాల ఎంపీపీలకు సన్మానం చేస్తారు.
- **జూన్ 16న** 'తెలంగాణ పట్టణ ప్రగతి దినోత్సవం' నిర్వహిస్తారు. పట్టణ ప్రగతి ద్వారా కార్పొరేషన్, మున్సిపాలిటీలు, పట్టణాలు సాధించిన ప్రగతిని, ప్రజలకు చేకూరిన లబ్ధిని తెలిపే కార్యక్రమాలుంటాయి.
- **జూన్ 17న** 'తెలంగాణ గిరిజన దినోత్సవం' జరుపుతారు. నూతనంగా ఏర్పడిన గిరిజన గ్రామాల్లో సభలు నిర్వహిస్తారు.
- **జూన్ 18న** 'తెలంగాణ మంచి నీళ్ల పండుగ' నిర్వహిస్తారు. సమైక్య రాష్ట్రంలో ఎదుర్కొన్న తాగునీటి ఎద్దడి నుంచి మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి సురక్షితమైన నీటిని సరఫరా చేస్తున్న తీరును వివరించే కార్యక్రమాలు ఉంటాయి.
- **జూన్ 19వ** తేదీన 'తెలంగాణ హరితోత్సవం' ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాలు, పట్టణాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంచడానికి జరిగిన కృషిని, అడవులు పెరిగిన తీరును వివరిస్తారు.
- **జూన్ 20న** 'తెలంగాణ విద్యాదినోత్సవం' నిర్వహిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని విద్యా సంస్థల్లో సభలు నిర్వహించి, విద్యారంగంలో తెలంగాణ సాధించిన విజయాలను వివరిస్తారు. నిర్మాణాలు పూర్తయిన 'మన ఊరు– మన బడి' పాఠశాలలను ప్రారంభిస్తారు. సిద్ధంగా ఉన్న 10 వేల గ్రంథాలయాలను, 1,600 డిజిటల్ క్లాస్ రూమ్‌లను ప్రారంభిస్తారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, పాటల పోటీలు నిర్వహిస్తారు.
- **జూన్ 21న** 'తెలంగాణ ఆధ్యాత్మిక దినోత్సవం' నిర్వహిస్తారు. దేవాలయాలు, మసీదులు, చర్చిలు, ఇతర ప్రార్థనా మందిరాల్లో కార్యక్రమాలు ఉంటాయి.
- **జూన్ 22వ** తేదీ గురువారం 'అమరుల సంస్మరణ' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. తెలంగాణ వ్యాప్తంగా గ్రామాలు, పట్టణాలతో పాటు విద్యాలయాల్లో అమరులకు శ్రద్ధాంజలి ఘటించి, మౌనం పాటిస్తారు. హైదరాబాద్‌లో నూతనంగా నిర్మించిన అమరుల స్మారకాన్ని సీఎం కేసీఆర్ ఆవిష్కరిస్తారు.

..మనోళ్లు మెరిశారు

▶ మొదటి పేజీ తరువాయి

సాధించారు. మొత్తంగా ఐఏఎస్‌కు 180 మంది ఎంపికవగా ఐపీఎస్‌కు 200 మంది, ఐఎఫ్‌ఎస్‌కు 38 మంది ఎంపికయ్యారు. ఇతర కేంద్ర సర్వీసుల్లోని గ్రూప్–ఏ కేటగిరీకి 473 మంది, గ్రూప్–బీ కింద 131 మంది ఎంపికైనట్లు యూపీఎస్సీ ప్రకటించింది. కాగా, సివిల్స్ ఫలితాల విజేతలకు సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. వారంతా మరిన్ని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.

తెలుగు రాష్ట్రాల ర్యాంకర్లు వీరే

ర్యాంకు	పేరు
3	ఎన్. ఉమా హారతి
22	జీవీఎస్ పవన్ దత్తా
33	తరుణ్ పట్నాయక్ మాదల
35	అజ్మీరా సంకేత్
40	సాయి ఆశ్రిత్ శాఖమూరి
54	రిచా కులకర్ణి
55	హెచ్ఎస్ భావన
60	సాయి ప్రణవ్
69	అంబికా జైన్
78	ఉత్కర్ష్‌కుమార్
87	అయాన్ జైన్
94	ఆవుల సాయికృష్ణ
110	నిధి పాయ్
132	అనుగు శివమారుతిరెడ్డి
157	రాళ్లపల్లి వసంత కుమార్
189	షేక్ హబీబుల్లా
200	కమతం మహేశ్ కుమార్
217	రావుల జయసింహారెడ్డి
243	కె. పవన సాయి సాహిత్య
257	అంకుర్ కుమార్
270	బి. ఉమామహేశ్వరరెడ్డి
285	చల్లా కల్యాణి
292	పాలువాయి విష్ణువర్ధన్‌రెడ్డి
293	గ్రంధి సాయికృష్ణ
297	షివిన్ చౌదరి
311	వీరగంధం లక్ష్మీ సునీత
313	కె.ఎన్.చందన్ జాహ్నవి
346	ఎస్.చేతన్‌రెడ్డి
384	తెప్పలపల్లి సుశ్మిత
409	ఇషాన్ అగర్వాల్
410	డొంగ్రె రేవయ్య
414	చంద్రశేఖర్ శంకల
426	సీహెచ్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి
459	చాణక్య ఉదయగిరి
464	సి.సమీరారాజా
469	బొడ్డు హేమంత్
480	గోపీకృష్ణ. బి
510	భువన ప్రణీత్ పప్పుల
548	దామెర్ల హిమవంశీ
558	రుత్విక్ సాయి కొట్టే
559	డి.మనోజ్
583	యర్రంశెట్టి ఉషారమణి
630	ఎస్.దీప్తి చౌహాన్
640	తుమ్మల సాయికృష్ణారెడ్డి
742	రామ్‌దేని సాయినాథ్
759	జి.అక్షయ్ దీపక్
805	మన్నం సుజిత్ సంపత్
817	సాహిల్ మీనా
846	బెందుకూరి మౌర్యతేజ్
866	నాగుల కృపాకర్

ఇంటర్నెట్‌లో శోధిస్తూ చదివా

'సాక్షి'ఇంటర్వ్యూలో ఆలిండియా 3వ ర్యాంకర్ ఉమాహారతి

ఢిల్లీలో కోచింగ్ తీసుకున్నా నచ్చలేదు.. ఇంట్లోనే చదువుకున్నా

రోజూ 6 నుంచి 8 గంటల పాటు ప్రిపేరయ్యేదాన్ని..

మానసిక ఒత్తిడికి గురికాకుండా చదవడమే ముఖ్యం.. నాన్నే స్ఫూర్తి... తమ్ముడు ఆదర్శం

నారాయణపేట/హుజూర్‌నగర్: ఒకటి కాదు.. రెండు కాదు.. నాలుగు సార్లు యూపీఎస్సీ రాసినా ర్యాంకు రాలేదు. అయినా ఆమె నిరాశ చెందలేదు. ఐదోసారి సైతం పట్టుదలతో ప్రయత్నించి ఏకంగా ఆలిండియా 3వ ర్యాంకు సాధించింది. ఆమెనే నారాయణపేట జిల్లా ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు, శ్రీదేవిల కుమార్తె నూకల ఉమాహారతి. హైదరాబాద్‌లో 2010లో 9.8 జీపీఏతో టెన్త్‌లో ఉత్తీర్ణత సాధించిన ఉమాహారతి... 2012లో ఇంటర్ ఎంపీసీలో 955 మార్కులు సాధించారు. ఆపై 2017లో ఐఐటీ హైదరాబాద్ నుంచి సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. నారాయణపేట జిల్లా ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లుది సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందినవారు. యూపీఎస్సీ 2020లో నిర్వహించిన ఐఈఎస్‌లో ఆమె తమ్ముడు సాయి వికాస్ 12వ ర్యాంకు సాధించారు. రెండేళ్ల శిక్షణ అనంతరం సోమవారమే ముంబైలోని సీపీడబ్ల్యూడీలో ఐఈఎస్‌గా విధుల్లో



కుమార్తెకు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, శ్రీదేవి

చేరగా ఆ మర్నాడే అక్క ఉమాహారతి సివిల్స్‌లో ఆలిండియా 3వ ర్యాంకు సాధించి ఐఏఎస్ కానుండటం విశేషం. సివిల్స్‌లో ర్యాంకు సందర్భంగా ఉమాహారతితో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ ఆమె మాటల్లోనే..

గత సివిల్స్ పేపర్లూ చదివా...

సివిల్ ఇంజనీరింగ్ తర్వాత ఉద్యోగం బదులు సివిల్స్ వైపు వెళ్లాలని నిర్ణయించుకున్నా. ఢిల్లీలోని వాజీరావు కోచింగ్ సెంటర్‌లో 2018–19లో శిక్షణ పొందినప్పటికీ అక్కడి కోచింగ్ నచ్చలేదు. ఇంటికొచ్చి ఆప్షనల్ సబ్జెక్టు ఆంత్రోపాలజీతోపాటు కామన్ సబ్జెక్టులకు సంబంధించిన అంశాలపై ఇంటర్నెట్‌లో స్టడీ మెటీరియల్ సెర్చ్ చేశా. గత సివిల్ పేపర్లనూ చదివా. దేశ, అంతర్జాతీయ అంశాలు, సంఘటనలపై నిత్యం ఆంగ్ల దినపత్రికలు చదివేదాన్ని ఈ ఏడాదంతా నాన్న, అమ్మతో నారాయణపేటలో ఉండి చదివా. సివిల్స్ సాధించా. ఈసారి 2,500 ర్యాంకుల్లో ఏదో ఒకటి వస్తుందనుకున్నా. మూడో ర్యాంకు వస్తుందని ఊహించలేదు.

చదివే సమయంలో ఆలోచనలు వద్దు..

సివిల్స్ అభ్యర్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా చదవాలి. నేను రోజుకు 6 నుంచి 8 గంటల వరకు ప్రిపేరయ్యేదాన్ని. మానసిక ఉల్లాసం కోసం మనకు నచ్చినట్లు ఉంటూ ఆటపాటలతో ముందుకెళ్లాలి. సబ్జెక్టుపై పట్టు సాధించాలి. చదివే సమయంలో ఎలాంటి ఆలోచనలు పెట్టుకోరాదు. శారీరక, మానసిక ఉల్లాసం కోసం బ్యాడ్మింటన్, యోగా, రన్నింగ్, వాకింగ్ అలవాటు చేసుకోవాలి.

విఫలమైనా తమ్ముడు వెన్నుతట్టాడు...

ఐపీఎస్ అధికారి అయిన మా నాన్న వెంకటేశ్వర్లు నుంచే స్ఫూర్తి పొందా. తమ్ముడు సాయి వికాస్‌ను ఆదర్శంగా తీసుకున్నా. గత ప్రయత్నాల్లో నాలుగుసార్లు విఫలమైనా బాధపడొద్దని తమ్ముడు అండగా నిలిచాడు. స్నేహితులు నిఖిల్, అంకితల సలహాలు, సూచనలు ఎంతో ఉపయోగపడ్డాయి.

అమ్మను ఆదర్శంగా తీసుకున్నా...



ప్రభుత్వ ఉపాధ్యాయురాలైన అమ్మ (లలితకుమారి)ను ఆదర్శంగా తీసుకొని చదివా. నాన్న (వెంకటేశ్వర్లు) ఎల్ఐసీలో ఉద్యోగి. మొదటి ప్రయత్నంలోనే సివిల్స్ సాధించడం గర్వంగా ఉంది. సమాజానికి సేవ చేయవచ్చునన్న సంకల్పంతో సివిల్స్ సాధనకు నిరంతరం కృషి చేశా.

– జీవీఎస్ పవన్ దత్తా, 22వ ర్యాంకు

పేదల జీవితాల్లో మార్పు తేవడమే లక్ష్యం..

మాది మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం కర్ణపేట గిరిజన గ్రామం. నాన్న ప్రేమ్‌సింగ్‌నాయక్ ఉద్యానవన శాఖలో డిప్యూటీ డైరెక్టర్‌గా, అమ్మ సవిత ప్రైవేటు ఉద్యోగి. ఐఐటీ ఢిల్లీలో మెకానికల్ ఇంజనీరింగ్ చదివా. అక్కడే మాస్టర్ ఆఫ్ రీసెర్చ్(ఎమ్మార్)లో గోల్డ్ మెడల్ సాధించా. ఏడాదిపాటు జపాన్‌లో రీసెర్చ్ ఇంజనీర్‌గా పనిచేసి ఆ తర్వాత సివిల్స్‌కు సిద్ధమయ్యా. 2021లో తొలి ప్రయత్నంలో ఇంటర్వ్యూ వరకు వెళ్లా. చిన్నప్పటి నుంచి పేదలు, గిరిజనుల కష్టాలు చూశా. వారి జీవితాల్లో మార్పు తేవాలనే ఉద్దేశంతోపాటు పేదలకు సేవ చేయాలనే ఆలోచనతో ఐఏఎస్ కావాలని లక్ష్యంగా పెట్టుకొని విజయం సాధించా.

– సంకేత్‌కుమార్, 35వ ర్యాంకు



సంకేత్‌కు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

ప్రజాసేవే లక్ష్యం...



మాది హనుమకొండ అడ్వొకేట్స్ కాలనీ. పేదలకు సాయం చేయాలనే ఉద్దేశంతోనే సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యా. నా తల్లిదండ్రులు అమర్, పద్మజ. నాన్న చిట్‌ఫండ్ యజమానిగా, రియల్ ఎస్టేట్ వ్యాపారి 'క్రెడాయ్'లో కీలకంగా ఉన్నారు. బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్సెస్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేశా. ఆంత్రోపాలజీ ఆప్షనల్ తీసుకొని మొదటి ప్రయత్నంలోనే సివిల్స్ సాధించా. ప్రణాళికాబద్ధంగా చదివితే సివిల్స్ ర్యాంకు సులభమే. – శాఖమూరి శ్రీసాయి ఆశ్రిత్ 40వ ర్యాంకు

గతంలోనే సివిల్స్‌కు ఎంపికైనా...



మా స్వస్థలం ఉమ్మడి కరీంనగర్ జిల్లా సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి. 2017 సివిల్స్‌లో 728వ ర్యాంకు సాధించి హైదరాబాద్‌లోని కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల ప్రాంతీయ డైరెక్టర్ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నా. ఐఏఎస్ కావాలనే లక్ష్యంతో ఆరోసారి ప్రయత్నించి విజయం సాధించా. నాన్న ఆవుల లక్ష్మయ్య పూసాల ఎస్‌జీటీ, అమ్మ సునీత గృహిణి. వరంగల్ నిట్‌లో ఇంజనీరింగ్ చేశా. ఐఏఎస్ కావాలన్న లక్ష్యంతో సివిల్స్‌పై దృష్టి సారించారు. – ఆవుల సాయికృష్ణ, 94వ ర్యాంకు

మళ్లీ రాస్తా.. ఫారిన్ సర్వీస్ లక్ష్యం..

మాది జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామం. తల్లిదండ్రులైన ఏనుగు అంజిరెడ్డి, పుష్పలత ప్రోత్సాహంతో సివిల్స్‌పై దృష్టి పెట్టా. ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్ యూనివర్సిటీలో బీఏ (ఎకనామిక్స్) చదువుతూనే సివిల్స్‌కు ప్రిపేరయ్యా. మెయిన్స్ ఆప్షనల్‌గా పొలిటికల్ సైన్స్ ఎంపిక చేసుకున్నా. కోవిడ్ వ్యాప్తి కారణంగా 2021లో ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణత సాధించకున్నా పక్కా ప్రణాళికతో చదివి ఈసారి ర్యాంకు సాధించా. మరోసారి సివిల్స్ రాస్తా. ఫారిన్ సర్వీసెస్ సాధించాలన్న కోరిక ఉంది.

– శివమారుతిరెడ్డి, 132 ర్యాంకు

స్టార్టప్ కంపెనీలో కొలువు వదిలేసి..

మాది హనుమకొండ. నాన్న ఉమ్మారెడ్డి వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాక్షేత్రంలో అసోసియేట్ డైరెక్టర్ (రీసెర్చ్)గా పనిచేస్తున్నారు. అమ్మ లక్ష్మి గృహిణి. అమ్మానాన్నలు రావుల ఉమ్మారెడ్డి, లక్ష్మి. హైదరాబాద్ ఐఐటీలో బీటెక్ పూర్తి చేసి రెండున్నర నెలలపాటు స్టార్టప్ కంపెనీలో పనిచేశా. ఆ తర్వాత ఉద్యోగం వదిలేసి 2020 నుంచి సివిల్స్ కోసం ప్రిపేర్ అవుతూ మూడో ప్రయత్నంలో సాధించా.

– రావుల జయసింహారెడ్డి, 217వ ర్యాంకు

ఐపీఎస్‌కే ప్రాధాన్యం...

మాది హనుమకొండ రాంనగర్. నాన్న కొట్టె రాధాకృష్ణారావు, సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల కళాశాలలో లైబ్రేరియన్. అమ్మ మంజుల ఫ్యామిలీ కౌన్సిలర్. నేను బీటెక్ చేసి సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యా. ఢిల్లీ నోయిడాలోని శివనాడార్ యూనివర్సిటీలో బీటెక్ ఈసీఈ పూర్తి చేశా. ఓ ఎంఎన్‌సీ కంపెనీలో రూ. లక్షన్నర జీతంతో ఉద్యోగం వచ్చినా సివిల్స్‌పై ఆసక్తితో సిద్ధమయ్యా. ఐదోసారి విజయం సాధించా. ఐపీఎస్ నా ప్రథమ ప్రాధాన్యత. ఐపీఎస్, ఐఆర్ఎస్‌కు ఎంపికయ్యే అవకాశాలు ఉన్నాయి.

– కొట్టె రిత్విక్ సాయి, 558 ర్యాంకు

పట్టుదలతో చదివా...

మాది బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్. ఢిల్లీలోని జేఎన్‌యూలో 2017లో జూనియర్ ఫెలోషిప్ రావడంతో 2018లో ఢిల్లీ యూనివర్సిటీలో పీహెచ్‌డీ (సౌత్ ఈస్ట్ ఏషియన్ స్టడీస్, చైనీస్) పూర్తి చేశా. విజయనగరం జిల్లాలోని గిరిజన కేంద్రీయ విశ్వవిద్యాలయంలో సివిల్స్‌లో ట్రైనింగ్ తీసుకుంటున్న ఎస్సీ విద్యార్థులకు అధ్యాపకుడిగా పాఠాలు బోధిస్తున్నా. సివిల్స్ కోసం ఐదేళ్లుగా ప్రిపేర్ అవుతున్నా. 2021లో ఇంటర్వ్యూ వరకు వెళ్లి వచ్చా. తర్వాత పట్టుదలతో కోచింగ్ తీసుకోకుండా చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించా. అమ్మానాన్నలు యాదమ్మ, రాములు, భార్య సౌమ్య, స్నేహితుల ప్రోత్సాహంతోనే ర్యాంకు సాధ్యమైంది.

– కంటం మహేష్ కుమార్, 200వ ర్యాంకు

నాన్న జీతం రూ. 15 వేలే...

మాది భద్రాద్రి జిల్లా కొత్తగూడెం పట్టణం. నాన్న శ్రీనివాసరావు కొత్తగూడెంలో ఓ హోటల్‌లో నెలకు రూ. 15 వేలకు పనిచేస్తున్నారు. అమ్మ నాగలక్ష్మి గృహిణి. కాలికట్‌లో బీటెక్ పూర్తి చేసి ఎల్‌అండ్‌టీలో మెకానికల్ ఇంజనీర్‌గా పనిచేస్తూనే సివిల్స్‌కు ప్రిపేరయ్యా. మూడు ప్రయత్నాల్లో విఫలం కావడంతో ఉద్యోగం మానేసి కొత్తగూడెంలోనే ఉంటూ సిద్ధమయ్యా. నాలుగో ప్రయత్నంలో విజయం సాధించా. పట్టుదల, అంకితభావం ఉంటే ప్రత్యేక కోచింగ్ లేకపోయినా సివిల్స్‌లో విజయం సాధించొచ్చు.

– గ్రంధే సాయికృష్ణ 293వ ర్యాంకు

ఐఆర్ఎస్‌గా కొలువు వచ్చినా...

మాది ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అనంతారం గ్రామం. నాన్న రిటైర్డ్ డీఎస్పీ ఇనుకొండ వెంకటేశ్వర్లు. వరంగల్ నిట్‌లో బీటెక్ చదువుతూనే 2019లో తొలిసారి కోచింగ్ లేకుండా సివిల్స్‌కు సిద్ధమై ఇంటర్వ్యూ వరకు వెళ్లా. రెండోసారి ఇంట్లోనే సిద్ధమై 615వ ర్యాంకు సాధించి ఐఆర్ఎస్‌కు ఎంపికయ్యా. ప్రస్తుతం నాగపూర్‌లోని నేషనల్ అకాడమీ డైరెక్ట్ ట్యాక్స్‌లో శిక్షణ పొందుతున్నా. ఐఏఎస్ లక్ష్యంతో మళ్లీ పరీక్షలు రాసి ర్యాంకు సాధించా.

– మనోజ్, 559వ ర్యాంకు

డిగ్రీ టు సివిల్స్...

డిగ్రీ చదివేటప్పటి నుంచే సివిల్స్‌కు సిద్ధమయ్యా. మూడో ప్రయత్నంలో ర్యాంకు సాధించడం సంతోషంగా ఉంది. – నిధిపాయ్‌కు 110వ ర్యాంకు

నాలుగో ప్రయత్నంలో...

మాది మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండలం బలరావుపేట గ్రామం. తల్లిదండ్రులు చంద్రమౌళి, కవిత. ఓయూలో బీటెక్ చేశా. సివిల్స్ లక్ష్యంతో కొన్నేళ్లుగా ప్రిపేరవుతున్నా. నాలుగోసారికి ఉత్తీర్ణత సాధించా.

– రాందేని సాయినాథ్, 742వ ర్యాంకు

వ్యవసాయ కుటుంబం నుంచి..

మాది సాధారణ వ్యవసాయ కుటుంబం. మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం సోమనపల్లి గ్రామం. తల్లిదండ్రులు తుమ్మల రాజశేఖర్‌రెడ్డి, సంతోష. వరంగల్ నిట్‌లో బీటెక్ చేశా. హైదరాబాద్‌లో గది అద్దెకు తీసుకొని సివిల్స్‌కు సిద్ధమయ్యా. 2021లో సివిల్స్ రాసినా మెయిన్స్‌లో రాకపోవడంతో మళ్లీ 2022లో పట్టుదలతో చదివి సివిల్స్ సాధించా.

– సాయికృష్ణ, 640వ ర్యాంకు

'మధ్యాహ్న' కార్మికురాలి కుమారుడికి... 410వ ర్యాంకు

రెబ్బెన (ఆసిఫాబాద్): సివిల్ ఫలితాల్లో మధ్యాహ్న భోజన కార్మికురాలి కుమారుడు డోంగ్రి రేవయ్య ఆలిండియా స్థాయిలో 410 ర్యాంకుతో మెరిశాడు. చదువుకు పేదరికం అడ్డురాదని నిరూపించాడు. కుమురంభీం జిల్లా రెబ్బెన మండలం తుంగెడ గ్రామానికి చెందిన డోంగ్రి విస్తారుబాయి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికురాలిగా పనిచేస్తోంది. 25 ఏళ్ల క్రితం భర్త మనోహర్ మృతి చెందడంతో కూలి పనులు చేసుకుంటూ ముగ్గురు పిల్లలను పోషించింది. పెద్ద కుమారుడు తిర్యాణి మండలంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. రెండో కుమారుడు రేవయ్య కన్నతల్లి కలను సాకారం చేస్తూ సివిల్స్‌లో సత్తా చాటాడు.

2021లో ఇంటర్వ్యూ వరకు వెళ్లి...

ఐఐటీ మద్రాస్‌లో బీటెక్ కెమికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన రేవయ్య కొన్నాళ్లు ఐఎన్‌జీసీలో ఉద్యోగం చేశాడు. సివిల్స్ లక్ష్యంతో ఉద్యోగాన్ని వదిలిపెట్టాడు. 2021లో జరిగిన యూపీఎస్సీ పరీక్షల్లో ఇంటర్వ్యూ వరకు వెళ్లినా కేవలం రెండు మార్కులతో ర్యాంకు కోల్పోయాడు. ఈసారి



ర్యాంకు సాధించిన రేవయ్యకు స్వీట్ తినిపిస్తున్న తల్లి విస్తారుబాయి, సోదరుడు

మరింత పట్టుదలతో చదివి అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నాడు. కాగజ్‌నగర్‌లో ప్రాథమిక విద్య, ఆసిఫాబాద్‌లో ఉన్నత విద్య పూర్తి చేసిన రేవయ్య.. హైదరాబాద్‌లోని సోషల్ వెల్ఫేర్ కళాశాలలో ఇంటర్‌లో 929 మార్కులు సాధించాడు. పేదలకు సేవ చేయడమే తన లక్ష్యమని, ప్రభుత్వ సేవలు పూర్తిస్థాయిలో ప్రజలకు అందించేందుకు కృషి చేస్తానని తెలిపాడు.

సివిల్స్ గురూ.. మహేశ్ భగవత్



శిక్షణ ఇస్తున్న మహేశ్ భగవత్

- సీఐడీ అదనపు డీజీ వద్ద ఎందరో అభ్యర్థుల ఇంటర్వ్యూ శిక్షణ
- వారిలో ఆలిండియా టాపర్ సహా 125–150 మందికి ర్యాంకులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సీఐడీ అదనపు డీజీ మహేశ్ భగవత్ 'సివిల్స్ గురూ'గా మరోసారి తన మార్కు చాటారు. సివిల్స్–2022 తుది ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన అభ్యర్థుల్లో చాలా మంది ఆయన వద్దే ఇంటర్వ్యూ శిక్షణ పొందారు. తన వద్ద ఇంటర్వ్యూ శిక్షణ పొందిన వారిలో ఆల్ ఇండియా టాపర్లుగా దాదాపు 125 నుంచి 150 మంది నిలిచారని, ఇది తనకు ఎంతో సంతోషంగా ఉందని మహేశ్ భగవత్ 'సాక్షి'తో మాట్లాడుతూ చెప్పారు. ఆలిండియా టాపర్, యూపీ యువతి ఇషితా కిశోర్‌కు తాను మెంటార్‌గా ఉండటం సంతృప్తినిచ్చిందన్నారు. తనతోపాటు మరికొందరు గత పదేళ్లుగా సివిల్స్ అభ్యర్థులకు మెంటార్లుగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది టాప్–100 ర్యాంకుల్లో 14వ ర్యాంకర్ కృతికా గోయల్, 22వ ర్యాంకర్, తిరుపతివాసి పవన్ దత్తా, 25వ ర్యాంకర్ కశ్మీరా సంకే, 27వ ర్యాంకు సాధించిన యాదవ్ సూర్యభాన్, 35వ ర్యాంకర్, తెలంగాణకు చెందిన అజ్మీర సంకేత్ కుమార్, 38వ ర్యాంకర్ అనూప్‌దాస్, 54వ ర్యాంకర్, తెలంగాణకు చెందిన రిచా కులకర్ణి, 74వ ర్యాంకర్ ఐషి జైన్, 76వ ర్యాంకు సాధించిన దబోల్కర్ వసంత్, 78వ ర్యాంకర్, తెలంగాణకు చెందిన ఉత్కర్ష కుమార్‌లు తన వద్ద ఇంటర్వ్యూ పొందినవారేనని మహేశ్ భగవత్ తెలిపారు. గత ఐదు నెలలుగా తాను ఇంటర్వ్యూలకు శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. విజేతలు గర్వం పెరగకుండా చూసుకోవాలని, ర్యాంకులు రాని వారు నిరుత్సాహపడకుండా మరోసారి ప్రయత్నించాలని ఆయన సూచించారు.

దినసరి కూలీ కుమారుడికి 885వ ర్యాంకు

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో చదివి ప్రణయ్ ఘనత

సాక్షి, హైదరాబాద్: సివిల్స్ ఫలితాల్లో దినసరి కూలీ కుమారుడు సత్తా చాటాడని, అది కూడా ఎస్సీ స్టడీ సర్కిల్‌లో చదివి ఈ ఘనత సాధించాడని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ చౌదారపు శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనగాం జిల్లాకు చెందిన కొయ్యాడా ప్రభాకర్ కుమారుడు కొయ్యాడా ప్రణయ్ కుమార్ తొలిసారి సివిల్స్ పరీక్షకు హాజరై 885వ రాంకు సాధించినట్లు ఆయన వెల్లడించారు. ప్రణయ్ తండ్రి దినసరి కూలీకాగా అతని తల్లి గృహిణి. ప్రణ



ప్రణయ్‌కుమార్‌ను అభినందిస్తున్న ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీధర్

య్ మేడ్చల్ జిల్లా నాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదవగా గజ్వేల్ ప్రభుత్వ సోషల్ రెసిడెన్షియల్‌లో పాలిటెక్నిక్, జేఎన్‌టీయూలో బీటెక్ చేశాడు.

మనిషి స్థానాన్ని యంత్రం ఎప్పటికీ భర్తీ చేయలేదు

'ఇఫ్లూ' ప్రొ.హరిబండి లక్ష్మి

రాయదుర్గం: మనిషి స్థానాన్ని యంత్రం ఎప్పటికీ భర్తీ చేయదని ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజస్ యూనివర్సిటీ (ఇఫ్లూ) స్కూల్ ఆఫ్ లిటరరీ స్టడీస్ డీన్, ట్రాన్స్‌లేషన్ విభాగం హెడ్ ప్రొఫెసర్ హరిబండి లక్ష్మీ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మనూలో ఆరు రోజులపాటు నిర్వహించే నైపుణ్యాభివృద్ధి వర్క్‌షాప్ ప్రారంభ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజ్ఞాన పుస్తకాలను అనువదించడానికి రెండు భాషల్లో ప్రావీణ్యంతోపాటు నిర్దిష్ట పరిజ్ఞానం కూడా అవసరమన్నారు. ఉర్దూ యూనివర్సిటీ ఓఎస్‌డీ–1 ఇంగ్లిష్ విభాగం హెడ్ ప్రొఫెసర్ షగుఫ్తా షాహీన్ మాట్లాడుతూ పరిధులు దాటిన సంస్కృతులకు అనువాదం రాయబారిగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ లాంగ్వేజెస్, లింగ్విస్టిక్స్ అండ్ ఇండాలజీ డీన్ ప్రొఫెసర్ అజీజ్‌బానో, ప్రొఫెసర్ ఇంతియాజ్ హుస్సేన్, ఎస్‌టీఎం చీఫ్ రిసోర్స్ పర్సన్ ప్రొఫెసర్ మాథ్యూ, రీసెర్చ్ స్కాలర్ రుమానా నిసార్, డాక్టర్ మహ్మద్ అస్లామ్ కున్నాతిల్ ప్రసంగించారు.

తొలగించిన ఆర్టిజన్లకు మళ్లీ కొలువులు

- విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి ప్రకటన



సాక్షి, హైదరాబాద్: సమ్మెకి దిగడంతో గతంలో ఉద్యోగాల నుంచి తొలగించిన 196 మంది ఆర్టిజన్లను తిరిగి విధుల్లో తీసుకుంటున్నట్టు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జి.జగదీశ్ రెడ్డి ప్రకటించారు. ఆర్టిజన్ల సంఘాల తరఫున మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల మంగళవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి జగదీశ్ రెడ్డిని కలిసి చర్చలు జరిపారు. ఎమ్మెల్యే బలాల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన మంత్రి మానవతా దృక్పథంతో తిరిగి ఉద్యోగాల్లో చేర్చుకుంటామని హామీ ఇచ్చారు. ఔట్‌సోర్సింగ్ విద్యుత్ ఉద్యోగులను సీఎం కేసీఆర్ విద్యుత్ సంస్థల్లో ఆర్టిజన్లుగా విలీనం చేసుకుని క్రమబద్ధీకరించారని మంత్రి గుర్తు చేశారు. భవిష్యత్తులో మళ్లీ సమ్మెకి వెళ్లరాదని హెచ్చరించారు. మళ్లీ ఇలాంటి సంఘటనలను పునరావృతం చేస్తే సహించమని ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్ రావు స్పష్టం చేశారు. చర్చల్లో టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ జి.రఘుమారెడ్డితో పాటు ఆర్టిజన్ల సంఘాల నేతలు పాల్గొన్నారు. తమను రెగ్యులర్ విద్యుత్ ఉద్యోగులతో సమానంగా పరిగణించాలని డిమాండ్ చేస్తూ మజ్లిస్ అనుబంధ ఎత్తేహాద్ యూనియన్‌తో పాటు మరో యూనియన్ గత నెలలో సమ్మెకి వెళ్లడంతో 196 మందిని ఉద్యోగాల నుంచి తొలగిస్తూ యాజమాన్యాలు నిర్ణయం తీసుకున్నాయి.

ఓయూ పీహెచ్‌డీ సిలబస్‌లో మార్పులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ సిలబస్‌లో మార్పులు చేయనున్నారు. యూజీసీ 2018లో విడుదల చేసిన నిబంధనల ప్రకారం పీహెచ్‌డీ కోర్సు వర్క్ (పార్టు–1) సిలబస్‌లో మార్పులు చేయాలని నిర్ణయించగా ఓయూ 2022లో అమలు చేసింది. కొత్త నిబంధనల ప్రకారం పేపర్ వన్‌లో రీసెర్చ్ మెథాడలజీ అండ్ పబ్లికేషన్ ఎథిక్స్, ఒక స్పెషలైజేషన్ సిలబస్‌లో మార్పులు చేయనున్నారు. అయితే ఓయూలోని సైన్స్, ఆర్ట్స్, కామర్స్, ఇంజనీరింగ్, లా తదితర కళాశాలల్లోని సుమారు 62 సబ్జెక్టుల్లో అవసరం ఉన్న సబ్జెక్టుల్లో పీహెచ్‌డీ సిలబస్‌ను మార్చనున్నారు.

జూన్ 5 నుంచి రెండో విడత గొర్రెల పంపిణీ

- ఎన్‌సీడీసీ నిధులు ఇవ్వకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నుంచే మంజూరు
- రూ.1000 కోట్లు ఇచ్చేందుకు ఆర్థిక శాఖ గ్రీన్‌సిగ్నల్...




సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని

సాక్షి, హైదరాబాద్: రెండో విడత సబ్సిడీ గొర్రెల పంపిణీకి రంగం సిద్ధమైంది. వచ్చే నెల 5వ తేదీ నుంచి రాష్ట్రంలో రెండో విడత గొర్రెల పంపిణీని ప్రారంభించనున్నట్టు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రకటించారు. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. గొర్రెల పంపిణీ పథకంపై మంగళవారం డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో తలసాని సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో గొర్రెల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజ్ యాదవ్, పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధర్‌సిన్హా, డైరెక్టర్ డాక్టర్. ఎస్.రాంచందర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయి 10వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా దశాబ్ది ఉత్సవాలను జూన్ 2 నుంచి 21 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని, ఈ ఉత్సవాల్లో భాగంగా వచ్చే నెల 5వ తేదీ నుంచి గొర్రెల పంపిణీ ప్రారంభిస్తామని చెప్పారు. ఇందుకు తగిన ఏర్పాట్లు చేయాలని, ఈలోగా లబ్ధిదారులను తీసుకెళ్లి గొర్రెలు కొనేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

రూ.500 కోట్లు విడుదల

కాగా, గొర్రెల పంపిణీ పథకానికి అవసరమైన నిధులను ఇవ్వడంలో జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ) జాప్యం చేస్తున్న నేపథ్యంలో ఈ పథకం అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వమే తన ఖజానా నుంచి నిధులను సమకూర్చాలని నిర్ణయించింది. అందులో భాగంగా ప్రస్తుతానికి రూ.1000 కోట్ల నిధులను మంజూరు చేసింది. రూ.వెయ్యి కోట్లలో రూ.500 కోట్లకు గాను ఆర్థిక శాఖ బడ్జెట్ విడుదల ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఈ నేపథ్యంలో గొర్రెల కొనుగోళ్ల ప్రక్రియను ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లలో పశుసంవర్ధక శాఖ అధికారులున్నారు. కాగా, రెండో విడత పంపిణీ ప్రక్రియను వచ్చే నెల 5వ తేదీన మంత్రి తలసాని నల్లగొండలో ప్రారంభించనుండగా, అదే రోజున అన్ని నియోజకవర్గాల్లోనూ ప్రారంభం కానుంది.



కొలువుల అర్హత పరీక్షల షెడ్యూల్ ఖరారు

జేఎల్ పరీక్షలు సెప్టెంబర్ 12 నుంచి అక్టోబర్ 3 వరకు

ఆగస్టు 8న ఏఓ, జేఏఓ అర్హత పరీక్ష

సాక్షి, హైదరాబాద్: పలు ఉద్యోగ నియామకాల అర్హత తేదీలను తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ఖరారుచేసింది. ఇంటర్మీడియట్ విద్య కమిషనరేట్ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో జూనియర్ లెక్చరర్ ఉద్యోగ అర్హత పరీక్షలను సెప్టెంబర్ 12 నుంచి సబ్జెక్టుల వారీగా నిర్వహించనున్నట్లు స్పష్టంచేసింది. అన్ని సబ్జెక్టులకు రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయి. పరీక్షల నిర్వహణ తేదీలకు సంబంధించిన షెడ్యూల్‌ను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. పరీక్షలన్నీ కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (సీబీఆర్టీ) విధానంలో నిర్వహించనున్నట్లు వెల్లడించింది. సెప్టెంబర్ 12న ప్రారంభం కానున్న పరీక్షలు అక్టోబర్ 3 వరకు దాదాపు 11 రోజులపాటు పరీక్షలు కొనసాగనున్నాయి.

- పరీక్ష తేదీకి వారం రోజుల ముందు హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు
- టీఎస్‌పీఎస్సీ వెల్లడి

ఆగస్టు 8న ఏఓ, జేఏఓ పరీక్ష..: పురపాలన, పట్టణాభివృద్ధి శాఖ పరిధిలోని పట్టణ స్థానిక సంస్థ (యూఎల్‌బీ)ల్లోని అకౌంట్స్ ఆఫీసర్ (ఏఓ), జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ (జేఏఓ) ఉద్యోగాల భర్తీకి సంబంధించిన పరీక్షను ఆగస్టు 8న నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ వెల్లడించింది. నిర్దేశించిన రోజున ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలను సీబీఆర్టీ పద్ధతిలో నిర్వహించనున్నట్లు వెల్లడించింది. పై అన్ని పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు పరీక్ష తేదీకి వారం ముందు హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పింది.

రేపు తెలంగాణ ఎంసెట్ ఫలితాలు

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 25వ తేదీన తెలంగాణ ఎంసెట్ ఫలితాలు విడుదల కానున్నాయి. గురువారం రోజున ఉదయం 11 గంటలకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ప్రభుత్వ కార్యదర్శి (ఉన్నత విద్య) వి.కరుణ, కళాశాల, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిత్తల్, తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య ఆర్.లింబాద్రి, జేఎన్‌టీయూ హైదరాబాద్ వీసీ ప్రొఫెసర్ కట్టా నరసింహారెడ్డి ఈ ఫలితాలను విడుదల చేయనున్నారు. జేఎన్‌టీయూ హైదరాబాద్‌లోని గోల్డెన్ జూబ్లీ హాలులో ఈ ఫలితాలను విడుదల చేస్తారు.



ఈ ప్రపంచాన్ని మృత్యువు, క్షయము పీడిస్తున్నాయి.
కానీ ప్రపంచ తత్వం ఎరిగిన వివేకి వీటికి దుఃఖించదు.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 24 మే 2023

అయిదేళ్ళలో ఉష్ణగుండమేనా?

అంచనాలు నిజమవుతాయా, లేదా అంటే... ఎవరి విశ్లేషణ వారికి ఉండవచ్చు. కానీ, అంచనాలు అప్రమత్తం కావడానికి పనికొస్తాయనడంలో మాత్రం ఎవరికీ భిన్నాభిప్రాయం ఉండే అవకాశమే లేదు. ఐరాస ప్రపంచ వాతావరణసంస్థ తాజా అంచనాలు అప్రమత్తం చేస్తున్నాయి. అత్యవసర పరిస్థితిని తలపిస్తున్నాయి. ఉష్ణతాపాన్ని ఒడిసిపట్టుకొనే గ్రీన్‌హౌస్ వాయువులు, ఎల్‌నినో ఫలితంగా అయిదేళ్ళలో ప్రపంచ ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుకొనే అవకాశం ఎక్కువుందన్న తాజా అంచనా అలాంటి ప్రమాద ఘంటికే. మన భూగోళ సగటు ఉష్ణోగ్రత 1.5 డిగ్రీల సెంటీగ్రేడ్ మేర పెరిగే అవకాశం మూడింట రెండొంతులుందని ఆ అంచనా సారాంశం. ఈ బీభత్స ప్రభావం భవిష్యత్తులో ఆర్థికంగానూ అపారంగా ఉంటుందని సోమవారం ఆ సంస్థ చేసిన హెచ్చరిక తీవ్రమైనదే.

కొన్నేళ్ళ క్రితం ఊహించినదాని కన్నా పరిస్థితి దిగజారింది. గత శతాబ్దిన్నరలో పర్యావరణానికి మనం చేసిన నష్టం అలాంటిది. పారిశ్రామికీకరణ కాలాని కన్నా ముందు (1850–1900 మధ్య) సగటు ఉష్ణోగ్రతతో పోలిస్తే, 1.5 డిగ్రీల గరిష్ఠ భూతాపోన్నతిని చరమావధిగా పెట్టుకున్నారు. ఆ లక్ష్మణరేఖ దాటితే ఉత్పాతం తప్పదని శాస్త్రవేత్తలు చాలా కాలంగా హెచ్చరిస్తున్నారు. 1.5 డిగ్రీలనే గరిష్ఠంగా ఎందుకు పెట్టుకున్నారంటే, అది దాటితే ఈ అదనపు ఉష్ణం కారణంగా జీవావరణ దుష్ప్రభావం శరవేగంగా వ్యాపిస్తుంది. తారాజువ్వలా దూసుకుపోతుంది. అందుకే, భూతాపోన్నతిని ఆ గీత దాటకుండా నియంత్రించాలని 2015 నాటి ప్యారిస్ ఒప్పందంలోనే తీర్మానించారు. ఈ గీతను చేరే అవకాశం తక్కువని 2015లో అనుకున్నారు. తీరా 2020కి వచ్చేసరికి అయిదింట ఒక వంతు ఛాన్సుందని తేలింది. నిరుడు ఆ ముప్పు 50 శాతం ఉండేది. ఇప్పుడు పరిమితిని దాటేసే ప్రమాదం 66 శాతానికి పెరిగిపోయింది. అంటే వచ్చే 2027 రెడ్ ఎలర్ట్ నామవత్సరం. ప్రపంచం ఉష్ణగుండమే.

ఇప్పటి వరకు ప్రపంచంలో అత్యధిక ఉష్ణోగ్రత 2016లో రికార్డయింది. ప్రాతిపదికగా తీసుకున్న 1900 నాటి ముందు కాలంతో పోలిస్తే, ఆ ఏటి సగటు ఉష్ణోగ్రత దాదాపు 1.3 డిగ్రీలు ఎక్కువ నమోదైంది. ఆ ఉష్ణరికార్డును దాటేరోజు ఎంతో దూరంలో లేదన్నదే ఇప్పుడున్న ఆందోళన. పర్యావరణ మార్పుతో పాటు చక్రభ్రమణమైన ఎల్‌నినో ప్రభావమూ అగ్నికి ఆజ్యం పోస్తోంది. ఈ ఏడాది ఆసియా ప్రాంతాన్ని సాధారణంగా అధికంగా ఈ సెగ వేగిస్తుందని అంచనా. నిజానికి 1970 నుంచి 2021 మధ్య దుర్భర వాతావరణ మార్పులతో దాదాపు 12 వేల ఉత్పాతాలు జరిగాయని లెక్క. వాటి వల్ల 20 లక్షల మందికి పైగా మరణిస్తే, 4.3 లక్షల కోట్ల డాలర్ల మేర ఆర్థిక నష్టాలు జరిగాయి. మరోలా చెప్పాలంటే, ఆ మొత్తం నష్టాలు భారతదేశ జీడీపీలో 25 శాతానికి పైమాటే!

మన దేశం సంగతికొస్తే.. వార్షిక సగటు ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. 1901 నుంచి ప్రతి రెండు దశాబ్దాల కాలాన్ని పోల్చి చూస్తే, గత 20 ఏళ్ళ కాలంలో ఎన్నడూ లేనంతగా హెచ్చాయి. భారతీయ రిజర్వ్ బ్యాంక్ తాజా పరిశోధనా పత్రమే ఆ సంగతి వెల్లడించింది. 1975 నుంచి తుపానులు, వరదలు అధికమయ్యేసరికి వ్యవసాయ ఉత్పత్తి, దరిమిలా ఆహార ధరలు విపరీతంగా ప్రభావితమయ్యాయి. వాతావరణ ఉత్పాతాలకు ప్రభావితమయ్యే దేశాల జాబితా వేస్తే... 'ప్రపంచ పర్యావరణ మార్పు ప్రమాద సూచి 2021'లో భారత్ 7వ స్థానంలో ఉంది. స్వాతంత్ర్య కాలంతో పోలిస్తే ఇప్పుడు మన ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ, అనుబంధ రంగాల కన్నా సేవారంగం పాలు గణనీయంగా పెరిగినా, ఉష్ణతాపంతో అన్ని రంగాలకూ తిప్పలు తప్పవు. వచ్చే 2030 నాటికి ఎండ వేడిమికి ప్రపంచ వ్యాప్తంగా 8 కోట్ల ఉద్యోగాల్ని నష్టపోవాల్సి వస్తుందట. అందులో 3.4 కోట్లు భారత్‌లోనే సంభవిస్తాయని 2020లోనే ప్రపంచ బ్యాంక్ మాట.

అలాగే, పెరిగే సముద్రమట్టంతో ప్రపంచంలో అత్యధికంగా చిక్కుల్లో పడేదీ మన దేశమే! 'పర్యావరణ మార్పుపై ఏర్పాటైన అంతర్ ప్రభుత్వ సంఘం' (ఐపీసీసీ) నిరుడు ఆ సంగతి కుండబద్దలు కొట్టింది. ఈ శతాబ్ది మధ్యకల్లా 3.5 కోట్ల భారతీయులు ఏటా సముద్రతీర ముంపు బారిన పడతారు. ఈ శతాబ్దాంతానికి ఆ సంఖ్య 4.5 నుంచి 5 కోట్లవుతుందని అంచనా. అందుకే, పర్యావరణంపై అంతంత మాత్రపు విధానాలనే అనుసరిస్తే కష్టమే. 2070 నాటికి 'నెట్ జీరో' లక్ష్య సాధన పెట్టుకున్నప్పటికీ 2050 కల్లా భారత జీడీపీ 8.5 నుంచి 10 శాతం దాకా తగ్గే ముప్పుంది. విధానపరమైన లోచూపును అందించే నేషనల్ ఇన్‌స్టిట్యూట్ గ్లోబల్ ఎకనామెట్రిక్ మోడల్ వేసిన లెక్క ఇది.

ఈ లెక్కలు, చెబుతున్న మాటలు అంచనాలే కదా అని అలక్ష్యం చేస్తే కష్టమే. పర్యావరణ విశ్లేషణకు దీర్ఘకాలాల్ని ఎంచుకోవాలి గనక, ప్యారిస్‌లో చేసుకున్న బాసల్ని నిలిపామా, చెరిపామా అన్నది 2040కి కానీ నిర్ధరించలేం. అప్పటికి తెలిసినా పుణ్యకాలం గడిచిపోతుంది. అందుకే దేశాలన్నీ చేతులు కలిపి, ప్రమాద నివారణకు ప్రయత్నించడమే ఏకైక మార్గం. తక్షణమే హరిత ఇంధనం వైపు మరలాలి. భావి బాధితులకు సురక్షిత ప్రాంతాల్లో పునరావాసం కల్పించాలి. అలా చేయాలంటే ధనిక దేశాలు తమ కర్బన ఉద్గారాల పాపాల శాపాలను అనుభవిస్తున్న అమాయక వర్ధమాన దేశాలకు నష్టపరిహారం చేయాలి. మునుపు మాట ఇచ్చిన వందల కోట్ల డాలర్ల ఆర్థిక సాయాన్ని అందించాలి. పాశ్చాత్య ప్రపంచం పర్యావరణ మార్పులకు అడ్డుకట్ట వేస్తే సరిపోదు. సత్వరమే ఆ మార్పుల నుంచి వెనక్కుమళ్ళి యథాపూర్వ స్థితికి వాతావరణం వచ్చేలా కృషిచేయాలి. ఉష్ణోగ్రతనూ, తద్వారా పర్యావరణ ఉత్పాతాన్నీ, ఆర్థికనష్టాలనూ తగ్గించడమే ఇక కర్తవ్యం.

ఆర్థిక వ్యవస్థకు జీవం పోసేనా?



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

బ్రిటిష్ వలస పాలకులు కూడా పేద వర్గాల ఉద్ధరణ కోసం చేయవలసిందంతా చేస్తున్నామని కోతలు కోసేవారు. అవే మాటల్ని దేశ స్వాతంత్ర్యం తరువాత ఏర్పడిన దేశీయ ప్రభుత్వం కూడా చెప్పింది. అవే ఇప్పటికీ కేంద్ర పాలకులు చెబుతారు. ప్రపంచ బ్యాంకు విధాన ఒరవడిలో పెట్టుబడి విధానాల్ని ఆశ్రయించే దేశాల పాలకులందరిదీ ఇదే తంతు. కానీ ఈ రాజకీయవేత్తలకు తమ 'అమాయక మనస్తత్వం' నుంచి బయటపడటం ఇష్టం ఉండదు. అది రోగ నివారణకు అందనంత పెద్ద జబ్బు. ఇప్పుడు దేశ ఆర్థిక వ్యవస్థకు 'జీవం పోసే' పేరిట 2000 నోట్ల కట్టల ఉపసంహరణ తతంగానికి తెరలేపారు. రూ. 2 కూడా చేతిలో ఆడని అసంఖ్యాక కష్టజీవులకు దీనివల్ల కలిగే ప్రత్యేక లాభం ఏముంటుంది?

"ఈ దేశ ప్రజలందరినీ సుఖశాంతులతో ఉంచగల సర్వ సంపదలూ దేశంలోనే ఉన్నాయి. కానీ అవి అందరికీ సమస్థాయిలో అందుబాటులోకి రాకపోవడానికి కారణం – ఈ సంపదంతా తమ హక్కు భుక్తం కావాలన్న కొలదిమంది సంపన్న స్వార్థపరుల అవధులు లేని గొంతెమ్మ కోరికలేనని మరచిపోరాదు.... దేశ స్వాతంత్ర్యం తరువాత ఏర్పడిన దేశీయ ప్రభుత్వం కూడా తాను పేద వర్గాల ఉద్ధరణ కోసం చేయవలసిందంతా చేస్తున్నానని బీరాలు పలకవచ్చు. కానీ, బ్రిటిష్ వలస పాలకులు కూడా అలాంటి కోతలే కోసేవారు. కానీ అసలు రహస్యం – పేద ప్రజల ప్రయోజనాలు మాత్రం నెరవేరక పోవడం. ఈ సత్యాన్ని స్వతంత్ర భారత పాలకులు వినమ్రతతో అంగీకరించి తీరాలి." – జాతిపిత గాంధీజీ (1947 డిసెంబర్ 11); 'ది హిందూ' ప్రచురించిన 'మహాత్మాగాంధీ: ది లాస్ట్ 200 డేస్' నుంచి.

"సంపన్నుల చేతిలో అంత అధికారం ఎలా గూడు కట్టుకుంది? పాలకులు ప్రయివేట్ కార్పొరేషన్ల పైన, సంపన్నుల ఆస్తుల పైన శ్రుతి మించిన ఆదాయంపై విధించే పన్నుల్ని తగ్గించి వేయడంవల్ల! మరోవైపున శ్రమజీవులైన కార్మిక సంఘాలను అణచి వేయడం ద్వారా వారి కనీస వేతనాన్ని ద్రవ్యోల్బణం ద్వారా కోత పెట్టేయడం రివాజుగా మారింది." – ప్రసిద్ధ ఆర్థికవేత్త పాల్ క్రూగ్‌మన్

2016లో అకస్మాత్తుగా బీజేపీ పాలకులు పెద్ద నోట్ల చలామణీని అదుపు చేసి దేశాన్ని ద్రవ్యోల్బణం నుంచి కాపాడుతామని బీరాలు పలికి తాము చతికిలపడటమే గాక కోట్లాదిమంది సామాన్య ప్రజలను కష్టాల్లోకి నెట్టేశారు. ఆ రోజు నుంచి ఈ రోజు దాకా ప్రజలు తేరుకోలేదు. ఈలోగానే 'పెద్ద నోట్ల భారం' పేరిట వాటిని చలామణీ నుంచి ఉపసంహరించే పేరిట గతంలో 500, 1000 నోట్లకు ఎసరు పెట్టినట్టే ఇప్పుడు రూ. 2000 నోట్లపై యుద్ధం ప్రకటించారు. 2016లో 'పాకిస్తాన్‌పై యుద్ధం కోసం' పెద్ద నోట్ల చలామణీని అదుపు చేస్తే, ఈ రోజు దాకా తేరుకోకుండా కునారిల్లుతూ వస్తున్న దేశ ఆర్థిక వ్యవస్థకు 'జీవం పోసే' పేరిట 2000 నోట్ల కట్టల ఉపసంహరణ తతంగానికి తెరలేపారు. సామాన్య ప్రజాబాహుళ్యం మౌలిక ప్రయోజనాలకు రూ. 2000 నోటు ఉపసంహరణ వల్ల ప్రత్యక్షంగా నష్టం కలగక పోవచ్చు. అయితే పరోక్షంగా ఎన్నికల పేరిట రాజకీయ పార్టీలు పోటాపోటీలతో అనుసరించే ఎత్తుగడల నుంచి మాత్రం రెండువేల రూపాయల నోటు తొలగిపోదు. లోపాయకారీగా ప్రత్యక్షమవుతూనే ఉంటుంది. కేవలం పాలకపక్ష నాటకంగా పైకి కనిపించినా, పరోక్షంగా ప్రతిపక్షాల ప్రయోజనాలు నెరవేర్చడంలో కూడా 'రెండు వేల నోటు' ఉపయోగపడుతుందని మరచిపోరాదు.

గతంలో రూ. 1000, రూ. 500 నోట్ల రద్దు వల్ల 'నల్ల ధనం, నకిలీ నోట్లు' చలామణీ నుంచి తప్పుకున్న దాఖలాలు లేవు. అలాగే విదేశీ బ్యాంకుల్లో ఏళ్ల తరబడిగా తలదాచుకుంటున్న భారత పెట్టుబడిదారుల దొంగ డబ్బును దేశానికి తీసుకొచ్చి, భారత ప్రజలకు లక్షలు, కోట్లు పంచిపెడతానన్న ప్రధాన మంత్రి మాట 'నీటి మూట'గా ఎలా మారిందో ప్రజలు చూశారు. ఈ సందర్భంగా నాటి రిజర్వు బ్యాంక్ గవర్నర్‌గా ఉన్న రఘురామ్ రాజన్ పాలకుల నిర్ణయాల్ని నిరసించి, 'దేశాన్ని ఆర్థిక సంక్షోభం'లోకి పాలకులు నెట్టబోతున్నారని ప్రజల్ని హెచ్చరించి మరీ గవర్నర్ పదవికి రాజీనామా చేసి అమెరికాలో కొలువుకి 'చెక్కేయ'వలసి వచ్చింది. రాజన్ హెచ్చరికలు దేశానికి ముందస్తు మెలకువలయ్యాయి. అయినా పాలకులలో చలనం లేదు. సుప్రీం కోర్టు కూడా 'ఆరేళ్ల తర్వాత ఇప్పుడు కాలాన్ని వెనక్కి తిప్పలేమన్న' తీవ్ర నిరాశను బాహాటంగానే వ్యక్తం చేసింది.

ఆసియా, ఆఫ్రికా వర్ధమాన దేశాల ఆర్థిక వ్యవస్థలు స్వతంత్రంగా, ఎలాంటి 'ఉచ్చులు' లేకుండా బతకవచ్చునో జూలియస్ నైరేరి అధ్యక్షతన ఏర్పడిన 'సౌత్ కమిషన్' నిరూపించింది (1990 రిపోర్టు). కాంగ్రెస్ హయాంలో ప్రధాని హోదాలో నరసింహారావు, మన్మోహన్ సింగ్ ఆ రిపోర్టును ఆహ్వానించి కూడా ఆచరణలో అమలు చేయలేకపోయారు. ఇదిలా ఉండగా – ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలలో ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థలు అన్నార్తులైన ప్రజాబాహుళ్యంపై ఎక్కుపెట్టిన దారి దోపిడీ పద్ధతుల వల్ల ఆయా ఖండాల ప్రజలు ఎలా ఆర్థికంగా కునారిల్లిపోయారో ఆ సంస్థల ఆదేశంపై వాటి తరఫున ఆ దేశాలలో పని చేసిన వైస్ ప్రెసిడెంట్ డేవిసన్ బుధూ తన అనుభవాలను అమితమైన దుఃఖంతో అక్షరబద్ధం చేశారు. "ఈ ఖండాలలో కోటానుకోట్ల పేద ప్రజలు పట్టెడన్నం కోసం మాడుతున్నారు. అన్నార్తుల రక్తంతో తడిసిన మా అధికారుల చేతులను కడగటానికి ప్రపంచంలో ఉన్న సబ్బులన్నీ చాలవు" అని ప్రకటించారు!

రెండో మాట



'రూ. 2000' పెద్ద నోటును సర్క్యులేషన్ నుంచి కట్టడి చేసినంత మాత్రాన రూ. 2లు కూడా చేతిలో ఆడని అసంఖ్యాక సామాన్య కష్టజీవులకు కలిగే ప్రత్యేక లాభం ఏముంటుంది? కర్ణాటక ఎన్నికల ఫలితాల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు జాగ్రత్తగా కేంద్ర పాలకులు కొత్త వేషానికి గజ్జె కట్టారు. కర్ణాటక తాజా ఎన్నికల్లో రెండువేల రూపాయల కట్టలు ప్రాణం పోసుకున్నందువల్ల 2024 ఎన్నికల నాటికన్నా ఈ కట్టల్ని 'కట్టడి' చేయాలన్నది కేంద్ర పాలకుల ఎత్తుగడ! అసలు 'మంచి పాలన' పేరిట దేశ రాజకీయ వ్యవహారాల్లో తలదూర్చే ప్రపంచ బ్యాంకు విధాన ఒరవడిలో పెట్టుబడి విధానాల్ని ఆశ్రయించే దేశాల పాలకులందరిదీ ఇదే తంతు అని నిశితమైన ఆర్థిక వ్యవహారాల నిపుణులలో ఒకరైన సంజీవి గుహన్ ఖండించవలసి వచ్చింది. వరల్డ్ బ్యాంక్ చరిత్రకారులైన ఎడ్వర్డ్ మాసన్, రాబర్ట్ ఆషర్ అభిప్రాయం కూడా అదే! అంతేగాదు, బీజేపీ పాలకుల నిర్ణయాలను 'ఆదర్శం'గా భావించిన ఒక 'నేత' మరొక అడుగు ముందుకు వేసి – ప్రతిపక్షాల కూటమికి తనను రథసారథిని చేస్తే మొత్తం ఎన్నికల ఖర్చంతా తానే భరిస్తానని అన్నట్టుగా ఓ ఇంగ్లిష్ ఛానల్‌లో బాహాటంగా ప్రకటించడంతోనే – రెండు వేల రూపాయల నోటుకు 'వేటు' పడిందని కొల్లలుగా ప్రకటనలు వెలువడజొచ్చాయి.

ఈ సందర్భంగా రాజకీయ పాలకుల, నాయకుల తప్పిదాలకు మూలాన్ని కనుగొనే యత్నంలో ఐన్‌స్టీన్‌కూ, సోషలిస్టు నాయకుడు రామ్‌మనోహర్ లోహియాకూ మధ్య సాగిన ఒక ఆసక్తికరమైన సంభాషణను గమనించాలి. **ఐన్‌స్టీన్:** 'రాజకీయులు చేసే తప్పిదాలు వాళ్ల లోని చెడ్డ తలంపుల వల్లగాక, అమాయకత్వం నుంచి పుట్టే లక్షణంగా మనం భావించవచ్చా?'

లోహియా: 'అసలు రహస్యం – రాజకీయవేత్తలకు తమ అమాయక మనస్తత్వం నుంచి బయటపడటం ఇష్టం ఉండదు. అది రోగ నివారణకి అందనంత పెద్ద జబ్బు. ఆ జబ్బే వారిని పీడిస్తుండే పెద్ద రోగం. ఈ రోగం నుంచి బయట పడటం ఇష్టం లేనందుననే చాలా మంది రాజకీయులకు దేశ సామాజిక, ఆర్థిక, ధార్మిక సమస్యలపై శాస్త్రీయమైన అవగాహన ఉండదు గాక ఉండదు'!

ఆర్థిక నిపుణులైన శుభదారావు నేతృత్వంలో పనిచేస్తున్న ఆర్థికవేత్తల బృందం (క్వాంట్ ఎకో) వివరించినట్టుగా, పన్నుల ఎగవేతకు వీలుగా దొంగచాటుగా అట్టిపెట్టుకోవడానికి ఈ 2000 లాంటి పెద్ద నోట్లు సంపన్నుల వద్ద మేట వేసుకున్నాయి. అవి ఇప్పుడు కోట్లాది విలువ చేసే లోహ సంపద పెంచుకోవడానికి ఉపయోగపడతాయి. గతంలో బ్యాంకుల వద్ద పొద్దుగూకులు పెద్ద నోట్లు మార్చుకోవడానికి పడిగాపులు పడి 125 మంది సాధారణ ఖాతాదార్ల ప్రాణాలు 'హరీ' అన్నాయి. ఈసారి 'భాగోతం' ఎలా ముగుస్తుందో రేపటి 'వెండి తెర'పై చూడాల్సిందే!

abkprasad2006@yahoo.co.in

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

హింస ఆగదా?



మణిపూర్‌లో ఇంకా ఎన్ని మరణాల గురించి జనాలు వేదన పడాలి? ఎన్ని ఇళ్లు, ఎన్ని కాలనీలు దగ్ధమవ్వాలి? ఎన్ని గ్రామాలు నేలమట్టం కావాలి? మనకు మనం ఒక రాష్ట్రం అనిపించుకోవడానికి ముందు ఎంత నష్టం జరగాలి? మిత్రమా, దీని జవాబు గాలిలో వీస్తోంది.

– పావోలియెన్లాల్ హావోకిప్, వ్యాఖ్యాత

దేశం తీరు



హరప్పా, మొహెంజెదారోలు ఏ యూరప్ దేశంలోనో ఉండివుంటే, వాళ్లు టూరిజం పరిశ్రమ మీద ప్రతి యేటా బిలియన్ల డాలర్లు సంపాదించేవాళ్లు. దానికి బదులుగా పాకిస్తాన్ వృద్ధిలో ఉన్న దేశాలను అడుక్కోవడానికే ఇష్టపడుతుంది.

– ఇంతియాజ్ మహమూద్, వ్యాఖ్యాత

పిండేశాక...



ఛాట్ జీపీటీ ప్రస్తుతానికి ఎందుకు ఉచితంగా ఉందంటే, మనం దానికి కావాల్సిన కథలు, వ్యాసాలు, కవితలు ఉచితంగా ఫీడ్ చెయ్యాలి కాబట్టి. మన దగ్గర ఉన్నవన్నీ చేయడం అయిపోయాక, అప్పుడు వాళ్లు దానికి డబ్బులు వసూలు చేయడం మొదలుపెడతారు.

– కింబెర్లీ ఎంగుయెన్, కవయిత్రి

ఆలోచిస్తే...



'కెరియర్‌ను నిర్మించుకోవడానికి మహిళలు ఎన్నో అవరోధాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందులో మొట్టమొదటి అడ్డంకి పెళ్లి చేసుకోవడం' అని కెరియర్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ఒక యువతి తన సీఈఓకు చెబుతుండగా విన్నాను. బహుశా అందుకే మహిళలు తమ నిర్ణయాలు సరిగ్గా తీసుకోవాల్సి ఉంటుంది.

– అపూర్వ పురోహిత్, రచయిత్రి

అప్పుడే...



సిద్ధరామయ్య ప్రభుత్వ ఉచిత విధానాలను విమర్శించినందుకు కర్ణాటక చిత్ర దుర్గ జిల్లాలోని ఒక ఉపాధ్యాయుడు సస్పెండ్ అయ్యాడట! అధికారంలోకి వచ్చీరాగానే ఇంత అసహనమా?

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

ప్రత్యామ్నాయం నియో లిబరలిజమే!

అభిప్రాయం



డా॥ పి. కృష్ణ మోహన్ రెడ్డి

గత కొన్నేళ్లుగా వామపక్షీయులు, పాపులిస్ట్ మేధావులు, నియోలిబరిలజంపై దాడిచేస్తూ మార్క్సిస్ట్ – సోషలిస్ట్ సిద్ధాంతానిది పైచేయిగా చూపిస్తూ ప్రధాన స్రవంతి మీడియాలో వ్యాసాలు రాస్తున్నారు. ఒక హైపోథీసిస్‌ను అప్లై చేసి 10 సార్లలో 8 సార్లు సఫలీకృతమైతే దానిని సిద్ధాంతం అంటారు. మరి 1930ల నుంచి 1991 సోవియట్ యూనియన్ పతనం వరకు దారుణంగా విఫలమైన మార్క్సిస్ట్ హైపోథీసిస్‌ను సిద్ధాంతంగా ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసం? మార్క్స్ 'యుటోపియన్' మోడల్ దారుణంగా విఫలం చెందడం ప్రచ్ఛన్న యుద్ధకాలంలో తేటతెల్లమైంది. ఆ మోడల్ వల్ల రష్యా, తూర్పు యూరప్, చైనా, కాంబోడియాల్లో కొన్ని లక్షల మంది మరణించారు. మార్క్స్–సోషలిస్ట్ మోడల్ పొలిటికల్ ఎకానమీ... దేశాలను, ప్రజలను దుర్భర దారిద్ర్యంలోకి నెట్టేసింది. పోల్చిచూస్తే తూర్పు జర్మనీ – పశ్చిమ జర్మనీ, ఉత్తర కొరియా – దక్షిణ కొరియా, తూర్పు యూరప్ – పశ్చిమ యూరప్‌లలో లిబరల్ ఆర్థిక వ్యవస్థే దేశాలను నిలబెట్టింది. ప్రధానంగా ప్రైవేటైజేషన్, విదేశీ పెట్టుబడులను నిరోధించడం, అన్నీ ప్రభుత్వ రంగంలో ఉండటం లాంటి కారణాల వల్ల మార్క్సిస్ట్ – సోషలిస్ట్ దేశాల్లో ఆర్థిక వ్యవస్థ స్తంభించిపోయి, ఆ దేశాలు కుప్పకూలాయి.

అదే సమయంలో 1950ల నుంచి ప్రపంచ వ్యాప్తంగా లిబరల్ ఆర్థిక వ్యవస్థ మోడల్‌ను అనుసరించిన దేశాలు, వాటిలోని ప్రజలు ఇటువంటి ఇబ్బందులు ఎదుర్కోలేదు. వాటి ఆర్థికవ్యవస్థలు కూడా అభివృద్ధి చెందుతూ వచ్చాయి. కాబట్టి లిబరల్–క్యాపిటలిస్ట్ మోడల్ ఒక కాల పరీక్షను ఎదుర్కొని విజయవంతంగా నిలబడింది. ఈ విషయాన్ని మొట్టమొదటగా అర్థం చేసుకున్నది చైనా. 1978 నుంచే చైనా మార్క్సిస్ట్ విధానాలను త్యజించి లిబరల్–క్యాపిటలిస్ట్ మోడల్‌లోకి ప్రవేశించింది. గత 40 ఏళ్లుగా చైనా అభివృద్ధి మన కళ్ళముందుంది. అలాగే తూర్పు యూరప్‌లోని కమ్యూనిస్టు దేశాలు ప్రజాస్వామిక దేశాలుగా 30 ఏళ్ల నుంచి ప్రజాస్వామికంగా నియోలిబరల్ మోడల్‌ని ఆచరిస్తున్నాయి. అక్కడి ప్రజలు తిరిగి మార్క్సిస్ట్ మోడల్ కోసం వెనక్కు వెళ్ళలేదు. ఒకవేళ మార్క్సిస్ట్ మోడల్ నియో లిబరల్ మోడల్ కంటే ఉత్తమమైనదైతే అక్కడి ప్రజలు కచ్చితంగా తిరిగి మార్క్సిస్ట్ మోడల్‌ని ఆహ్వానించేవారు. ఎందుకంటే వారు ఈ రెండు మోడల్స్‌నూ అనుభవించారు కనుక.

మార్క్సిస్ట్–నియో లిబరల్ నేపథ్యం ఇలా ఉండగా, భారతదేశంలో మాత్రం నియో లిబరలిజం వల్ల దేశం నాశనం అవుతుందని ప్రచారం చేస్తున్నారు. కానీ 1947 నుంచి 1991 వరకు 'నెహ్రూవియన్ సోషలిస్ట్ కమాండ్ ఎకానమీ'ని ఆచరించడం వల్ల మన ఆర్థికవృద్ధి రేటు 3 శాతానికి మించలేదు. దేశం దారుణమైన ఆర్థిక సమస్యల్లో ఇరుక్కుపోయింది. మన్మోహన్ సింగ్ 1991లో ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు... లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ (ఎల్‌పీజీ) వల్లనే దేశం గడ్డు సమస్యల నుంచి బయట పడింది. ఈ మోడల్ భారతదేశంతో సహా అన్ని దేశాల్లోనూ సత్ఫలితాలను ఇస్తూ ఉంది. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే చివరి కమ్యూనిస్టు దేశాలు వియత్నాం, క్యూబా కూడా మార్క్సిస్ట్ – సోషలిస్ట్ సిద్ధాంతాలను అనుసరించలేక పోయాయి. ఇంకో ముఖ్య విషయం ఏమిటంటే మార్క్సిస్ట్ సిద్ధాంతం, మార్క్సిస్ట్ పోరాటాల ద్వారా మార్క్సిస్ట్ ప్రభుత్వాన్ని నెలకొల్పుకున్న నేపాల్ కూడా లిబరలిజం రాజ్యాంగ, ఆర్థిక విధానాలతోనే అభివృద్ధి చెందుతోంది. కాబట్టి 21వ శతాబ్దంలో నియో లిబరలిజాన్ని వదలి తిరిగి సోషలిజం వైపు ప్రయాణం చేయడం ఆత్మహత్యా సదృశ్యమే.



కొన్నిసార్లు నియో లిబరలిజం వల్ల ఆర్థిక తారతమ్యాలు పెరిగి పోతున్నాయనీ; పర్యావరణ కాలుష్యం, కార్పొరేటీకరణ, వనరులు దోచుకోవడం లాంటివి జరుగుతున్నాయనీ విమర్శలున్నాయి. ఆర్థికవ్యవస్థ మెరుగుపడి, అధిక ధనం ప్రభుత్వాల చేతిలోకి వచ్చినా ప్రభుత్వాలు అసమానతలు తొలగించకుండా ఉంటే అది ప్రభుత్వాల తప్పు. నియో లిబరిజం తప్పుకాదు. ఇక పర్యావరణం, వనరుల వినియోగం విషయానికి వస్తే... గతంలో కమ్యూనిస్టు దేశాల్లో కూడా గనులతో సహా అన్ని సహజ వనరులనూ ప్రభుత్వాలే విచ్చలవిడిగా వినియోగించడంతో ఆయా దేశాల్లో పర్యావరణం దెబ్బతింది. కాబట్టి ఇటువంటి విషయాలమీద నియో లిబరలిజం సిద్ధాంతంలో లోపమున్నట్లు విమర్శించడం సమంజసం కాదు. ఈ సిద్ధాంతం వల్ల పేదరికం పెరిగిపోతుందని ఒక విమర్శ. ఇది అవాస్తవం. పేదరికం తగ్గడంతోపాటు మధ్యతరగతి కూడా పెరుగుతోందనేది వాస్తవం. నియో లిబరలిజాన్ని విమర్శించే మేధావులు ఆర్థిక వ్యవస్థకు ఎటువంటి ఇబ్బందులు తేనటువంటి వేరే ఆర్థిక మోడల్‌ను ప్రతిపాదిస్తే అందరూ ఆహ్వానిస్తారు. కానీ సోషలిజాన్ని తిరిగి తీసుకురావాలనే ప్రయత్నం తప్ప ఒక ప్రత్యామ్నాయ మోడల్‌ను ఎవరూ ప్రతిపాదించడం లేదు. అదే విచారకరం.

వ్యాసకర్త అసోసియేట్ ప్రొఫెసర్
చరిత్రశాఖ, ఎస్వీ యూనివర్సిటీ

చట్టాలున్నా మ్యాన్‌హోల్ మరణాలు!

అభిప్రాయం



మన్నారం నాగరాజు

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో డ్రైనేజీలను, సెప్టిక్ ట్యాంకులను, మ్యాన్ హోల్స్‌ను మనుషులతో శుభ్రం చేయించకూడదని చట్టమైతే ఉంది. కానీ మ్యాన్ హోళ్ల లోపలికి పోయి ఊపిరాడక ప్రాణాలు కోల్పోయే పారిశుద్ధ్య కార్మికుల ఉదంతాలు ఇప్పటికీ కొనసాగడమే విషాదకరం. ఇంతటి దుర్భర పరిస్థితుల్లో సమాజ ఆరోగ్యం కోసం పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కనీస గౌరవ మర్యాదలు లభించక పోవడం మరింత శోచనీయం. 21వ శతాబ్దంలోకి దూసుకుపోతున్నామని జబ్బలు చరుచుకుంటున్న మనం... పారిశుద్ధ్య వ్యవస్థను పూర్తి స్థాయిలో యాంత్రికీకరణ చేయలేకపోవడం విడ్డూరంగా లేదూ?

మానవ విసర్జితాలను సాటి మనుషులే ఎత్తిపోసే అత్యంత దుర్భరమైన వ్యవస్థను నిర్మూలించేందుకు 2013లో కేంద్ర ప్రభుత్వం చట్టం తెచ్చింది. రెండేళ్ల కిందట దానికి సవరణలూ చేపట్టింది. పార్లమెంటులో బీఎస్పీ సభ్యుడు అడిగిన ఓ ప్రశ్నకు కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత శాఖ మంత్రి రాందాస్ అథవాలే సమాధానమిస్తూ... దేశంలో మానవ వ్యర్థాలను శుభ్రపరచే వృత్తిలో ఎవరూ లేరని ప్రకటించారు. అయితే సెప్టిక్ ట్యాంకులు, మురుగు కాలువలను శుభ్రంచేసే క్రమంలో గత అయిదేళ్లలో దేశవ్యాప్తంగా 330 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఆయనే వెల్లడించడం గమనార్హం.

మానవ విసర్జితాలను ఎత్తిపోసే దుర్భరమైన వృత్తిలో సమాజంలో అణగారిన వర్గాలు కొన్ని దశాబ్దాలపాటు మగ్గిపోయాయి. తదనంతర కాలంలో సెప్టిక్ ట్యాంకులు, మురుగు కాలువలు, మ్యాన్ హోళ్లలో దిగి వాటిని శుభ్రంచేసే పనులన్నీ వీరే నెత్తికెత్తుకోవాల్సి వచ్చింది. ఈ పనిలో ఏటా వందల మంది ప్రాణాలు కోల్పోతూనే ఉన్నారు. 2018లో 68 మంది, 2019లో 119 మంది కార్మికులు ఈ పనిలో ప్రాణాలు కోల్పోయారని కేంద్ర ప్రభుత్వమే 2020లో రాజ్యసభలో ప్రకటించింది. ఆ రెండేళ్లలోనే దాదాపు 200 మంది ఈ శుద్ధి ప్రక్రియలో ప్రాణాలు కోల్పోతే 2017 నుంచి 2022 వరకు అయిదేళ్లలో 330 మంది మృత్యువాత పడ్డారని చెప్పడం కాకిలెక్కలేనని స్వచ్ఛంద సంస్థలు, సఫాయి కర్మచారుల సంక్షేమ సంఘాలు విమర్శిస్తున్నాయి. ఇవన్నీ ఠాణాల్లో నమోదైన కేసుల సంఖ్య మాత్రమేననీ, ఇలా ప్రాణాలు కోల్పోయినవారు ఇంతకు ఎన్నోరెట్లు ఉంటారనీ వీరి జీవన స్థితిగతులను మార్చే లక్ష్యంతో దశాబ్దాలుగా పోరాడుతున్న స్వచ్ఛంద సంస్థ 'సఫాయీ కర్మచారీ ఆందోళన్' (ఎస్‌కేఏ) ఆవేదన వ్యక్తం చేస్తోంది. పార్లమెంట్ చట్టం ద్వారా ఏర్పడిన జాతీయ సఫాయీ కర్మచారీ కమిషన్ (ఎన్‌సీఎస్ కే) 2017 జనవరి నుంచి ఆగస్టు వరకు దేశవ్యాప్తంగా సెప్టిక్ ట్యాంకులు, మురుగు కాలువలు, మ్యాన్‌హోళ్లను శుభ్రంచేసే పనిలో 127 మంది చనిపోయినట్లు ప్రకటించింది. అదే సమయంలో ఒక్క జాతీయ రాజధాని ప్రాంతం పరిధిలోనే 429 మంది పారిశుద్ధ్య కార్మికులు ప్రాణాలు కోల్పోయినట్లు ఎస్‌కేఏ లెక్క తేల్చింది. మృతుల సగటు వయసు 37 సంవత్సరాలేనన్న గణాంకాలు– వారిపై ఆధారపడ్డ కుటుంబాలు రోడ్డున పడ్డాయన్న కఠోర సత్యాన్ని కళ్లకు కడుతున్నాయి.



2013 చట్టంలో కొన్ని క్లాజులు ఇబ్బందికరంగా ఉన్నాయి. అత్యవసర పరిస్థితుల్లో కార్మికులు మ్యాన్ హోల్‌లోకి ప్రవేశించవచ్చుననీ, అయితే 44 రకాల రక్షణ పరికరాలతోనే కార్మికులు ప్రవేశించవలసి ఉంటుందనీ చట్టంలో వివరణ ఉంది. అయితే సుప్రీంకోర్టు మాత్రం అత్యవసర పరిస్థితుల్లోనయినా సరే మనుషులను మ్యాన్ హోల్‌లోకి దింపరాదని ఆదేశించింది.

మ్యాన్ హోల్‌లలో ప్రాణాంతకమైన మిథేన్ వాయువు ఉండడం వల్ల కార్మికులు ఊపిరాడక చనిపోయే దుర్ఘటనలు చాలా జరుగుతున్నాయి. మ్యాన్ హోల్ మూత తెరవగానే వాయువులు పైకి పెల్లుబుకుతుంటాయి. కొంతసేపు తరువాత అక్కడ పరిస్థితిని బట్టి పక్కన ఉన్న ఇళ్ల నుంచి బకెట్లతో నీళ్లు తెచ్చిపోస్తే వాయువుల ఘాటు తగ్గుతుందని కొందరు కార్మికులు తమ అనుభవం వివరించారు.

మానవ వ్యర్థాల శుద్ధి, రవాణా వంటివన్నీ యాంత్రికీకరణ చేయడాన్ని ప్రాధాన్యాంశంగా తీసుకోవాలి. మురుగునీటి పారుదల వ్యవస్థలను ఆధునికీకరించాలి. ఈ దిశగా స్థానిక సంస్థలను ప్రోత్సహించాలి. సెప్టిక్ ట్యాంకుల శుద్ధీకరణకు ఐఐటీ మద్రాస్ 2019లోనే రోబోను రూపొందించినా ఇప్పటికీ వాటి వాడకం అమలుకు నోచుకోలేదు. అక్షరజ్ఞానం లేని పారిశుద్ధ్య కార్మికులు సైతం సులభంగా నడిపించగల ఇటువంటి యంత్రాలను వినియోగంలోకి తీసుకురావాలి. స్వచ్ఛభారత్ స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా, విధానపరంగా చేయూతనిస్తేనే మానవ వ్యర్థాలను ఎత్తిపోస్తున్నవారి జీవితాల్లో వెలుగు కనిపిస్తుంది. లేనిపక్షంలో పాలకులు ప్రజాక్షేత్రంలో ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు.

వ్యాసకర్త తెలంగాణ లోక్‌సత్తా పార్టీ
రాష్ట్ర అధ్యక్షుడు । 95508 44433

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, తిథి: శు.పంచమి రా.1.11 వరకు, తదుపరి షష్ఠి, నక్షత్రం: పునర్వసు ప.1.55 వరకు, తదుపరి పుష్యమి, వర్జ్యం: రా.10.43 నుండి 12.29 వరకు, దుర్ముహూర్తం: ప.11.31 నుండి 12.23 వరకు, అమృతఘడియలు: ఉ.11.15 నుండి 01.32 వరకు : రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు, యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు, సూర్యోదయం: 5.30, సూర్యాస్తమయం: 6.23.

క్లుప్తంగా...

సీఎం రైతు ద్రోహి: ఆర్‌ఎస్పీ



అలంపూర్: 'రైతుల సమస్యలు పట్టించుకోని సీఎం కేసీఆర్.. రైతు వ్యతిరేకి, ద్రోహి'అని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. బహుజన రాజ్యాధికార యాత్ర మంగళవారం అలంపూర్ మున్సిపాలిటీలో కొనసాగింది. ఈ సందర్భంగా ఆర్‌ఎస్పీ మాట్లాడుతూ.. ధాన్యా నికి గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అకాల వర్షాలతో రైతులు నష్టపోతుంటే వరి ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం చేస్తోందన్నారు. రైస్ మిల్లర్ల చేతివాటానికి మోసపోతున్న రైతులు.. దళారులకు చౌకగా ధాన్యాన్ని విక్రయిస్తూ నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి మిల్లర్లు క్వింటాలుకు 7నుంచి 10 కిలోలు అదనంగా తరుగు తీస్తున్నారని మండిపడ్డారు. తరుగు పేరుతో మోసాలు చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని, ఐకేపీ కేంద్రాల్లో ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

బీఆర్‌ఎస్‌ది గోబెల్స్ ప్రచారం: వైఎస్ షర్మిల



సాక్షి, హైదరాబాద్: లక్ష కోట్ల కాళేశ్వరం లక్ష ఎకరాలకు నీళ్లు ఇచ్చిందో లేదో కానీ.. దొరలు మాత్రం దేశా లు దాటి గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల విమర్శించారు. కమీషన్ల కాళేశ్వరంతో తెలంగాణ.. దేశానికి ధాన్యాగారం అయితే, తొమ్మిదేళ్లలో 9వేల మంది రైతులెందుకు ఆత్మహత్యలు చేసుకున్నారని నిలదీశారు. కాళేశ్వ రం తెలంగాణకు గుదిబండని, ఆ ప్రాజెక్ట్ ఇంజినీరింగ్ అద్భుతం కాదు 'మెగా'వైఫల్యమని విమర్శించారు. లక్ష కోట్లు ఖర్చు పెట్టి ఎన్ని ఎకరాలకు సాగునీరిచ్చారో తెలియని అయోమయం నెలకొందన్నారు. 'కేటీఆర్ 90 లక్షల ఎకరాలంటారు. కేసీఆర్ 45 లక్షల ఎకరాలంటారు. అసెంబ్లీ వేదికగా హరీశ్‌రావు 2 లక్షల ఎకరాలంటారు. ఇంతకీ ఏది నిజం' అని ఎద్దే వా చేశారు. కాళేశ్వరంతో 10 లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చామని సర్కారు వెబ్‌సైట్‌లో పేర్కొనడాన్ని ఆమె ఆక్షేపించారు. వైట్ ఎలిఫెంట్‌లా మారిన కాళేశ్వరంపై శ్వేతపత్రం విడుదల చేయాలని షర్మిల డిమాండ్ చేశారు.

పనులు ఆపకుంటే వాహనాలు తగలబెడతాం

- సీతమ్మసాగర్ నిర్మాణ కంపెనీ ప్రతినిధులకు ఎమ్మెల్యే హెచ్చరిక



చర్ల: సీతమ్మసాగర్ ప్రాజెక్టు నిర్మాణ పనులకు సంబంధించి పలువురు రైతులకు ఎలాంటి పరిహారం చెల్లించకుండా పనులు చేపడుతున్నారని తక్షణమే ఆ పనులను ఆపకుంటే వాహనాలు తగలబెడతామని భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్ట్ నిర్మాణ కంపెనీ ప్రతినిధులను హెచ్చరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లింగాపురం, కొత్తపల్లి, మొగళ్లపల్లి, కొత్తూరు తదితర గ్రామాల్లో చేపడుతున్న పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ...నిర్మాణ కంపెనీ ప్రతినిధులు కోర్టు ఆర్డర్లను అతిక్రమిస్తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, చట్టాలను చేతుల్లోకి తీసుకున్న వీరిపై చర్యలు తీసుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో పలువురు రైతుల పట్టా భూములకు, కోరెగడ్డలంకలో రైతులు సాగు చేసుకుంటున్న భూములకు ఎలాంటి పరిహారం చెల్లించకుండా పనులు చేపడుతున్నారని మండిపడ్డారు. రైతులకు పరిహారంతో పాటు పర్యావరణ అనుమతుల్లేవంటూ ఇటీవల కొందరు జాతీయ హరిత ట్రిబ్యునల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, పనులు ఆపాలంటూ కోర్టు ఆదేశాలు జారీ చేసిందని, అయినా నిర్మాణ కంపెనీ ప్రతినిధులు పనులు చేస్తుండటాన్ని ఆయన తప్పుబట్టారు. నిర్మాణ సంస్థ పెద్దలు, ఉన్నతాధికారులు వచ్చి రైతులతో మాట్లాడిన తర్వాతే పనులు చేపట్టాలని సూచించారు.

పంచాయతీలకు రూ.1,190 కోట్లు విడుదల

▶ మొదటి పేజీ తరువాయి

చేశారు. సీఎం కేసీఆర్‌తోపాటు హరీశ్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

జేపీఎస్‌ల క్రమబద్ధీకరణ, పంచాయతీలకు నిధుల పట్ల హర్షం...

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణతోపాటు, గ్రామ పంచాయతీలకు బకా యిల నిధులను విడుదల చేయడం పట్ల తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం హర్షం వ్యక్తం చేసింది. సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం జేపీఎస్‌లను కనికరించారని, జీపీలకు నిధులు విడుదల చేయడం వల్ల అభివృద్ధి మరింత వేగంగా జరగడానికి ఆస్కారమిచ్చారని ఆ సంఘం తెలిపింది. ఆ సంఘం బాధ్యులు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుని కలిసి కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం ఉపాధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బూడిద రామ్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి కొలను శ్రీనివాస్ రెడ్డి, పొట్ట సత్యం గౌడ్, జేపీఎస్‌ల సంఘానికి చెందిన శశిధర్, శివ, భాస్కర్, హరి, శివకుమార్ ఉన్నారు. అనంతరం వీరంతా సచివాలయంలో పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాను కలిసి ధన్యవాదాలు తెలిపారు.

సీఎం అంటే అంతా కలిసి ఓడిస్తారు!

▶ మొదటి పేజీ తరువాయి

నినాదాలు చేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ.. సీఎం అంటూ నినాదాలు చేస్తే అంతా కలిసి తనను ఓడిస్తారని, ఎమ్మెల్యేను కూడా కానివ్వరని వ్యాఖ్యానించడం ద్వారా పార్టీలోని అంతర్గత రాజకీయాలను, తనను ప్రత్యర్థి పార్టీలు పనిగట్టుకుని ఓడించే ప్రయత్నాలు చేస్తాయని చెప్పకనే చెప్పారు. తాను తెలంగాణ కోసం మంత్రి పదవిని వదిలేశానని, తనకు సీఎం పదవిపై మోజు లేదని కోమటిరెడ్డి చెప్పారు. అయినా తాను అనుకుంటే సీఎం పదవి నడుచుకుంటూ వస్తుందని పేర్కొనడం ద్వారా తాను కూడా సీఎం రేసులో ఉన్నట్టేనని పరోక్షంగా వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులందరం కలిసి పనిచేస్తామని చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్‌కు 70–80 సీట్లు వస్తాయని, అధికారంలోకి వచ్చేది తమ పార్టీనేనని దీమా వ్యక్తం చేశారు. నిరుద్యోగ భృతి, రుణ మాఫీ వంటి హామీలను కచ్చితంగా నెరవేరుస్తామని, ఎన్నికలకు రెండు నెలల ముందే అభ్యర్థులను ప్రకటిస్తామంటూ పార్టీ వ్యూహాలను కూడా బహిర్గతం చేశారు.

వైఎస్‌ను ఒప్పించి ప్రాజెక్టు సాధించాం..

'బ్రాహ్మణ వెల్లేంలకు కృష్ణా నీరు రావడంతో సంతోషంగా ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో సీఎంగా ఉన్న వైఎస్ రాజశేఖర రెడ్డిని మూడుసార్లు నల్లగొండకు తీసుకువచ్చా. ఆయన్ను ఒప్పించి ప్రాజెక్టును సాధించాం. అప్పట్లోనే 90 శాతం పనులు పూర్తయ్యాయి. ప్రాజెక్టుకు మోటార్లు బిగించాలంటే అధికారులను ఎమ్మెల్యేలు బెదిరిస్తున్నారు. మూడు నెలలైతే వారు మాజీలు అవుతారు. బస్టాండ్లలో బఠానీలు అమ్ముకుంటారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయాన్ని ఎవరూ ఆపలేరు. ఎవరు సీఎం అయినా, తాను ఒక్క మిస్డ్‌కాల్ ఇస్తే తన కోసం జిల్లా అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తారు. వచ్చే మూడు నెలల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కష్టపడి పనిచేస్తే తెలంగాణలో 80 సీట్ల వరకు పార్టీ గెలుస్తుంది. నల్లగొండ జిల్లాలో 12 స్థానాలు గెలవటం ఖాయం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తాం. రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇస్తాం..'అని కోమటిరెడ్డి చెప్పారు.



నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు వద్ద నిర్వహించిన సభలో మాట్లాడుతున్న భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండలో బీసీ డిక్లరేషన్ సభ

'వచ్చే వారం పది రోజుల్లో నల్లగొండలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీసీ డిక్లరేషన్ సభ నిర్వహిస్తాం. ఈ సభకు ప్రియాంకా గాంధీని తీసుకువస్తాం. వచ్చే ఎన్నికలకు రెండు నెలల ముందే కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటిస్తారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ ఎవరి పాలైందో అర్థం కావడం లేదు. 10వ తరగతి, ఇంటర్మీడియెట్ ప్రశ్న పత్రాలను దిద్దలేని ప్రభుత్వం, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లక్షల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడింది. రైతులు పండించిన ధాన్యం కల్లాల్లోనే ఎండకు ఎండి, వానకు తడిసిపోతుంటే ధాన్యాన్ని కొనలేని ప్రభుత్వం రైతు ప్రభుత్వం ఎలా అవుతుంది?. అసెంబ్లీలో 100 సార్లు శ్రీశైలం సొరంగం ప్రాజెక్టుపై రాజగోపాల్ రెడ్డి మాట్లాడితే ప్రభుత్వం స్పందించలేదు. ఇప్పటికైనా శ్రీశైలం సొరంగం, నక్కలగండి, బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టుల అసంపూర్తి పనులను పూర్తి చేయాలి. ఎన్నికల ముందు ప్రాజెక్టుల పేరుతో ఏం చేసినా ప్రజలు గమనిస్తారు..'అని వెంకటరెడ్డి అన్నారు.

ఫ్యూడల్ విధానాన్ని తీసుకురావడమేనా పునర్నిర్మాణం

- పీపుల్స్‌మార్చ్ యాత్రలో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయడమంటే ధరణి చట్టాన్ని తీసుకొచ్చి ఫ్యూడల్, భూస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడమేనా అని కాంగ్రెస్ శాసన సభాపక్ష నేత మల్లు భట్టివిక్రమార్క రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రం వెలిగిపోతుందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఐదు రోజుల విరామం అనంతరం పీపుల్స్ మార్చ్ పాదయాత్ర 68వ రోజు మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లాలో యథావిధిగా కొనసాగింది. నవాబ్‌పేట మండలం రుక్కంపల్లి నుంచి యాత్ర ప్రారంభం కాగా..పలుగ్రామాల మీదుగా కిష్టారం గ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మల్లారెడ్డిపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో భట్టి మాట్లాడారు. దశాబ్దాలుగా సాగు చేసుకుంటూ పహాణీలో కాస్తు కాలంలో ఉన్న పేద, మధ్యతరగతి, బలహీన వర్గాల రైతులు, మాన్యాలు ఇనాం భూములపై హక్కులు పొందిన రైతులు సైతం బీఆర్‌ఎస్ తీసుకొచ్చిన ధరణి వల్ల హక్కులు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.



రుక్కంపల్లిలో భట్టి పాదయాత్ర

తెలంగాణ వచ్చి పదేళ్లవుతున్న నేపథ్యంలో సంబరాలు చేసుకుంటూనే..నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవం లక్ష్యాలు నెరవేరాయా? సమసమాజం వైపు తెలంగాణ అడుగులు వేసిందా? స్వేచ్ఛాయుత వాతావరణం ఉందా వంటి అంశాలపై సమాజం మొత్తం ఆలోచన చేయాలని భట్టి పిలుపునిచ్చారు. దేశంలో బీజేపీ శకం ముగిసిందని కర్ణాటక ఫలితాలు తెలంగాణ నుంచి ఛత్తీస్‌గఢ్‌కు పాకుతాయని భట్టి అన్నారు.

ఐదు రాష్ట్రాలపై బీజేపీ నజర్!

- ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజికవర్గ ఓటర్లే లక్ష్యంగా కార్యాచరణ
- నేడు, రేపు ఎస్సీ మోర్చాల నేతలతో జాతీయ నేతల భేటీలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై బీజేపీ అధినాయకత్వం ప్రత్యేక దృష్టిపెట్టింది. ఈ ఏడాది చివరిలోగా తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, మిజోరంలో ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. కర్ణాటకలో ఓటమి నేపథ్యంలో ఈ ఎన్నికల కోసం బీజేపీ పకడ్బందీ ప్రణాళికలు రూపొందిస్తోంది. విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో పాగా వేయడంతో పాటు, ప్రస్తుతం అధికారంలో ఉన్న చోట తిరిగి విజయఢంకా మోగించడం లక్ష్యంగా ముందుకువెళ్లనుంది. ముఖ్యంగా 4 పెద్ద రాష్ట్రాల్లో అధిక ఓట్లు ఉన్న సామాజికవర్గాల వారీగా వ్యూహాలు సిద్ధం చేస్తోంది.

పార్టీ పరిస్థితిపై సమీక్ష..

బుధ, గురువారాల్లో ఐదు రాష్ట్రాలకు చెందిన ఎస్సీ మోర్చా నాయకులతో జాతీయ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు లాల్‌సింగ్ ఆర్య వేర్వేరుగా కీలక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ భేటీకి జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) బీఎల్ సంతోష్, మరో ముఖ్యనేత సతీష్, ఇతర నేతలు హాజరుకానున్నారు. ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి, ఎన్నికల సన్నద్ధత ఎలా ఉంది? బలాబలాలు, బలమైన అభ్యర్థులు, ఎన్నికల్లో ప్రభావితం చేసే అంశాలపై ఫీడ్‌బ్యాక్ తీసుకోనున్నారు. ఈ సమావేశానికి తెలంగాణ నుంచి పార్టీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాషా హాజరుకానున్నారు. రాష్ట్రంలోని 19 ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాల వారీగా అధికార, ప్రతిపక్ష పార్టీల వారీగా బలాబలాలపై నివేదికను సమర్పించనున్నారు. ఇదే మాదిరిగా పై ఐదు రాష్ట్రాలకు చెందిన వివిధ మోర్చాలతోనూ జాతీయ స్థాయి నేతలు సమావేశం కానున్నట్టు సమాచారం.

'కర్ణాటక' ఫలితం!

▶ మొదటి పేజీ తరువాయి

కార్యక్రమాలకు ఓ వర్గం నేతలు దూరంగా ఉంటుంటే, సీఎల్పీ నేత నిర్వహిస్తున్న బహిరంగ సభలకు మరోవర్గం నేతలు దూరంగా ఉంటున్నారు. సోషల్ మీడియాలో ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకోవడం నిత్యకృత్యంగా మారింది. వీటన్నింటిపై ఏఐసీసీ ఇప్పటికే రాష్ట్ర ఇన్‌చార్జిల నుంచి నివేదికలు తెప్పించుకుంది. ఎన్నికల సమయంలో నేతల మధ్య ఐక్యత అత్యంత ముఖ్యమని భావిస్తున్న కాంగ్రెస్ హైకమాండ్ ఆయా నివేదికల ఆధారంగా నేతలకు కీలక సూచనలు చేసే అవకాశాలున్నాయి.

బీఆర్‌ఎస్‌పై పోరాటానికి పక్కా వ్యూహం

కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు దోహదపడిన 'కమీషన్ల ప్రభుత్వం'నినాదాన్ని తెలంగాణలోనూ బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ ఇప్పటికే నిర్ణయించింది. ఇక 111 జీవో రద్దు, రింగ్‌రోడ్డు, సాగునీటి ప్రాజెక్టుల్లో జరుగుతున్న అవినీతిని ప్రధానాస్త్రంగా చేసుకొని బీఆర్‌ఎస్‌పై పోరాడేలా పక్కా వ్యూహాన్ని హైకమాండ్ సిద్ధం చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రభుత్వ అవినీతిపై కేంద్ర ఏజెన్సీలను సంప్రదించడం, కోర్టుల్లో దావాలు వేయడం సహా ప్రజా పోరాటాలు నిర్మించే అంశంపై మార్గదర్శనం చేయనుంది. దీంతో పాటే పార్టీ ఇప్పటికే ప్రకటిస్తున్న హామీల అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా కార్యక్రమాలు, బహిరంగ సభలు, ప్రియాంకగాంధీ పర్యటనల అంశాలను 26న జరిగే భేటీలో చర్చిస్తారని ఏఐసీసీ వర్గాలు తెలిపాయి.

జడ్చర్ల సభ ముగించుకుని..

ఏఐసీసీ పిలుపు నేపథ్యంలో ఈనెల 25న జడ్చర్లలో భారీ సభ మరుసటి రోజే టీపీసీసీ ముఖ్య నేతలంతా ఢిల్లీ పయనమవుతున్నారు. రాష్ట్రానికి చెందిన 11మంది కీలక నాయకులతో ఖర్గే, రాహుల్‌గాంధీలు సమావేశం కానున్నారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డితో పాటు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి (ముగ్గురు ఎంపీలు), మల్లు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, జగ్గారెడ్డి, పొదెం వీరయ్య, సీతక్క (ఐదుగురు ఎమ్మెల్యేలు), జీవన్‌రెడ్డి (ఎమ్మెల్సీ), మధుయాష్కీ గౌడ్ (టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్), దామోదర రాజనర్సింహ (టీపీసీసీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్)లకు ఆహ్వానం అందింది. కాగా ఖర్గే నివాసంలో ఈ సమావేశం జరగనుంది.

నదిలోకి బిడ్డను విసిరి..తల్లీ దూకబోయి

- నీటిలో మునిగి చనిపోయిన శిశువు
- నదిలోకి దూకబోయిన తల్లి..అడ్డుకున్న రివర్‌గార్డ్ పోలీసులు

యైటింక్లయిన్‌కాలనీ (పెద్దపల్లి జిల్లా): రెండునెలల శిశువును గోదావరిలోకి విసిరి తాను కూడా ఆత్మహత్య చేసుకోబోయింది ఓ తల్లి. ఇంతలో అక్కడే ఉన్న రివర్‌గార్డ్ పోలీసులు ఆ తల్లి ప్రయత్నాన్ని అడ్డుకుని ఆమెను రక్షించారు. అయితే నదిలో పడిన శిశువు జాలర్లు రక్షించే ప్రయత్నం చేసినా అప్పటికే ఊపిరాడక మృతి చెందింది. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో మంగళవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లో నివాసముంటూ పెద్దపల్లి జిల్లాలోని ఆర్కే–7గనిలో ఫిట్టర్‌గా పనిచేస్తున్న బుక్యా రమేశ్, ప్రియాంక దంపతులకు రెండునెలల పాప ఉంది. రెండు నెలల నుంచి ప్రియాంక సెంటినరీకాలనీలోని తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. మంగళవారం పాప ముక్కు నుంచి రక్తంరావడంతో కలత చెందిన ప్రియాంక సెంటినరీ కాలనీలోని సింగరేణి డిస్పెన్సరీ(ఆస్పత్రి)కి తీసుకెళ్లింది. అక్కడ పరీక్షించిన వైద్యులు గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు ఎండవేడి కారణంగా ముక్కులోంచి రక్తం వచ్చిందని, ఎలాంటి ప్రమాదమూ లేదని, మందులు ఇచ్చి పంపించారు. అయితే ప్రియాంక ఇంటికి వెళ్లకుండా పాపను తీసుకుని గోదావరిఖని సమీపంలోని గోదావరినది బ్రిడ్జిపైకి వెళ్లి పాపను నదిలోకి విసిరేసింది. అనంతరం తాను కూడా దూకిబోగా...అక్కడే ఉన్న రివర్‌గార్డ్ పోలీసులు అడ్డుకున్నారు. నదిలో మునిగిపోతున్న పాపను కాపాడేందుకు జాలర్లు ప్రయత్నం చేయగా అప్పటికే పాప విగత జీవిగా మారింది. ఘటనా స్థలాన్ని స్థానిక సీఐ సందర్శించి పూర్వాపరాలను ఆరా తీస్తున్నారు. ప్రియాంకకు మతిస్థిమితం లేకపోవడమే కారణమా..? ఇంకేమైనా కారణం ఉందా..? అనే కోణంపై విచారణ చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పు చెల్లించలేదని...

- కౌలురైతు పంట డబ్బులు బదిలీ చేసుకున్న అప్పు ఇచ్చిన వ్యక్తి
- సహకరించిన కొనుగోలు కేంద్రం నిర్వాహకుడు
- మనస్తాపంతో కౌలురైతు మృతి, కుటుంబ సభ్యుల ఆందోళన
- కరీంనగర్ జిల్లా పీచుపల్లిలో ఘటన



చిగురుమామిడి(హుస్నాబాద్): అప్పు చెల్లించలేదని కౌలురైతు విషయంలో ఓ వ్యక్తి దారుణంగా ప్రవర్తించాడు. సదరు రైతు పండించిన పంట డబ్బు తన ఖాతాలో జమ అయ్యేలా కొనుగోలు కేంద్రంలో మేనేజ్ చేశాడు. మనస్తాపం చెందిన కౌలు రైతు మంగళవారం ఆకస్మికంగా మరణించాడు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం పీచుపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. పీచుపల్లికి చెందిన పోతరవేని రాజయ్య(55) కౌలురైతు. ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని వరిపంట వేశాడు. ఇటీవలే వరి కోసి ధాన్యాన్ని పీచుపల్లిలోని డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రంలో ఆరబోశాడు. రెండురోజుల క్రితం తూకం వేశాడు. అయితే.. కుటుంబ అవసరాల నిమిత్తం రాజయ్య.. అదే గ్రామానికి చెందిన గడ్డం జగ్గారెడ్డి వద్ద గతంలో తీసుకున్నాడు. ఆ అప్పు తీర్చడం లేదని జగ్గారెడ్డి.. రాజయ్య ధాన్యం డబ్బులు తనఖాతాలో జమచేసుకునేందుకు కొనుగోలు సెంటర్‌కు వెళ్లాడు. ఆధార్, బ్యాంకు, రైతు పాసుపుస్తకం జిరాక్స్ పేపర్లను కొనుగోలు కేంద్రం నిర్వాహకుడు నరేందర్‌కు ఇచ్చాడు. జగ్గారెడ్డి వివరాలనే నరేందర్ ఆన్‌లైన్‌లో నమోదు చేశాడు. ఓటీపీ వచ్చింది.. రెండు, మూడు రోజుల్లో పంటసొమ్ము కూడా జమ అవుతుందని సందేశం వచ్చింది. దీంతో తన కష్టం వృథా అయ్యిందని రాజయ్య మనస్తాపం చెందాడు. తనకు డబ్బులు రావని దిగులు పడ్డాడు. మంగళవారం వేకువజామున ఆకస్మికంగా మృతి చెందాడు. రాజయ్య మృతికి జగ్గారెడ్డి కారణమని అతని ఇంటిఎదుట రాజయ్య మృతదేహంతో కటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. రాత్రివరకు చర్చలు కొనసాగాయి. అయితే ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై సామల రాజేశ్ తెలిపారు.

పోడు పట్టాల పండగ!

▶ మొదటి పేజీ తరువాయి

ఈ పథకాన్ని ప్రారంభించాలని ఆదేశించా రు. జూలైలోనే దళితబంధు కొనసాగింపు కోసం ఏర్పాట్లు చేయాలని సీఎస్‌కు సూచించారు.

కలెక్టర్లతో రేపు సదస్సు

తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లకు సంబంధించి ఈ నెల 25న జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సు నిర్వహించాలని సీఎం నిర్ణయించారు. ఈ సమావేశంలో మంత్రులు, జిల్లా ఎస్పీలు పాల్గొంటారు.

14న నిమ్స్ విస్తరణకు శంకుస్థాపన

వైద్యారోగ్య దినోత్సవం సందర్భంగా జూన్ 14న నిమ్స్ ఆస్పత్రి విస్తరణ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. 2,000 పడకలతో నూతనంగా నిర్మించనున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ భవన నిర్మాణం పనులకు పునాదిరాయి వేయనున్నారు.

పదోన్నతులు కల్పించండి

రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి మిత్తల్‌కు ట్రెసా విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: రెవెన్యూశాఖ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) కోరింది. డిప్యూటీ కలెక్టర్, తహసీల్దార్, ఇతర కేడర్లలో పదోన్నతులను పూర్తిచేయాలని కోరుతూ ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.గౌతమ్‌కుమార్ మంగళవారం రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిత్తల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వీఆర్‌ఏలకు పేస్కేల్ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై వారు కృతజ్ఞతలు తెలిపారు.

పంట నష్టం.. కూతురు పెళ్లికి పుట్టని రుణం

మనస్తాపంతో రైతు బలవన్మరణం



బాదావత్ వీర్య (ఫైల్)

టేకుమట్ల(రేగొండ): ఒకవైపు రెండేళ్లు పంట పండక పెరిగిన అప్పులు.. మరోవైపు కూతురు పెళ్లి దగ్గరపడుతున్నా చిల్లిగవ్వ అప్పు పుట్టని దుస్థితి. దీంతో మనస్తాపానికి గురైన ఓ రైతు చావే శరణ్యమనుకుని ప్రాణాలు తీసుకున్నాడు. ఈ విషాద ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రామన్నగూడెంతండాలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..తండాకు చెందిన బాదావత్ వీర్య(50) తనకున్న రెండెకరాల భూమితో పాటు, మరో ఐదెకరాల భూమిని కౌలుకు తీసుకుని మిర్చి, వరి పంటలు వేస్తున్నాడు. రెండేళ్లుగా వ్యవసాయంలో నష్ట వాటిల్లుతోంది. ఈ నెల 31న కుమార్తె వివాహం పెట్టుకున్నాడు. పంటలో నష్టం రావడంతో సుమారు రూ.5లక్షల మేర అప్పులయ్యాయి. మరోవైపు కూతురు వివాహానికి నగదు సమకూరడం లేదు. దీనికి తోడు ఈ ఏడాది ఫిబ్రవరి 28న తన పెద్దకుమారుడు చందులాల్ రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. దీంతో మానసికంగా తీవ్ర ఒత్తిడికి లోనైన వీర్య సోమవారం మధ్యాహ్నం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు పరకాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి, అక్కడినుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. రెండున్నర నెలల వ్యవధిలోనే తండ్రీకొడుకులు మృతి చెందిన ఘటనలతో కుటుంబంతో పాటు గ్రామంలోనూ విషాదఛాయలు అలముకున్నాయి.

క్లుప్తంగా

ప్రధాని డిగ్రీ సర్టిఫికెట్ వివాదం...

కేజ్రీవాల్‌కు మళ్లీ సమన్లు

అహ్మదాబాద్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ డిగ్రీ సర్టిఫికెట్‌పై చేసిన వ్యాఖ్యల కేసుకు సంబంధించి ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్‌లకు గుజరాత్ కోర్టు మరోసారి సమన్లు జారీ చేసింది. కేజ్రీవాల్ వ్యాఖ్యలపై గుజరాత్ యూనివర్సిటీ దాఖలు చేసిన పరువు నష్టం కేసులో జూన్ 7న కోర్టు ఎదుట హాజరు కావాలంటూ చీఫ్ మెట్రోపాలిటిన్ మెజిస్ట్రేట్ ఎస్.జే.పాంచాల్ మంగళవారం సమన్లు పంపారు. గతంలో మే 23న హాజరు కావాలని కోర్టు సమన్లు జారీ చేసినా ఇరువురు నేతలు హాజరు కాలేదు. ప్రధాని విద్యార్హతల వివాదం సమయంలో గుజరాత్ యూనివర్సిటీ పరువు తీసేలా కేజ్రీవాల్, ఆప్ నాయకులు మాట్లాడారని, ట్విట్టర్లలో పోస్టులు పెట్టారన్న ఆరోపణలతో ఆ యూనివర్సిటీ కోర్టుకెక్కింది. మోదీకి డిగ్రీయే ఉంటే, అది నిజాయితీగా వచ్చిందే అయితే గుజరాత్ యూనివర్సిటీ ఆ సర్టిఫికెట్ ఎందుకు ఇవ్వలేదు, బహుశా అది ఫేక్ అయి ఉంటుందంటూ అప్పట్లో కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు.

బెంగాల్‌లో 34,000 కిలోల పేలుడు పదార్థాలు స్వాధీనం

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహించిన దాడుల్లో భారీ ఎత్తున పేలుడు పదార్థాలు, నిషేధిత బాణసంచాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పేలుడు పదార్థాల తయారీ పరిశ్రమలను చట్టవిరుద్ధంగా నిర్వహిస్తున్న 100 మందిని అరెస్టు చేసినట్లు పోలీసు అధికారులు మంగళవారం వెల్లడించారు. మొత్తం 132 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. 34,000 కిలోల పేలుడు పదార్థాలు, బాణసంచాను స్వాధీనం చేసుకున్నారు.

కునో నేషనల్ పార్క్‌లో చీతా కూన మృతి

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్క్‌లో రెండు నెలల క్రితం జన్మించిన చీతా కూన మంగళవారం చనిపోయిందని అటవీ శాఖ తెలిపింది. దీంతో, ఆఫ్రికా దేశాల నుంచి తీసుకువచ్చిన వాటితో కలిపి రెండు నెలల కాలంలో మృతి చెందిన చీతాల సంఖ్య నాలుగుకు చేరింది. నమీబియా నుంచి తీసుకువచ్చిన చీతాల్లో ఒకటైన 'జ్వాల'కు మార్చిలో నాలుగు కూనలు పుట్టాయి. మంగళవారం తల్లితోపాటు మూడు కూనలు అటవీ ప్రాంతంలో తిరుగాడుతుండగా, నాలుగో కూన మాత్రం కదలకుండా ఉంది. వైద్యులు చికిత్స అందించినా ఫలితం లేకపోయింది. కొద్ది సేపటికే చనిపోయింది' అని అటవీ శాఖ వివరించింది. ఈ కూన పుట్టినప్పటి నుంచి బలహీనంగానే ఉందని తెలిపింది. నమీబియా, దక్షిణాఫ్రికాల నుంచి తీసుకువచ్చిన చీతాల్లో మూడు గత రెండు నెలల్లో చనిపోవడం తెలిసిందే.

సివిల్స్‌లో నారీ భేరి

మొదటి నాలుగు ర్యాంకులు వారివే | ఫస్ట్ ర్యాంకర్ ఇషితా కిశోర్ | తెలుగు యువతి నూకల ఉమా హారతికి మూడో ర్యాంక్ | టాప్-25 ర్యాంకర్లలో 14 మంది మహిళలు, 11 మంది పురుషులు | అర్హత సాధించిన 933 మంది అభ్యర్థులు

న్యూఢిల్లీ: సివిల్ సర్వీసెస్-2022 తుది ఫలితాలను యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్(యూపీఎస్సీ) మంగళవారం విడుదల చేసింది. మొదటి నాలుగు ర్యాంకులను మహిళలే కైవసం చేసుకోవడం విశేషం . ఢిల్లీ యూనివర్సిటీ గ్రాడ్యుయేట్ ఇషితా కిశోర్ తొలి ర్యాంకు సాధించారు. గరిమా లోహియా, తెలుగు యువతి నూకల ఉమా హారతి, స్మృతీ మిశ్రా వరుసగా రెండు, మూడు, నాలుగో ర్యాంకు సొంతం చేసుకున్నారు. టాప్-25 ర్యాంకర్లలో 14 మంది మహిళలు, 11 మంది పురుషులు ఉన్నట్లు యూపీఎస్సీ ప్రకటించింది. ఈ పరీక్షలో మొత్తం 933 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. వీరిలో 613 మంది పురుషులు, 320 మంది మహిళలు ఉన్నారు. సివిల్స్‌లో టాప్-3 ర్యాంకులు మహిళలే సాధించడం ఇది వరుసగా రెండో సంవత్సరం కావడం గమనార్హం. సివిల్స్-2021లో శృతి శర్మ, అంకితా అగర్వాల్, గామినీ సింగ్లా తొలి మూడు ర్యాంకులు దక్కించుకున్న సంగతి తెలిసిందే.

మూడో ప్రయత్నంలో తొలి ర్యాంక్

ఈసారి సివిల్స్ తొలి ర్యాంకర్ ఇషితా కిశోర్ ఆప్షనల్ సబ్జెక్టుగా పొలిటికల్ సైన్స్ అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ ఎంచుకొని మూడో ప్రయత్నంలో విజయం సాధించారు. ఆమె యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ పరిధిలోని శ్రీరామ్ కాలేజీ ఆఫ్ కామర్స్ నుంచి ఎకనామిక్స్(ఆనర్స్)లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. రెండో ర్యాంకర్ గరిమా లోహియా యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ పరిధిలోని కిరోరీమల్ కాలేజీ నుంచి కామర్స్‌లో గ్రాడ్యుయేషన్ అభ్యసించారు. సివిల్స్‌లో కామర్స్ అండ్ అకౌంటెన్సీని ఆప్షనల్ సబ్జెక్టుగా ఎంచుకున్నారు. రెండో ప్రయత్నంలో రెండో ర్యాంక్ సాధించారు. మూడో ర్యాంకర్ నూకల ఉమా హారతి ఐఐటీ-హైదరాబాద్ నుంచి సివిల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ పూర్తిచేశారు. ఆంత్రోపాలజీని ఆప్షనల్ సబ్జెక్టుగా ఎంచుకున్నారు. ఐదో ప్రయత్నంలో మూడో ర్యాంక్ సొంతం చేసుకున్నారు. ఇక స్మృతీ మిశ్రా మూడో ప్రయత్నంలో నాలుగో ర్యాంకు దక్కించుకున్నారు. ఆమె ఢిల్లీలోని మిరండా హౌజ్ కాలేజీలో బీఎస్సీ చదివారు. జువాలజీ ఆప్షనల్ సబ్జెక్టుగా సివిల్స్‌లో జయకేతనం ఎగురవేశారు. ఐదో ర్యాంకర్ మయూర్ హాజారికా తొలి ప్రయత్నంలోనే అనుకున్నది సాధించారు. అస్సాంకు చెందిన హజారియా ఎంబీబీఎస్ చదివారు.

ప్రతిష్టాత్మక విద్యా సంస్థల నుంచి రాక

టాప్-25 ర్యాంకర్ల విద్యార్హతలను గమనిస్తే చాలా మంది ఐఐటీ, ఎన్ఐటీ, యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ, గుజరాత్ నేషనల్ లా యూనివర్సిటీ, జాదవ్‌పూర్ యూనివర్సిటీ వంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థల నుంచి ఇంజనీరింగ్, హ్యుమానిటీస్, సైన్స్, కామర్స్, మెడికల్ సైన్స్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసినవారే ఉన్నారు. మెయిన్స్ పరీక్షలో ఎక్కువ మంది ఆంత్రోపాలజీ, కామర్స్ అండ్ అకౌంటెన్సీ, ఎకనామిక్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, లా, హిస్టరీ, మ్యాథ్స్, పొలిటికల్ సైన్స్ అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్, ఫిలాసఫీ, సోషియాలజీ, జువాలజీని ఆప్షనల్ సబ్జెక్టులుగా ఎంచుకున్నారు.

రిజర్వ్ లిస్టులో 178 మంది

అర్హత సాధించిన వారిలో 345 మంది జనరల్ కేటగిరీ, 99 మంది ఆర్థికంగా వెనుకబడిన తరగతి(ఈడబ్ల్యూఎస్), 263 మంది ఇతర వెనుకబడిన తరగతులు(ఓబీసీ), 154 మంది షెడ్యూల్డ్ కులాలు(ఎస్సీ), 72 మంది షెడ్యూల్డ్ తెగల(ఎస్టీ) వర్గానికి చెందినవారున్నారు. 178 మంది అభ్యర్థులను రిజర్వ్ జాబితాలో చేర్చినట్లు యూపీఎస్సీ తెలియజేసింది. మొత్తం విజేతల్లో 41 మంది దివ్యాంగులు ఉన్నారు.



ఫస్ట్ ర్యాంకర్ ఇషితకు మిఠాయి తినిపిస్తున్న కుటుంబసభ్యులు

నా కల నెరవేరింది

సివిల్స్‌లో తొలి ర్యాంకు సాధించడం ద్వారా నా కల నెరవేరింది. ఐఏఎస్ అధికారిగా మహిళా సాధికారత కోసం, అణగారిన వర్గాల సంక్షేమ కోసం కృషి చేస్తా. మొదటి ర్యాంకు లభించడం చాలా సంతోషంగా ఉంది. ఇందుకు తొలుత నా కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేయాలి. సివిల్స్‌లో మొదటి రెండు ప్రయత్నాలు విఫలమైనప్పటికీ వారు నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. మెరుగైన ర్యాంకు సాధించాలన్న లక్ష్యంతో ప్రతిరోజూ 8 గంటల నుంచి 9 గంటల పాటు చదివాను. నా కఠోర శ్రమకు ఈ ఫలితం దక్కిందని భావిస్తున్నా. నా ప్రాధాన్యత ఉత్తర ప్రదేశ్ క్యాడర్. ఈసారి సివిల్స్‌లో మొదటి నాలుగు ర్యాంకులు మహిళలు సొంతం చేసుకోవడం ఆనందంగా ఉంది

\- ఇషితా కిశోర్, సివిల్స్ ఫస్ట్ ర్యాంకర్

15 రోజుల్లోగా మార్కుల వివరాలు

యూపీఎస్సీ వెబ్‌సైట్ http//www.upsc.gov.in ద్వారా ఫలితాలు, సివిల్స్ విజేతల వివరాలు తెలుసుకోవచ్చు. అభ్యర్థులకు ఏదైనా సమాచారం కావాలంటే 011- 23385271/ 23381125/ 23098543 ఫోన్ నంబర్ల ద్వారా పని దినాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల దాకా సంప్రదించవచ్చని యూపీఎస్సీ సూచించింది. సివిల్స్-2022లో అభ్యర్థులు సాధించిన మార్కుల వివరాలను 15 రోజుల్లోగా వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలియజేసింది.

సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షను గత ఏడాది జూన్ 5న నిర్వహించారు. 11,35,697 మంది దరఖాస్తు చేసుకోగా, 5,73,735 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 13,090 మంది మెయిన్స్‌కు అర్హత సాధించారు. గత ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన మెయిన్స్ పరీక్షలో 2,529 మంది అభ్యర్థులు పర్సనాలిటీ టెస్టు(ఇంటర్వ్యూ)కు ఎంపికయ్యారు. తుది ఫలితాల్లో 933 మంది అర్హత సాధించారు.

టాప్-10 ర్యాంకర్లు

ర్యాంకు	విజేత
1	ఇషితా కిశోర్
2	గరిమా లోహియా
3	నూకల ఉమా హారతి
4	స్మృతీ మిశ్రా
5	మయూర్ హజారికా
6	గహన నవ్యా జేమ్స్
7	వసీం అహ్మద్ భట్
8	అనిరుధ్ యాదవ్
9	కనికా గోయల్
10	రాహుల్ శ్రీవాస్తవ

రెండో ర్యాంకు ఊహించలేదు

''సివిల్స్ సాధించాలన్నది నా చిన్నప్పటి కల. ఏకంగా రెండో ర్యాంకు సాధిస్తానని ఊహించలేదు. గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత సివిల్స్ ప్రిపరేషన్ ప్రారంభించా. ఈ ప్రయాణంలో మా అమ్మ, కుటుంబ సభ్యులు నాకు తోడుగా నిలిచారు. ప్రిపరేషన్ నిరంతరం కాకుండా మధ్యలో అప్పుడప్పుడు విరామం ఇచ్చా. బంధుమిత్రులను కలుసుకున్నా. స్ఫూర్తి, సొంతంగా చదుకోవడం, విశ్లేషణతో ఎవరైనా పరీక్షల్లో విజయం సాధించవచ్చు. సరైన మార్గనిర్దేశం కూడా అవసరమే. పెద్ద నగరంలో ఉంటున్నామా, చిన్న పట్టణంలో ఉంటున్నామా అనేది సమస్య కాదు. ఇంట్లో ఉండి చదువుకుంటే ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి. సర్వీసులో చేరాక మహిళాభివృద్ధి, యువత సంక్షేమం కోసం పనిచేస్తా''

\- గరిమా లోహియా, సివిల్స్ రెండో ర్యాంకర్

విజేతలకు మోదీ అభినందనలు

సివిల్స్-2022 విజేతలకు ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలియజేశారు. దేశానికి సేవలందించే అవకాశం రావడం, ప్రజల జీవితాన్ని సానుకూల మార్పును తీసుకొచ్చే అదృష్టం లభించడం గొప్ప విషయమంటూ ట్వీట్ చేశారు. విజయం సాధించలేకపోయినవారు నైపుణ్యాలను, బలాలను ప్రదర్శించేందుకు దేశంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. ర్యాంకర్లకు కేంద్ర మంత్రులు అమిత్ షా, జితేంద్ర సింగ్ తదితరులు అభినందనలు తెలియజేశారు.



హెడ్ కానిస్టేబుల్‌కు 667వ ర్యాంక్

ఢిల్లీ పోలీసు శాఖలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న రామ్‌భజన్ కుమార్ సివిల్స్‌లో 667వ ర్యాంకు సాధించి, అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. ఆయన వయసు 34 ఏళ్లు. ఎనిమిదో ప్రయత్నంలో ర్యాంకు సాధించడం గమనార్హం. ప్రస్తుతం సైబర్ సెల్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. సివిల్స్ ఫలితాలు వెలువడిన తర్వాత రామ్‌భజన్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సహచరులు, సీనియర్ అధికారులు ఆయనను అభినందించారు. ఓబీసీ కేటగిరీకి చెందిన రామ్‌భజన్‌కు తొమ్మిది సార్లు సివిల్స్ రాసేందుకు అనుమతి ఉంది. ఎట్టకేలకు ర్యాంకు సాధించడం ద్వారా తన కల నెరవేర్చుకున్నానని ఆయన చెప్పారు. ఒకవేళ ఈసారి విఫలమైనా తొమ్మిదోసారి పరీక్ష రాయాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. ఇప్పటిదాకా ఏడు ప్రయత్నాలు సఫలం కాకపోయినా నిరాశ పడలేదని అన్నారు. తన భార్య అందించిన అండదండలతో ముందుకు సాగానని వివరించారు. తాను రాజస్తాన్ నుంచి వచ్చానని, అక్కడ తన తండ్రి కూలీగా పనిచేస్తున్నాడని వెల్లడించారు. కష్టాల్లోనే పుట్టి పెరిగానని పేర్కొన్నారు. అంకితభావం, కఠోర శ్రమ, సహనంతో అనుకున్న లక్ష్యం సాధించడం సులువేనని సూచించారు. కానిస్టేబుల్‌గా పనిచేస్తూ 2019లో యూపీఎస్సీ పరీక్షలో ర్యాంకు సాధించిన ఫిరోజ్ ఆలం తనకు స్ఫూర్తిగా నిలిచారని చెప్పారు. రామ్‌భజన్ 2009లో పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా చేరారు.

నమ్మకమే పునాది



వేద పండితుల ఆశీర్వచనాలు, ఆస్ట్రేలియా మూలవాసుల సంప్రదాయ పద్ధతుల్లో మోదీ, అల్బనీస్‌లకు వేదికపైకి స్వాగతం

ఆస్ట్రేలియాతో సుదృఢ బంధం: మోదీ



ఫోన్ టార్చ్‌లైట్లను వెలిగించి మోదీకి సభికుల అభివాదం

కిక్కిరిసిన సిడ్నీ ఇండోర్ స్టేడియం

20 వేల మందికి పైగా హాజరు

ఆద్యంతం మోదీ నినాదాలే

ఆస్ట్రేలియా ప్రధాని విస్మయం

సిడ్నీ: పరస్పర నమ్మకం, గౌరవాలే మూలస్తంభాలుగా భారత్-ఆస్ట్రేలియా సంబంధాలు నానాటికీ బలపడుతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. మంగళవారం సిడ్నీలోని కుడోస్ బ్యాంక్ ఎరీనాలో జరిగిన కార్యక్రమంలో ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో కలిసి ఆయన మాట్లాడారు. దేశంలోని అతి పెద్ద ఇండోర్ స్టేడియాల్లో ఒకటైన 20 వేల మంది సామర్థ్యమున్న ఎరీనా పూర్తిగా కిక్కిరిసిపోయింది. కార్యక్రమంలో 21 వేల మందికి పైగా పాల్గొన్నారు. సభికులంతా 'మోదీ, మోదీ' నినాదాలతో ప్రధానికి ఘనస్వాగతం పలికారు. ఆయన ప్రసంగం పొడవునా పదేపదే అవే నినాదాలతో హోరెత్తించారు. మోదీ మాట్లాడుతూ ఆస్ట్రేలియాలో వ్యూహాత్మక భాగస్వామ్యం నానాటికీ బలోపేతమవుతోందన్నారు. వచ్చే ఐదేళ్లలో ద్వైపాక్షిక వాణిజ్యం రెట్టింపునకు మించి పెరుగుతుందని ఆశాభావం వెలిబుచ్చారు. ''భారత-ఆస్ట్రేలియా మధ్య భౌగోళికంగా చాలా దూరమున్నా హిందూ మహాసముద్రం రెండింటినీ నిరంతరం కలిపే ఉంచుతోంది. ఇరు దేశాల బంధాలకు ఒకప్పుడు '3సి'లు (కామన్వెల్త్, క్రికెట్, కర్రీ) ప్రతీకగా ఉండేవి. తర్వాత '3డి'లు (డెమొక్రసీ, డయాస్పొరా, దోస్తీ)గా మారింది. ఇప్పుడది '3ఇ'లు (ఎనర్జీ, ఎకానమీ, ఎడ్యుకేషన్)గా రూపాంతరం చెందింది. ఇరు దేశాల బంధాల్లోని గాఢత ఈ నిర్వచనాలన్నింటినీ ఎప్పుడో అధిగమించింది. క్రికెట్ అయితే ఎన్నో దశాబ్దాలుగా కలిపి ఉంచుతూ వచ్చింది. కొన్నేళ్లుగా ఈ జాబితాలో యోగా కూడా చేరింది'' అని సభికుల హర్షధ్వానాల మధ్య చెప్పుకొచ్చారు. ఇందులో ఆస్ట్రేలియాలోని భారత సంతతి పాత్ర అత్యంత కీలకమని ప్రశంసలు గుప్పించారు. లెగ్ స్పిన్ మాంత్రికుడు, లెజెండరీ క్రికెటర్ షేన్ వార్న్ అకాల మరణం పాలైనప్పుడు లక్షలాది మంది భారతీయులు అత్యంత ఆప్తున్ని కోల్పోయామంటూ దుఃఖించారని గుర్తు చేశారు. బ్రిస్బేన్‌లో త్వరలో భారత కాన్సులేట్‌ను ప్రారంభిస్తామని ప్రకటించారు. బుధవారం మోదీ, అల్బనీస్ ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు.

ప్రపంచ శక్తిగా భారత్

భారత్ నేడు ప్రపంచమంతటికీ ఓ సానుకూల శక్తిగా ఎదిగిందని ఈ సందర్భంగా మోదీ అన్నారు. ఎక్కడ ఎలాంటి విపత్తు జరిగినా సాయానికి అందరికంటే ముందు నిలుస్తూ వస్తోందన్నారు. ఇటీవలి తుర్కియే భూకంప బాధితులను ఆపరేషన్ దోస్త్ ద్వారా ఇతోధికంగా ఆదుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ''ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో తళుకులీనుతున్న తారగా భారత్‌ను అంతర్జాతీయ ద్రవ్య నిధి అభివర్ణించింది. ప్రపంచ మాంద్యం పరిస్థితులను సమర్థంగా తట్టుకుంటున్న దేశమేదైనా ఉందంటే అది భారతేనని ప్రపంచ బ్యాంకు కూడా చెప్పింది. ప్రపంచంలోకెల్లా అత్యంత ఎక్కువ సంఖ్యలో యువత ఉన్న దేశం కూడా భారతే'' అన్నారు.

భారత యాత్రాస్మృతిలోకి జారుకున్న అల్బనీస్

ఇటీవలి భారత పర్యటన తాలూకు మధుర స్మృతులు తన మనసులో ఇంకా తాజాగానే ఉన్నాయన్నారు. ''గుజరాత్‌లో హోలీ వేడుకలు, ఢిల్లీలో మహాత్మా గాంధీకి నివాళులు, అహ్మదాబాద్ స్టేడియంలో దాదాపు లక్ష మంది అభిమానుల అభివాదం స్వీకరించడం అన్నీ అద్భుత జ్ఞాపకాలే. 1991లో 28 ఏళ్ల యువకునిగా ఐదు వారాల పాటు భారత్‌లో కలియదిరిగా. ఎక్కడికి వెళ్లినా ఇరు దేశాల ప్రజల మధ్య పెనవేసుకున్న గాఢానుబంధాన్ని గమనించా'' అని చెప్పారు. నిజమైన భారత్‌ను అర్థం చేసుకోవాలంటే దేశమంతా రైళ్లో, బస్సుల్లో విస్తృతంగా కలియదిరగాలని అల్బనీస్ అభిప్రాయపడ్డారు.

సిడ్నీలో 'లిటిల్ ఇండియా'

పశ్చిమ సిడ్నీలో భారతీయులు ఎక్కువగా ఉండే హారిస్ పార్కుకు 'లిటిల్ ఇండియా' అని ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ నామకరణం చేశారు. ఇదో గొప్ప గౌరవమంటూ మోదీ కృతజ్ఞతలు తెలిపారు. అల్బనీస్‌ను హారిస్ పార్క్‌కు తీసుకెళ్లి భారతీయ వంటకాలు, ముఖ్యంగా అక్కడ బాగా ఫేమస్ అయిన చాట్, జిలేబీ రుచి చూపించాలని స్థానిక భారతీయులకు సూచించారు. కోవిడ్ కష్టకాలంలో ఆస్ట్రేలియాలో స్థానిక గురుద్వారాలు గొప్పగా సేవలందించాయని ఆయన అన్నారు.

మోదీ ఓ రాక్‌స్టార్

సిసలైన బాస్: అల్బనీస్

తమ దేశంలో మోదీకి దక్కుతున్న అపూర్వ ఆదరణను కళ్లారా చూసి ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ అక్షరాలా అచ్చెరువొందారు. మోదీ వేదికపైకి రాగానే ఆయన్ను ఆప్యాయంగా కౌగిలించుకున్నారు. 'ప్రపంచంలో ఎక్కడికెళ్లినా రాక్‌స్టార్ తరహాలో అపూర్వ స్వాగతం పొందే అత్యంత పాపులర్ నాయకుడు' అంటూ మిన్నంటిన హర్షధ్వానాల మధ్య సభికులకు పరిచయం చేశారు! ''ప్రఖ్యాత అమెరికా సింగర్ బ్రూస్ స్ప్రింగ్‌స్టీన్ కూడా 2017లో ఇక్కడికొచ్చారు. ఇప్పుడు మోదీకి లభించినంత ఆదరణ ఆయనకు కూడా దక్కలేదు. మోదీ నిజమైన బాస్'' అంటూ ఆకాశానికెత్తారు. స్ప్రింగ్‌స్టీన్‌ను అభిమానులు బాస్ అని ముద్దుపేరుతో పిలుచుకుంటారు! ప్రపంచంలోకెల్లా అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం తాలూకు స్ఫూర్తిని ఆస్ట్రేలియాకు వెంట తెచ్చినందుకు మోదీకి కృతజ్ఞతలని అల్బనీస్ అన్నారు. ఇంత భారీ సంఖ్యలో భారతీయులు ఆస్ట్రేలియాను తమ సొంతిల్లుగా మార్చుకున్నందుకు వారిని చూసి గర్వపడుతున్నానన్నారు. అంతకుముందు ప్రధానులిద్దరికీ వేదిక వద్ద వేదమంత్రాలు, ఆస్ట్రేలియా మూలవాసుల సంప్రదాయ పద్ధతుల్లో ఘనస్వాగతం లభించింది. ఆస్ట్రేలియాతో బంధాలను దృఢతరం చేయడంలో కీలకపాత్ర పోషించాలని భారతీయ ప్రముఖులను మోదీ కోరారు.

సిసోడియా పట్ల పోలీసుల దురుసుతనం: ఆప్



సిసోడియాను లాక్కెళ్తున్న పోలీసు

న్యూఢిల్లీ: ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ఆవరణలో మంగళవారం మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా పట్ల పోలీసులు అనుచితంగా ప్రవర్తించారని ఆప్ ఆరోపించింది. ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో జుడీషియల్ కస్టడీలో ఉన్న సిసోడియాను పోలీసులు మంగళవారం కోర్టుకు తీసుకువచ్చారు. కస్టడీని జూన్ ఒకటో తేదీ వరకు పొడిగిస్తూ న్యాయమూర్తి ఆదేశాలిచ్చారు. అనంతరం తీసుకెళ్తుండగా సిసోడియా మీడియాతో మాట్లాడేందుకు యత్నించారు. పోలీసులు ఆయన్ను బలవంతంగా మెడపట్టి లాక్కెళ్లారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సహా పలువురు ఆప్ నేతలు దీన్ని ఖండించారు. ఆప్ విమర్శలను తప్పుడు ప్రచారంగా ఢిల్లీ పోలీసు శాఖ పేర్కొంది. ''కస్టడీలో ఉండగా మీడియాకు స్టేట్‌మెంట్లివ్వడం చట్ట విరుద్ధం. ఈ ఘటనలో పోలీసు అధికారి నుంచి అలాంటి స్పందన సహజమే'' అంటూ ట్వీట్ చేసింది.

కేంద్ర ఆర్డినెన్స్‌పై పోరులో మీ వెంటే మేం

కేజ్రీవాల్‌కు బెంగాల్ సీఎం మమతా బెనర్జీ హామీ

కోల్‌కతా: దేశ రాజధానిలో పరిపాలనా సర్వీసులపై లెఫ్టినెంట్ గవర్నర్‌కు అధికారాలు కట్టబెడుతూ కేంద్రం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌పై పోరులో సీఎం కేజ్రీవాల్‌కు మద్దతుగా నిలుస్తామని పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ ప్రకటించారు. కేజ్రీవాల్ మంగళవారం పంజాబ్ సీఎం భగవంత్ మాన్‌తో కలిసి కోల్‌కతాలో మమతతో గంటపాటు చర్చలు జరిపారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆర్డినెన్స్‌పై రాజ్యసభలో ప్రవేశపెట్టే బిల్లును 2024 లోక్‌సభ ఎన్నికలకు సెమీఫైనల్‌గా కేజ్రీవాల్ అభివర్ణించారు. కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ అధికారంలో ఉంటే ఏర్పడేది డబుల్ ఇంజన్ సర్కారు కాదని, ట్రబుల్ ఇంజన్ ప్రభుత్వమని మమత ఎద్దేవా చేశారు. ఆర్డినెన్స్‌పై బిల్లుకు రాజ్యసభలో వ్యతిరేకంగా ఓటేయాలని అన్ని పార్టీలకు విజ్ఞప్తి చేశారు. 'కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మహా అయితే ఆరు నెలలు మాత్రమే అధికారంలో ఉంటుంది. అద్భుతమేదైనా జరిగితే ఈలోగానే గద్దెదిగుతుంది'అని మమత పేర్కొన్నారు.



మెక్సికో దేశంలోని పెబ్లా రాష్ట్రంలోని పోపోకాటెపెటెల్ అగ్నిపర్వతమిది. సోమవారం బద్దలై పెద్దమొత్తంలో లావా, దుమ్ము ధూళిని వెదజల్లినప్పుడు తీసిందీ ఫొటో.



రాహుల్ లారీ ప్రయాణం

రాహుల్ కూచున్నది ఎక్కడో తెలుసా? ఓ లారీ క్యాబిన్లో! లారీ డ్రైవర్ల సమస్యలు తెలుసుకోవడానికి ఢిల్లీ నుంచి చండీగఢ్ వరకు సోమవారం రాత్రంతా ఆయన ఇలా లారీలో ప్రయాణించారు. మధ్యలో ధాబాలో డ్రైవర్లతో మాట్లాడారు. సంబంధిత వీడియోను కాంగ్రెస్ ట్వీట్ చేసింది. దేశవ్యాప్తంగా 90 లక్షల మంది లారీ డ్రైవర్ల సమస్యలను కేంద్రం పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ కొంతకాలంగా విమర్శిస్తోంది.

పార్లమెంట్ ప్రారంభోత్సవాన్ని బహిష్కరించనున్న విపక్షాలు!

న్యూఢిల్లీ: పార్లమెంట్ నూతన భవనాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రారంభించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీయే ప్రారంభిస్తే ఈ కార్యక్రమాన్ని బహిష్కరించాలని యోచిస్తున్నట్లు సమాచారం. కొత్త భవనాన్ని ఈ నెల 28న లాంఛనంగా ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. నూతన భవన ప్రారంభోత్సవానికి తాము హాజరు కావడం లేదని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ, సీపీఐ నేతలు ఇప్పటికే ప్రకటించారు. ఈకార్యక్రమాన్ని బహిష్కరించాలని, దీనిపై అతిత్వరలో ఒక ఉమ్మడి ప్రకటన జారీ చేయాలని పలు భావసారూప్యం కలిగిన ప్రతిపక్షాలు భావిస్తున్నట్లు సమాచారం. బుధవారం తుది నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. పార్లమెంట్ అనేది కేవలం ఒక భవనం కాదని, దేశ ప్రజాస్వామ్యానికి అది పునాది అని తృణమూల్ కాంగ్రెస్ నేత, ఎంపీ డెరెక్ ఓ బ్రెయిన్ చెప్పారు. ఇది ప్రధాని మోదీ సొంత వ్యవహారం కాదని అన్నారు. 2020 డిసెంబర్‌లో కొత్త పార్లమెంట్ నిర్మాణ శంకుస్థాపన పనులను ప్రతిపక్షాలు బహిష్కరించాయి.

సాక్షి
కరీంనగర్

బుధవారం | 24 | మే | 2023



పత్తి క్వింటాల్‌కు రూ.7,050

జమ్మికుంట: జమ్మికుంట మార్కెట్‌లో మంగళ వారం క్వింటాల్ పత్తి గరిష్ట ధర రూ.7,050, మోడల్ ధర రూ.6,950, కనిష్ట ధర రూ.6,700 పలికింది.



నకిలీ మకిలీ వీడేనా!

రైతుకు ఎంతో కీలకమైన విత్తన దశను అభాసు పాలుజేస్తున్నారు పలు వురు వ్యాపారులు. తక్కువ ధరకు విత్తనాలొస్తున్నాయని ఆశ చూపడం రివాజుగా సాగుతోంది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
41.0/27.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

సార్..లెటర్ ప్లీజ్!

డీఎస్పీ నుంచి ఎస్సైల వరకు సిఫారసుల కోసం పరుగులు

- పోస్టింగులు ఇప్పించాలని ఎమ్మెల్యేలకు వినతులు
- తెలంగాణ దశాబ్ది ఉత్సవాల తర్వాత బదిలీలు?
- ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే సివిల్ సర్వెంట్ల బదిలీలు
- త్వరలో మరికొందరు ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీలు?



సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

సార్వత్రిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని డీజీపీ అంజనీకుమార్ ఆదేశాలతో పోలీసుశాఖ అప్రమత్తమైంది. ఎప్పుడు ఎన్నికల షెడ్యూలు వచ్చినా.. విధుల నిర్వహణకు సిద్ధంగా ఉండేలా పోలీసు కమిషనర్లు, ఎస్పీలు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. పోస్టింగుల కోసం ప్రయత్నాలు చేసే పోలీసు అధికారులు సైతం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మూడేళ్ల గడువు తీరిన స్టేషన్ హౌజ్ ఆఫీసర్ పోస్టు కోసం ఎస్సైలు, ఇన్‌స్పెక్టర్లు, సబ్‌డివిజన్ కోసం డీఎస్పీ, ఏసీపీ ర్యాంకు అధికారుల మధ్య తీవ్రపోటీ నెలకొంది. చాలాకాలంగా లూప్‌లైన్‌లో ఉన్న వారు, పోస్టింగుల కోసం ఎదురు చూస్తున్న వారంతా అధికార పార్టీ ఎమ్మెల్యేల ద్వారా సిఫారసు లేఖల కోసం యత్నిస్తున్నారు. గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కొందరు, విధేయత చూపిస్తామని మరికొందరు లీడర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఇన్‌స్పెక్టర్ ర్యాంకు అధికారులు ఇటీవల అడపాదడపా బదిలీ అయినా.. ఎస్సై ర్యాంకు అధికారులు మాత్రం మార్చిలోనే మరో చోటికి బదిలీ అయ్యారు.

వెంటాడుతున్న నిబంధనలు..

కరీంనగర్ జిల్లా ముందునుంచి రాజకీయంగా ప్రత్యేకతను కలిగిఉంది. సంచలనాలు, ఉద్యమాలకు పురిటిగడ్డగా పేరున్న జిల్లాలో పోలీసులు, రెవెన్యూ అధికారులకు పోస్టింగులు దక్కడం ఆషామాషీ కాదు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉప్పు నిప్పు అన్న పరిస్థితుల్లో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలంతా విశ్వసనీయతను పక్కనబెట్టి ప్రతిభావంతులు, సమర్థులైన అధికారుల వైపే మొగ్గు చూపుతున్నారు. ఐఏఎస్, ఐపీఎస్ వంటి సివిల్ సర్వెంట్ల నుంచి ఆర్డీవోలు, డీఎస్పీ, తహసీల్దార్, ఇన్‌స్పెక్టర్, ఎస్సైల వరకు అందరికీ ఇదే సూత్రం పాటించాలని నిర్ణయానికి వచ్చారు. ఎక్కడ చిన్న లోపం దొరికినా.. ఎన్నికల్లో ప్రతిపక్షాలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసే అవకాశం లేకుండా పకడ్బందీగా పోస్టింగులు ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. మూడేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న అధికారులంతా ఆ నియోజకవర్గంలో పనిచేయకూడదు. అదే సమయంలో గతంలో అదే నియోజకవర్గంలో ఉప ఎన్నిక లేదా జనరల్ ఎన్నికలు నిర్వహించి ఉండకూడదు.

దశాబ్ది ఉత్సవాల తరువాత బదిలీలు..

విశ్వసనీయ సమాచారం ప్రకారం...ఐఏఎస్, ఐపీఎస్‌లతోపాటు ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఇన్‌స్పెక్టర్ల వంటి పోస్టింగులు చాలావరకు మార్చి నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. ఐఏఎస్, ఐపీఎస్ బదిలీల వ్యవహారం రాజధానిలో నిర్ణయిస్తారు. కానీ... ఆర్డీవో, డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్, ఎస్సై ర్యాంకు అధికారుల్లో చాలామంది తదుపరి పోస్టింగ్ ఎక్కడన్నది ఇప్పటికే దాదాపు అవగాహన ఉంది. కొన్ని సాంకేతిక సమస్యల కారణాలతో బదిలీలు ఆలస్యమవుతున్నాయి. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు అంటే జూన్ 2 తర్వాత కొలిక్కి వచ్చే అవకాశం ఉందని సమాచారం.

కీలక అధికారుల పదవీకాలం.. వివరాలు

కరీంనగర్

కలెక్టర్: ఆర్వీ కర్ణన్ దాదాపు రెండేళ్లుగా పనిచేస్తున్నారు. హుజూరాబాద్ ఉప ఎన్నిక, ఎమ్మెల్సీ జనరల్ ఎన్నిక నిర్వహించారు.
అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ): శ్యామ్ ప్రసాద్‌లాల్ ఐదేళ్లుగా పనిచేస్తున్నారు.
అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్): గరీమఅగర్వాల్ ఏడాదిన్నర కింద చేరారు.
సీపీ కరీంనగర్: ఎల్. సుబ్బారాయుడు, ఇటీవలే విధుల్లో చేరారు.
అడిషనల్ డీసీపీ (ఎల్అండ్‌వో): శ్రీనివాస్, మూడేళ్లుగా కొనసాగుతున్నారు.
అడిషనల్ డీసీపీ (అడ్మిన్): చంద్రమోహన్, నాలుగేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు.
ఏసీపీలు: అర్బన్ ఏసీపీ తుల శ్రీనివాస్, రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు రెండేళ్లలోపే..హుజూరాబాద్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఉపఎన్నిక ముందు వచ్చారు.
ఆర్డీవోలు: కరీంనగర్ ఆనంద్‌కుమార్ ఐదేళ్లవుతోంది.. హుజూరాబాద్ ఆర్డీవో హరిసింగ్ ఇటీవలే బాధ్యతలు తీసుకున్నారు.

పెద్దపల్లి

కలెక్టర్: సంగీత సత్యానారాయణ, రెండేళ్లు అవుతోంది.
అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ): లక్ష్మీనారాయణ, మూడున్నరేళ్లవుతోంది.
అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్): దీపక్‌కుమార్, రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నారు.
సీపీ రామగుండం: రేమా రాజేశ్వరి, ఇటీవల బాధ్యతలు స్వీకరించారు.
ఆర్డీవోలు: పెద్దపల్లి–వెంకట మాధవరావు, మంథని– వీర బ్రహ్మాచారి ఇద్దరూ ఇటీవలే బాధ్యతలు చేపట్టారు.
డీఎస్పీలు: ఎడ్ల మహేశ్ ఇటీవలే వచ్చారు. గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్ రెండేళ్ల దాటింది.

జగిత్యాల

కలెక్టర్: యాస్మీన్‌బాషా: ఇటీవలే బాధ్యతలు చేపట్టారు.
అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ): మందా మకరంద్, ఏడాదిగా పనిచేస్తున్నారు.
అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్): లత, రెండేళ్లుగా కొనసాగుతున్నారు.
ఎస్పీ: భాస్కర్, ఇటీవలే బాధ్యతలు చేపట్టారు.
ఆర్డీవోలు: మెట్‌పల్లి–కోరుట్ల ఆర్డీవోగా ఉన్న వినోద్, జగిత్యాల ఆర్డీవోగా ఉన్న మాధురి మూడేళ్లుగా పనిచేస్తున్నారు.
డీఎస్పీలు: ప్రకాశ్, రవీందర్‌రెడ్డి కాస్త అటూ ఇటూగా రెండేళ్లుగా పనిచేస్తున్నారు.

సిరిసిల్ల

కలెక్టర్: అనురాగ్ జయంతి.. ఏడాదిన్నర పూర్తి చేసుకున్నారు.
ఎస్పీ: అఖిల్‌మహాజన్ ఇటీవలే బాధ్యతలు చేపట్టారు.
అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ): ఖీమ్యా నాయక్, ఏడాది గడిచింది.
అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్): సత్యప్రసాద్, రెండేళ్ల గడిచాయి.
ఆర్డీవోలు: సిరిసిల్ల–టీ.శ్రీనివాసరావు నాలుగేళ్లు.. వేములవాడ–పవన్‌కుమార్ ఏడాది దాటింది.
డీఎస్పీలు: సిరిసిల్ల– విశ్వప్రసాద్ ఏడాది దాటింది. వేములవాడ–నాగేంద్రాచారి ఏడాదిన్నర అయింది.

మెరిసిన ఆణిముత్యాలు

సివిల్స్‌లో ఉమ్మడి జిల్లావాసుల ప్రతిభ

● ఆవుల సాయికృష్ణకు 94వ ర్యాంకు ● 132వ ర్యాంకు సాధించిన శివమారుతిరెడ్డి



జగిత్యాల: మిఠాయిలు పంపిణీ చేస్తున్న శివమారుతిరెడ్డి కుటుంబ సభ్యులు

కరీంనగర్/కోరుట్ల: వాళ్లు లక్ష్య సాధనపైనే దృష్టి సారించారు.. కృషి, పట్టుదలతో చదివారు.. ఒకసారి తప్పినా మరోసారి మరింత కసి పెంచుకున్నారు.. తల్లిదండ్రులు, పెద్దల ప్రోత్సాహంతో ముందుకు కదిలారు.. అకుంఠిత దీక్షతో ముందుకెళ్లారు సివిల్స్‌లో ర్యాంకులు సాధించారు.. విజయానికి పేదరికం, ఆర్థిక పరిస్థితులు అడ్డు కాదని నిరూపించారు.

సుమితా డావ్రా స్ఫూర్తి



'సివిల్స్ అనేది ఓ తపస్సు లాంటిది.. ఎన్ని గంటలు, ఎంతసేపు చదివామన్నది కాదు.. ఎంత విషయ పరిజ్ఞానం పెంపొందించుకున్నామనేదే ముఖ్యం' అని సివిల్స్–2022 ఫలితాల్లో ఆల్ ఇండియాలో 94వ ర్యాంకు సాధించిన ఆవుల సాయికృష్ణ అన్నారు. ఉన్నత చదువులకు పేదరికం, ఆర్థిక పరిస్థితులు కారణాలు కావని పేర్కొన్నారు. కంటెంట్ కాదు.. క్వాలిటీ ముఖ్యమని... చదువుకుంటున్న రోజుల్లో కరీంనగర్ కలెక్టర్‌గా పనిచేసిన సుమితా డావ్రా స్ఫూర్తన్నారు.

కరీంనగర్, హైదరాబాద్‌లో చదువు..

కరీంనగర్ పారమిత పాఠశాల, ఇంటర్మీడియట్ హైదరాబాద్ నారాయణ కళాశాల, ఇంజినీరింగ్ వరంగల్ నీట్‌లో సాగింది. మాది మధ్య తరగతి కుటుంబం. నాన్న ఆవుల లక్ష్మయ్య ప్రభుత్వ ఉపాధ్యాయుడు. అమ్మ సునీత గృహిణి. సోదరుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. హైదరాబాద్‌లో పనిచేస్తున్నారు. ఐఏఎస్ కావాలనేది నా లక్ష్యం. రెండో ప్రయత్నంలోనే 2017 బ్యాచ్‌లో 728వ ర్యాంక్ సాధించిన. మినిస్టరీ ఆఫ్ కార్పొరేట్ ఎఫైర్స్ రీజినల్ డైరెక్టర్ (ఎస్ఈఆర్), హైదరాబాద్ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నా. ఎలాగైనా ఐఏఎస్ సాధించాలనే లక్ష్యంతో ఆరోసారి పట్టువదలని విక్రమార్కుడిలా ప్రయత్నించా.

మార్గదర్శకులు...

ఎస్ఈఆర్‌లో నా సీనియర్ తక్కళ్లపల్లి యశ్వంత్‌రావు సూచనలు, సలహాలు పాటించా. ఎన్ని గంటలు చదివామన్నది కాకుండా.. ఏ మేరకు విషయ పరిజ్ఞానం అవలోకనం జరిగిందో తెలుసుకోని విశ్రమించకుండా, తక్షశిల కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు దుర్గాప్రసాద్ మార్గదర్శనం ఎంతో ఉపయోగపడింది.

రెండో ప్రయత్నంలో..

జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామానికి చెందిన ఏనుగు అంజిరెడ్డి–పుష్పలత దంపతుల కుమారుడు శివమారుతిరెడ్డి సివిల్స్ ఫలితాల్లో 132 ర్యాంకు సాధించి సత్తా చాటారు. ఈయన తండ్రి అంజిరెడ్డి జిల్లాలోని మల్లాపూర్ మండలం గుండంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. పుష్పలత వ్యవసాయ పనులు పర్యవేక్షిస్తారు. ప్రాథమిక విద్యాభ్యాసం కోరుట్ల మండలం అయిలాపూర్ విశ్వశాంతి పాఠశాల జరిగింది. తొమ్మిది, పదో తరగతి, ఇంటర్ హైదరాబాద్ శ్రీచైతన్య కళాశాలలో సాగింది. సివిల్స్ సాధించాలన్న లక్ష్యంతో ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్ యూనివర్శిటీ బీఏ(ఎకనావిక్స్)లో చేరారు. మూడేళ్లక్రితం డిగ్రీ పూర్తిచేసి 2021లో తొలిసారి సివిల్స్ రాశాడు. కొవిడ్ బారిన పడి ప్రిలిమినరీలో ఉత్తీర్ణత సాధించలేకపోయాడు. తండ్రి అంజిరెడ్డి ప్రోత్సాహంతో మళ్లీ సన్నద్ధమయ్యారు. రెండోసారి విజయం సొంతం చేసుకున్నారు. ప్రతీరోజు 8 గంటలు చదివేవాడినని శివమారుతిరెడ్డి అన్నారు. సిలబస్‌ను చిన్నచిన్న విభాగాలుగా మార్చుకుని వారానికి ఓ విభాగం లెక్కన ఒకదాని తర్వాత ఒకటి పూర్తిగా చదివి అవగాహన పెంచుకున్నాన్నారు. సివిల్స్ సాధనలో ఎన్‌సీఈఆర్‌టీ బేసిక్ నుంచి ఉన్నతస్థాయి వరకు ఉన్న పుస్తకాలు ఉపయోగపడ్డాయని వివరించారు.

నాన్నపై ప్రేమతో..



ఉపాధ్యాయుడిగా అంకితభావంతో పనిచేస్తూ పిల్లలను తీర్చిదిద్దడానికి మా నాన్న పడుతున్న తపనను చిన్ననాటి నుంచి గమనించా. ఉన్నత ఉద్యోగం సాధిస్తే ఆయన బాటలోనే ప్రజలకు సేవలు అందించవచ్చన్న ఆలోచనతో సివిల్స్‌పై దృష్టి పెట్టా. అమ్మ పుష్పలత, నాన్న ఆశయాలు సాధించడానికి కష్టపడి చదివా. ప్రస్తుత ర్యాంకు 132 ప్రకారం ఐఏఎస్ క్యాడర్ వస్తుందని ఆశిస్తున్నా. అందులో చేరాక మళ్లీ సివిల్స్ రాస్తా. ఫారిన్ సర్వీసెస్ సాధించాలన్నది నా లక్ష్యం.

– శివమారుతిరెడ్డి

న్యూస్‌రీల్

బాలింత మరణాలు నివారించాలి



కరీంనగర్‌టౌన్: జిల్లాలో బాలింతల మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్వీ కర్ణన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో మాతృమరణాలు, లింగనిర్ధారణ, హైరిస్క్ ప్రెగ్నెన్సీ, సీసెక్షన్ ఆపరేషన్ తదితర అంశాలపై వైద్యాధికారులతో రివ్యూ నిర్వహించారు. జిల్లాలో ప్రసవం అనంతరం రక్తహీనత, ఆర్‌హెచ్ నెగటీవ్ కారణాలతో జరిగే బాలింతల మరణాలపై మహిళలను అప్రమత్తం చేయాలన్నారు. ఏఎన్ఎంలు తరచూ క్షేత్రస్థాయిలో తిరుగుతూ అవసరమైన చికిత్సలు అందించాలన్నారు. ఆసుపత్రుల్లో ఓపీ, ఐపీ ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. లింగనిర్ధారణ పరీక్షలు చేసే కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి లలితాదేవి, పీసీహెచ్ఓ కృష్ణభాస్కర్, డాక్టర్ సుజాత, గైనకాలజిస్టు డాక్టర్ మంజుల పాల్గొన్నారు.

మద్యం అక్రమ రవాణా చేస్తే కఠినచర్యలు

కరీంనగర్‌క్రైం: మద్యం అక్రమ రవాణా, క్రయ విక్రయాలపై కఠిన చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి.శ్రీనివాసరావు హెచ్చరించారు. మంగళవారం ఆయన స్థానికంగా మాట్లాడారు. కరీంనగర్ జిల్లాలో అక్రమ మద్యం, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, అమ్మినా, రవాణా చేసినా, కలిగియున్న చర్యలు తప్పవన్నారు. గోవా, కర్ణాటక, మహారాష్ట్ర, ఢిల్లీ, హర్యానా తదితర రాష్ట్రాల నుంచి బాటిల్ లిక్కర్ తెచ్చి అమ్మినా.. పార్టీలు, ఫంక్షన్లు నిర్వహించినా కేసులు ఫైల్‌చేస్తామన్నారు. ఆర్మీ బాటిళ్లు కూడా సివిలియన్స్ వద్ద దొరికితే చర్యలు తప్పవన్నారు. ట్రాన్స్‌పోర్టు యజమానులు, వాహనదారులు, డ్రైవర్లు అక్రమ మద్యానికి సహకరించవద్దన్నారు. ఎక్సైజ్‌శాఖ ద్వారా ఈవెంట్ పర్మిషన్ తీసుకోవాలని లేదంటే ఫంక్షన్ హాల్, నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఉత్సాహంగా సీఎం కప్ జిల్లాస్థాయి పోటీలు



బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న డీవైఎస్ఓ

కరీంనగర్‌స్పోర్ట్స్: సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడా పోటీలు రెండోరోజు ఉత్సాహభరితంగా సాగాయి. జిల్లా యువజన, క్రీడాశాఖాధికారి కీర్తి రాజవీరు రన్నింగ్, అథ్లెటిక్స్‌తో పాటు పలు పోటీలను ప్రారంభించారు. మంగళవారం జరిగిన పోటీల్లో కబడ్డీ విభాగంలో హుజురాబాద్ జట్టు గెలుపొందగా, గన్నేరువరం జట్టు రన్నరప్‌గా నిలిచింది. మహిళల కబడ్డీ విభాగంలో హుజురాబాద్ జట్టు గెలుపొందగా, కరీంనగర్ అర్బన్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఖోఖో పురుషుల విభాగంలో మానకొండూర్ జట్టు విజయం సాధించగా హుజురాబాద్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. మహిళల ఖోఖోలో కేశవపట్నం జట్టు విజయం సాధించగా కరీంనగర్ అర్బన్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఫుట్‌బాల్‌లో కరీంనగర్ అర్బన్ జట్టు విజయం సాధించింది. షటిల్ బ్యాడ్మింటన్ మెన్స్ విభాగంలో సింగిల్స్‌లో వైభవ్ అనసూరి, డబుల్ మెన్స్ విభాగంలో ఎల్.సాయిరిశ్వంత్, వైభవన సూరి విజయం సాధించారు. ఉమెన్స్ సింగిల్స్ విభాగంలో భవ్యశ్రీ, డబుల్స్‌లో రుషిత, భవ్యశ్రీ, మిక్స్‌డ్ డబుల్స్‌లో వైభవ్ అనసూరి, భవ్యశ్రీ, అథ్లెటిక్స్ రన్‌లో డి.అరవింద్, ఎ.సాయిమనోజ్, సీహెచ్ శైలజ, డి.భార్గవి, పురుషుల లాంగ్ జంప్‌లో డి.అరవింద్ విజేతలుగా నిలిచారు. నేటితో జిల్లాస్థాయి సీఎం కప్ పోటీలు ముగియనున్నాయి. నేటి సాయంత్రం 5 గంటలకు స్టేడియంలో బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం జరుగనున్నట్లు డీవైఎస్ఓ రాజవీరు తెలిపారు.

రోజూ పౌష్టికాహారం అందించాలి



వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

గంగాధర(చొప్పదండి): పౌష్టికాహారంతోనే మహిళలు, పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ పేర్కొన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్, పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని గట్టుభూత్కూర్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రోజూ పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూ చించారు. గ్రామంలోని బీసీ కాలనీలో గల అంగన్‌వాడీ బోరు వద్ద కమ్యూనిటీ ఇంకుడుగుంత నిర్మాణ పనులు ప్రారంభించారు. అనంతరం కోతుల వనం, శ్మశానవాటిక, సెగ్రిగేషన్ షెడ్, నర్సరీని పరిశీలించారు. చెత్త సేకరణ వివరాలు తెలుసుకున్నారు. గ్రామంలోని ఇంకుడుగుంతలను పరిశీలించి పంచాయతీ పాలకవర్గాన్ని అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కంకణాల విజయేందర్‌రెడ్డి, డీఆర్డీవో శ్రీలత, డీపీవో వీరబుచ్చయ్య, డీడబ్ల్యూవో సంధ్యారాణి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కంకణాల రాజగోపాల్‌రెడ్డి, ఎంపీడీవో రాజీవ్ మల్హోత్ర, ఎంపీవో జనార్దన్‌రెడ్డి, ఎస్‌బీఎం వేణు, ఉపసర్పంచ్ కాసారపు శైలజ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నేడు విత్తన మేళా

కరీంనగర్ అర్బన్: అన్నదాతల సౌకర్యార్థం కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానంలో బుధవారం విత్తన మేళా నిర్వహించనున్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి.మంజులత తెలిపారు. ఆసక్తిగల రైతులు కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానానికి ఉదయం 10 గంటలకు రావాలని సూచించారు. వివరాలకు 8464943732, 9505507995, 9963075228 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వీఆర్ఏల వివరాల సేకరణ

- క్రమబద్ధీకరణకు అడుగులు
- విద్యార్హతల ఆధారంగా మూడు కేటగిరీలుగా విభజన

జిల్లాలో రెవెన్యూ గ్రామాలు:	205
మొత్తం వీఆర్ఏలు:	510
టీఎస్‌పీఎస్సీ ద్వారా నియామకం:	125
వారసత్వంగా నియామకం:	385
డిగ్రీ, ఆపైన విద్యార్హత గలవారు:	336
ఇంటర్‌లోపు అర్హత ఉన్నవారు:	174



కరీంనగర్ అర్బన్: జిల్లాలో వీఆర్ఏ ఉద్యోగాల క్రమబద్ధీకరణ చర్యలు ప్రారంభమయ్యాయి. కలెక్టర్ ఆర్వీ కర్ణన్ మౌఖిక ఆదేశాల మేరకు తహసీల్దార్లు వివరాల సేకరిస్తున్నారు. ఇదేక్రమంలో కొందరు తహసీల్దార్లు తమ అనుచరులను వీఆర్ఏలుగా నియమించేందుకు పావులు కదుపుతున్నట్లు తెలిసింది. విద్యార్హతల ఆధారంగా ఇరిగేషన్, మునిసిపల్, విద్యాశాఖ, రెవెన్యూశాఖ, మిషన్ భగీరథ, జిల్లా పరిషత్, మెడికల్ కాలేజీల్లో పేస్కేల్ ఇస్తూ తదుపరి ప్రమోషన్లు వచ్చేవిధంగా వారిని సర్దుబాటు చేయనున్నట్లు సమాచారం.

సమాచారం తర్వాతే మార్గదర్శకాలు..

- వీఆర్ఏల సమగ్ర సమాచారం ఇచ్చిన తర్వాతే క్రమబద్ధీకరణ మార్గదర్శకాలు జారీకానున్నాయి.
- జిల్లాలో 510 మంది వీఆర్ఏలు పనిచేస్తున్నారు. వీరిలో ఏపీపీఎస్సీ ద్వారా నియమితులైన వారు 125 మంది వరకు ఉన్నారు. వంశపారంపర్యంగా వచ్చిన వారిలో కొందరు వయోపరిమితితో సంబంధం లేకుండా పనిచేస్తున్నారు.
- అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న మరికొందరి స్థానంలో కుటుంబసభ్యుల్లో మరొకరు వీఆర్ఏగా కొనసాగుతున్నారు. మరికొందరు వేరే వ్యక్తులను జీతంపై అనధికారికంగా నియమించుకున్నారు.

మూడు కేటగిరీలుగా...

- వీఆర్ఏలలో ఉన్నత విద్యార్హతలున్నవారికి పదోన్నతులు కల్పిస్తామని, 55 ఏళ్లు నిండిన వారసత్వ వీఆర్ఏల పిల్లలకు ఉద్యోగాలు ఇస్తామని సీఎం హామీ ఇచ్చారు.
- హామీ అమలు చేయాలంటూ 2022లో వీఆర్ఏలు 80 రోజులపాటు విధులు బహిష్కరించి సమ్మెకు దిగారు. అప్పుడు ఐదుగురు మరణించారు. కొందరు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నారు. అయినా వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులకు వీఆర్ఏ పోస్టు ఇవ్వలేదు.
- వీఆర్ఏల విద్యార్హతల్లోనూ భారీగా తేడాలున్నాయి. వంశ పారంపర్యంగా వచ్చిన వారిలో కొందరు పూర్తిగా చదువుకోనివారూ ఉన్నారు. దీంతో వీరందరి సమగ్ర సమాచారాన్ని సేకరించేందుకు ప్రత్యేక ప్రొఫార్మా రూపొందించారు.
- మొదటి ఫార్మాట్‌లో పేరు, 2023 మే 19 నాటికి వయస్సు, విద్యార్హత, కులం, నియామకమైన విధానం ప్రకటన ద్వారా నియామకమా లేదా వంశపారంపర్యంగానా? సేకరిస్తున్నారు.
- రెండో ఫార్మాట్‌లో అనారోగ్యంతో ఉన్నవారి వివరాల కోసం మరో ప్రొఫార్మాను తయారు చేశారు. మొదటి ఫార్మాట్‌లో పేర్కొన్న వివరాలతో పాటు మెడికల్ రిపోర్టులు, సంబంధిత వీఆర్ఏకు బదులుగా పనిచేస్తున్న వ్యక్తికి ఉన్న సంబంధం తెలియజేసే కాలమ్‌ను ప్రొఫార్మాలో కల్పించారు.

క్లుప్తంగా

బీసీబంధు అమలు చేయాలి



మాట్లాడుతున్న ఆది మల్లేశం

విద్యానగర్‌(కరీంనగర్‌): రాష్ట్రంలోని ప్రతీ బీసీ కుటుంబానికి రూ.10లక్షలు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి కరీంనగర్‌ జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశంపటేల్‌ డిమాండ్‌ చేశారు. మంగళవారం ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. దళితబంధు మాదిరిగా రాష్ట్రంలోని 136 బీసీ కులాలకు బీసీబంధు అమలు చేయాలని సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. లేకుంటే బీసీల నాయకుడు ఆర్‌.కృష్ణయ్య నాయకత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం జిల్లా వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ చిగుర్ల శ్రీనివాస్‌, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్‌, నాయకులు లింగంపల్లి శ్రీనివాస్‌, నల్లగోని శ్రీనివాస్‌, దిలీప్‌, అల్గం శ్రీకాంత్‌, అనిల్‌ పాల్గొన్నారు.

దొంగ అరెస్ట్‌



పోలీసుల అదుపులో నిందితుడు

కరీంనగర్‌క్రైం: నగరంలోని ఓ ఇంట్లో బంగారం దొంగలించిన వ్యక్తిని కరీంనగర్‌ వన్‌టౌన్‌ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వివరాలు.. కొమురంభీం ఆసిఫాబాద్‌జిల్లాకు చెందిన వగాడే అంజన్న ఇటీవల వన్‌టౌన్‌ పరిధిలోని ఒక ఇంట్లో చొరబడి మూడున్నర తులాల బంగారం చోరీ చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిపై నిఘా పెట్టి సీసీ కెమెరాల్లో అతన్ని గుర్తించి విచారించగా చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. బంగారం రికవరీ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ నటేశ్‌ తెలిపారు. ఈ సందర్భంగా క్రైం టీమ్‌ సిబ్బంది బషీర్‌ఖాన్‌, హసన్‌లను సీఐ అభినందించి రివార్డులు ప్రకటించారు.

విద్యుత్‌షాక్‌తో తీవ్రగాయాలు

మానకొండూర్‌: మండలంలోని పచ్చునూర్‌ గ్రామానికి చెందిన జంగం శివయ్య (38) ఆదివారం విద్యుత్‌ షాక్‌కు గురికాగా ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చేర్పించారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు..శివయ్య గ్రామంలో విద్యుత్‌స్తంభాల వెంట డిష్‌ వైరును సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు డిష్‌ వైరు తీగకు తగలడంతో శివయ్య షాక్‌కు గురయ్యాడు. శరీర భాగాలకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు కరీంనగర్‌ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించగా, ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌ తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

నకిలీ మకిలీ వీడేనా!

- నకిలీ విత్తన దందాలో అక్రమార్కులు
- ఏటా రైతులకు శఠగోపం
- కట్టడికి చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం
- తనిఖీలకు ప్రత్యేక బృందాలు.. నంబర్ల ఏర్పాటు

> నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం మోపాలి. ఎంతటివారినైనా ఉపేక్షించొద్దు. టాస్క్‌ఫోర్స్‌ టీంలు సమన్వయంతో పనిచేసి కల్తీ విత్తనాలకు అడ్డుకట్ట వేయాలి.
> – ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

కరీంనగర్‌ అర్బన్‌: రైతుకు ఎంతో కీలకమైన విత్తన దశను అభాసుపాలుజేస్తున్నారు పలువురు వ్యాపారులు. అన్నదాతల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని గతంలో నకిలీ విత్తనాలు అంటగట్టిన ఘటనలు కోకొల్లలు. తక్కువ ధరకు విత్తనాలొస్తున్నాయని ఆశ చూపడం, పూత, కాత అద్భుతంగా ఉంటుందంటూ మాటల గారడీతో మభ్యపెట్టడం రివాజుగా సాగుతోంది. హెచ్‌టీ, బీటీ–3 పత్తి విత్తనాలతో పాటు వరి విత్తనాల్లో లోపాలు ఏటా వెలుగుచూస్తుండగా కఠినచర్యలు లేకపోవడంతోనే దందా నిరాటంకంగా సాగుతోందన్న ఆరోపణలు పుష్కలం.

సమాచారమివ్వండి.. బహుమతులు పొందండి

నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు సమాచారమిస్తే చాలు నగదు పారితోషికం ఇవ్వనున్నారు. 87126 70760, 87128 70708 నంబర్లకు సమాచారమిస్తే నకిలీ విత్తన విక్రయాలపై ఉక్కుపాదం మోపనున్నారు. వాస్తవానికి ఏప్రిల్‌లోనే సదరు బృందాలను ఏర్పాటు చేసి విస్తత ప్రచారం నిర్వహించాల్సి ఉండగా వ్యవసాయశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఆందోళనకర పరిణామం.



గతంలో పట్టుబడిన కల్తీ పత్తి విత్తనాలు

అనధికారిక గోడౌన్లే అడ్డాలు

జిల్లాలో అనధికారిక గోడౌన్లలో కల్తీ విత్తన దందా సాగుతుందన్న ఆరోపణలు పుష్కలం. జిల్లా వ్యవసాయశాఖలోని ఓ అధికారి సంపూర్ణ సహకారంతోనే నిషేధిత మందులు, విత్తనాల అమ్మకాలు సాగుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారికంగా చూపించే గోడౌన్‌ ఒకటైతే అనధికారికంగా రెండు, మూడు నిర్వహిస్తున్నారన్నది పక్కా సమాచారం. అధికారిక గోడౌన్లలో కంపనీ విత్తనాలు, ప్రైవేట్‌గా నిర్వహించే భవనాల్లో నకిలీ విత్తనాలను నిల్వ చేయడం.. ఆకర్షణీయమైన ప్యాకెట్లలో నింపి రాత్రికి రాత్రే మాయం చేయడం జిల్లలోని పలువురు వ్యాపారులకు వెన్నెతో పెట్టిన విద్య.

వివిధ ప్రాంతాల నుంచి సరఫరా

జిల్లాలో పత్తి 75వేల ఎకరాల్లో, వరి 2.20లక్షల ఎకరాల్లో సాగు చేస్తుంటారు. ఈ సారి పత్తిసాగు మరింత పెంచాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో విత్తనాలకు డిమాండ్‌ ఉండటంతో వ్యాపారులకు వరంలా మారింది. అనుమతి గల విత్తనాలు విక్రయిస్తే తక్కువ లాభముండటంతో వ్యాపారులు అక్రమ వ్యాపారానికే మొగ్గు చూపుతున్నారు. కరీంనగర్‌ చేపల మార్కెట్‌ సమీపంలోని విత్తనాలు, పురుగు మందుల దుకాణాలు, రాజీవ్‌ చౌక్‌లో గల దుకాణాల్లో కొందరు వ్యాపారులు ఈ దందాకు తెరలేపినట్లు సమాచారం. జిల్లాకేంద్రంగా నలుగురు వ్యాపారులు చక్రం తిప్పుతూ జిల్లా అంతటికి సరఫరా చేస్తున్నారు. జిల్లాకేంద్రంతో పాటు హుజూరాబాద్‌ కేంద్రంగా విత్తనాల దందా సాగుతోంది. వరంగల్‌ నుంచి సదరు విత్తనాలను దిగుమతి చేసుకుని పెద్ద ఎత్తున నిల్వ చేశారు. గుంటూరు, కర్నూలు నుంచి విత్తనాలు తెచ్చి ఆకర్షణీయమైన ప్యాకెట్లలో గ్రామాల్లో అమ్ముతున్నారు.

వరి విత్తనాలు సక్రమమేనా?

ప్రభుత్వం యంత్రాంగంతో పాటు ప్రయివేటుగా సరఫరా జరిగే వరి విత్తనాల్లో వేటిని నమ్మాలో నమ్మకూడదో తెలియని పరిస్థితి. గతంలో మానకొండూర్‌ మండలంలోని రామకృష్ణసీడ్స్‌లో నిర్వహించిన తనిఖీల్లో వరి విత్తనాలకు సంబంధించి నిల్వలో 796 బ్యాగుల తేడా రాగా హుజూరాబాద్‌ మండలం సింగాపూర్‌లో హిమాలయ సీడ్‌ ప్లాంట్‌లో 350 క్వింటాళ్లను రికార్డుల్లో నమోదు చేయకపోవడంతో 6ఏ కేసులు నమోదు చేశారు. అలాగే దమ్మక్కపేట సమీపంలోని అన్నదాత సీడ్‌ ప్లాంట్‌లో విత్తన ధ్రువీకరణ లేకుండా గతంలో జారీ చేసిన లేబుళ్ల(ట్యాగులు) అంటించి విత్తన సంచులను మార్కెటింగ్‌ చేస్తున్నట్లు తేలింది. జేజీఎల్‌కు సంబంధించి జారీ చేసిన లేబుళ్లను బీపీటీ విత్తన సంచులకు వినియోగించడం అధికారుల పర్యవేక్షణ తీరును చాటింది. అయితే నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం మోపుతామని, ఎట్టి పరిస్థితుల్లో సహించేదిలేదని సంబంధిత విభాగాల అధికారులు చెబుతున్నారు.

టీఎన్జీవోల నూతన కార్యవర్గానికి అభినందన



కలెక్టర్‌ కర్ణన్‌ను కలిసిన టీఎన్జీవోల సంఘం నాయకులు

కరీంనగర్‌ అర్బన్‌: టీఎన్జీవోల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని కలెక్టర్‌ ఆర్‌వీ కర్ణన్‌, సీపీ సుబ్బారాయుడు అభినందించారు. మంగళవారం టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, నగర అధ్యక్షుడు సర్దార్‌ హర్మిందర్‌సింగ్‌, రూరల్‌ అధ్యక్షుడు మారుపాక రాజేశ్‌భరద్వాజ్‌, జిల్లా కోశాధికారి ముప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు ఇరుమల్ల శారధ మర్యాదపూర్వకంగా కలెక్టర్‌ను కలిసి బొకే అందించారు. అనంతరం అడిషనల్‌ కలెక్టర్‌ శ్యాంప్రసాద్‌లాల్‌, జిల్లా ట్రెజరీ అధికారి నాగరాజు, రోడ్లు, భవనాల శాఖ ఎస్‌ఈ చందర్‌సింగ్‌లను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులు మాట్లాడుతూ, ఉద్యోగుల సంరక్షణకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం సహాధ్యక్షుడు రాగి శ్రీనివాస్‌, మహిళా జేఏసీ చైర్మన్‌ శారద, మహిళా నాయకులు సబిత, సునీత, సరిత, విజయలక్ష్మి, తిమ్మాపూర్‌ అధ్యక్షుడు పోలు కిషన్‌, జిల్లా నాయకులు రవీందర్‌రెడ్డి, రమేశ్‌గౌడ్‌, గూడ ప్రభాకర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, జలాలుద్దీన్‌ అక్బర్‌, కోట రామస్వామి, రాజమల్లయ్య, కరుణాకర్‌ పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల తీరుకు నిరసనగా ధర్నా

కరీంనగర్‌: ఇరవై ఏళ్ల క్రితం చనిపోయిన వ్యక్తిని బతికి ఉన్నట్లు చూపిస్తూ రెవెన్యూ రికార్డులు మార్పుచేసి తన 1.04 గుంటల భూమిని ఇతరులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్న రెవెన్యూ అధికారుల తీరును నిరసిస్తూ మానకొండూర్‌ మండలం ఈదులగట్టెపల్లికి చెందిన అప్పని తిరుపతి కుటుంబ సభ్యులు కలెక్టరేట్‌ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత లిబరేషన్‌ ఫ్రంట్‌ రాష్ట్ర కార్యదర్శి మార్వాడి సుదర్శన్‌ మాట్లాడుతూ, తిరుపతికి చెందిన భూమి నుంచి 1.04 గుంటలను రెవెన్యూ అధికారులు అదే గ్రామానికి చెందిన దాసరి యాదగిరి, అశోక్‌, పద్మకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. దాసరి వీరయ్య 20 ఏళ్ల క్రితం మరణించగా, అతడు బతికే ఉన్నట్లు రెవెన్యూ అధికారులు బోగస్‌ కాగితాలు సృష్టించి 249 సర్వే నంబర్‌ వన్‌బీ ఖాతాలో పొందుపర్చారని ఆరోపించారు. భూమికి సంబంధించిన పాస్‌బుక్‌లు, వన్‌బీ రికార్డులు, పహాణీలు అప్పని తిరుపతి పేరిట ఉన్న విషయాన్ని అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు మొరపెట్టుకున్నా స్పందించకపోవడం బాధాకరమన్నారు. తిరుపతి భూమిని కాజేయాలని చూస్తున్న రెవెన్యూ అధికారులు, సంబంధిత వ్యక్తులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు తప్పిదంగా సృష్టించిన వన్‌బీ ఖాతా నంబర్‌ 249 రికార్డు, 13బీసీ పాస్‌పుస్తకాన్ని రద్దుపరిచి బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్‌ చేశారు.



ధర్నా చేస్తున్న బాధితులు, తదితరులు

పల్లె దవాఖానాలతో మెరుగైన వైద్యం

- వీసీలో మంత్రి హరీశ్‌రావు

కరీంనగర్‌టౌన్‌: గ్రామస్థాయిలో అనారోగ్యం బారిన పడిన వారు నాటు వైద్యం, ఇతర స్థానిక వైద్యం వైపు వెళ్లకుండా వారికి మెరుగైన వైద్య సహాయం అందించేలా పల్లెదవాఖానాలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్లు, వైద్యాధికారులతో కేసీఆర్‌ న్యూట్రిషన్‌ కిట్‌, పల్లె దవాఖానా, కంటి వెలుగు, సీపీఆర్‌ విధానంపై వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా సమీక్షించారు. జిల్లాల్లో నూతన సబ్‌ సెంటర్ల నిర్మాణాలకు స్థలాలను గుర్తించి నెలాఖరులోగా టెండర్‌ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు ప్రతివారం పనులను సమీక్షించాలని సూచించారు. తొమ్మిది జిల్లాలలో కేసీఆర్‌ న్యూట్రిషన్‌ కిట్లు పంపిణీ చేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో కంటివెలుగు కార్యక్రమం విజయవంతమైందని వెల్లడించారు. ఎండతీవ్రత దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని, ఎండతీవ్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు సూచనలు, సలహాలు అందించాలన్నారు. కార్డియాక్‌ అరెస్ట్‌ జరిగినప్పుడు చేపట్టవలసిన సీపీఆర్‌ విధానంపై జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. వీసీలో కలెక్టర్‌ ఆర్‌వీ కర్ణన్‌, అదనపు కలెక్టర్‌ గరిమా అగర్వాల్‌, ట్రైనీ ఐపీఎస్‌ మహేందర్‌ బాబాసాహెబ్‌, జిల్లా వైద్యాధికారి లలితాదేవి తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి హరీశ్‌రావు

నేటి కంటి వెలుగు శిబిరాలు

కరీంనగర్‌టౌన్‌: జిల్లాలో బుధవారం నిర్వహించే కంటి వెలుగు శిబిరాల వివరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్‌ లలితాదేవి ప్రకటించారు. కరీంనగర్‌ నగరంలోని 60వ డివిజన్‌, హుజురాబాద్‌ పట్టణంలో 3వ వార్డు, అదే మండలం వెంకట్రావుపల్లి గ్రామంలో శిబిరాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. జమ్మికుంట పట్టణం 19వ వార్డు, చిగురుమామిడి మండలం గాగిరెడ్డిపల్లి, చొప్పదండి మండలం భూపాలపట్నం, గంగాధర మండలం హిమ్మత్‌నగర్‌, రామడుగు మండలం వెదిర, కొత్తపల్లి మండలం ఎలగందుల, మానకొండూరు మండలం లింగాపూర్‌, వెల్ది, సైదాపూర్‌ మండలం ఆకునూర్‌, శంకరపట్నం మండలం ముత్తారం, రాజాపూర్‌ గ్రామాల్లో కంటి వెలుగు బృందాలు పనిచేస్తాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

25న ప్రతిభా పురస్కారాలు

విద్యానగర్‌(కరీంనగర్‌): పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రోగ్రెసివ్‌ రికగ్నైజ్డ్‌ టీచర్స్‌ యూనియన్‌ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు యూనియన్‌ అధ్యక్షుడు ముస్కు తిరుపతిరెడ్డి తెలిపారు. మంగళవారం కరీంనగర్‌ ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులతో పాటు 10జీపీఏ సాధించిన జిల్లా పరిషత్‌, కేజీబీవీ, మోడల్‌ స్కూల్‌ విద్యార్థులకు ఈనెల 25న కలెక్టరేట్‌ ఆడిటోరియంలో నిర్వహించే కార్యక్రమంలో అవార్డులు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షుడు పింగలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్‌, గుర్రం చెన్నకేశవరెడ్డిపాటు విశిష్ట అతిథిగా డీఈవో సీహెచ్‌.జనార్దన్‌రావు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో పంచాయతీరాజ్‌ పత్రిక సంపాదక కార్యవర్గ సభ్యుడు జాలి మహేందర్‌రెడ్డి, జిల్లా అసోసియేట్‌ అధ్యక్షుడు అన్నాడి మోహన్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పీఆర్‌టీయూ నాయకులు

క్రీడల్లో గెలుపోటములు సహజం

- బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్‌

తిమ్మాపూర్‌(మానకొండూర్‌): క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్‌ జీవీ రామకృష్ణారావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది అవతరణ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం తిమ్మాపూర్‌ మండలం రేణికుంట టోల్‌ గేట్‌ వద్ద ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ కప్‌ క్రికెట్‌ టోర్నమెంట్‌ను పార్టీ మండల అధ్యక్షుడు రావుల రమేశ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోటీల్లో గెలుపోటములు సహజమని, ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తిని చాటాలన్నారు. ఆటలపోటీలతో స్నేహభావం పెంపొందుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి, శంకరపట్నం జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు కొమురయ్య, శంకర్‌, అంజన్న, ఎంపీటీసీ కనుకం కొమురయ్య, జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బోర్డు మెంబర్‌ ఎలుక ఆంజనేయులు, ఉప సర్పంచ్‌ కుంభం శ్రీనివాస్‌, బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకులు మహిపాల్‌, యాదగిరి, శ్యామ్‌రావు, సతీశ్‌రెడ్డి పాల్గొన్నారు.



పోటీలు ప్రారంభిస్తున్న రామకృష్ణారావు

పిడుగుపాటుకు ఒకరి మృతి

జమ్మికుంట(హుజూరాబాద్‌): జమ్మికుంట మండలం నాగంపేట గ్రామంలో రామంచ కొమురయ్య(48) మంగళవారం సాయంత్రం పిడుగుపాటుకు గురై మరణించాడు. వీణవంక మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన కొమురయ్య 20ఏళ్ల క్రితం అత్తగారి ఊరైన నాగంపేటకు బతుకుదెరువు కోసం వచ్చాడు. భార్య నాగమణి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. స్థానికంగా కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ప్రస్తుతం పాత ఇనుప సామగ్రి సేకరించే దుకాణంలో పనిచేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం దుకాణంలో పనిచేస్తుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మరణించాడు. నాగమణి ఫిర్యాదు మేరకు టౌన్‌ సీఐ బార్పటి రమేశ్‌ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కొమురయ్య మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ప్రాణం తీసిన ఆస్తి గొడవ

కరీంనగర్‌క్రైం: ఆస్తి విషయంలో జరిగిన గొడవలో ఓ వ్యక్తి మృతిచెందాడు. కరీంనగర్‌ టూటౌన్‌ పోలీసుల వివరాలు.. నగరంలోని జ్యోతినగర్‌కు చెందిన దయ్యాల శ్రీనివాస్‌(50)కు 30 ఏళ్ల క్రితం చొప్పదండి మండలం ఆర్నకొండకు చెందిన గంగవ్వతో వివాహం కాగా కుమారుడు హరీశ్‌ ఉన్నాడు. కాగా శ్రీనివాస్‌ అతడి భార్యకు మధ్య మనస్పర్థలు రావడంతో 20 ఏళ్ల నుంచి గంగవ్వ కుమారుడితో కలిసి ఆర్నకొండలో ఉంటున్నారు. ఏడాదిన్నర క్రితం గంగవ్వ, హరీశ్‌ కరీంనగర్‌కు రాగా జ్యోతినగర్‌లోని ఒక ఇంట్లో ఉంచారు. అప్పటి నుంచి శ్రీనివాస్‌ కూడా తన తల్లిదండ్రులతోనే ఉంటున్నాడు. ఈక్రమంలో ఇల్లు హరీశ్‌ పేరిట రిజిస్ట్రేషన్‌ చేయాలని గంగవ్వ, హరీశ్‌లు శ్రీనివాస్‌ తండ్రి మల్లయ్య, అతడి రవీందర్‌తో గొడవలు పడుతున్నారు. సోమవారం రాత్రి ఆస్తి వివాదం ముదిరి గొడవ జరిగింది. ఈ గొడవలో శ్రీనివాస్‌పై హరీశ్‌, అతడి మేనమామ బీరయ్య దాడి చేశారు. దీంతో శ్రీనివాస్‌ తలకు తీవ్ర గాయాలవడంతో మృతి చెందాడు. మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి

- ఇటీవలే పదోతరగతి పాసైన సిరివెన్నెల
- కోనరావుపేటలో విషాదం



సిరివెన్నెల (ఫైల్‌)

కోనరావుపేట(వేములవాడ): ఇటీవలే పదోతరగతి పాసైన ఓ విద్యార్థిని అనారోగ్యంతో మృతిచెందింది. వివరాల్లోకి వెళ్తే.. కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన సుతారి శ్రీనివాస్‌–భాగ్య దంపతులకు ఇద్దరు కూతుళ్లు. పెద్ద కూతురు సిరివెన్నెల (15) ఇటీవలే పదోతరగతి పాసైంది. దీంతో వారు ఎంతగానో సంతోషించారు. కానీ దురదృష్టవశాత్తు సిరివెన్నెల పసిరికల వ్యాధి(జాండిస్‌)కి గురైంది. తల్లిదండ్రులు పలు ఆస్పత్రుల్లో చూపిస్తూ మందులు వాడుతున్నారు. అయినా వ్యాధి ముదరడంతో పరిస్థితి విషమించి, మంగళవారం చనిపోయింది. విద్యార్థిని మృతి విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు సుల్తాన్‌ రాజు, రహీం, తోటి విద్యార్థులు ఆమె ఇంటికి వెళ్లి, సంతాపం ప్రకటించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

కొత్తపల్లి(కరీంనగర్‌): పల్లెలు పరిశుభ్రంగా ఉండేలా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీరాజ్‌, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ సంచాలకులు విజయరావు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల పారిశుధ్యాన్ని మెరుగుపరచడంలో భాగంగా చేపట్టిన 'స్వచ్ఛ సర్వేక్షన్‌ గ్రామీణ్‌ 2023' ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌ కార్యక్రమాన్ని మంగళవారం కొత్తపల్లి మండలం నాగులమల్యాలలో పర్యవేక్షించారు. గ్రామంలో చెత్త, మురికినీటి నిర్వహణ, పారిశుధ్యం, సెగ్రిగేషన్‌ షెడ్‌ వినియోగం, నర్సరీ, వైకుంఠధామాలను పరిశీలించారు. నర్సరీ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన సేంద్రియ ఎరువు బ్రాండ్‌గా తయారుచేసి ఇస్తుండటాన్ని ప్రశంసించారు. ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, డీఎల్‌పీఓ హరికిషన్‌, స్వచ్ఛభారత్‌ కోఆర్డినేటర్‌ రమేష్‌, ఎంపీఓ శ్రీనివాస్‌, సర్పంచ్‌ నాయిని ప్రసాద్‌, యూనిసెఫ్‌ క్లస్టర్‌ ఫెసిలిటేటర్‌ కళ్యాణి పాల్గొన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న విజయరావు

తల్లిదండ్రులపై కుమారుడి దాడి

- భూమి పాస్‌బుక్కులు అడగడమే కారణం

బోయినపల్లి(చొప్పదండి): భూమి పాస్‌బుక్కులు అడిగినందుకు తల్లిదండ్రులపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు బోయినపల్లి ఎస్‌హెచ్‌వో సత్తయ్య తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. నర్సింగాపూర్‌ గ్రామానికి చెందిన రెడ్డవేని లచ్చవ్వ–ఐలయ్య దంపతుల భూమి పాస్‌బుక్కులు వారి కుమారుడు ఆనంద్‌ వద్ద ఉన్నాయి. వాటిని తమకు ఇవ్వాలంటూ సోమవారం ఆనంద్‌ ఇంటికి వెళ్లారు. అతను వారికి పాస్‌బుక్కుల జిరాక్స్‌లు ఇచ్చాడు. తనను పాసుబుక్కులు అడుగుతారా అని మనసులో పెట్టుకొని, ఆదేరోజు రాత్రి తల్లిదండ్రులు ఉంటున్న ఇంటికి వచ్చి, వారితోపాటు అడ్డు వచ్చిన మేనత్త గౌరవ్వ, తమ్ముడు నరేందర్‌, మరదలు స్వాతిలపై దాడి చేశాడు. ఈ ఘటనలో ఐదుగురికీ గాయాలయ్యాయి. భూమి పాస్‌బుక్కులు అడిగినందుకే తమపై దాడి చేశాడని లచ్చవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆనంద్‌, గణేశ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

ఎదురెదురుగా ఢీకొన్న బైక్‌లు

- యువకుడి దుర్మరణం

మెట్‌పల్లి(కోరుట్ల): వెల్లుల్ల శివారులో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. మెట్‌పల్లి పట్టణంలోని సాయిరాంకాలనీకి చెందిన విఘ్నేశ్‌, రాహుల్‌లు ద్విచక్రవాహనంపై వెల్లుల్ల వైపు వెళ్తున్నారు. అదే సమయంలో వెల్లుల్లకు చెందిన వన్నెల మహేశ్‌ బైక్‌పై మెట్‌పల్లికి వస్తున్నాడు. మార్గమధ్యంలో వీ ఆర్‌ఎం గార్డెన్‌ వద్ద వాహనాలు వేగంగా వచ్చి, ఎదురెదురుగా ఢీకొట్టాయి. ఈ ఘటనలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో విఘ్నేశ్‌, మహేశ్‌ల పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబసభ్యులు నిజామాబాద్‌ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ మహేశ్‌ మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు.

వడదెబ్బతో జీపీ కార్మికుడు..

సారంగాపూర్‌(జగిత్యాల):జగిత్యాల జిల్లా సారంగాపూర్‌ మండలం రేచపల్లి గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ కార్మికుడు నక్క రాజన్న(50) వడదెబ్బతో మంగళవారం మృతిచెందాడు. మల్టీపర్పస్‌ కార్మికుడిగా పనిచేస్తున్న రాజన్న సోమవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. జగిత్యాలలోని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. అదే రాత్రి ఇంటికి తీసుకొచ్చారు. ఆరోగ్య పరిస్థితి విషమించి మంగళవారం మృతిచెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు ఉపాధి కోసం గల్ఫ్‌ వెళ్లాడు. సర్పంచ్‌ ఎడమల జయ, ఉపసర్పంచ్‌ రాచకొండ రాజేశం, జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్‌రెడ్డి తదితరులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.

విగ్రహ ధ్వంసం కేసులో ఇద్దరి రిమాండ్‌

గొల్లపల్లి(ధర్మపురి): మల్లన్నపేటలో హనుమాన్‌ ఆలయంలోకి చొరబడి, స్వామి వారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై దత్తాద్రి తెలిపారు. గ్రామానికి చెందిన ముత్యాల గంగాధర్‌ తన భార్య కాపురానికి రావడం లేదని, నక్క శ్రీధర్‌ తనకు వివాహం కావడం లేదని రెండు రోజుల క్రితం హనుమాన్‌ ఆలయంలో స్వామివారి విగ్రహాన్ని ధ్వంసం చేసి, పారిపోయారు. స్థానికుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం నిందితులను అరెస్టు చేశారు. జిల్లా మెజిస్ట్రేట్‌ ఎదుట హాజరుపరచగా ఇద్దరికీ జ్యుడీషియల్‌ రిమాండ్‌ విధించారని ఎస్సై పేర్కొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

వేములవాడరూరల్‌: వేములవాడ మండలంలోని చెక్కపల్లి ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ బన్సీలాల్‌ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఉప్పర్‌ మల్యాలకు చెందిన సముద్రాల విజయ్‌, నిమ్మల సతీశ్‌లు వేములవాడ శివారు ప్రాంతంలో గంజాయి సేవిస్తూ ఇతరులకు విక్రయిస్తున్నట్లు పోలీసులకు మంగళవారం సమాచారం వచ్చింది. దీంతో అక్కడికి వెళ్లి, తనిఖీలు చేపట్టి, నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి కిలో గంజాయి, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ రిమాండ్‌కు పంపినట్లు సీఐ పేర్కొన్నారు. గంజాయిని నిజామాబాద్‌ నుంచి తీసుకువచ్చినట్లు తెలిపారు. గంజాయి అమ్మినా, సేవించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సై నాగరాజు, కానిస్టేబుల్‌ రాజశేఖర్‌ తదితరులున్నారు.



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ బన్సీలాల్‌

కాలిపోయిన చెరుకు పంట

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని మామిడిపల్లి గ్రామంలో ముత్యాల కిషన్‌రెడ్డికి చెందిన చెరుకు పంట కాలిపోయింది. మంగళవారం మధ్యాహ్నం ఊరికి వెళ్లి వచ్చి, చూసేసరికి పంటకు మంటలు వ్యాపించాయి. ఆర్పే ప్రయత్నం చేసినా ఎకరంన్నర చేను కాలిపోయిందని బాధితుడు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపించాడు. సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.



క్లుప్తంగా

బస్‌స్టేషన్ తనిఖీ



తనిఖీ చేస్తున్న జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ బస్‌స్టేషన్‌ను మంగళవారం ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. ప్రయాణికులకు బస్సుల సౌలభ్యతను పరిశీలించారు. బస్‌లు బంచింగ్ కాకుండా చూడాలని, చల్లని తాగునీరు అందుబాటులో ఉంచాలని, బస్‌స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులకు సూచించారు. తనిఖీలో ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్(మెకానిక్) భీంరెడ్డి, కరీంనగర్ 1, 2 డిపోల మేనేజర్లు ప్రణీత్, మల్లయ్య, సూపర్‌వైజర్లు శివప్రసాద్, సత్తయ్య, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

సప్తగిరికాలనీ(కరీంనగర్): పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో జరుగుతున్న ఎన్‌సీసీ వార్షిక శిబిరంలో పాల్గొంటున్న సుమారు 600 మంది ఎన్‌సీసీ విద్యార్థులకు మంగళవారం కరీంనగర్ లయన్స్ ఐ ఆస్పత్రి రేకుర్తి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు నేత్ర పరిరక్షణ, అవయవ దానం, నేత్రదానం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ జిగ్నా అమ్మాయిలకు గైనిక్ సమస్యలు, వాటిని ఎలా గుర్తించడం, తీసుకోవాల్సిన ముందుజాగ్రత్తలు, ఇతర ఆరోగ్య నియమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో లయన్ చిత్ర సురేష్, పెద్ది విద్యాసాగర్, సింగమరాజు, బుర్ర మధుసూదన్‌రెడ్డి, తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ డానియల్ లోట్జిమ్, సుబేదార్ మేజర్ సాగర్‌సింగ్, కిరణ్ జ్యోతి, భోగిని ప్రకాష్, జ్యోత్స్న, రాజేశ్, జ్యోతిలక్ష్మి, మ్యాగీ, సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'పంట నష్టపరిహారం రైతుల ఖాతాల్లో జమచేయాలి'

కరీంనగర్: తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాలకు ముందు సీఎం కేసీఆర్ ప్రకటించిన పంట నష్ట పరిహారం డబ్బులు వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జూన్ 2 నుంచి 20 రోజుల పాటు తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర మంత్రివర్గం తీర్మానించడమే కాకుండా వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసేందుకు కేటాయింపులు చేశారని మండిపడ్డారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు వారంలో పరిహారం ఇస్తామని స్వయంగా సీఎం కేసీఆర్ జిల్లాలో ప్రకటించి రెండు నెలలు దాటిందని, ఇంతవరకు పరిహారంపై మంత్రులు, ఎమ్మెల్యేలు మాట్లాడటం లేదని విమర్శించారు. జూన్ 2వ తేదీకి ముందే అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అన్ని స్థాయిల్లో తెలుగు భాషను అమలు చేయాలి

సప్తగిరికాలనీ(కరీంనగర్): భాష, సాంస్కృతిక, సాహిత్య, ఆర్థిక, రాజకీయ రంగాలకు కేంద్రమైన జిల్లాలో అన్ని స్థాయిల్లో తెలుగు భాషను అమలు చేయాలని కోరుతూ మంగళవారం తెలుగు కూటమి ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కర్ణన్‌కు వినతి పత్రం అందించారు. సాంకేతిక రంగంలో తెలుగు వెనుకబాటుదనాన్ని పారదోలాలని, ప్రజలకు అందుబాటులో నమూనా పత్రాలు ఉంచాలన్నారు. కార్యాలయాల్లో తెలుగు వాడకం తప్పనిసరి చేయాలని కోరారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, దుకాణాలు, మందులు, ఇతర వాణిజ్య ఉత్పత్తుల అమ్మకం, వారంటీ, హెచ్చరికలు తెలుగులో స్పష్టంగా ముద్రించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సాహితీవేత్తలు, కూటమి బాధ్యులు డాక్టర్ నలిమెల భాస్కర్, డాక్టర్ వెల్ముల కృష్ణారావు, అన్నవరం దేవేందర్, కూకట్ల తిరుపతి, గాజోజు నాగభూషణం, కందుకూరి అంజయ్య తదితరులున్నారు.

మోసం చేసిన వ్యక్తిపై కేసు

కరీంనగర్‌క్రైం: గృహ నిర్మాణానికి డబ్బులు తీసుకొని మోసం చేసిన కాంట్రాక్టర్‌పై త్రీటౌన్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ తీగలగుట్టపల్లి పరిధిలోని ఆలూరి సూసన్ అనే మహిళ తన సొంతింటి కల సాకారం చేసుకునేందుకు తనకు ఉన్న 200 గజాల భూమిలో ఇల్లు నిర్మించుకోవాలనుకుంది. ఇంటి నిర్మాణం చేసేందుకు కోర్టుచౌరస్తాలో కన్‌స్ట్రక్షన్ కంపెనీ నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ కత్తెరపాక శేఖర్‌ను ఆశ్రయించింది. ఇల్లు కట్టించి ఇచ్చేందుకు రూ.12 లక్షలు చెల్లించింది. ఇల్లు కట్టించకపోగా, ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసం చేయడంతో ఆమె త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చిత్ర కథ: వైఫై సరే.. ప్రారంభమెప్పుడో



అధికారులు, ఉద్యోగులు, ప్రజల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వైఫై సేవలు అలంకార ప్రాయంగా మిగిలాయి. స్మార్ట్‌సిటీలో భాగంగా కలెక్టరేట్‌లో నాలుగు వైఫై పరికరాలను రెండు నెలల క్రితం అమర్చారు. ఇందులో రెండు అధికారులు, ఉద్యోగుల కోసం కాగా మరో రెండు ప్రజల కోసం ఏర్పాటు చేశారు. ఉచితంగా ఇంటర్‌నెట్ వాడుకునేందుకు ఏర్పాట్లు చేయగా ఇంకా ప్రారంభానికి నోచుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. - కరీంనగర్ అర్బన్

ఆధ్యాత్మికం: ఘనంగా ఎల్లమ్మ బోనాలు



కరీంనగర్ మండలం దుర్శేడ్‌లో మంగళవారం రేణుకా ఎల్లమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో బైండ్లపూజారుల డప్పుచప్పుళ్ల నడుమ బోనాలతో మహిళలు ఊరేగింపుగా ఎల్లమ్మ ఆలయానికి చేరుకున్నారు. బోనం సమర్పించి మొక్కులు చెల్లించారు. గౌడ సంఘం అధ్యక్షుడు బుర్ర భూమయ్య, ఉపాధ్యక్షులు సంపత్, హరీష్, లక్ష్మణ్, తిరుపతి, శ్రీనివాస్, లచ్చయ్య, భూమయ్య, లింగయ్య, కనుకయ్య తదితరులు పాల్గొన్నారు. - కరీంనగర్‌రూరల్

ట్రాన్స్‌పోర్టు డిప్యూటీ కమిషనర్‌ను కలిసిన ఆర్టీసీ ఆర్‌ఎం



చంద్రశేఖర్‌గౌడ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సుచరిత

విద్యానగర్(కరీంనగర్): నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఆర్టీసీ కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎస్.సుచరిత మంగళవారం కరీంనగర్ జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మామిళ్ల చంద్రశేఖర్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రయాణికుల అక్రమ రవాణాను అరికట్టేందుకు సహకరించాలని అందించాలని కోరారు. ఆర్‌ఎం వెంట కరీంనగర్ 1, 2 డిపోల మేనేజర్లు ప్రణీత్, మల్లయ్య ఉన్నారు.

సత్తా చాటుతాం

- జిల్లాకు పేరు తీసుకొస్తాం
- సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో కరీంనగర్‌ను నంబర్‌వన్‌గా నిలుపుతామంటున్న క్రీడాకారులు



సీఎం కప్ జిల్లాస్థాయి కబడ్డీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

కరీంనగర్‌స్పోర్ట్స్: చీఫ్ మినిస్టర్ కప్‌తో మళ్లీ క్రీడల వైపునకు వెళ్లాం. గతంలో మా సత్తా చాటి కరీంనగర్ జిల్లాను చాంపియన్ నిలిపిన మేము తొలిసారిగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాను మరోసారి చాంపియన్‌గా నిలుపుతామంటున్నారు పలువురు క్రీడాకారులు. గతంలో క్రీడల్లో జిల్లాకు అరుదైన రికార్డ్ ఉన్నప్పటికీ కరోనా కారణంగా కొంత మేరకు తగ్గగా ఇటీవల మళ్లీ క్రీడారంగంలో జిల్లా పుంజుకుందనే చెప్పాలి. కాగా ఈనెల 15వ తేదీ నుంచి సీఎం కప్ 2023 పోటీలు మండలస్థాయి నుంచి ప్రారంభం కాగా మండలస్థాయిలోని సీనియర్ క్రీడాకారులు మళ్లీ తమ ఆటపై పట్టు సాధించాలని పోటీల్లో పాల్గొన్నారు. ఈనెల 22 నుంచి కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో ప్రారంభమైన జిల్లాస్థాయి పోటీలకు హాజరైన పలువురు క్రీడాకారులను »సాక్షి« పలకరించగా వారి మనోభావాలను వెల్లడించారు.

పదేళ్ల తర్వాత మళ్లీ..



దాదాపు 10 ఏళ్ల తర్వాత మళ్లీ టేబుల్‌టెన్నిస్ పోటీల్లో పాల్గొంటున్న. ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన సీఎం కప్ పోటీల్లో పాల్గొనలేకపోయా. ఇప్పుడు పాల్గొనే అవకాశం వచ్చింది. కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ టేబుల్‌టెన్నిస్‌లో శిక్షణ ఇస్తున్న. ఆడే అవకాశం వచ్చింది. బాగా ప్రాక్టీస్ చేశా. రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో జిల్లాకు ఫస్ట్‌ప్లేస్ తీసుకొస్తా. - డి గౌతం

బాక్సింగ్‌లో విజేతగా నిలుస్తా..



తొలిసారిగా జరుగుతున్న సీఎం కప్ పోటీల్లో బాక్సింగ్‌లో చాంపియన్‌గా నిలిచేందుకు సాధన చేస్తున్న. ప్రస్తుతం బీటెక్ చదువుతున్న. ఇంటర్ వరకు బాక్సింగ్ పోటీల్లో పాల్గొన్న. ఇంజినీరింగ్‌లో యూనివర్సిటీకి ఆడాను. బాక్సింగ్ అంటే చాలా ఇష్టం. రోజూ ప్రాక్టీస్ చేస్తా. తొలి కప్‌ను బాక్సింగ్‌లోనే జిల్లాకు అందిస్తా. - కె. రాకేశ్

జిల్లాస్థాయిలో విజేతగా నిలిచాం



మాది హుజూరాబాద్. బేసిక్‌గా కబడ్డీ ప్లేయర్. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న. 2016లో నా చివరి టోర్నమెంట్. సీఎం కప్‌తో మళ్లీ ఆడాల్సి వచ్చింది. జిల్లాస్థాయి పోటీల్లో విజేతగా నిలిచాం. ముందున్న లక్ష్యం రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని విజేతగా నిలవడం. - పి.లక్ష్మణ్

షాట్‌పుట్‌లో సత్తా చాటుతా..



మాది కరీంనగర్‌రూరల్ మండలం మొగ్దుంపూర్. నేను అథ్లెట్. షాట్‌పుట్, డిస్క్ నా ఈవెంట్స్. గతంలో కూడా చాలాసార్లు పోటీల్లో పాల్గొని పలు పతకాలు కూడా సాధించా. సీఎం కప్‌లో షాట్‌పుట్‌లో పతకం సాధించాలనేది నా కోరిక. అందుకు సాధన చేస్తా. - ఎం.విక్రమ్‌కుమార్

పకడ్బందీగా పారిశుధ్య పనుల నిర్వహణ



పారిశుధ్య నిర్వహణ పనులు పర్యవేక్షిస్తున్న చైర్మన్ రాజు

కొత్తపల్లి: కొత్తపల్లి పట్టణంలో పకడ్బందీగా పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు తెలిపారు. »స్వచ్ఛ సర్వేక్షణ్–ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలు« కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని 5వ వార్డులో నిర్వహించిన పారిశుధ్య పనులను కౌన్సిలర్ మానుపాటి వేణుగోపాల్‌తో కలిసి పర్యవేక్షించారు. మురికి కాలువల్లోని సిల్టు, రోడ్డు పక్కన ఉన్న పిచ్చి మొక్కలు, గడ్డి తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకు పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. పరిసరాలు బాగుంటేనే ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమవుతుందని తెలిపారు. మున్సిపల్ ఏఈ ఆసిఫ్, 7వ వార్డు ఇన్‌చార్జి బాలాజీ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

26 నుంచి మహాశక్తి ఆలయ వార్షిక వేడుకలు



మహాశక్తి ఆలయం

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్‌లోని చైతన్యపురిలో గల శ్రీ మహాశక్తి ఆలయం త్రయోదశ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 26న జరుగుతాయని ఆలయ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీజగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య భారతిస్వామి ఆధ్వర్యంలో 26న ఉదయం 4:30 గంటలకు శ్రీమహాదుర్గా, శ్రీమహాలక్ష్మి, శ్రీమహా సరస్వతి అమ్మవార్లకు పంచామృతం అభిషేకం, 8 గంటలకు స్వస్తి పుణ్యా వాచనం, గణపతి పూజ, అఖండ దీపారాధన, సర్వతోభద్ర మండలం, లక్ష్మీగణపతి హోమం, రుద్ర సహిత చండీహోమం, పూర్ణాహుతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ జరుగుతుందని అన్నారు. అనంతరం జగద్గురుల అనుగ్రహ భాషణం. సాయంత్రం సుహాసినిలతో సామూహిక కుంకుమ పూజలు, లలిత సహస్రనామ పారాయణం జరుగుతుందని తెలిపారు. పూజల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

మంత్రి 'కొప్పుల'ను కలిసిన టీజీపీఏ కమిటీ



మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు బొకే అందజేస్తున్న నాయకులు

కరీంనగర్: తెలంగాణ గురుకుల ప్రిన్సిపాల్ అసోసియేషన్ (టీజీపీఏ) రాష్ట్ర కమిటీ ఆవిర్భావాన్ని పురస్కరించుకుని ఆ కమిటీ నాయకులు మంగళవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కరీంనగర్‌లోని తన.క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నూతన కమిటీకి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గురుకుల విద్య బలోపేతానికి తాము శాయశక్తులా కృషిచేస్తామని హామీ ఇచ్చారు. సీఎం.కేసీఆర్ మానసపుత్రిక కేజీ టు పీజీ మిషన్‌లో భాగంగా పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తామని ప్రతినబూనారు. వృత్తిపరమైన పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గురుకుల ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రౌతు అజయ్‌కుమార్, కోశాధికారి జక్కని రాజేశం, మహిళా కార్యదర్శి తాళ్ల నీలిమాదేవి, కార్యనిర్వాహక కార్యదర్శి గన్నెబోయిన బిక్షపతి, కార్యదర్శి శ్రీకాంత్ సంయుక్త కార్యదర్శి పోరండ్ల చంద్రమోహన్, కరీంనగర్ జిల్లా బాధ్యులు సంపత్, మహేశ్, రాజేందర్, తిరుపతి, భాగ్యలక్ష్మి, సరిత, ఉదయ్, సురేష్, మహబూబాద్, హన్మకొండ, వరంగల్, జనగామ జిల్లాల బాధ్యులు శ్రీనివాసరావు, సతీశ్, కృష్ణకుమారి, మాధవీలత, గ్రేటర్ వరంగల్, పెద్దపల్లి, మహబూబ్‌నగర్, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాల ఇన్‌చార్జిలు శ్రీనివాస్, మాధవీలత, రాజు, శ్రీకాంత్, సంతోష్, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లు కూల్చిన వారిపై చర్య తీసుకోవాలి



ఇళ్లను పరిశీలిస్తున్న సీపీఎం నగర కమిటీ నాయకులు

కొత్తపల్లి: కరీంనగర్ శివారు రేకుర్తిలోని 19వ డివిజన్ షేఖాబీకాలనీలో పేద ముస్లింల ఇళ్లను కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాని సీపీఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం డిమాండ్ చేశారు. రేకుర్తిలోని ఇళ్ల కూల్చిన ప్రదేశాన్ని మంగళవారం సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో సందర్శించారు. 20 ఏళ్ల క్రితం రేకుర్తికి చెందిన షేక్ ఖాలిద్ తన సొంత భూమి సర్వేనంబర్.194లోని కొంత భూమిని పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు గిఫ్ట్‌డీడ్ కింద ఇచ్చారని, ఆ భూమిలో గ్రామపంచాయతీ అనుమతులు తీసుకొని ఇళ్ల నిర్మించుకోగా రియల్ ఎస్టేట్ భూమాఫియా కన్ను ఆ భూములపై పడిందన్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా పేదల ఇళ్లను కూల్చడం సరికాదన్నారు. ఇందులో ప్రభుత్వ భూమి ఉంటే జీవో 58, 59 ప్రకారం క్రమబద్ధీకరించి పేదలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కరీంనగర్‌రూరల్ జోన్ కార్యదర్శి కవ్వంపల్లి అజయ్, నగర కమిటీ సభ్యులు పున్నం రవి, కాంపల్లి సాగర్, నాయకులు గడ్డం శ్రీకాంత్, శ్రీనివాస్, డి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని స్కూల్‌ను మూసేయాలి



ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం మల్కాపూర్‌లో అనుమతి లేని శ్రీచైతన్య స్కూల్‌ను మూసివేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆ స్కూల్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ శ్రీచైతన్య స్కూల్స్‌కి అనుమతి, గుర్తింపు లేకున్నా పాఠశాలను ఏర్పాటు చేసుకొని అడ్మిషన్లు చేస్తూ తల్లిదండ్రులను మోసం చేస్తున్నా అధికారులు స్పందించకపోవడం సిగ్గుచేటని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్, జిల్లా సహాయ కార్యదర్శులు వినయ్ సాగర్, మనోజ్, జిల్లా కమిటీ సభ్యుడు సందేశ్, నాయకులు బైరి మణికంఠ, ప్రణయ్ పాల్గొన్నారు.

మహా సంపర్క్ అభియాన్ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

కరీంనగర్‌టౌన్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలన విజయవంతంగా పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జాతీయ నాయకత్వం ఈనెల 30 నుంచి నెల రోజులపాటు మహా సంపర్క్ అభియాన్ పేరిట నిర్వహించే వివిధ కార్యక్రమాలను జిల్లాలో విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని బీజేపీ నేత సుద్దాల దేవయ్య, పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్లోని శుభమంగళ గార్డెన్‌లో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ముందుగా ఇటీవల కాలంలో వివిధ కారణాలతో మృతిచెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలకు సంతాపం తెలిపేందుకు జిల్లా కార్యదర్శి రంగు భాస్కరాచారి తీర్మానం ప్రవేశపెట్టారు. అనంతరం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగ్గిళ్లపు రమేశ్ పలు అంశాలపై రాజకీయ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అనంతరం దేవయ్య, కృష్ణారెడ్డి, కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయిన్‌పల్లి ప్రవీణ్‌రావు మాట్లాడారు. మోదీ ప్రభుత్వం 9 ఏళ్లలో దేశానికి ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిందన్నారు. అనేక సాహసోపేత నిర్ణయాలతో మనదేశం విశ్వంలోనే తిరుగులేని శక్తిగా అవతరించిందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, మాజీ మేయర్ డి.శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, కొరటాల శివరామకృష్ణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, బత్తుల లక్ష్మీనారాయణ, బొమ్మ శ్రీరామ్‌చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

మంచాల రమేశ్‌కు రంగస్థల పురస్కారం

సప్తగిరికాలనీ(కరీంనగర్): తెలంగాణ ట్రాన్స్‌కో, డిస్కమ్, విద్యుత్ సౌధ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన కల్చరల్ తెలంగాణ స్టేట్ జనరల్ బాడీ సమావేశంలో కరీంనగర్ విద్యుత్ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న మంచాల రమేశ్‌ను స్టేట్ ట్రాన్స్‌కో డైరెక్టర్ జగత్‌రెడ్డి రంగస్థల పురస్కారంతో సత్కరించారు. నటుడు, దర్శకుడు, విలన్‌గా పలు నాటికల్లో ప్రతిభ కనబరిచి ఉభయ రాష్ట్రాల్లో పలు చోట్ల బహుమతులు, అవార్డులు స్వీకరించిన రమేశ్ కరీంనగర్ విద్యుత్ శాఖ సర్కిల్లో పని చేస్తుండటం గర్వకారణమన్నారు. 2008 నుంచి 2023 వరకు ఏటా జరిగే విద్యుత్ శాఖ నాటిక పోటీల్లో ప్రథమ బహుమతి పొందటం అభినందనీయమని కరీంనగర్ సూపరిండెంట్ ఇంజినీర్ గంగాధర్ పేర్కొన్నారు. ఈసందర్భంగా రమేశ్‌ను స్పోర్ట్స్ కల్చరల్ కౌన్సిల్ బాధ్యులు రాజు, అనిల్‌కుమార్, విద్యుత్ ఉద్యోగ సంఘాల బాధ్యులు, చైతన్య కళాభారతి సంస్థ కళాకారులు అభినందించారు.

పాత పెన్షన్ వర్తింపజేయాలి

కరీంనగర్: డీఎస్సీ–2003 ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోరెడ్డి దామోదర్‌రెడ్డి మంగళవారం ఫ్యాక్స్ ద్వారా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారికి వినతిపత్రం సమర్పించారు. ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, కేజీబీవీ టీచర్లను రెగ్యులర్ చేయాలన్నారు. గతేడాది సమ్మర్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం వేసవి సెలవుల్లో స్పెషల్ క్లాసులు తీసుకున్న ఉపాధ్యాయులకు ఈఎల్స్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

బీజేపీ నాయకుల సంబరాలు



సంబరాల్లో బీజేపీ నాయకులు

కరీంనగర్‌టౌన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఎంపీగా నాలుగేళ్ల పాలన విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం కరీంనగర్‌లో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుతున్నారు. కమాన్‌చౌరస్తాలో మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ బండి సంజయ్ గల్లీ లీడర్ అని హేళన చేసిన వారికి ఎంపీగా ఎన్నిక కావడం మొదటి చెంప పెట్టు లాంటిదన్నారు. గతంలో పనిచేసిన ఎంపీల కంటే భిన్నంగా కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు గుగ్గిలపు రమేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, బత్తుల లక్ష్మీనారాయణ, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు, ఎర్రబెల్లి సంపత్‌రావు, మాడ వెంకట్‌రెడ్డి, బండ రమణారెడ్డి, కటకం లోకేశ్, పుప్పాల రఘు, బొంతల కళ్యాణ్ చంద్ర, అలివేలు సమ్మిరెడ్డి, మంథని కిరణ్, ఆకుల రాజేందర్, ఎడమ సత్యనారాయణరెడ్డి, గుంజేటి శివ, ఆవుదుర్తి శ్రీనివాస్, జీడి మల్లేష్, మాడిశెట్టి సంతోష్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంధ్యాకాల సమయంలో..





సూర్యుడు అస్తమిస్తున్న సమయంలో ఓ అందమైన దృశ్యం ఆవిష్కృతమైంది. మంగళవారం సాయంత్రం కరీంనగర్‌లోని మంకమ్మతోటలో గల ఓ ఇంటి దాబాపై పావురాలు వరుస క్రమంలో ఎగరాలా? వద్దా? అన్నట్లుగా ఉండి ఒక్కసారిగా గాలిలో ఎగిరాయి. ఈ దృశ్యాన్ని చూసిన పలువురు మంత్రముగ్ధులయ్యారు. - సప్తగిరికాలనీ(కరీంనగర్)

ఆందోళనకరంగానే!

ఎంపీ అవినాశ్ మాతృమూర్తికి ఆస్పత్రిలో కొనసాగుతున్న చికిత్స

- క్రిటికల్ కేర్ యూనిట్‌లో వైద్యం అందిస్తున్న విశ్వభారతి వైద్య బృందం
- తల్లి వద్దే ఉంటూ బాగోగులు చూసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాశ్
- సీబీఐ అధికారులు ఆస్పత్రిలోకి వచ్చారంటూ ఎల్లో మీడియా తప్పుడు వార్తలు
- దుష్ప్రచారాలను ఖండిస్తూ శాంతియుతంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తల నిరసన



కర్నూలులోని విశ్వభారతి హాస్పిటల్ వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న పార్టీ శ్రేణులు

సాక్షి ప్రతినిధి కర్నూలు: ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి మాతృమూర్తి శ్రీలక్ష్మి ఆరోగ్యం విషమంగానే ఉంది. కర్నూలులోని విశ్వభారతి ఆస్పత్రి వైద్యుల బృందం క్రిటికల్ కేర్ యూనిట్(సీసీయూ)లో ఆమె ఆరోగ్యాన్ని ప్రత్యేకంగా పర్యవేక్షిస్తోంది. ఎంపీ అవినాశ్ నిరంతరం అక్కడే ఉంటూ తల్లి బాగోగులు ఎప్పటికప్పుడు స్వయంగా చూసుకుంటున్నారు. వారిని పరామర్శించేందుకు రాయలసీమ జిల్లాల నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు ఆస్పత్రికి పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఎంపీ అవినాశ్‌ను సీబీఐ అరెస్టు చేస్తోందంటూ తప్పుడు వార్తలకు తెర తీసిన ఎల్లో మీడియా తన విష ప్రచారాన్ని కొనసాగిస్తోంది. శ్రీలక్ష్మి ఆరోగ్యం ఆందోళనకరంగా ఉందని వైద్యులు బులిటెన్ విడుదల చేయడం, ఓ వర్గం మీడియా తప్పుడు వార్తల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు ఆస్పత్రి ఎదుట రోడ్డుపైనే సోమవారం రాత్రంతా గడిపారు. ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు భారీగా బలగాలను తరలించారు.

సీబీఐ అధికారులు ఆస్పత్రిలోకి వెళ్లారంటూ..

పోలీస్ గెస్ట్‌హౌస్‌లో ఉంటున్న సీబీఐ అధికారులు అక్కడి నుంచి ఎస్పీ కార్యాలయానికి మాత్రమే వెళ్లారు. అయితే ఎల్లో మీడియా మాత్రం సీబీఐ అధికారులు విశ్వభారతి ఆస్పత్రిలోకి వెళ్లారని, అక్కడ పరిస్థితి, శ్రీలక్ష్మి ఆరోగ్యం గురించి వాకబు చేశారని దుష్ప్రచారం చేస్తూ డిబేట్లు నిర్వహించింది. విశ్వభారతి ప్రాంగణం, గాయత్రి ఎస్టేట్‌లో ప్రశాంతంగా ఉన్న వాతావరణాన్ని చెదరగొట్టి ఉద్రిక్తతకు దారితీసేలా కథనాలు ప్రసారం చేసింది. రోప్ పార్టీ పోలీసులు భోజనం చేసేందుకు వెళుతుంటే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు వారిపై ఆందోళనకు దిగినట్లు ఎల్లో మీడియా తప్పుడు వార్తలకు తెగబడింది. తాజాగా సుప్రీంకోర్టు ఆదేశాల అనంతరం మంగళవారం సాయంత్రం వరకూ అంతా ప్రశాంతంగా ఉండటంతో ఇక రాత్రికి అవినాశ్‌ను అరెస్టు చేసే అవకాశం ఉందంటూ మళ్లీ ప్రచారానికి తెరతీసింది.

శాంతియుతంగా నిరసన..

శ్రీలక్ష్మి, అవినాశ్‌ను పరామర్శించేందుకు ఎమ్మెల్యేలు రవీంద్రనాథ్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి, ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, రమేశ్, మేయర్లు సురేశ్‌బాబు, బీవై రామయ్య కడప, కర్నూలు కార్పొరేషన్ల కార్పొరేటర్లు ఆస్పత్రి వద్దకు వచ్చారు. ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్, సుధాకర్, ఆర్థర్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి నాలుగు రోజులుగా రాత్రింబవళ్లు ఆస్పత్రి వద్దే ఉంటున్నారు. ఎల్లో మీడియా దుష్ప్రచారాలను నిరసిస్తూ ఎమ్మెల్యేలు, కార్యకర్తలు మంగళవారం రాత్రి 7 గంటలకు ఆస్పత్రి ఎదుట శాంతియుతంగా నిరసన తెలిపారు. తన తల్లి ఆరోగ్యం కుదుట పడగానే 27 తర్వాత తానే స్వయంగా వస్తానని ఎంపీ అవినాష్‌రెడ్డి ప్రకటించారని, మానవత్వంతో వ్యవహరించాలని సీబీఐ అధికారులకు సూచించారు.

అవినాశ్ ముందస్తు బెయిల్‌పై

నిర్ణయానికి ఇన్ని రోజులా!

- ఆదేశాలిచ్చినా ఉత్తర్వులు జారీ చేయకపోవడమేమిటి?
- 25న అవినాశ్‌రెడ్డి పిటిషన్‌పై నిర్ణయం తీసుకోండి
- తెలంగాణ హైకోర్టు వెకేషన్ బెంచ్‌కు సుప్రీంకోర్టు ధర్మాసనం సూచన
- బెయిల్ కోరే హక్కు పిటిషనర్‌కు ఉంది
- సునీత తరఫు న్యాయవాదితో జస్టిస్ నరసింహ

సాక్షి, న్యూఢిల్లీ: ఎంపీ అవినాశ్‌రెడ్డి ముందస్తు బెయిలుపై నిర్ణయం తీసుకోవడానికి ఇన్ని రోజులా అని తెలంగాణ హైకోర్టుపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తంచేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చినా ఉత్తర్వులు జారీ చేయకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేసింది. అవినాశ్ పిటిషన్‌పై ఈ నెల 25న హైకోర్టు వెకేషన్ బెంచ్ విచారణ జరిపి తగిన ఆదేశాలివ్వాలని ఆదేశించింది. గతంలో మరో బెంచ్ విచారించినప్పటికీ వెకేషన్ బెంచ్ విచారణకు అడ్డంకి కాదని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్



పీఎస్ నరసింహ ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణకు (జూన్ 5) వచ్చే వరకు సీబీఐ నుంచి మధ్యంతర రక్షణ కల్పించాలని లేదా తన పిటిషన్‌ను వెకేషన్ బెంచ్ విచారించేలా ఆదేశాలివ్వాలంటూ అవినాశ్‌రెడ్డి దాఖలు చేసిన అప్లికేషన్‌పై ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చిన తర్వాత హైకోర్టు విచారించలేదా అని జస్టిస్ నరసింహ ప్రశ్నించారు. హైకోర్టు రెండుసార్లు విచారించిందని, ఉత్తర్వులు ఇవ్వలేదని, జూన్ 5కు వాయిదా వేసిందని, మే 15న సీబీఐ నుంచి నోటీసులు వచ్చాయని అవినాశ్ తరఫున సీనియర్ న్యాయవాది వి.గిరి తెలిపారు. ఆ తర్వాత ఏం జరిగిందని ధర్మాసనం ప్రశ్నించగా.. సీబీఐ నోటీసులు ఇచ్చిందన్నారు. 'హైకోర్టులో విచారణ ఉండగా సీబీఐ నోటీసులు ఇవ్వడం గమనార్హం' అని అభిప్రాయపడిన ధర్మాసనం.. సీబీఐ విచారణకు హాజరు కాలేదు కదా అని అనగా.. ఏడుసార్లు పిటిషనర్ హాజరయ్యారని గిరి తెలిపారు. ఒక్క రోజు వ్యవధిలో రావాలని నోటీసులు ఇవ్వడంతో మూడు రోజులు సమయం కోరామన్నారు. సీబీఐ తరఫున ఎవరైనా హాజరయ్యారా అని ధర్మాసనం ప్రశ్నించగా.. ఎవరూ హాజరు కాలేదని వైఎస్ వివేకా కుమార్తె సునీత తరఫు న్యాయవాది లూత్రా తెలిపారు. హైకోర్టులో ఏప్రిల్ 27న ఇద్దరి పిటిషన్లూ విచారణకు వచ్చాయని, సీజే వద్దకు వెళ్లినా ఎలాంటి ఆర్డర్ రాలేదని, జూన్ 5న మేటర్ జాబితా అయిందని లూత్రా వివరించారు. జస్టిస్ నరసింహ జోక్యం చేసుకొని.. ఏమైనా అరెస్టు భయం ఉందా అని ప్రశ్నించారు. తాను మొదటి నుంచి అదే చెబుతున్నానని, ఇప్పటికే అవినాశ్ తండ్రి అరెస్టయ్యారని, తల్లి ఆసుపత్రిలో ఉన్నారని గిరి చెప్పారు. ఈ సమయంలో లూత్రా జోక్యం చేసుకోవడంతో గిరి ఒకింత అసహనం వ్యక్తం చేశారు. గిరిని ధర్మాసనం మందలించడంతో ఆయన ధర్మాసనానికి క్షమాపణలు తెలిపారు. బెయిలు కోరే హక్కు పిటిషనర్‌కు ఉందని ధర్మాసనం లూత్రానుద్దేశించి వ్యాఖ్యానించింది. హైకోర్టు వెకేషన్ బెంచ్ గురించి ఆరా తీసింది. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న పిటిషన్లు వెకేషన్ బెంచ్ వినాలని సూచిస్తామని తెలిపింది. హైకోర్టుకు వెళ్లాలని ఇరువర్గాలకు తెలిపింది. అవినాశ్ వద్దకు వెళ్లాలని సీబీఐ ప్రయత్నించగా వందలాది మంది అనుచరులు అడ్డుకున్నారని లూత్రా అనగా.. అవన్నీ సీబీఐ న్యాయవాది చెబుతారని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అనంతరం జస్టిస్ నరసింహ ఉత్తర్వులు వెలువరించారు.



తాగునీటి కోసం రాస్తారోకో

వెంకటాపురం(కె): తాగునీటి కోసం ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండల పరిధిలోని ఉప్పేడు, గొల్లగూడెం గ్రామస్తులు మంగళవారం ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. తమకు 15 రోజులుగా తాగునీరు అందడం లేదని.. సర్పంచ్, కార్యదర్శులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ వెంకటాపురం (కె), భద్రాచలం రహదారిపై ఖాళీ బిందెలతో కూర్చున్నారు. సుమారు 2గంటల పాటు రహదారిపై ఆందోళన చేపట్టారు.

ధాన్యం కొనుగోళ్లలో నల్లగొండ టాప్

- ఇప్పటికి 5.56 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు
- 5.25లక్షల మెట్రిక్ టన్నులతో రెండో స్థానంలో నిజామాబాద్
- కొనుగోళ్లలో వెనుకబడిన 18 జిల్లాలు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు తప్పడం లేదు. కొన్ని జిల్లాల్లో కొనుగోళ్లు నత్తనడకన నడుస్తుండగా, మరి కొన్ని జిల్లాల్లో వేగంగా జరుగుతున్నాయి. అత్యధికంగా కొనుగోలు చేసిన జిల్లాల్లో నల్లగొండ మొదటి స్థానంలో ఉంది. కొనుగోళ్లలో అనేక సమస్యలు ఎదురవుతున్నా జిల్లా యంత్రాంగం వాటిని ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ ముందుకు సాగుతోంది. సాధారణంగా ఏటా నిజామాబాద్ జిల్లాల్లో అత్యధికంగా ధాన్యం కొను గోలు చేస్తారు. ఈసారి మాత్రం నల్లగొండలో ఇప్పటికే అత్యధికంగా కొనుగోలు చేశారు. ఈ రెండు జిల్లాలతో పాటు మరో 10 జిల్లాల్లో కొనుగోళ్లు వేగంగా సాగుతున్నా మిగతా జిల్లాల్లో మాత్రం కొనుగోళ్లలో సమస్యలు తప్పడం లేదు. రాష్ట్రంలో 62,15,957 మెట్రిక్ టన్నులు కొనుగోలు లక్ష్యంగా పెట్టుకోగా అందులో ఇప్పటికి 56,72,270 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు.

తాలు తంటా.. మిల్లర్ల కొర్రీలు

రాష్ట్రంలోని 18 జిల్లాలు ధాన్యం కొనుగోళ్లలో వెనకబడ్డాయి. అందులో 9 జిల్లాల్లో కొనుగోలు లక్ష్యంలో సగం ధాన్యం కొనుగోలు చేయకపోగా, మరో 9 జిల్లాల్లో పావలావంతు ధాన్యం కూడా కొనుగోలు చేయలేదు. భూపాలపల్లి, ములుగు, నాగర్‌కర్నూల్, వికారాబాద్, రంగారెడ్డి, జోగుళాంబ గద్వాల, మేడ్చల్, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాలు ధాన్యం కొనుగోళ్లలో వెనుకబడ్డాయి. మరి కొన్ని జిల్లాలు లక్ష్యంలో సగం ధాన్యం కూడా కొనుగోలు చేయలేదు. అందులో యాదాద్రి, మెదక్, సిద్దిపేట, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, నారాయణ్‌పేట, నిర్మల్, వరంగల్, కొత్తగూడెం జిల్లాలు ఉన్నాయి.

అనేక చోట్ల అకాల వర్షాల కారణంగా ధాన్యం తడవడం, కొన్నిచోట్ల తడిచిన ధాన్యం మొలకెత్తడం, మరికొన్ని తాలు ఉందంటూ మిల్లర్లు నిరాకరించడం వంటి సమస్యలతో కొనుగోళ్లు వేగంగా సాగడం లేదు. ముఖ్యంగా మిల్లర్ల కొర్రీలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈసారి వర్షాకాలం సీజన్ సాగును ముందే ప్రారంభించేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో కొనుగోళ్లలో వేగం పుంజుకోకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

పెరిగిన దిగుబడి.. తగ్గని రాశులు

గతంలో ఎప్పుడూ లేనట్లుగా పెద్ద ఎత్తున ధాన్యం దిగుబడి వచ్చింది. ఎక్కడ చూసినా ధాన్యం రాశులే. రాష్ట్ర వ్యాప్తంగా కొనుగోళ్లు వేగంగా సాగుతున్న జిల్లాల్లోనూ ఇంకా కల్లాల్లో ధాన్యం ఒడవడం లేదు. ఒక్క నల్లగొండ జిల్లాలోనే చూస్తే గత సీజన్‌లో 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే ఈసారి ఇప్పటికే 5.56 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా కొనుగోలు చేసినా ఇంకా కల్లాల్లో ధాన్యం నిల్వలు ఉన్నాయి.

ప్రత్యేక చొరవతోనే..

నల్లగొండ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో జిల్లా యంత్రాంగం ప్రత్యేక చొరవ చూపుతోంది. అధికారులు మొదట్లో 272 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే ఈ సీజన్‌లో ధాన్యం అధికంగా దిగుబడి రావడం, దానికితోడు అకాల వర్షాలు రావడంతో త్వరగా ధాన్యం కొనుగోలు చేయాలని మరో 100 కొనుగోలు కేంద్రాలను అదనంగా ఏర్పాటు చేసి కొనుగోళ్లను ముమ్మరం చేశారు. జిల్లా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు కొనుగోళ్లు ప్రారంభమైనప్పటి నుంచి 45 రోజులుగా ప్రతి రోజు నాలుగైదు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పర్యటిస్తున్నారు.

రోజుకు లక్షన్నర టన్నుల ధాన్యం సేకరణ

- ఇప్పటివరకు 38.50 ఎల్ఎంటీ ధాన్యం సేకరణ
- ధాన్యం కొనుగోళ్లపై మంత్రి గంగుల కమలాకర్ సమీక్ష



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు సాగుతున్న తీరు సంతృప్తికరంగా ఉందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ధాన్యం కొనుగోళ్లపై మంగళవారం ఆయన రాష్ట్ర సచివాలయంలో పౌరసరఫరాల కమిషనర్ అనిల్ కుమార్, కార్పొరేషన్ జీఎం రాజారెడ్డి తదితరులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. సగటున రోజుకు లక్షన్నర మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు యాసంగి ధాన్యాన్ని 38.50 లక్షల మెట్రిక్ టన్నుల మేర సేకరించామని, ఇది గత సీజన్ కన్నా 10 లక్షల మెట్రిక్ టన్నులు అధికమని అన్నారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి ఆశించినంత సహకారం లేకున్నా, రైతుల నుంచి కనీస మద్దతు ధరతో సేకరిస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు అనుకూల విధానాల కారణంగా ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచిందని, గతంలో ఎన్నడూ లేనంతగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం పోటెత్తుతున్న పరిస్థితులు ఉన్నాయని అన్నారు. అకాల వర్షాలతో పలు జిల్లాల్లో కోట్లాది రూపాయల ధాన్యం నేలపాలైందని, వారిని కూడా ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. మంగళవారం వరకూ రాష్ట్రవ్యాప్తంగా 7 వేల కొనుగోలు కేంద్రాల ద్వారా రూ. 7,907 కోట్ల విలువ గల ధాన్యాన్ని 6 లక్షల మంది రైతుల నుంచి సేకరించినట్లు తెలిపారు. ఇప్పటికే 400కి పైగా కొనుగోలు కేంద్రాల్లో సేకరణ పూర్తి కాగా, వాటిని మూసేసినట్లు చెప్పారు. ఎఫ్‌సీఐ నిర్దేశించిన కనీస నాణ్యతా ప్రమాణాలను రైతులు పాటిస్తూ, ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తేవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని మౌలిక వసతులను ఏర్పాటు చేశామని, అక్కడక్కడా ఎదురవుతున్న సమస్యలపై ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగం స్పందిస్తుందని, రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని మంత్రి ఆదేశించారు.

ఆర్‌అండ్‌బీ పునర్విభజన

- పూర్తయిన ప్రక్రియ
- కొత్తగా మంచిర్యాల 'సర్కిల్'
- ఐదు బిల్డింగ్ డివిజన్ కార్యాలయాలు..
- బిల్డింగ్, రోడ్ల పనుల పర్యవేక్షణ ఇకపై వేర్వేరుగా
- భవనాలను సిద్ధం చేసిన అధికారులు
- జూన్ 2వ తేదీ నుంచి అందుబాటులోకి



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ ఎస్ఈ కార్యాలయం

కైలాస్‌నగర్: రోడ్లు, భవనాల శాఖ పునర్విభజన ప్రక్రియ పూర్తయింది. పాలన సౌలభ్యంతో పాటు పనుల్లో నాణ్యత పెంచాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌అండ్‌బీ డివిజన్లను పునర్ వ్యవస్థీకరించింది. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో మంచిర్యాల జిల్లా కేంద్రంగా మరో సర్కిల్ కార్యాలయం అందుబాటులోకి రానుంది. బిల్డింగ్ పనుల పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా ఐదు డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు చేసింది. పనుల పర్యవేక్షణ మరింత పకడ్బందీగా జరిగేలా కొత్తగా ఆరు సెక్షన్లు అందుబాటులోకి రానున్నాయి. అధికారులు సైతం నియామకం కానున్నారు. వీటి ఏర్పాటుకు అవసరమైన భవనాలను సైతం ఆర్‌అండ్‌బీ అధికారులు ఇప్పటికే గుర్తించారు. కొన్నింటికి ప్రభుత్వ భవనాలను గుర్తించగా మరికొన్నింటికి భవనాలను అద్దెకు తీసుకున్నారు. వీటిలో సౌకర్యాల కల్పనకు అవసరమైన నిధులు, ఫర్నిచర్ వంటి సామగ్రి కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఇది వరకు రోడ్లు, భవనాల నిర్మాణం, నిర్వహణను అధికారులంతా పర్యవేక్షించగా ప్రస్తుతం వాటికి వేరువేరు కార్యాలయాలు ఏర్పాటవుతున్నాయి. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2నుంచి ఆర్‌అండ్‌బీ కొత్త కార్యాలయాలు అందుబాటులోకి రానున్నట్లుగా ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.

మంచిర్యాల జిల్లా కేంద్రంగా సర్కిల్ కార్యాలయం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంగా ఆర్‌అండ్‌బీ సర్కిల్ (ఎస్ఈ) కార్యాలయం కొనసాగుతుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోడ్లు, భవన నిర్మాణాలు, నిర్వహణ వ్యవహారాలన్నీ ఈ కార్యాలయం ద్వారానే జరుగుతున్నాయి. జిల్లాల పునర్విభజన జరిగి ఏడేళ్లవుతున్నప్పటికీ ఇదే కార్యాలయం ద్వారా పనులు నిర్వహిస్తున్నారు. తాజాగా ఆర్‌అండ్‌బీ పునర్విభజనలో భాగంగా మంచిర్యాల, కుమురంభీం జిల్లాలకు కలిపి మంచిర్యాల జిల్లా కేంద్రంగా కొత్త సర్కిల్(ఎస్ఈ) కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇక నుంచి ఆయా జిల్లాలకు సంబంధించిన పనులన్నీ ఈ సర్కిల్ కార్యాలయం ద్వారా కొనసాగనున్నాయి. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు కలిపి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంగా ప్రస్తుతమున్న ఎస్ఈ కార్యాలయమే కొనసాగనుంది. సర్కిల్ కార్యాలయం ఏర్పాటు ద్వారా పనులపై పర్యవేక్షణ పెరగడంతో పాటు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

కొత్తగా ఐదు బిల్డింగ్ డివిజన్ కార్యాలయాలు

ప్రస్తుతం ఆర్‌అండ్‌బీ శాఖలో ఎస్ఈ, ఈఈ, డివిజన్ కార్యాలయాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చేపట్టే రోడ్లు, భవనాల నిర్మాణాలు, వాటి నిర్వహణను జిల్లా స్థాయిలో ఎస్ఈ, ఈఈలు, డివిజన్ స్థాయిల్లో డీఈలు పర్యవేక్షిస్తున్నారు. పునర్విభజనలో భాగంగా రోడ్లు, భవనాల నిర్మాణాల కోసం వేర్వేరుగా డివిజన్లను ఏర్పాటు చేస్తున్నారు. రోడ్లు, భవనాలను వేర్వేరుగా విభజించడం ద్వారా ఆయా పనులపై పర్యవేక్షణ పెరగడంతో పాటు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటుందనే ఉద్దేశంతో ప్రభుత్వం వేర్వేరుగా విభజిస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో ఐదు బిల్డింగ్ డివిజన్లను కొత్తగా ఏర్పాటు చేయనున్నారు. జిల్లాకు ఒకటి చొప్పున నాలుగు జిల్లాలకు కలిపి నాలుగు బిల్డింగ్ డివిజన్ కార్యాలయాలతో పాటు ఆసిఫాబాద్ జిల్లా పరిధిలో పెంచికల్‌పేట కేంద్రంగా కొత్తగా మరో డివిజన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇక ఇన్ని రోజులు జిల్లాలోని ఉట్నూర్ కేంద్రంగా కొనసాగిన డివిజన్ కార్యాలయాన్ని సైతం మంచిర్యాల జిల్లా చెన్నూర్‌కు తరలించనున్నారు. ఈ కార్యాలయాలు ఆర్‌అండ్‌బీ ద్వారా చేపట్టే భవన నిర్మాణాలు, నిర్వహణను పర్యవేక్షించనున్నాయి. ప్రస్తుతమున్న డీఈ కార్యాలయాలు రోడ్ల నిర్మాణాలు, నిర్వహణను నిర్వహించనున్నాయి.

ఆరు సెక్షన్ల ఏర్పాటు

కొత్తగా ఆరు ఆర్‌అండ్‌బీ సెక్షన్లను సైతం ఏర్పాటు చేస్తున్నారు. ఆదిలాబాద్‌లో ఒకటి, నిర్మల్‌లో రెండు, మంచిర్యాలలో 2, ఆసిఫాబాద్‌లో ఒకటి చొప్పున ఈ సెక్షన్లను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా పరిధిలో కొనసాగుతున్న రెండు సెక్షన్లను ఇతర ప్రాంతాలకు తరలించారు. ఇందులో జైనథ్ సెక్షన్‌ను బెజ్జూర్‌కు తరలించగా, నార్నూర్ సెక్షన్‌ను పెంచికల్‌పేట్‌కు తరలించారు. ఇప్పటివరకు రోడ్లు, భవనాల నిర్మాణాలు, పర్యవేక్షణ వ్యవహారాలన్నీ ఎస్ఈ, ఈఈ, డీఈల పరిధిలో కొనసాగగా ఇకపై ఈ పనులు వేర్వేరుగా జరుగనున్నాయి. ఇందుకు అధికారులను సైతం వేరువేరుగానే నియమించనున్నారు.

భవనాలను సిద్ధం చేశాం



ఆర్‌అండ్‌బీ ద్వారా చేపట్టే పనులు త్వరితగతిన, నాణ్యతతో జరుగాలనే ఉద్దేశంతో ప్రభుత్వం శాఖను పునర్విభజన చేయాలని నిర్ణయించింది. ఉమ్మడి జిల్లా పరిధిలో కొత్తగా ఎస్ఈ కార్యాలయంతో పాటు భవన నిర్మాణాల కోసం ప్రత్యేకంగా డివిజన్, సెక్షన్ కార్యాలయాలను ఏర్పాటు చేసింది. వీటికి అవసరమైన భవనాలను ఇప్పటికే సిద్ధం చేశాం. జూన్ 2వ తేదీ నుంచి వీటిలో అధికారికంగా కార్యకలాపాలు షురూ కానున్నాయి. అందుకు అవసరమైన ఫర్నిచర్, ఇతరత్రా వసతుల కల్పన కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. – బానోత్ రాజేందర్ నాయక్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా

కనిపించని పెద్ద నోట్ల ఉపసంహరణ ప్రభావం

మంచిర్యాలఅగ్రికల్చర్: మంచిర్యాల జిల్లాలో రూ.2వేల నోట్ల ఉపసంహరణ ప్రభావం అంతగా కనిపించలేదు. మంగళవారం నోట్ల మార్పిడి, డిపాజిట్‌కు వచ్చే ఖాతాదారుల కోసం బ్యాంకు అధికారులు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాట్లు చేసినా హడావుడి లేదు. ఈ నెల 23 నుంచి సెప్టెంబర్ 30 వరకు గడువు ఉండడంతో మొగ్గు చూపలేదు. ఈ నెల, వచ్చే నెలలో శుభముహూర్తాలు ఉండడంతో వివాహాల కోసం బంగారం, బట్టలు దుకాణాల్లో పెద్ద నోట్లను వినియోగిస్తున్నట్లు తెలిసింది. 2016 నవంబర్‌లో నోట్ల రద్దు సమయంలో పెద్ద ఎత్తున బ్యాంకుల జనాలు బారులు తీరారు. కొన్ని నెలలుగా పేద, మధ్యతరగతి సామాన్య ప్రజల చేతిలో రూ.2 వేలు కనిపించడం లేదు. పెద్ద మొత్తం వ్యాపారులు సాగించే, రియల్‌ఎస్టేట్ వ్యాపారాలు సాగించే వారి వద్దనే ఎక్కువగా ఉంటున్నాయి. సామాన్య, మధ్య తరగతి జనాల వద్ద పెద్ద నోట్లు లేకపోవడంతో బ్యాంకుల్లో హడావుడి కనిపించడం లేదు. నిల్వ ఉన్న వారుసైతం కాస్త వేచిచూసే ధోరణిలో ఉన్నట్లు తెలుస్తోంది.

సీఎం కప్ కబడ్డీ రాష్ట్ర పోటీలకు హుజూరాబాద్ జట్టు

హుజూరాబాద్: సీఎం కప్ క్రీడల్లో భాగంగా జిల్లా కేంద్రంలో జరిగిన కబడ్డీ పోటీల్లో హుజూరాబాద్ క్రీడాకారులు సత్తాచాటారు. అత్యంత ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హుజూరాబాద్ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు, కౌన్సిలర్ తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. రాష్ట్ర పోటీలకు ఎంపికైన వారిలో కె.గౌతమ్, పి.అనిల్, పి.మహేందర్‌రెడ్డి, యు.అరవింద్, కె.ప్రేమ్‌చంద్, ఎం.ప్రభాత్, విష్ణువర్దన్ (హుజూరా బాద్), పవన్, అరవింద్, ఆశీర్వాద్(గన్నేరువరం), శివాజీ (కరీంనగర్), శశాంక్ (చొప్పదండి) ఉన్నారు. ఈ జట్టుకు కోచ్‌గా రాజ్‌కుమార్ (పీఈటీ హు జూరాబాద్), మేనేజర్‌గా సీహెచ్.శ్రీనివాస్ (జెడ్పీహెచ్ఎస్ ఇల్లందకుంట) వ్యవహరిస్తారని పేర్కొన్నా రు. జట్టు సభ్యులు ఈనెల 27,28,29న హైదరా బాద్‌లో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను కబడ్డీ కోచ్ అంజయ్య, పీడీ సొల్లు సారయ్య, పీఈటీలు రాజిరెడ్డి, వెంకటరెడ్డి, రవికుమార్ తదితరులు అభినందించారు.



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

27, 28 తేదీల్లో జాతీయస్థాయి సెమినార్

విద్యానగర్(కరీంనగర్): నిరుద్యోగ హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పడానికి ఈనెల 27, 28 తేదీల్లో కరీంనగర్‌లో జాతీయ స్థాయిలో సెమినార్ నిర్వహించనున్నట్లు డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి తెలిపారు. మంగళవారం డీవైఎఫ్ఐ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను ఎత్తివేసి, నిరుద్యోగ హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వానికి భవిష్యత్తులో తగిన గుణపాఠం చెప్పడానికి నిర్వహిస్తున్న సెమినార్‌ను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి.నరేశ్, నాయకులు వెంకటేశ్, మహేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తిరుపతి

బ్రాహ్మణ భవన్ ప్రారంభోత్సవానికి తరలిరావాలి



మాట్లాడుతున్న గంగు ఉపేంద్రశర్మ

- బ్రాహ్మణ సేవాసమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ

కరీంనగర్ కల్చరల్: హైదరాబాద్ గోపనపల్లిలో నిర్మించిన బ్రాహ్మణ భవన్ ప్రారంభోత్సవానికి ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో బ్రాహ్మణులు తరలివచ్చి విజయవంతం చేయాలని బ్రాహ్మణ సేవాసమితి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్ మార్కెట్ రోడ్ వేంకటేశ్వరాలయంలోని కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బ్రాహ్మణ సంఘాల మహాసభలో సీఎం కేసీఆర్ 6 ఎకరాల భూమిలో రూ.12 కోట్ల నిధులతో బ్రాహ్మణ భవన్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని తెలిపారు. ఆలయాల అభివృద్ధికి, బ్రాహ్మణ, అర్చక సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఒక్క కరీంనగర్ జిల్లాలోనే బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ద్వారా రూ.5 కోట్ల నిధులు బెస్ట్ స్కీం కింద పేద బ్రాహ్మణులకు అందించారన్నారు. డిపెన్ స్కీంలో భాగంగా 273 జీవో ద్వారా రూ.3 వేల నుంచి రూ.6 వేల వరకు పెంచారని, మెరిట్ సాధించిన విద్యార్థుల విదేశీ చదువులకు రూ.70 కోట్ల నిధులు అందజేశారని వివరించారు. 29 రాష్ట్రాల్లో ఒక్క తెలంగాణలోనే అర్చక, ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులతో పాటు గ్రాంట్ ఇన్ ఎయిడ్ జీతాలిస్తున్నారని వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలో మంథని, ధర్మపురి, కరీంనగర్, కాళేశ్వరం తదితర ప్రాంతాల్లో 2 లక్షల మంది వరకు బ్రాహ్మణులున్నారని, వారిని స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులు, నాయకులు విస్మరిస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు డాక్టర్ శ్రీరాంపట్ల, దీపక్, డాక్టర్ విష్ణుదాస్ గోపాల్‌రావు, గోపాల కిషన్‌రావు, అన్నమరాజు మనోహర్‌రావు, ఎనమండ్ర మణికంఠశర్మ, సంకేపల్లి నాగేంద్రశర్మ, దేవరాజు దయాసాగర్ తదితరులున్నారు.

రూ.2వేల నోట్లతో కరెంట్ బిల్లులు చెల్లించవచ్చు

కొత్తపల్లి(కరీంనగర్): రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.2,000 నోట్లను ఉపసంహరించుకుంటున్న సందర్భంగా ఆ నోట్లతో వినియోగదారులు ముందస్తు కరెంట్ బిల్లులు చెల్లించే వెసులుబాటును సంస్థ కల్పించిందని టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ గంగాధర్ ప్రకటనలో తెలిపారు. రూ.2 వేల నోట్లతో ప్రస్తుత నెల బిల్లులు, ముందస్తు బిల్లులు చెల్లించే అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవడంతో పాటు విద్యుత్ సంస్థకు సహకరించాలని కోరారు. అలాగే విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాలను పట్టణాలు, గ్రామాల్లో ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

25న 'వివేకానంద'లో జాబ్‌మేళా

కరీంనగర్‌సిటీ: జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో 25న టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ వారు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ట్రైనింగ్, ప్లేస్మెంట్ ఆఫీసర్ (టీపీఓ) మహ్మద్ అబ్దుల్ సలీం మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.శ్రీనివాస్ మాట్లాడుతూ, రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌కు హాజరయ్యే అభ్యర్థులు 2021, 2022, 2023 విద్యా సంవత్సరాల్లో బీఎస్సీ (జనరల్), ఏదేని బీకాం, బీబీఏ, బీబీఎం, బీఏ కోర్సుల్లో 50 శాతం లేదా 5 సీజీపీఏలతో ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు పూర్తి ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఏదైనా గుర్తింపు కార్డు, పూర్తి సమాచారంతో కూడిన బయోడేటాతో ఉదయం 9 గంటలకు వివేకానంద కళాశాలలో సంప్రదించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు మహ్మద్ అబ్దుల్ సలీం (98497 37313)ను సంప్రదించాలని పేర్కొన్నారు.



వీణాగుండవెల్లి, ఫౌండర్, సీఈవో, ఇమాజియా

అవకాశాలను సృష్టించుకోవాలి!

విజయానికిదే కొత్త ఫార్ములా

వీణాగుండవెల్లి మనసులో మాట

'డ్రీమ్ బిగ్, ఫాలో యువర్ పాషన్, వర్క్ హార్డ్, వర్క్ స్మార్ట్'... నాలుగు మాటలు. ఈ నాలుగు మాటలే వీణాగుండవెల్లిని విజేతగా నిలబెట్టాయి. 'ఇలా ముందుకెళ్లమని నాకెవ్వరూ చెప్పలేదు. స్వీయశోధనతో తెలుసుకున్న సత్యాలివి. కొత్తతరానికి నేను చెప్పగలిగిన సూచన ఇది. నేను ఆచరించిన మార్గమే నా సందేశం' అన్నారామె.

ఉస్మానియా యూనివర్శిటీ నుంచి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ చేసిన వీణ ఆ తర్వాత యూఎస్ వెళ్లి శాంటాక్లారా యూనివర్శిటీ నుంచి కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ చేశారు. యూఎస్‌లోని సిలికాన్ వ్యాలీ కేంద్రంగా ఇమాజియా సాఫ్ట్‌వేర్ కంపెనీని నిర్వహిస్తున్న వీణ ఇటీవల హైదరాబాద్‌కి వచ్చినప్పుడు సాంకేతిక రంగంలో విజయవంతమైన తన జర్నీని ఆమె 'సాక్షి'తో పంచుకున్నారు.

''యూఎస్‌లో నేను కానస్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, సిస్కో సిస్టమ్స్‌లో పని చేసిన తర్వాత టెక్నాలజీ రంగంలో సొంత కంపెనీ ప్రారంభించాను. ఇంటర్నెట్ మొదలైన రోజులు, అలాగే వైటూకే క్రైసిస్ ఎదురైన రోజులు కూడా. ఆ సమస్యలను అధిగమిస్తూ ఇంటర్నెట్ ఆధారిత ఫైనాన్స్ అప్లికేషన్స్ సర్వీసులందించింది మా సంస్థ. ఈ టెక్నాలజీకి భవిష్యత్తు ఉందని నమ్మాను, నా నమ్మకమే పునాదిగా ముందుకెళ్లాను. ఒక దశ తరవాత కంపెనీ కార్యకలాపాలను విస్తరించాలనే ఉద్దేశంతో వెంచర్ క్యాపిటల్ ద్వారా ఫండ్ రైజింగ్ మొదలుపెట్టాను. మా కంపెనీ సేవల పట్ల నమ్మకం కలిగినప్పటికీ పెట్టుబడులు పెట్టడానికి చాలామంది ముందడుగు వేయలేకపోయారు. అందుకు కారణం మహిళను కావడమే. నా మీద నాకు కాన్ఫిడెన్స్ ఉంది, నేను కాన్ఫిడెంట్‌గా ముందుకెళ్తున్నాను. ఆ మేరకు పెట్టుబడి పెట్టేవాళ్లలో విశ్వాసం కలిగించడం కొంచెం కష్టమైందనే చెప్పాలి. కష్టం అని వదిలిన వాళ్ల వెంట సక్సెస్ రాదు. కష్టాన్ని జయించడమే విజయానికి తొలిమెట్టు. మొత్తానికి నాకున్న సాంకేతిక పరిజ్ఞానం పట్ల విశ్వాసం కలిగిన తరవాత పెట్టుబడులు పెట్టారు. కానీ ఆ తర్వాత 'మీ కంపెనీలో మా ప్రతినిధి సీఈవో హోదాలో ఉంటారు. మీరు టెక్నాలజీ పార్ట్ చూసుకోండి' అన్నారు. ఆ షరతును అంగీకరించాల్సి వచ్చింది. కానీ ఆ ప్రయత్నం విజయవంతం కాలేదు. టాప్‌లో ఉన్న మా కంపెనీ ఒడిదొడుకులకు లోనయింది. తిరిగి టాప్‌లో నిలపడానికి నేను చాలా కష్టపడాల్సి వచ్చింది.

ముందుచూపు

ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ వినియోగం ఇప్పుడు బాగా ఎక్కువైంది. మేము 2015లో ప్రాడక్ట్ బిల్డ్ చేశాం. సాంకేతిక రంగానికి ఏఐని పరిచయం చేశామని చెప్పాలి. ఆ తర్వాత మూడేళ్లకు కృత్రిమ మేధ ఆధారిత ఆర్థిక సహకారాన్ని డిజిటల్‌గా అందించడం మొదలుపెట్టాం. మరో రెండేళ్లలో ఫైనాన్షియల్ డాక్యుమెంట్‌లను చదివి, ప్రాజెస్ చేయగలిగిన తొలి ఏఐ ఇంజన్‌ను తీసుకొచ్చాం. ఈ రంగంలో మేమిచ్చిన డైరెక్షన్‌ను ముందుచూపున్న కంపెనీలు అందుకున్నాయి. మేము ఏఐ ఆధారిత డిజిటల్ పేమెంట్స్ చేస్తున్నాం. ఆర్థిక లావాదేవీలు వేగంగా జరుగుతుంటే వ్యాపారం కూడా అంతే వేగంగా జరుగుతుంది. ఓటూసీ (ఆర్డర్ టూ కస్టమర్) ప్రాసెస్‌ని మా కంపెనీ చేస్తుంది. తొంభై దేశాల్లో, 25 భాషల్లో మా సేవలందిస్తున్నాం.

భవిష్యత్తు దర్శనం

విజేత కావాలంటే భవిష్యత్తును దర్శించగలగాలి. ఆలోచనను ఆచరణలో పెట్టడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ వెనుకడుగు వేయకూడదు. అలాగే అవకాశాలను అందిపుచ్చుకోవడమనేది పాత మాట. అవకాశాలను సృష్టించుకోవాలనేది ఈ జనరేషన్ అనుసరించాల్సిన ఫార్ములా. హెన్రీ ఫోర్డ్ ఒక ఇంజనీర్‌గా మిగిలిపోలేదు. తన ఆలోచనతో రవాణాకు యంత్రంతో నడిచే కారు అనే వాహనానికి రూపకల్పన చేసి పారిశ్రామికవేత్త అయ్యాడు. గుర్రం మీద ప్రయాణించే కాలాన్ని వేగంగా ముందుకు తీసుకెళ్లాడు. మన ఆలోచన సమాజానికంటే ముందుండాలి. అది శతాబ్దం కావచ్చు, దశాబ్దం కావచ్చు. ఆ సమయానికి సమాజం మన ఆలోచనను స్వాగతించవచ్చు లేదా విమర్శించనూ వచ్చు. కానీ దానిని నిరూపించిన తరవాత మన వెంట నడిచి తీరుతుంది'' అన్నారు వీణా గుండవెల్లి.

ఆమె తన విజయాలనే పాఠ్యాంశాలుగా కాలిఫోర్నియా యూనివర్సిటీలో బోధిస్తున్నారు. అల్పాదాయ వర్గాల వారికి సహాయం చేయడానికి టచ్ ఏ లైఫ్ పేరుతో ఒక ఫౌండేషన్ ద్వారా సేవలందిస్తున్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణ, సామాజిక ప్రయోజనం చేకూరే స్టార్టప్‌లతో ముందుకు వచ్చే యువతకు చేయూతనిస్తున్నారు. ఈ ప్రయాణంలో ఆమెను వరించిన అవార్డుల ప్రస్తావనకు ఆమె 'ఎన్నని చెప్పాలి, అయినా ఆ లెక్క ఇప్పుడెందుకు' అన్నారు నవ్వుతూ.

– వాకా మంజులారెడ్డి

ఒక్కోసారి ఒక చిన్న ఆలోచన కూడా సరైన అవకాశంగా రూపుదిద్దుకుంటుంది. అదే ఆదాయవనరులను సృష్టించి పెడుతుంది. భోపాల్‌వాసి రచన ఆర్య విషయంలో అదే జరిగింది. ఫ్యాషన్ జ్యువెలరీని తయారు చేసే రచన బొటిక్‌లలో మిగిలిపోయిన ఫ్యాబ్రిక్‌ను సేకరించి, వాటితో ఆభరణాలను తయారు చేస్తూ దానిద్వారా ఆదాయ వనరులను సృష్టించుకుంది. కాటన్ ఫ్యాబ్రిక్‌పైన బ్లాక్ ప్రింట్స్ వేసి, ఆ మెటీరియల్‌తో ఎకోఫ్రెండ్లీ జ్యూయలరీని తయారు చేస్తూ, ప్రదర్శనలు నిర్వహిస్తుంది. 'కేతకి' పేరుతో శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఉపాధి పొందుతోంది. అభిరుచి నుంచి ఆదాయానికి మార్గం వేసుకున్న రచన ఆర్య ఫ్యాబ్రిక్ ఆభరణాల తయారీ గురించి ఎన్నో విషయాలను పంచుకుంది.



అభిరుచే ఆభరణమైంది

* ఫ్యాబ్రిక్ స్క్రాప్‌తో ఫ్యాషన్



రచన ఆర్య



''చిన్నప్పుడు గృహాలంకరణ వస్తువులను తయారు చేయడంలో ఇష్టం చూపేదాన్ని. ఎంఫిల్ చేసినా ఆ అభిరుచి అలాగే కొనసాగింది. ఫైన్ ఆర్ట్స్ చదువుతున్నప్పుడు నా డిజైన్ పనిని మరింత మెరుగుపరిచాయి. ఆ తర్వాత ఐదేళ్లుగా ఫ్యాబ్రిక్ బీడ్స్‌తో నగలను తయారు చేస్తూ ఉపాధిని పొందుతున్నాను.


మా నాన్న ఆయుర్వేద వైద్యుడు, అమ్మ గృహిణి. సరైన సంపాదన లేకపోవడంతో చాలా ఇబ్బందులను ఎదుర్కొన్నారు. తర్వాత సొంత బిజినెస్ ఏర్పాటు చేశారు. అది నిలదొక్కుకోవడానికి చాలా టైమ్ పట్టింది. ఎన్ని కష్టాలు వచ్చినా నన్నూ, అన్నయ్యను బాగా చదివించాలనుకున్నారు. వారి ఇష్టం మేరకు చదువుకుంటూనే నా అభిరుచిని మెరుగుపరుచుకుంటూ ఉండేదాన్ని. నెక్లెస్‌లు, ఇయర్ హ్యాంగింగ్స్, ఫ్యాబ్రిక్ బీడ్స్, ట్రైబల్స్ జ్యువెలరీ, దుస్తుల మీద ప్రింట్లు ఇలా అనేక రకాల డిజైన్స్‌పై దృష్టి పెట్టేదాన్ని. ఓ రోజు నేను జ్యువెలరీ పనుల్లో ఉన్నప్పుడు– తేలికగా ఉండే క్లాత్‌తో ఆభరణాలను ఎందుకు తయారు చేయకూడదు– అని ఆర్ట్ డిజైనర్ అయిన మా అన్నయ్య అన్నాడు.

ఎకో ఫ్రెండ్లీ థీమ్

అన్నయ్య ఇచ్చిన పర్యావరణ హిత ఆభరణాల తయారీ ఆలోచన నాకు బాగా నచ్చింది. ఫ్యాషన్ ప్రపంచం లో ఎప్పుడూ కొత్త ప్రయోగాలు జరుగుతూనే ఉంటాయి. హాలీవుడ్ నటి ఏంజెలినా జోలీ కూడా పాత బ్రాండెడ్ దుస్తులను సేకరించి, కొత్తగా మార్చేసి మార్కెట్ చేసే బిజినెస్‌ను ప్రారంభించారు. దీనివల్ల ఒకసారి వాడిన వస్తువులను మరోవిధంగా మళ్లీ వాడచ్చు. పర్యావరణానికీ మేలు కలుగుతుంది. దీంతో నేనూ కాటన్ ఫ్యాబ్రిక్ పైన బ్లాక్ ప్రింట్స్ వేసి, ఆ మెటీరియల్‌తో జ్యువెలరీ తయారు చేయడం మొదలుపెట్టాను.

స్క్రాప్ .. స్పెషల్

మొదటి నుంచి స్క్రాప్ నుంచి ఆభరణాలను తయారు చేయడం నా ప్రత్యేకత. వీటి ద్వారా రూ.50 నుంచి రూ.1000 వరకు విలువ చేసేవి వివిధ రూపాలలో నా వద్ద డిజైన్లు ఉన్నాయి. ఆరేళ్ల క్రిందట 'కేతకి' పేరుతో ఏర్పాటు చేసిన నా ఈ వ్యాపారంలో పెద్దగా ఒడిదొడుకులు ఎదురు కాలేదు. వేడుకల్లోనూ, వేదికల్లోనూ ధరించడానికి సందర్భానికి తగిన ఆభరణాలను మహిళలు మెచ్చేలా తయారు చేస్తూ వచ్చాను. మార్కెట్‌లో లభించే మెటల్ ఆభరణాలకు ఇవి పూర్తి భిన్నం. అయితే, ఈ ఫ్యాబ్రిక్ జ్యువెలరీలో మెటల్, పూసలు, ముత్యాలను ఉపయోగిస్తాను. దీనితోపాటు మా ప్రాంతానికి ప్రత్యేకమైన బ్లాక్ ప్రింట్‌ను వాడతాను. ఇది చర్మానికి, పర్యావరణానికి అనుకూలమైనది.



ఎంబ్రాయిడరీ, జరీ జర్దోసీ హస్తకళను ఉపయోగించే ఫ్యాబ్రిక్ జ్యువెలరీని కూడా తయారుచేస్తాను.

వర్క్‌షాప్స్

తయారు చేసిన ఆభరణాలతో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తుంటాను. నా స్టార్టప్ ద్వారా మహిళలకు శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టాను. రిజిస్టర్డ్ ఆర్టిస్ట్‌గా మారాక ప్రభుత్వరంగంలోనూ ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేశాను. ఇప్పటివరకు ఢిల్లీ, హైదరాబాద్, రాయ్‌పూర్, కోల్‌కతా ఇండోర్ వంటి పెద్ద నగరాల్లో చేసిన ప్రదర్శనలు, వర్క్‌షాప్స్ మంచి పేరు, ఆదాయాన్ని తెచ్చిపెట్టాయి. ఆభరణాల తయారీలో సహాయకుల సంఖ్య పెరిగింది. ఆన్‌లైన్ ద్వారా, షాప్స్ ద్వారా వీటి అమ్మకాలు జరుపుతుంటాను. చిన్న అభిరుచి ఆదాయ వనరుగా మారింది. ఎంతోమందికి చేరువయ్యేలా చేసింది. పర్యావరణ హిత ప్రయోగాలు చేయడం వల్ల ప్రకృతికి దగ్గరయ్యాను అనే అనుభూతిని పొందుతున్నాను' అని వివరిస్తుంది రచన ఆర్య.

● 3డి ఆర్టిస్ట్

రోడ్డుపై కనికట్టు

పశ్చిమ బెంగాల్‌లోని భద్రేశ్వర్ అనే ఊళ్లో
రోడ్ల మీద హఠాత్తుగా డాల్ఫిన్ దుముకుతుంటుంది.
గోడ నిలబడుతుంది.
గుంత ఉందనే భ్రాంతి కలుగుతుంది.
పూనమ్ అనే గృహిణి ఇలా 3డి ఆర్ట్‌తో కనికట్టు చేస్తోంది.
ఆమె వీడియోలు యూట్యూబ్‌లో హల్‌చల్ చేస్తున్నాయి.

కోల్‌కతా నుంచి భద్రేశ్వర్ గంటన్నర దూరం. ఒకప్పుడు అది వేరే ఊరుగాని ఇప్పుడు దాదాపుగా సిటీలో కలిసిపోయింది. ఆ ఊరు ఒకప్పుడు జూట్ మిల్లుకు ప్రసిద్ధి. ఇప్పుడు పూనమ్ వేస్తున్న త్రీడీ బొమ్మలకే ప్రసిద్ధి చెందుతోంది. భద్రేశ్వర్‌లోని ఇరుకు వీధుల్లో పూనమ్ హఠాత్తుగా ప్రత్యక్షమై బొగ్గు, చాక్‌పీస్‌లతో ఒక కాలువను సృష్టించినా, బావిని తవ్వినా త్రీ డైమన్షనల్ ఇల్యూజన్ వల్ల నిజంగా అనిపిస్తాయి. థ్రిల్ పుట్టిస్తాయి. వీటిని పూనమ్ రీల్స్‌గా, షార్ట్ వీడియోస్‌గా విడుదల చేయడం వల్ల వైరల్‌గా మారుతున్నాయి. బోలెడంత మంది అభిమానులను సంపాదించుకుంటున్నాయి.



పూనమ్ – 3డి ఆర్ట్

పూనమ్ ఉత్సాహంగా తన విశేషాలు చెప్పింది. కేవలం చూడటం ద్వారానే ఈ కళను నేర్చుకున్నానని చెప్పింది.

ఎంఏ బిఇడి చదివి

పూనమ్ భద్రేశ్వర్‌లోనే పుట్టి పెరిగింది. ఎం.ఎ, బీఈడి చేసింది. అదే ఊళ్లో కమర్షియల్ ఆర్టిస్ట్‌గా, త్రీడీ ఆర్టిస్ట్‌గా ఉన్న చందన్‌ను వివాహం చేసుకుంది. చందన్ కూడా తన బొమ్మలతో సోషల్ మీడియాలో ఫేమస్. కాని పెళ్లయ్యాక 2002 నుంచి పూనమ్ కూడా వీడియోలు రిలీజ్ చేయడం మొదలుపెట్టి గుర్తింపు పొందింది. 'చిన్నప్పటి నుంచి నాకు బొమ్మలంటే ఆసక్తి. మా స్కూలు మాస్టారు ఒకాయన నాలో బొమ్మల గురించి ఆసక్తి పెంచారు. నా భర్త చందన్ కూడా ఆర్టిస్ట్ కావడంతో పెళ్లయ్యాక నేను బొమ్మలు ప్రాక్టీసు చేయడం మొదలు పెట్టాను. అయితే నా భర్త త్రీడీ బొమ్మలు వేయడంలో ఎక్స్‌పర్ట్. నేను అతన్ని నేర్పించమని అడగలేదు. కేవలం చూస్తూ నాకు నేనుగా నేర్చుకున్నాను. త్రీడి బొమ్మ గీయాలంటే కొలతల్లోనే ఉంది అంతా. అలాగే షేడ్ ఎక్కడ ఇవ్వాలో తెలియాలి. అది నేను నేర్చుకున్నాను. ముఖ్యంగా నేనూ నా భర్తా, పిల్లలూ సులభంగా బొమ్మలు గీసేలా టెక్నిక్స్ కనిపెట్టాం. అవి వీడియోల ద్వారా చెబుతున్నాం... అలాగే నేరుగా కూడా క్లాసులు చెప్పి నేర్పిస్తున్నాం. మా కృషి ఆదరణ పొందడం ఆనందంగా ఉంది' అని తెలిపింది పూనమ్.

ప్రత్యేక ఆహార్యం

పూనమ్ తన అన్ని వీడియోల్లో చీరకట్టుతో, తల మీద కొంగు కప్పుకుని కనిపిస్తుంది. పూర్తిగా గృహిణి ఆహార్యంలో ఉండటం వల్ల, అలాంటి ఆహార్యంలో త్రీడీ బొమ్మలు వేసే స్త్రీలు ఎవరూ లేరు కనుక ఆమె వీడియోలు కుతూహలం రేపుతున్నాయి. 'మా వాడలోని పిల్లలంతా నా వీడియోలకు సహకరిస్తుంటారు. బావి గీసి దానిలో దూకమంటే దూకుతున్నట్టుగా యాక్ట్ చేస్తారు. లేని మెట్ల మీద నుంచి గెంతుతారు. వారు లేకపోతే నా వీడియోలు లేవు' అంది పూనమ్. ఆమె ప్రతి ఆల్ఫాబెట్‌తో బొమ్మలు ఎలా గీయాలో వీడియోలు చేసింది. అలాగే అంకెలతో కూడా. ప్రతి గీతను బొమ్మగా మార్చే ఆమె ప్రతిభ నెటిజన్స్‌ను ఆకట్టుకుంటోంది. ఉదాహరణకు ఒక ఇంటి ముందు మెట్లు లేకపోయినా మెట్లు గీయడంతో ఆ ఇంటి గడప లుక్కే మారి ఆశ్చర్యం కలుగుతుంది.

పూనమ్ వీడియోలు ఆమెకు ఆదాయం తెచ్చి పెడుతున్నాయి. ప్రతిభ ఉంటే ఉన్న చోట నుంచే ఉనికి పొందవచ్చంటోంది పూనమ్.

'సాక్షి' పలకరింపు

3 లక్షల సబ్‌స్క్రయిబర్లతో 'పూనమ్ ఆర్ట్ అకాడెమీ' యూ ట్యూబ్ చానల్ పూనమ్ వేస్తున్న త్రీడీ బొమ్మల వీడియోలతో ట్రెడింగ్‌లో ఉంటోంది. ఇప్పటికి ఆమె వీడియోలకు దాదాపు 14 కోట్ల వ్యూస్ వచ్చాయంటే ఎంత మంది ఎక్కడెక్కడ చూస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఫేస్‌బుక్ పేజీలో ఫోన్ నంబర్ ఆధారంగా 'సాక్షి' పలకరించితే పూనమ్ ఉత్సాహంగా తన విశేషాలు చెప్పింది.

'రానున్నది రాక మానదు. కానున్నది కాక మానదు' అని నిర్లిప్తంగా ఉండడం లేదు యువతరం. 'ఏం రానున్నది? ఏం కానున్నది?' అనే దానిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. క్వాంటమ్ సాంకేతిక విషయంలో మన దేశం అగ్రదేశాలతో పోటీ పడుతోంది. మరోవైపు మన దేశంలోని యువతరం గేమ్‌ఛేంజర్‌గా చెప్పుకునే క్వాంటమ్ టెక్నాలజీపై ప్రత్యేక దృష్టి పెడుతుంది. ఆ కటింగ్–ఎడ్జ్ టెక్నాలజీలోని ప్రతి కదలికను ఆసక్తిగా గమనిస్తోంది...



యూత్ పల్స్

క్వాంటమ్ కలల యువతరం

ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో సంస్థలు, ప్రభుత్వాలు క్వాంటమ్ టెక్నాలజీ అభివృద్ధి, పరిశోధనపై వందల కోట్లు వెచ్చిస్తున్నాయి. ఇప్పటికైతే క్వాంటమ్ టెక్నాలజీలో అమెరికా నెంబవర్‌వన్‌గా ఉంది. 'నేనేమైనా తక్కువ తిన్నానా!' అంటూ సొంతంగా క్వాంటమ్ కంప్యూటర్‌ను రూపొందించి క్వాంటమ్ టెక్నాలజీపై పట్టు సాధించే దిశగా దూసుకుపోతోంది చైనా. మరోవైపు గూగుల్, మైక్రోసాఫ్ట్, ఇన్‌టెల్.. లాంటి సాంకేతిక దిగ్గజాలు 'క్వాంటమ్ సుప్రిమసీ' కప్పును గెలుచుకోవడానికి బరిలో ఉన్నాయి. క్వాంటమ్ సాంకేతిక జ్ఞానంపై పట్టు ఉన్న దేశం ప్రగతిపథంలో దూసుకుపోతుందనేది భవిష్యత్ చెప్పే తిరుగులేని నిజం. అందుకే మన దేశం కూడా క్వాంటమ్‌పై దృష్టి పెట్టింది. ఆరువేల కోట్లతో నేషనల్ క్వాంటమ్ మిషన్‌ను ప్రారంభించింది.

ఇంతకీ క్వాంటమ్ టెక్నాలజీ ప్రత్యేకత ఏమిటి?

'ఐబీఎం' (అమెరికన్ మల్టీనేషనల్ టెక్నాలజీ కార్పొరేషన్) మాటల్లో చెప్పాలంటే... 'శాస్త్రవేత్తలు, ఇంజనీర్‌లు క్లిష్టమైన సమస్యల పరిష్కారానికి సూపర్ కంప్యూటర్‌లను ఆశ్రయిస్తారు. కొన్ని సమస్యలకు సూపర్ కంప్యూటర్‌లు అంత సూపర్ కావు. సంప్రదాయ కంప్యూటర్‌ల సహాయంతోనే క్లిష్టంగా ఉన్న సమస్యలను పరిష్కరించడానికి క్వాంటమ్ మెకానిక్స్ నియమాలను ఉపయోగించుకొని వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతికతే... క్వాంటమ్ టెక్నాలజీ'

మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్ మూలసూత్రాల ఆధారంగా పనిచేసే క్వాంటమ్ టెక్నాలజీతో సమాచార భద్రతకు ఢోకా ఉండదు. సంప్రదాయ కంప్యూటర్‌లతో పోల్చితే ఫుల్–స్కేల్ క్వాంటమ్ కంప్యూటర్‌లతో అంతరిక్షం నుంచి ఫైనాన్స్ వరకు ఎన్నో రంగాలలో విప్లవాత్మకమై మార్పులు రానున్నాయి. 'ఇది అసాధ్యం' అనుకున్నవి 'సాధ్యం' కానున్నాయి. కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. డ్రగ్ అండ్ మెటీరియల్ డెవలప్‌మెంట్‌లో క్వాంటమ్ టెక్నాలజీ కీలకం కానున్నది.

సంక్లిష్టమైన సమస్యలను పరిష్కరించి, విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చే ఈ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ ద్వారా యంగ్ టెకీలకు సరికొత్త అవకాశాలు చేరువకానున్నాయి. అయితే ప్రపంచవ్యాప్తంగా కొన్ని యూనివర్శిటీలలో మాత్రమే క్వాంటమ్ సైన్స్‌ను బోధిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా క్వాంటమ్ టెక్నాలజీలో పట్టా అందుకున్న వారు తక్కువగా ఉన్నారట. ఈ కటింగ్–ఎడ్జ్ టెక్నాలజీపై ప్రాథమిక అవగాహన ఏర్పాటు చేసుకోవడానికి, దాని లోతుపాతులు తెలుసుకోవడానికి 'ది బెస్ట్ బుక్స్ ఆన్ క్వాంటమ్ కంప్యూటింగ్' వేట మొదలు పెట్టింది యువతరం.

'క్వాంటమ్ కంప్యూటింగ్ ఫర్ ఎవ్రీ వన్' 'క్వాంటమ్ కంప్యూటింగ్: యాన్ అప్లైడ్ అప్రోచ్'; 'క్వాంటమ్ కంప్యూటైజేషన్ అండ్ క్వాంటమ్ ఇన్ఫర్‌మేషన్' 'క్వాంటమ్ కంప్యూటింగ్: ఏ జెంటిల్ ఇంట్రడక్షన్'... ఇలా ఎన్నో పుస్తకాలు యువతరం హస్తభూషణం అయ్యాయి.

'స్ట్రాంగ్ సాఫ్ట్‌వేర్ ట్రెనింగ్ తీసుకున్న స్టూడెంట్స్‌కు క్వాంటమ్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ లాంగ్వేజ్ పట్టుబడడం కష్టమేమీ కాదు' అంటున్నారు 'ఐబీఎం' రిసెర్చ్ ఇండియా క్వాంటమ్ అంబాసిడర్ ఎల్వీ సుబ్రమణియన్.

ఐఐటీ–మద్రాస్ గత సంవత్సరం ప్రవర్తక్ టెక్నాలజీ ఫౌండేషన్‌తో కలిసి 'అడ్వాన్స్‌డ్ క్వాంటమ్ కంప్యూటింగ్' పై రెండు వారాల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కోర్స్ లక్ష్యం క్వాంటమ్ కంప్యూటింగ్ మూలసూత్రాలను విద్యార్థులకు పరిచయం చేయడం. గూగుల్, ఐబీఎం, మైక్రోసాఫ్ట్‌లాంటివి క్వాంటమ్ అప్లికేషన్‌లను రూపొందించాయి.

క్వాంటమ్‌కు సంబంధించి కనిపించీ, కనిపించని దారి ఇప్పుడు రాచమార్గమై యువతరాన్ని ఆహ్వానిస్తోంది. ఇక స్పీడ్‌గా ప్రయాణించడమే తరువాయి.

సాధనతో అన్నీ సాధ్యమే

క్వాంటమ్ టెక్నాలజీలో యువతరానికి స్ఫూర్తి ఇస్తున్న మహిళలు అదితిసేన్, కవితా దొర్రై, కస్తూరి సహ, టీనా సెబాస్టియన్... మొదలైనవారు. ఒక చర్చావేదికలో పాల్గొన్న వీరు క్వాంటమ్ టెక్నాలజీలో మహిళల ప్రాతినిధ్యం గురించి మాట్లాడారు. సంప్రదాయ ఆలోచనలకు భిన్నంగా ఆలోచించాలని చెప్పారు. తమ ప్రయాణంలో తాము ఎదుర్కొన్న అవరోధాలను గురించి చెప్పారు. అదితిసేన్ 2000 సంవత్సరంలో తొలిసారిగా స్నేహితులతో మాట్లాడుతున్నప్పుడు 'క్వాంటమ్' గురించి విన్నది. ఆసక్తితో ఈ టెక్నాలజీ గురించి పరిచయ పుస్తకాలు చదివింది. ఆ తరువాత యూనివర్శిటీ ఆఫ్ గడాన్స్క్(పోలాండ్)లో ప్రాజెక్ట్ స్టూడెంట్‌గా చేరి పీహెచ్‌డీ చేసింది. క్వాంటమ్ టెక్నాలజీలోని రిసెర్చ్ ఏరియాలు ఆమెకు ఉత్సాహాన్ని ఇచ్చాయి.

కెరీర్‌కు సంబంధించి పరిమితులు విధించుకోకూడదు. మరోవైపు చూస్తే ఎన్నో అద్భుత అవకాశాలు ఉన్నాయి. ఆసక్తి, సాధన మిళితమైతే అసాధ్యమైనది లేదు.


- టీనా సెబాస్టియన్, కో–ఫౌండర్, 'క్యాకూన్' (క్వాంటమ్ కంప్యూటింగ్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీ)





హారిక ఖాతాలో మరో 'డ్రా'

మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్ చెస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక మరో గేమ్‌ను 'డ్రా' చేసుకుంది. సైప్రస్‌లో 12 మంది అగ్రశ్రేణి క్రీడాకారిణుల మధ్య ఈ టోర్నీ జరుగుతోంది. రష్యాకు చెందిన అంతర్జాతీయ మాస్టర్ పొలీనా షువలోవాతో మంగళవారం జరిగిన ఏడో రౌండ్ గేమ్‌ను హారిక 25 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. రెండు గేముల్లో గెలిచి, ఐదు గేమ్‌లను 'డ్రా' చేసుకున్న హారిక ఏడో రౌండ్ తర్వాత 4.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉంది.



అంకిత రైనా శుభారంభం

ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ క్వాలిఫయింగ్ టెన్నిస్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో భారత నంబర్ వన్ అంకిత రైనా రెండో రౌండ్‌లోకి ప్రవేశించింది. పారిస్‌లో మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో అంకిత 7-5, 5-7, 6-2తో ఎమిలైన్ డార్టరన్ (ఫ్రాన్స్)పై విజయం సాధించింది. 2 గంటల 48 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అంకిత తన సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఏడుసార్లు బ్రేక్ చేసింది. నెట్ వద్దకు 51 సార్లు దూసుకొచ్చి 29 సార్లు పాయింట్లు సాధించింది.

చెన్నై 'విజిల్ పోడు'

ఐపీఎల్‌లో నేడు (ఎలిమినేటర్)
ముంబై x లక్నో (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

- ఫైనల్లోకి సూపర్ కింగ్స్
- క్వాలిఫయర్–1లో గుజరాత్‌పై విజయం
- 15 పరుగులతో ఓడిన టైటాన్స్

చెన్నై వేదిక, ధోని కెప్టెన్సీ అంటే ఎంత చిన్న లక్ష్యమైనా ప్రత్యర్థి ముందు భారీ లక్ష్యమే! నెమ్మదైన చెపాక్ మైదానంలో ఇది మరోసారి కనిపించింది. రెండు రోజుల క్రితం బెంగళూరులో చెలరేగిన జట్టును ధోని తన వ్యూహాలతో కట్టిపడేశాడు. కీలక సమరంలో తన జట్టును గెలిపించి పదోసారి ఫైనల్లోకి చేర్చి అభిమానులతో ఈల (విజిల్‌పోడు) కొట్టించాడు. 173 పరుగులను అందుకోలేక లీగ్ టాపర్, డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ బోల్తా పడింది. అద్భుత ఫామ్‌లో ఉన్న టీమ్ సమష్టి వైఫల్యంతో తమ రెండు సీజన్ల చరిత్రలో తొలిసారి ఆలౌట్ అయింది. నాలుగుసార్లు విజేతగా నిలిచిన చెన్నై సూపర్‌కింగ్స్ (సీఎస్‌కే) ఐదో టైటిల్ వేటకు సిద్ధం కాగా... గుజరాత్‌కు రెండో క్వాలిఫయర్ రూపంలో మరో అవకాశం మిగిలి ఉంది. ముంబై, లక్నో జట్ల మధ్య నేడు జరిగే ఎలిమినేటర్ మ్యాచ్ విజేతతో శుక్రవారం జరిగే రెండో క్వాలిఫయర్‌లో టైటాన్స్ తలపడుతుంది.


రుతురాజ్ గైక్వాడ్

చెన్నై: ఐపీఎల్‌లో సొంత ప్రేక్షకుల మధ్య చివరి మ్యాచ్‌గా భావిస్తున్న పోరును ధోని చక్కటి విజయంతో ముగించాడు. మంగళవారం జరిగిన క్వాలిఫయర్-1 మ్యాచ్‌లో సమష్టి ప్రదర్శనతో సూపర్ కింగ్స్ విజయాన్ని అందుకుంది. ఈ మ్యాచ్‌లో సీఎస్‌కే 15 పరుగుల తేడాతో గుజరాత్ టైటాన్స్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 172 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రుతురాజ్ గైక్వాడ్ (44 బంతుల్లో 60; 7 ఫోర్లు, 1 సిక్స్) డెవాన్ కాన్వే (34 బంతుల్లో 40; 4 ఫోర్లు) రాణించారు. అనంతరం గుజరాత్ 20 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. శుబ్‌మన్ గిల్ (38 బంతుల్లో 42; 4 ఫోర్లు, 1 సిక్స్) మినహా ఎవరూ ప్రభావం చూపలేకపోయారు.

ఓపెనర్లు మినహా...

ఓపెనర్లు రుతురాజ్, కాన్వే తమ ఫామ్‌ను కొనసాగిస్తూ మరోసారి చెన్నైకి శుభారంభం అందించారు. ఈ క్రమంలో 2 పరుగుల వద్ద రుతురాజ్‌కు కాస్త అదృష్టం కూడా కలిసొచ్చింది. తాజా సీజన్‌లో తొలిసారి బరిలోకి దిగిన యువ పేసర్ దర్శన్ నల్కండే తన మూడో బంతికే రుతురాజ్‌ను అవుట్ చేసి సంబరం చేసుకున్నాడు. అయితే అది 'నోబాల్' కావడంతో బతికిపోయిన రుతురాజ్ వరుస బంతుల్లో 6, 4 బాది జోరును ప్రదర్శించగా, కాన్వే కాస్త జాగ్రత్తగా ఆడాడు. పవర్‌ప్లే ముగిసే సరికి చెన్నై 6 ఫోర్లు, సిక్స్‌తో 49 పరుగులు చేయగలిగింది. 36 బంతుల్లో రుతురాజ్ అర్ధ సెంచరీ పూర్తయింది. ఎట్టకేలకు 87 పరుగుల (64 బంతుల్లో) తొలి వికెట్ భాగస్వామ్యం తర్వాత 11వ ఓవర్లో మొదటి వికెట్ తీయడంలో గుజరాత్ సఫలమైంది. రుతురాజ్‌ను షమీ అవుట్ చేయగా, తర్వాతి ఓవర్లోనే దూబే (2)ను నూర్ వెనక్కి పంపాడు. మూడు బంతుల వ్యవధిలో రహానే (17), కాన్వే పెవిలియన్ చేరగా, అంబటి రాయుడు (17) కూడా పెద్దగా ప్రభావం చూపలేదు. చివర్లో జడేజా (16 బంతుల్లో 22; 2 ఫోర్లు) కాస్త ధాటిగా ఆడాడు.

సమష్టి వైఫల్యం...

ఛేదన దిశగా ఏ దశలోనూ గుజరాత్ అడుగులు సరిగా పడలేదు. గిల్ కొద్దిగా ప్రతిఘటించినా, మిగతావారంతా పూర్తిగా విఫలమయ్యారు. సాహా (12) ఆరంభంలోనే వెనుదిరగ్గా, కెప్టెన్ హార్దిక్ (8) తన వైఫల్యాలను కొనసాగించాడు. చెన్నై కట్టుదిట్టమైన బౌలింగ్‌తో పరుగులు రావడం గగనంగా మారింది. 10 ఓవర్లు ముగిసేసరికి స్కోరు 72 పరుగులు కాగా... విజయం కోసం చివరి పది ఓవర్లలో 101 పరుగులు చేయాల్సిన స్థితిలో టైటాన్స్ నిలిచింది. దాంతో గిల్, మిల్లర్ (4)లపైనే జట్టు ఆశలు పెట్టుకుంది. అయితే వీరిద్దరు ఒకే స్కోరు వద్ద అవుట్ కావడంతో మ్యాచ్ చెన్నై చేతుల్లోకి వెళ్లిపోయింది.

'సున్నా'కు 500 మొక్కలు చొప్పన...

ఈ మ్యాచ్‌లో బౌలర్ పరుగు ఇవ్వకుండా 'డాట్ బాల్' వేసిన సమయంలో టీవీ స్కోరు బోర్డులో సున్నాకు బదులుగా ఒక పచ్చని మొక్క చూపిస్తూ వచ్చారు. దీనికి ప్రత్యేక కారణం ఉంది. బీసీసీఐ, ఐపీఎల్ ప్రధాన స్పాన్సర్ టాటా కలిసి 'ప్లే ఆఫ్స్' మ్యాచ్‌ల కోసం ఈ నిర్ణయం తీసుకున్నాయి. ప్రతీ డాట్ బాల్‌కు బీసీసీఐ 500 చొప్పున మొక్కలు నాటాలని ఒట్టు వేసుకున్నాయి! ఇది నాలుగు ప్లే ఆఫ్స్ మ్యాచ్‌లకూ వర్తిస్తుంది. తొలి క్వాలిఫయర్ చెన్నై ఇన్నింగ్స్‌లో 34 డాట్ బాల్స్, గుజరాత్ ఇన్నింగ్స్‌లో 50 డాట్ బాల్స్ ఉన్నాయి. అంటే ఈ మ్యాచ్‌కు సంబంధించి మొత్తం 42,000 మొక్కలు నాటబోతున్నారు.



స్కోరు వివరాలు

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: రుతురాజ్ (సి) మిల్లర్ (బి) మోహిత్ శర్మ 60; కాన్వే (సి) రషీద్ (బి) షమీ 40; దూబే (బి) నూర్ 1; రహానే (సి) గిల్ (బి) నల్కండే 17; రాయుడు (సి) షనక (బి) రషీద్ 17; జడేజా (బి) షమీ 22; ధోని (సి) పాండ్యా (బి) మోహిత్ శర్మ 1; మొయిన్ అలీ (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 172. వికెట్ల పతనం:** 1-87, 2-90, 3-121, 4-125, 5-148, 6-155, 7-172. **బౌలింగ్:** షమీ 4-0-28-2, దర్శన్ నల్కండే 4-0-44-1, రషీద్ ఖాన్ 4-0-37-1, నూర్ అహ్మద్ 4-0-29-1, మోహిత్ శర్మ 4-0-31-2.

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (సి) పతిరణ (బి) చహర్ 12; గిల్ (సి) కాన్వే (బి) చహర్ 42; పాండ్యా (సి) జడేజా (బి) తీక్షణ 8; షనక (సి) తీక్షణ (బి) జడేజా 17; మిల్లర్ (బి) జడేజా 4; విజయ్‌శంకర్ (సి) రుతురాజ్ (బి) పతిరణ 14; తెవాటియా (బి) తీక్షణ 3; రషీద్ (సి) కాన్వే (బి) తుషార్ 30; నల్కండే (రనౌట్) 0; నూర్ (నాటౌట్) 7; షమీ (సి) చహర్ (బి) పతిరణ 5; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (20 ఓవర్లలో ఆలౌట్) 157. వికెట్ల పతనం:** 1-22, 2-41, 3-72, 4-88, 5-88, 6-98, 7-136, 8-136, 9-142, 10-157. **బౌలింగ్:** దీపక్ చహర్ 4-0-29-2, తుషార్ దేశ్‌పాండే 4-0-43-1, తీక్షణ 4-0-28-2, జడేజా 4-0-18-2, పతిరణ 4-0-37-2.

10 ఐపీఎల్ టోర్నీ చరిత్రలో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు పదోసారి ఫైనల్ చేరింది. నాలుగుసార్లు విజేతగా, ఐదుసార్లు రన్నరప్‌గా నిలిచింది.

1 గత ఏడాది కొత్త జట్టుగా ఐపీఎల్‌లోకి వచ్చి విజేతగా నిలిచిన గుజరాత్ టైటాన్స్ ఈ టోర్నీ మొత్తంలో తొలిసారి ఓ మ్యాచ్‌లో ఆలౌట్ కావడం గమనార్హం.

4 ఇప్పటి వరకు చెన్నై, గుజరాత్ జట్ల మధ్య నాలుగు ఐపీఎల్ మ్యాచ్‌లు జరగ్గా... నాలుగు మ్యాచ్‌ల్లోనూ రుతురాజ్ గైక్వాడ్ ఒక్కడే అర్ధ సెంచరీ సాధించడం విశేషం.

1 ఐపీఎల్ టోర్నీలో గతంలో గుజరాత్‌తో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయిన చెన్నై తొలిసారి గెలిచింది. మూడు మ్యాచ్‌ల్లోనూ ఛేజింగ్‌లో నెగ్గిన గుజరాత్ నాలుగోసారి చేతులెత్తేసింది.

తొలిసారి రజత, కాంస్య పతకాలు

ప్రపంచకప్ షూటింగ్ టోర్నీలో మెరిసిన గనీమత్, దర్శన రాథోడ్


దర్శన రాథోడ్ , గనీమత్ సెఖో

అల్మాటీ (కజకిస్తాన్): ప్రపంచకప్ షాట్‌గన్ షూటింగ్ టోర్నీ మహిళల స్కీట్ ఈవెంట్‌లో భారత్‌కు తొలిసారి రజత, కాంస్య పతకాలు లభించాయి. ఆరుగురు షూటర్ల మధ్య మంగళవారం జరిగిన స్కీట్ ఈవెంట్ ఫైనల్లో గనీమత్ 'షూట్ ఆఫ్'లో గురితప్పి రజత పతకం సాధించగా... దర్శన కాంస్య పతకాన్ని సంపాదించింది. 60 షాట్‌ల ఫైనల్లో అసెమ్ ఒరిన్‌బే (కజకిస్తాన్), గనీమత్ 50 పాయింట్లతో సమఉజ్జీగా నిలిచారు. స్వర్ణ, రజత పతకాల కోసం రెండు షాట్‌ల 'షూట్ ఆఫ్'ను నిర్వహించారు. ఒరిన్‌బే రెండు పాయింట్లు స్కోరు చేసి స్వర్ణ పతకాన్ని ఖరారు చేసుకోగా... గనీమత్ ఒక పాయింట్ సాధించి రజతం దక్కించుకుంది. దర్శన 39 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచింది. అంతకుముందు క్వాలిఫయింగ్‌లో దర్శన 120 పాయింట్లు సాధించి రెండో ర్యాంక్‌లో, గనీమత్ 117 పాయింట్లు స్కోరు చేసి నాలుగో ర్యాంక్‌లో నిలిచి ఫైనల్‌కు అర్హత పొందారు. పురుషుల స్కీట్ ఈవెంట్‌లో భారత్ నుంచి ముగ్గురు షూటర్లు మేరాజ్ అహ్మద్ ఖాన్, గుర్జోత్ ఖాంగురా, అనంత్‌జీత్ సింగ్ వరుసగా 17వ, 19వ, 23వ స్థానాల్లో నిలిచి ఫైనల్ చేరలేకపోయారు.

వేర్వేరు గ్రూపుల్లో శ్రీలంక, వెస్టిండీస్



దుబాయ్: వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీ షెడ్యూల్‌ను ఐసీసీ ప్రకటించింది. ర్యాంకింగ్స్‌లో పడిపోయిన మాజీ చాంపియన్లు శ్రీలంక, వెస్టిండీస్ జట్లు ఈసారి క్వాలిఫయర్స్ ద్వారా ప్రధాన టోర్నీకి ముందడుగు వేయాల్సి ఉంటుంది. వచ్చేనెల 18 నుంచి జూలై 9 వరకు జింబాబ్వేలో క్వాలిఫయింగ్ టోర్నీ జరుగుతుంది. ప్రధాన టోర్నీకి కేవలం రెండు బెర్త్‌లే ఖాళీ ఉన్నాయి. మొత్తం 10 జట్లు అర్హత టోర్నీలో పాల్గొంటాయి. గ్రూప్ 'ఎ'లో వెస్టిండీస్, జింబాబ్వే, నెదర్లాండ్స్, నేపాల్, అమెరికా... గ్రూప్ 'బి'లో శ్రీలంక, ఐర్లాండ్, స్కాట్లాండ్, ఒమన్, యూఏఈ లీగ్ మ్యాచ్‌లు ఆడతాయి. ఫైనల్స్‌కు చేరే రెండు జట్లు అక్టోబర్-నవంబర్‌లలో భారత ఆతిథ్యమిచ్చే ప్రపంచకప్ టోర్నీకి అర్హత సాధిస్తాయి.

మెయిన్ 'డ్రా'కు అష్మిత, మాళవిక

కౌలాలంపూర్: మలేసియా మాస్టర్స్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో భారత యువతారలు అష్మిత చాలిహా, మాళవిక బన్సోద్ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించారు. మంగళవారం జరిగిన క్వాలిఫయింగ్ మ్యాచ్‌ల్లో అష్మిత 10-21, 21-19, 21-17తో వెన్ యు జాంగ్ (కెనడా)పై... మాళవిక 21-12, 21-19తో లిన్ సియాంగ్ టి (చైనీస్ తైపీ)పై గెలుపొందారు

మనిక ముందంజ



దర్బన్: ప్రపంచ టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్ విభాగంలో భారత నంబర్‌వన్ మనిక బత్రా మూడో రౌండ్‌లోకి ప్రవేశించింది. మంగళవారం జరిగిన రెండో రౌండ్‌లో ప్రపంచ 39వ ర్యాంకర్ మనిక 11-9, 14-12, 11-4, 11-8తో ప్రపంచ 171వ ర్యాంకర్ వోంగ్ జిన్ రూ (సింగపూర్)పై గెలిచింది. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో భారత పోరాటం ముగిసింది. ప్రపంచ 56వ ర్యాంకర్ సత్యన్ జ్ఞానశేఖరన్ 6-11, 6-11, 5-11, 7-11తో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ డాంగ్ కియు (జర్మనీ) చేతిలో ఓడిపోయాడు.

అర్జున్‌కు మూడో విజయం

షార్జా: షార్జా మాస్టర్స్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ మూడో విజయం సాధించాడు. సెర్గీ అజరోవ్ (రష్యా)తో మంగళవారం జరిగిన ఏడో రౌండ్ గేమ్‌లో తెల్లపావులతో ఆడిన అర్జున్ 54 ఎత్తుల్లో గెలుపొందాడు. ఏడో రౌండ్ తర్వాత అర్జున్ 4.5 పాయింట్లతో 14వ ర్యాంక్‌లో ఉన్నాడు. భారత్‌కే చెందిన మరో యువ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ నాలుగో 'డ్రా' నమోదు చేశాడు. ఏడో రౌండ్ తర్వాత గుకేశ్ ఐదు పాయింట్లతో మరో ఐదుగురితో కలిసి ఉమ్మడిగా అగ్రస్థానంలో ఉన్నాడు.

సినిమా

ఆహ్లాదంగా ఆటా పాటా...


చిరంజీవి, తమన్నా

స్విట్జర్లాండ్‌లో అందమైన లొకేషన్స్‌లో ఆడిపాడారు చిరంజీవి, తమన్నా. ఈ పాట ఆడియన్స్‌కి ఏ లెవల్లో కిక్ ఇవ్వనుందనేది ఆగస్టు 11న థియేటర్స్‌లో తెలుస్తుంది. చిరంజీవి హీరోగా మెహర్ రమేశ్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'భోళా శంకర్'. ఈ చిత్రంలో చిరంజీవి సరసన తమన్నా హీరోయిన్‌గా, చెల్లెలిగా కీర్తీ సురేష్ నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ స్విట్జర్లాండ్‌లో జరుగుతోంది. ''స్విట్జర్లాండ్‌లో కళ్లు చెదిరే అందాలతో, మైమరిపించే లొకేషన్స్‌లో 'భోళాశంకర్' కోసం తమన్నాతో ఆటా పాటా ఎంతో ఆహ్లాదకరంగా జరిగింది'' అని పేర్కొన్నారు చిరంజీవి. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: మహతి స్వరసాగర్.

శివమెత్తుతాడు!


సాయిరామ్ శంకర్


సాయిరామ్ శంకర్ హీరోగా కొత్త సినిమా ప్రారంభమైంది. ఈ చిత్రం ద్వారా ప్రకాశ్ జూరెడ్డి దర్శకునిగా పరిచయం చేస్తూ వీఎస్‌ఆర్ క్రియేషన్స్‌పై రమణి జూరెడ్డి నిర్మిస్తున్నారు. పోలవరం బంగారమ్మ అమ్మవారి గుడిలో ఈ చిత్రం పూజా కార్యక్రమాలు మంగళవారం జరిగాయి. 'గంగ తలపై ఉన్నంతవరకే శివుడు చల్లగా ఉంటాడు. కంట్లోంచి గానీ జారిందా శివమెత్తుతాడు' అంటూ సాయిరామ్ శంకర్ చెప్పిన డైలాగ్‌తో ముహూర్తపు సన్నివేశాన్ని చిత్రీకరించారు. ''1990లో జరిగిన వాస్తవ ఘటన ఆధారంగా విలేజ్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోన్న చిత్రమిది. ఇళయరాజాగారు ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండటం హైలైట్. అలాగే డైరెక్టర్ వంశీగారు లిరిక్స్ అందించడం మరో విశేషం'' అన్నారు ప్రకాశ్ జూరెడ్డి, రమణి జూరెడ్డి. ఈ చిత్రానికి కెమెరా: మోహన్ చారి.

ఆ రోజు కోసం ఎదురుచూస్తున్నాను!


శ్రుతీహాసన్

''ఓ సినిమాకు సంబంధించి హీరో, హీరోయిన్ సమానమైన పారితోషికాన్ని అందుకునే రోజు కోసం ఎదురు చూస్తున్నాను'' అన్నారు హీరోయిన్ శ్రుతీహాసన్. ఫ్రాన్స్‌లో ప్రస్తుతం 76వ కాన్స్ చలన చిత్రోత్సవాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ వేడుకల్లో పాల్గొంటున్నారు శ్రుతీహాసన్. ఈ సందర్భంగా 'హీరోతో సమానమైన పారితోషికాన్ని అందుకోవడానికి నాకు రెండు దశాబ్దాలు పట్టింది'' అన్న ప్రియాంకా చోప్రా మాటలపై మీ స్పందన ఏంటి? అన్న ప్రశ్న శ్రుతీకి ఎదురైంది. ఈ విషయంపై శ్రుతీహాసన్ స్పందిస్తూ- ''ప్రియాంకా చోప్రా అద్భుతం సాధించారు (హాలీవుడ్‌లో హీరోకి సమానంగా పారితోషికం అందుకున్న విషయాన్ని ఉద్దేశించి). మేమంతా ఇంకా కష్టపడుతున్నాం. మన దగ్గర సమాన వేతనం అనే అంశం గురించి కనీసం చర్చ కూడా లేదు. కానీ హీరోలతో పాటుగా హీరోయిన్లకి కూడా సమాన వేతనం లభించే రోజు రావాలని ఎదురు చూస్తున్నా'' అని చెప్పుకొచ్చారు. ఇంకా మాట్లాడుతూ- ''గతంలో నేను కాన్స్ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో పాల్గొన్నాను. ఈసారి నేను నటించిన ఇంటర్‌నేషనల్ ఫిల్మ్ 'ది ఐ' కోసం కాన్స్ చిత్రోత్సవాల్లో పాల్గొంటున్నాను. విభిన్నమైన సంస్కృతులు, సంప్రదాయాలు ప్రతిబింబిస్తున్న కాన్స్ వేడుకల్లో దేశం తరపున నేను ఓ ప్రతినిధిగా ఉండటం చాలా సంతోషంగా ఉంది'' అని పేర్కొన్నారు శ్రుతీహాసన్.

నటుడు రే స్టీవెన్సన్ ఇక లేరు


రే స్టీవెన్సన్


'ఆర్‌ఆర్‌ఆర్' సెట్‌లో రాజమౌళితో...

'రౌద్రం..రణం..రుధిరం' (ఆర్‌ఆర్‌ఆర్) సినిమాలో స్కాట్ దొరగా విలన్ పాత్రలో నటించి, తెలుగు ప్రేక్షకులను మెప్పించిన ఐరిష్ నటుడు రే స్టీవెన్సన్ (58) ఇక లేరు. ఓ ఇటాలియన్ ఫిల్మ్ షూటింగ్‌లో పాల్గొంటున్న స్టీవెన్సన్ హఠాత్తుగా అస్వస్థతకు గురి కావడం, వెంటనే ఆయన్ను హాస్పిటల్‌కు తరలించడం, అప్పటికే స్టీవెన్సన్ మృతి చెందినట్లుగా అక్కడి వైద్యులు చెప్పడం జరిగిందని హాలీవుడ్ కథనం. ఇక ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన చిత్రం 'ఆర్‌ఆర్‌ఆర్'తో భారతీయ ప్రేక్షకులకు సుపరిచితులయ్యారు స్టీవెన్సన్. ఆయన మృతి పట్ల 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్ర యూనిట్ సభ్యులు సోషల్ మీడియా వేదికగా సంతాపం వ్యక్తం చేశారు.

''రే స్టీవెన్సన్ మరణం నాకు షాకింగ్‌గా ఉంది. ఈ వార్తను మేం నమ్మలేకపోతున్నాం. ఆయన సెట్స్‌లో ఉంటే ఆ ప్రదేశం ఎంతో ఎనర్జీతో నిండిపోయేది. రే స్టీవెన్సన్ ఆత్మకు శాంతి చేకూరాలి. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను'' అని ట్వీట్ చేశారు రాజమౌళి.

'రే స్టీవెన్సన్ మరణం నన్ను షాక్‌కు గురి చేసింది' అని ట్వీట్ చేశారు ఎన్టీఆర్.

'రే స్టీవెన్సన్ మరణం నాకు బాధ కలిగించింది'' అని ట్వీట్ చేశారు రామ్‌చరణ్.


సూర్య, శివశక్తి దత్త

ఈ ప్రయోగం ట్రెండ్‌సెట్టర్ కావాలి

- శివశక్తి దత్త

''వారణాసి సూర్య జీరో బడ్జెట్‌లో తీసిన 'గండ' చిత్రం గురించి విని ఆశ్చర్యపోయాను.. ఆనందించాను. డబ్బు లేకున్నా సినిమా చేయాలన్న ఉత్సాహం, తపన ఉంటే చాలని ఈ సినిమాతో నిరూపిస్తున్నారు. ఈజీ సినిమా సంస్థ ప్రయోగం ఎంతో మంది ఔత్సాహికులకు ఆదర్శంగా నిలవాలి.. ఈ సినిమా ట్రెండ్ సెట్టర్ కావాలి'' అని ప్రముఖ రచయిత శివశక్తి దత్త అన్నారు. నూతన నటీనటులతో వారణాసి సూర్య స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'గండ'. ఈ సినిమా టీజర్‌ని శివశక్తి దత్త విడుదల చేశారు. వారణాసి సూర్య మాట్లాడుతూ- ''జీరో బడ్జెట్ మూవీస్ చేయొచ్చని పన్నెండేళ్ల క్రితమే రామ్‌గోపాల్ వర్మగారు చెప్పారు. తెలుగులో మొదటి జీరో బడ్జెట్ మూవీ 'గండ'. ఈ సినిమాపై మా టీమ్ అంతా ఐదేళ్లు వర్క్ చేశాం. మా టీమ్ అంతా కొత్తవారే. కంటెంట్ నమ్ముకుని ఈ సినిమా తీశాం. ఇకపైన కూడా మా ఈజీ సినిమా సంస్థ నుండి జీరో బడ్జెట్ చిత్రాలు వస్తాయి'' అన్నారు.

ఒక్క నిమిషం


అభిషేక్

అభిషేక్ పచ్చిపాల, నాజియా ఖాన్, వినీషా, ఇషిత ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జస్ట్ ఏ మినిట్'. పూర్ణస్ యశ్వంత్ దర్శకత్వంలో రెడ్ స్వాన్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ధర్మపురి ప్రకాష్ నిర్మించారు. ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. ''చక్కని ప్రేమకథతో సాగే వినోదాత్మక చిత్రం ఇది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

జీవితం విలువ తెలుస్తుంది

- నిర్మాత 'బన్నీ' వాసు



''2018' సినిమా తెలుగు కాపీ చూశాను.. నచ్చింది. సెకండాఫ్‌లో మనకు తెలియకుండానే మనం కన్నీళ్లు పెట్టుకునే సన్నివేశాలు ఉన్నాయి. ముఖ్యంగా చివరి 45 నిమిషాల్లో మనిషి జీవితం తాలూకు విలువ ఏంటో తెలుస్తుంది. 2018లో కేరళలో వరదల సమయంలో అక్కడి ప్రజలు వారి జీవితాలను ఏ విధంగా త్యాగం చేశారు? అనేది దర్శకుడు చూపించిన విధానం ఆకట్టుకుంటుంది. ఇలాంటి రియలిస్టిక్ ఘటనలను కూడా కమర్షియల్ అంశాలతో దర్శకుడు చక్కగా చెప్పారు. ఈ సినిమా ఆడియన్స్‌ను థియేటర్స్‌లో టెన్షన్ పెడుతుంది.. క్లాప్స్ కొట్టిస్తుంది'' అన్నారు 'బన్నీ' వాసు. టొవినో థామస్ ప్రధాన పాత్రధారిగా, అపర్ణా బాలమురళి, కుంచక్కో బోబన్ కీలక పాత్రల్లో నటించిన మలయాళ చిత్రం '2018'. జూడ్ ఆంథోనీ జోసెఫ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం మే 5న విడుదలై ఇప్పటికే రూ. 130 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించి, ఇంకా ప్రదర్శితమవుతోంది. ఈ సినిమా తెలుగులో ఈ నెల 26న విడుదల కానుంది. తెలుగు రాష్ట్రాల్లోని నైజాంలో గీతా డిస్ట్రిబ్యూషన్, వైజాగ్‌లో 'దిల్' రాజు, మిగతా ఏరియాల్లో 'బన్నీ' వాసు రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా 'బన్నీ' వాసు విలేకరులతో మాట్లాడుతూ- ''2018' అందర్నీ మెప్పించే విధంగా ఉంటుంది. ఇక అల్లు అర్జున్‌గారి 'పుష్ప: ది రూల్'ని డిసెంబరులో రిలీజ్ చేయాలనుకుంటున్నారు. షారుక్ ఖాన్ 'జవాన్'లో అల్లు అర్జున్‌గారు నటించారన్నది అవాస్తవం. బాలీవుడ్ మూవీ 'అశ్వత్థామ ఇమ్మోర్టల్' ప్రపోజల్ అల్లు అర్జున్‌గారికి వచ్చింది కానీ ఇంకా ఆయన నిర్ణయం తీసుకోలేదు'' అన్నారు.

ఫేమస్ కావాలనుకునే యువకుల కథ

- సుమంత్ ప్రభాస్



''తప్పు, ఒప్పు.. ఇలా ఏం చేసినా ఊర్లో ఫోకస్, ఫేమస్ కావాలనే ఆలోచన ఉన్న యువకుల కథే 'మేమ్ ఫేమస్'. ఫ్యామిలీతో కలిసి ఎంజాయ్ చేసే యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఇది'' అని సుమంత్ ప్రభాస్ అన్నారు. ఆయన హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'మేమ్ ఫేమస్'. అనురాగ్ రెడ్డి, శరత్, చంద్రు మనోహరన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా సుమంత్ ప్రభాస్ మాట్లాడుతూ- ''నా పేరు సుమంత్ రెడ్డి. ప్రభాస్‌గారికి ఫ్యాన్‌ని. అందుకే సుమంత్ ప్రభాస్ అని పెట్టుకున్నాను. డిగ్రీ పాసయ్యాక ఎస్ఐ ఉద్యోగానికి ప్రిపేర్ కావాలనుకున్నాను. డిగ్రీ చదువుతున్నప్పుడు కాలేజీలో అందరికీ తెలియాలనే ఉద్దేశంతో ఒక షార్ట్ ఫిల్మ్ తీశాం.. అది నచ్చడంతో ఒక ఫిల్మ్ స్కూల్ వాళ్లు మాకు కంటెంట్ క్రియేట్ చేయమని కెమెరాలు స్పాన్సర్ చేయడంతో 'పిల్ల పిల్లగాడు' అనే వెబ్ సిరీస్ చేశాం. అది నచ్చడంతో అనురాగ్, శరత్ అన్న పిలిచి, వెబ్ సిరీస్ చేద్దామన్నారు. నేను సినిమా చేద్దామన్నాను. కథ రెడీ చేయమన్నారు. ఆ తర్వాత 'మేమ్ ఫేమస్' కథని వారికి చెప్పాను.. నచ్చడంతో నన్నే డైరెక్షన్ చేయమన్నారు. లీడ్ రోల్‌కి తగ్గ యువకుడు కుదరకపోవడంతో నేనే నటించాను. నా తర్వాతి సినిమా కూడా చాయ్ బిస్కెట్ బ్యానర్‌లోనే ఉంటుంది'' అన్నారు.

కెరీర్‌పై బ్లాక్ మార్క్ పెట్టాలని చూశారు

- పవిత్రా లోకేష్



''వినోదం, భావోద్వేగాలు, అద్భుతమైన సంగీతంతో రూపొందిన చిత్రం 'మళ్ళీ పెళ్లి'. ఈ చిత్రకథ సమాజానికి అద్దం పడుతుంది'' అని నటి పవిత్రా లోకేష్ అన్నారు. వీకే నరేశ్, పవిత్రా లోకేష్ జంటగా ఎమ్మెస్ రాజు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మళ్ళీ పెళ్లి'. వీకే నరేశ్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదలకానుంది. ఈ సందర్భంగా పవిత్రా లోకేష్ మాట్లాడుతూ- ''ఎమ్మెస్ రాజుగారు 'మళ్ళీ పెళ్లి'లో నరేశ్‌గారు, నేను నటిస్తేనే బాగుంటుందనడంతో చేశాం. మళ్ళీ పెళ్లి అంటే సమాజం ఇప్పటికీ తక్కువగానే చూస్తుంది. ఇదొక్కటే కాదు.. సమాజంలో చాలా నిబంధనలు ఉంటాయి. మా విషయంలో (నరేశ్-పవిత్ర) కొన్ని సంఘటనలు జరిగాయి. కొందరు నా వ్యక్తిత్వ హననం చేసి, నా కెరీర్‌పై బ్లాక్ మార్క్ పెట్టాలని చూశారు. ఆ సమయంలో నేను ఒంటరిగా ఉంటే ఆత్మహత్య చేసుకోవాలి? లేదా ఇంట్లో కూర్చోవాలి. అప్పుడు నేను బయటికి వచ్చానంటే కారణం నరేశ్‌గారు.. ఆయన నాకు చాలా సపోర్ట్‌గా ఉన్నారు. విజయ నిర్మల, కృష్ణగార్లతో పాటు మహేశ్‌బాబుగారిని కూడా కలిశాను. ఆ ఫ్యామిలీ మమ్మల్ని (నరేశ్-పవిత్ర) యాక్సెప్ట్ చేసింది'' అన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	18	61,982
నిఫ్టీ ▲	34	18,348

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	12,631	▽ 90
డోజోన్స్	33,245	▽ 42
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,763	▽ 8
డాక్స్	16,153	▽ 71
షాంఘై	3,246	▽ 50
నికాయ్	30,958	▽ 129

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో	ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	60,342	▽ 487
బంగారం (99.5 స్వచ్ఛత)	60,100	▽ 485
వెండి (కిలో)	70,718	▽ 1,803

అశోక్ లేలాండ్ లాభం జూమ్

షేరుకి రూ. 2.6 డివిడెండ్



న్యూఢిల్లీ: ఆటో రంగ దిగ్గజం అశోక్ లేలాండ్ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 5 రెట్లు దూసుకెళ్లి రూ. 803 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది(2021–22) ఇదే కాలంలో కేవలం రూ. 158 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 9,927 కోట్ల నుంచి రూ. 13,203 కోట్లకు ఎగసింది. మొత్తం వ్యయాలు రూ. 9,430 కోట్ల నుంచి రూ. 12,086 కోట్లకు పెరిగాయి. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 2.6 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. ప్రస్తుత ఏడాది (2023–24) రూ. 600–750 కోట్ల పెట్టుబడులను వెచ్చించనున్నట్లు కంపెనీ ఎండీ, సీఈవో షేను అగర్వాల్ పేర్కొన్నారు. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి కంపెనీ టర్న్‌అరౌండ్ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 1,362 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2021–22లో రూ. 285 కోట్ల నికర నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం రూ. 26,237 కోట్ల నుంచి రూ. 41,673 కోట్లకు జంప్ చేసింది. ఫలితాల నేపథ్యంలో అశోక్ లేలాండ్ షేరు ఎన్ఎస్ఈలో 0.5 శాతం నీరసించి రూ. 152 వద్ద ముగిసింది.

2,000 నోటు.. సవాలక్ష ప్రశ్నలు!

- ఒక్కో బ్యాంకులో ఒక్కో రకంగా...
- మార్పిడి, డిపాజిట్ నిబంధనల విషయంలో గందరగోళం
- రూ. 2 వేల నోట్ల మార్పిడి ప్రక్రియ ప్రారంభం



న్యూఢిల్లీ: డీమానిటైజేషన్ నాటితో పోలిస్తే చిన్న లైన్లు, కొన్ని బ్యాంకుల్లో నిబంధనలపరమైన గందరగోళం మధ్య రూ. 2,000 నోట్ల మార్పిడి, డిపాజిట్ల ప్రక్రియ మంగళవారం నాడు ప్రారంభమైంది. పాన్ లేదా ఆధార్ వంటి అధికారిక ధ్రువీకరణ పత్రాలు, ఇతరత్రా ఫారంలు తప్పనిసరని ఆర్‌బీఐ సూచించకపోయినా కొన్ని బ్యాంకుల్లో సిబ్బంది అవి కావాల్సిందే అనడంతో ఖాతాదారులు అయోమయ పరిస్థితి ఎదుర్కొన్నారు. కొన్ని బ్యాంకులు ఎలక్ట్రానిక్ ఎంట్రీలు చేసుకుని నోట్లను మార్చగా, మరికొన్ని మాత్రం ఎటువంటి ధ్రువీకరణ పత్రాలేమీ అడగకుండా రిజిస్టరులో పేరు, మొబైల్ నంబరు రాయాలంటూ కస్టమర్లకు సూచించాయి. అయితే, కొన్ని బ్యాంకులు మాత్రం పాన్ లేదా ఆధార్ కార్డులను చూపించాలని అడిగినట్లు కొందరు కస్టమర్లు తెలిపారు. అలాగే, మరికొన్ని బ్యాంకులు నోట్లను మార్చలేదని, దానికి బదులుగా తమ తమ ఖాతాల్లో డిపాజిట్ చేసుకోవాల్సిందిగా సూచించాయని వివరించారు. అయితే, 2016లో పెద్ద నోట్లను రద్దు చేసినప్పుడు (డీమానిటైజేషన్) కనిపించినంతగా చాంతాడంత లైన్లు ఈసారి కనిపించలేదు. పెద్ద ఎత్తున ప్రజలు రావొచ్చనే అంచనాలతో కూర్చునేందుకు, తాగు నీటికి ఢిల్లీలోని రిజర్వ్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేసినప్పటికీ ఎక్కువ మంది రాలేదు. నోట్లను మార్చుకునేందుకు దాదాపు 130 రోజుల పైగా వ్యవధి ఉండటం ఇందుకు కారణమని పరిశీలకులు తెలిపారు. నోట్ల మార్పిడి, డిపాజిట్లకు నాలుగు నెలల సమయం ఉండటంతో డీమానిటైజేషన్‌తో పోలిస్తే అంత హడావుడి ఏమీ లేదని ఓ ప్రభుత్వ రంగ బ్యాంక్ సీనియర్ అధికారి తెలిపారు. నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా డిపాజిట్లు స్వీకరిస్తున్నట్లు వివరించారు. రూ. 2,000 నోట్ల మార్పిడి, డిపాజిట్ కోసం ఎటువంటి ఫారం లేదా పత్రం అవసరం లేదంటూ ఎస్‌బీఐ తమ శాఖలకు అధికారికంగా మెమో పంపించింది. బ్యాంక్ ఆఫ్ బరోడా ఎటువంటి ఫారం నిర్దేశించకపోయినా, తమ ఖాతాదారులు కాకపోతే మాత్రం ఐడీ ప్రూఫ్ మాత్రం అడుగుతోంది. ఇక కోటక్, హెచ్ఎస్‌బీసీ వంటి ప్రైవేట్ బ్యాంకులు తమ ఖాతాదారులు కాని వారి దగ్గర్నుంచి ఫారం/ఐడీ ప్రూఫ్ అడుగుతున్నట్లు తెలిపాయి. కానీ యాక్సిస్ బ్యాంక్, స్టాండర్డ్ చార్టర్డ్, యస్ బ్యాంక్, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటివి మాత్రం తాము ఎటువంటి ఫారం లేదా ఐడీ ప్రూఫ్‌ను తప్పనిసరి చేయడం లేదని పేర్కొన్నాయి. రూ. 2,000 నోట్లను ఉపసంహరిస్తున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఇవి చెల్లుబాటవడం కొనసాగుతుంది. సెప్టెంబర్ 30 వరకు వీటిని మార్చుకోవచ్చు లేదా ఖాతాల్లో డిపాజిట్ చేసుకోవచ్చు.

సమర్థించుకున్న ఆర్‌బీఐ..

రూ. 2,000 నోట్ల ఉపసంహరణను ఢిల్లీ హైకోర్టులో ఆర్‌బీఐ సమర్థించుకుంది. ఇది డీమానిటైజేషన్ కాదని చట్టబద్ధమైన ప్రక్రియ మాత్రమేనని తెలిపింది., నిర్వహణ సౌలభ్యం కోసమే నోట్ల మార్పిడిని అనుమతించాలని నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. ఎటువంటి ఆధారాలు చూపకుండా నోట్లను మార్చుకోవచ్చన్న ఆర్‌బీఐ, ఎస్‌బీఐ నోటిఫికేషన్లను సవాలు చేస్తూ అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ అనే లాయరు వేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై ఆర్‌బీఐ ఈ మేరకు వాదనలు వినిపించింది. ధ్రువీకరణ పత్రాల ప్రసక్తి లేకపోతే మాఫియా, నక్సల్స్ మొదలైన వారి వల్ల ఇది దుర్వినియోగమయ్యే అవకాశం ఉందని పిటిషనరు వాదించారు. ఇరు పక్షాల వాదనలు విన్న మీదట హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది.

ఆన్‌లైన్‌లో అందుబాటులోకి ఐటీఆర్ 1, 4 ఫారమ్‌లు



న్యూఢిల్లీ: ఆన్‌లైన్‌లో ఈ ఫైలింగ్ పోర్టల్‌పై ఆదాయపన్ను రిటర్నుల పత్రాలు (ఐటీఆర్) 1, 4లను పన్ను శాఖ అందుబాటులోకి తీసుకొచ్చింది. వ్యక్తులు, చిన్న వ్యాపారులు, వృత్తి నిపుణులు వీటిని దాఖలు చేస్తుంటారు. ఇతర ఐటీఆర్ పత్రాలను సైతం త్వరలోనే అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రకటించింది. 2022–23 సంవత్సరానికి ఐటీఆర్‌ల దాఖలు గడువు జూలై 31గా ఉంది. ఐటీఆర్ 1ను వ్యక్తులు, వేతన జీవులు, వృద్ధులు దాఖలు చేస్తుంటారు. ఐటీఆర్4ను వ్యాపారులు, వృత్తి నిపుణులు దాఖలు చేస్తుంటారు.

ఎన్ఎండీసీ తుది డివిడెండ్ రూ.2.85



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మైనింగ్ రంగ దిగ్గజం ఎన్ఎండీసీ 2022–23 ఆర్థిక సంవత్సరానికిగాను ఒక్కో షేరుకు తుది డివిడెండ్ రూ.2.85 ప్రకటించింది. తొలి మధ్యంతర డివిడెండ్‌తో కలుపుకుని ఇది రూ.6.60లకు చేరింది. మార్చి త్రైమాసికంలో నికరలాభం 22 శాతం ఎగసి రూ.2,277 కోట్లకు చేరింది. టర్నోవర్ 13.76 శాతం క్షీణించి రూ.5,851 కోట్లు సాధించింది. 2022–23లో సంస్థ రూ.17,667 కోట్ల టర్నోవర్‌పై రూ.5,529 కోట్ల నికరలాభం ఆర్జించింది.

మూడో రోజూ ముందుకే

- సెన్సెక్స్ 18 పాయింట్లు ప్లస్
- నిఫ్టీ 34 పాయింట్లు అప్

ముంబై: వరుసగా మూడో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు బలపడ్డాయి. తొలి నుంచీ లాభాల బాటలో సాగి స్వల్ప లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ 18 పాయింట్లు పుంజుకుని 61,982 వద్ద నిలిచింది. ఒక దశలో 282 పాయింట్లు జంప్‌చేసి 62,245ను తాకింది. ఇంట్రాడేలో 18,420కు చేరిన నిఫ్టీ చివరికి 34 పాయింట్లు లాభపడింది. 18,348 వద్ద స్థిరపడింది. రోజంతా ఉత్సాహంగా కదిలిన మార్కెట్లు చివరి గంటలో వెనకడుగు వేశాయి.

మెటల్ మెరుపులు..: ఎన్ఎస్ఈలో వరుసగా రెండో రోజు మెటల్ ఇండెక్స్ 2.6% ఎగసింది. మీడియా, ఆయిల్, ఆటో, ఫార్మా 1.2–0.6% మధ్య వృద్ధి చూపగా.. ఐటీ 0.5% నీరసించింది. నిఫ్టీ దిగ్గజాలలో అదానీ ఎంటర్‌ప్రైజెస్ మరోసారి 14% దూసుకెళ్లగా.. దివీస్ 4% ఎగసింది. బజాజ్



ఫిన్, ఐషర్, యూపీఎల్, ఎస్‌బీఐ లైఫ్, బీపీసీఎల్, ఐటీసీ, ఏషియన్ పెయింట్స్, ఇండస్‌ఇండ్, టాటా మోటార్స్ 2–1% మధ్య బలపడ్డాయి.

అదానీ గ్రూప్ విలువ అప్...

షేర్ల ధరల కృత్రిమ పెంపు ఆధారాల్లేవంటూ సుప్రీం కోర్టు నియమిత నిపుణుల కమిటీ పేర్కొనడంతో అదానీ గ్రూప్‌లోని లిస్టెడ్ కంపెనీలన్నీ వరుసగా మూడో రోజు బలపడ్డాయి. అదానీ విల్మర్ 10 శాతం దూసుకెళ్లగా.. అదానీ పవర్, ట్రాన్స్‌మిషన్, గ్రీన్ ఎనర్జీ, అదానీ టోటల్ గ్యాస్, ఎన్‌డీటీవీ 5 శాతం చొప్పున జంప్ చేశాయి. అంబుజా సిమెంట్స్, అదానీ పోర్ట్స్, ఏసీసీ 1–0.2 శాతం మధ్య లాభపడ్డాయి. దీంతో మూడు రోజుల్లో అదానీ గ్రూప్ మార్కెట్ విలువ రూ. 1,77,927 కోట్లమేర ఎగసింది. దీంతో 10 కంపెనీలతో కూడిన మొత్తం గ్రూప్ విలువ రూ. 10,79,498 కోట్లకు చేరింది.

రియల్టీ కింగ్.. డీఎల్‌ఎఫ్ సింగ్

- రూ. 59,030 కోట్ల సంపద
- గ్రోహె–హురున్ ఇండియా లిస్టులో అగ్రస్థానం
- టాప్ 100లో తెలుగు రాష్ట్రాల వారు 10 మంది

న్యూఢిల్లీ: దేశీ రియల్ ఎస్టేట్ రంగంలో రియల్టీ దిగ్గజం డీఎల్‌ఎఫ్ చైర్మన్ రాజీవ్ సింగ్ అత్యంత సంపన్నుడిగా అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. రూ. 59,030 కోట్ల సంపదతో మరోసారి నంబర్‌వన్ స్థానాన్ని దక్కించుకున్నారు. 2023కి గాను దేశీ రియల్టీ కుబేరులతో కిచెన్, బాత్రూమ్ ఫిట్టింగ్స్ సంస్థ గ్రోహె, రీసెర్చ్ సంస్థ హురున్ ఇండియా సంయుక్తంగా ఈ లిస్టును రూపొందించింది. 16 నగరాలకు చెందిన 67 కంపెనీలకు సంబంధించి 100 మంది సంపన్నులకు ర్యాంకింగ్ ఇచ్చింది. ఇందులో తెలుగు రాష్ట్రాల నుంచి 10 మంది చోటు దక్కించుకున్నారు. జీఏఆర్ కార్పొరేషన్ వ్యవస్థాపక చైర్మన్ జీ అమరేందర్ రెడ్డి కుటుంబం (రూ. 15,000 కోట్లు) పదో స్థానంలో నిల్చింది. మంగళవారం విడుదల చేసిన సంపన్నుల జాబితా ప్రకారం.. రూ. 42,270 కోట్ల సంపదతో మంగళ్ ప్రభాత్ లోధా కుటుంబం (మాక్రోటెక్ డెవలపర్స్ – లోధా గ్రూప్) రెండో స్థానంలో, రూ. 37,000 కోట్ల సంపదతో ఆర్ఎంజెడ్ కార్ప్ అర్జున్ మెండా కుటుంబం మూడో స్థానంలో ఉన్నాయి. ఈసారి లిస్టులో 25 మందికి కొత్తగా చోటు దక్కగా, 36 మంది సంపద తగ్గింది.

ఇతర వివరాలు..

- రాష్ట్రాల వారీగా చూస్తే మహారాష్ట్రలో అత్యధికంగా 37 మంది రియల్టీ కుబేరులు ఉన్నారు. ఢిల్లీ (23), కర్ణాటక (18) తర్వాత స్థానాల్లో ఉన్నాయి. తెలంగాణలో 9 మంది, ఆంధ్రప్రదేశ్‌లో ఒక్కరు ఉన్నారు.
- నగరాలవారీగా చూస్తే ముంబై (29 మంది), న్యూఢిల్లీ (23), బెంగళూరు (18) వరుసగా తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి.
- టాప్ 10లో చోటు దక్కించుకునేందుకు కనీస సంపద 2017లో రూ. 3,350 కోట్లుగా ఉండగా ప్రస్తుతం రూ. 15,000 కోట్లకు ఎగిసింది. అలాగే టాప్ 50లో చోటు దక్కించుకునేందుకు కనీస సంపద రూ. 660 కోట్ల నుంచి రూ. 1,330 కోట్లకు చేరింది.
- టాప్ 100 మంది ఔత్సాహిక వ్యాపారవేత్తల మొత్తం సంపద గతేడాదితో పోలిస్తే 4% పెరిగి రూ. 4,72,330 కోట్లుగా (57 బిలియన్ డాలర్లు) ఉంది. ఇందులో టాప్ 10 కుబేరుల వాటా 60%గా ఉంది.
- డీఎల్‌ఎఫ్‌కు చెందిన పియా సింగ్, రేణుకా తల్వార్ అత్యంత సంపన్న మహిళలుగా ఉన్నారు.



HURUN INDIA

తెలుగు రియల్టీ కుబేరులు..

పేరు	కంపెనీ	సంపద (రూ. కోట్లలో)	ర్యాంకు
గవ్వా అమరేందర్ రెడ్డి కుటుంబం	జీఏఆర్	15,000	10
జూపల్లి రామేశ్వర రావు కుటుంబం	మైహోమ్ కన్‌స్ట్రక్షన్స్	9,490	13
సి. వెంకటేశ్వర రెడ్డి	అపర్ణ కన్‌స్ట్రక్షన్స్	5,940	16
ఎస్ సుబ్రమణ్యం రెడ్డి	అపర్ణ కన్‌స్ట్రక్షన్స్	5,880	17
మనోజ్ నంబూరు	అలయన్స్ ఇన్‌ఫ్రా	3,900	29
అయోధ్య రామిరెడ్డి	రామ్‌కీ ఎస్టేట్స్	1,420	46
సునీల్ బొమ్మిరెడ్డి	అలయన్స్ ఇన్‌ఫ్రా	1,300	49
సురేంద్ర బొమ్మిరెడ్డి	అలయన్స్ ఇన్‌ఫ్రా	1,300	49
సురేశ్ బొమ్మిరెడ్డి	అలయన్స్ ఇన్‌ఫ్రా	1,300	49
జీవీకే రెడ్డి, కుటుంబం	తాజ్ జీవీకే హోటల్స్	700	78

భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

తపాలా శాఖలో 12,828 గ్రామీణ డాక్ సేవక్ ఉద్యోగాలు

దేశవ్యాప్తంగా వివిధ పోస్టల్ సర్కిళ్లలోని బ్రాంచి పోస్ట్ ఆఫీసుల్లో గ్రామీణ డాక్ సేవక్(జీడీఎస్) ఉద్యోగాల భర్తీకి స్పెషల్ సైకిల్ మే–2023 ప్రకటన వెలువడింది. పదో తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా ఈ నియామకాలు చేపడతారు.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 12,828(తెలంగాణ–96, ఆంధ్రప్రదేశ్–118)
» **పోస్టుల వివరాలు:** గ్రామీణ డాక్ సేవక్స్–బ్రాంచ్ పోస్టు మాస్టర్/అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టు మాస్టర్.
» **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఇందులో మ్యాథ్స్, ఇంగ్లిష్, స్థానిక భాష తప్పనిసరిగా చదివుండాలి. అదేవిధంగా కంప్యూటర్ పరిజ్ఞానంతోపాటు సైకిల్ తొక్కటం వచ్చి ఉండాలి.
» **వయసు:** 11.06.2023 నాటికి 18 నుంచి 40 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు గరిష్ట వయసులో సడలింపు లభిస్తుంది.
» **వేతనం:** నెలకు బీపీఎం పోస్టులకు రూ.12,000 నుంచి రూ.29,380, ఏబీపీఎం పోస్టులకు రూ.10,000 నుంచి రూ.24,470 ఉంటుంది.
» **ఎంపిక విధానం:** పదో తరగతిలో సాధించిన మార్కుల మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.06.2023.
» **దరఖాస్తు సవరణలకు అవకాశం:** 12.06.2023 నుంచి 14.06.2023 వరకు.
» **వెబ్‌సైట్:** www.indiapostgdsonline.gov.in

భారత్ డైనమిక్స్ లిమిటెడ్‌లో 100 పోస్టులు

ప్రభుత్వ రంగ సంస్థ భారత్ డైనమిక్స్ లిమిటెడ్.. ఫిక్స్‌డ్ టర్మ్(కాంట్రాక్ట్)ప్రాతిపదికన హైదరాబాద్, బెంగళూరు, భానూర్, విశాఖపట్నం, కొచ్చి, ముంబైలో ఉన్న బీడీఎల్ కార్యాలయాలు/యూనిట్లలో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 100
» **విభాగాలు:** హెచ్‌ఆర్, బిజినెస్ మేనేజ్‌మెంట్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్ , కంప్యూటర్ సైన్స్, సివిల్, కెమికల్, ఎలక్ట్రికల్, ఫైనాన్స్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, బీఎస్సీ, ఇంటిగ్రేటెడ్ ఎంఈ/ఎంటెక్, ఎంబీఏ, ఎంఎస్‌డబ్ల్యూ,పీజీ డిప్లొమా, సీఏ/ఐసీడబ్ల్యూఏ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 10.05.2023 నాటికి 28 ఏళ్లు మించకూడదు. » **వేతనం:** నెలకు రూ.30,000 నుంచి రూ.39,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** విద్యార్హతలో సాధించిన మార్కులు, పని అనుభవం, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది:** 24.05.2023.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరితేది:** 23.06.2023.
» **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల జాబితా వెల్లడి తేది:** 05.07.2023.
» **ఇంటర్వ్యూ తేదీలు:** జూలై రెండో వారం.
» **వెబ్‌సైట్:** www.bdl-india.in

ఎన్‌టీపీసీలో 300 పోస్టులు

నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌టీపీసీ).. అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులను కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 300
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ మేనేజర్ (ఆపరేషన్స్/మెయింటెనెన్స్)
» **విభాగాలు:** ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఇనుస్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్
» **అర్హత:** బీఈ, బీటెక్ (ఎలక్ట్రికల్/మెకానికల్/ఎలక్ట్రానిక్స్)లలో 60 శాతం మార్కుల ఉత్తీర్ణతతో పాటు కనీసం ఏడేళ్ల పని అనుభవం ఉండాలి. **వయసు:** 35 ఏళ్లలోపు ఉండాలి. **వేతనం:** రూ.60,000 – 1,80,000
» **ఎంపిక ప్రక్రియ:** రాత పరీక్ష,ఇంటర్వ్యూ ఆధారంగా
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తులకు చివరి తేది:** 02.06.2023
» **వెబ్‌సైట్:** www.ntpc.co.in

సశస్త్ర సీమాబల్‌లో 543 కానిస్టేబుల్ పోస్టులు

న్యూఢిల్లీలోని కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు చెందిన సశస్త్ర సీమాబల్(ఎస్ఎస్‌బీ) ..కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 543
» **కేటగిరీలు:** వాషర్‌మ్యాన్, బార్బర్, సఫాయివాలా, టైలర్, గార్డెనర్, కోబ్లర్, కుక్, డ్రైవర్, వెటర్నరీ, కార్పెంటర్, బ్లాక్‌స్మిత్, వాటర్ క్యారియర్, పెయింటర్.
» **అర్హత:** పదో తరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమాలో ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి. » **వయసు:** డ్రైవర్ పోస్టులకు 21 నుంచి 27 ఏళ్లు, వాషర్‌మన్, బార్బర్, సఫాయివాలా, టైలర్, గార్డెనర్, కోబ్లర్, కుక్, వాటర్ క్యారియర్ పోస్టులకు 18 నుంచి 27 ఏళ్లు, ఇతర పోస్టులకు 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **పే స్కేల్:** నెలకు రూ.21,700 నుంచి రూ.69,100 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, ట్రేడ్/స్కిల్ టెస్ట్, మెడికల్ టెస్ట్, డాక్యుమెంటేషన్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో ప్రకటన. ప్రచురితమైన తేదీ నుంచి 30 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలి.
» **వెబ్‌సైట్:** www.ssbrectt.gov.in

టీచింగ్ కెరీర్‌కు తొలి మెట్టు.. సీటెట్

కేంద్ర ప్రభుత్వ పాఠశాలల్లో.. టీచర్ కొలువులకు పోటీపడాలంటే.. సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్)లో అర్హత తప్పనిసరి! సీటెట్.. బీఈడీ, డీఈడీ విద్యార్థులకు సుపరిచితమైన పరీక్షే!! ఇందులో ఉత్తీర్ణత సాధిస్తే..ఆ స్కోర్‌కు జీవిత కాల గుర్తింపు లభిస్తుంది. ఈ ఏడాది జూలై సెషన్‌కు సంబంధించి సీటెట్ నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో.. సీటెట్‌కు అర్హతలు, పరీక్ష విధానం, ప్రిపరేషన్ గైడెన్స్..

» సీటెట్–2023 జూలై నోటిఫికేషన్ విడుదల
» ఈ స్కోర్‌తోనే ఉపాధ్యాయ నియామకాలకు అర్హత
» స్కోర్‌కు జీవిత కాల గుర్తింపు

నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచింగ్ ఎడ్యుకేషన్ నిబంధనల ప్రకారం–ఉపాధ్యాయ వృత్తిలో చేరాలనుకునే అభ్యర్థులకు బీఈడీ, డీఈడీ, బీఈడీ(స్పెషల్ ఎడ్యుకేషన్)తోపాటు.. సీటెట్‌లో అర్హత సాధించడం తప్పనిసరి. దీంతో.. సీబీఎస్ఈ అనుబంధ పాఠశాలలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు, ఆర్మీ పబ్లిక్ స్కూల్స్ వంటి వాటిలో టీచర్ కొలువు సొంతం చేసుకోవాలంటే.. సీటెట్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

రెండు పేపర్లుగా సీటెట్

- బోధించే తరగతులను అనుసరించి సీటెట్ పరీక్షను రెండు పేపర్లుగా నిర్వహిస్తారు.
- ఒకటి నుంచి అయిదో తరగతి వరకు బోధనకు పేపర్–1లో అర్హత సాధించాలి.
- ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు టీచింగ్‌కు పేపర్–2లో ఉత్తీర్ణత పొందాలి.
- రెండు స్థాయిల్లోనూ బోధించాలనుకునే వారు రెండు పేపర్లకు హాజరుకావచ్చు.

అర్హతలు

- **పేపర్–1కు అర్హత:** ఇంటర్మీడియెట్/తత్సమాన కోర్సులో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణతతో పాటు రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ లేదా నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ లేదా రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్(స్పెషల్ ఎడ్యుకేషన్)లో ఉత్తీర్ణత ఉండాలి. లేదా 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు బీఈడీ/బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పాస్ అవ్వాలి.
- ఎన్‌సీటీఈ మార్గదర్శకాల ప్రకారం–బీఈడీ అభ్యర్థులను కూడా ఎస్‌జీటీ పోస్టులకు అర్హులుగా పేర్కొన్నారు. దీంతో..సీటెట్ టెట్–పేపర్–1కు బీఈడీ ఉత్తీర్ణులు కూడా పోటీ పడొచ్చు.

పేపర్–2కు అర్హత

- బీఏ/బీఎస్సీ/బీకామ్‌ల్లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణతతోపాటు బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్(బీఈడీ) లేదా బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్(స్పెషల్ ఎడ్యుకేషన్) లేదా నాలుగేళ్ల బీఏ ఎడ్యుకేషన్/బీఎస్సీ ఎడ్యుకేషన్‌లలో ఉత్తీర్ణత ఉండాలి. లేదా నాలుగేళ్ల బీఏ బీఈడీ/బీఎస్సీ బీఈడీలలో 50 శాతం మార్కులతో పాస్ అవ్వాలి(లేదా) బీఈ/బీటెక్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి బీఈడీ/బీఈడీ(స్పెషల్ ఎడ్యుకేషన్ చదువుతున్న వారు కూడా అర్హులే(లేదా) 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణతతోపాటు మూడేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ–ఎంఈడీ ఉత్తీర్ణత ఉండాలి.

150 మార్కులకు పేపర్ 1

- పేపర్–1 అయిదు విభాగాల్లో మొత్తం 150 మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం రెండున్నర గంటలు.
- చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి 30 ప్రశ్నలు–30 మార్కులకు; లాంగ్వేజ్–1, 30 ప్రశ్నలు–30 మార్కులకు;లాంగ్వేజ్–2, 30ప్రశ్నలు–30 మార్కులకు;మ్యాథమెటిక్స్ 30ప్రశ్నలు–30 మార్కులకు; ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ 30 ప్రశ్నలు–30 మార్కులకు నిర్వహిస్తారు.పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా ఉంటుంది.
- లాంగ్వేజ్–1, లాంగ్వేజ్–2 తప్పనిసరి పేపర్లు. లాంగ్వేజ్–1 విభాగంలో అభ్యర్థులు ఎంచుకున్న బోధన మాధ్యమానికి సంబంధించిన ప్రశ్నలు అడుగుతారు.
- లాంగ్వేజ్–2 విభాగంలో.. 20 లాంగ్వేజ్‌లలో ఏదో ఒక దాన్ని ఎంచుకోవచ్చు. ఈ విభాగంలో ఎంచుకునే లాంగ్వేజ్‌ను లాంగ్వేజ్–1 విభాగంలో ఎంచుకోకూడదు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు లాంగ్వేజ్–2లో తెలుగు, ఉర్దూ భాషల్లో హాజరయ్యే అవకాశముంది.

పేపర్–2 కూడా 150 మార్కులకే

- పేపర్–2ను 150 మార్కులకు నిర్వహిస్తారు. మొత్తం అయిదు విభాగాల్లో ఆబ్జెక్టివ్ విధానంలో ఈ పరీక్ష ఉంటుంది. పరీక్ష సమయం రెండున్నర గంటలు.
- చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి 30 ప్రశ్నలు–30 మార్కులకు; లాంగ్వేజ్1, 30 ప్రశ్నలు–30 మార్కులకు; లాంగ్వేజ్ 2, 30 ప్రశ్నలు–30 మార్కులకు; మ్యాథమెటిక్స్, సైన్స్ 60 ప్రశ్నలు–60 మార్కులకు; సోషల్ స్టడీస్/సోషల్ సైన్స్ 60 ప్రశ్నలు–60 మార్కులకు నిర్వహిస్తారు.
- లాంగ్వేజ్–1 విభాగంలో.. అభ్యర్థులు తాము బోధించాలనుకుంటున్న మాధ్యమంలోనే పరీక్ష రాయాల్సి ఉంటుంది.
- లాంగ్వేజ్–2 విభాగంలో.. లాంగ్వేజ్–1లో హాజరైన భాష కాకుండా.. ఇతర లాంగ్వేజ్‌ను ఎంచకోవాలి. మొత్తం 20 భాషలు అందుబాటులో ఉన్నాయి.



- మ్యాథమెటిక్స్ అండ్ సైన్స్ టీచింగ్ అభ్యర్థులు పేపర్–2లో నాలుగో విభాగాన్ని, సోషల్ టీచర్లు అయిదో విభాగాన్ని ఎంచుకుని పరీక్షకు హాజరు కావాలి.
- ప్రతి పేపర్‌కు రెండున్నర గంటల సమయం అందుబాటులో ఉంటుంది.

కనీస అర్హత మార్కులు

సీటెట్ పేపర్–1, పేపర్–2లలో అభ్యర్థులు తప్పనిసరిగా కనీస అర్హత మార్కులు సాధించాల్సి ఉంటుంది. ఎన్‌సీటీఈ నిబంధనల మేరకు..జనరల్ కేటగిరీ అభ్యర్థులు కనీసం అరవై శాతం మార్కులతో(90 మార్కులు) ఉత్తీర్ణత సాధించాలి. బీసీ కేటగిరీ అభ్యర్థులు 50 శాతం మార్కులతో(75 మార్కులు), ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగుల కేటగిరీలకు చెందిన అభ్యర్థులు 40 శాతం మార్కులతో(60 మార్కులు) ఉత్తీర్ణత పొందాలి.

ప్రిపరేషన్ పక్కాగా

చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి

ఈ విభాగంలో ఎడ్యుకేషనల్ సైకాలజీ నుంచి ప్రాథమిక స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థులు ప్రధానంగా శిశువు సైకాలజీకి సంబంధించిన అంశాలపై ఎక్కువ దృష్టిసారించాలి. వికాస దశలు, వికాస అంశాలైన శారీరక, మానసిక, సాంఘిక,ఉద్వేగ వికాసాలు మొదలైన అంశాలను క్షుణ్నంగా చదవాలి. శిశువు ప్రవర్తనలో మార్పునకు సంబంధించిన అభ్యాసం,అభ్యసన బదలాయింపు అంశాలను చదవాలి. సైకాలజీ అంశాలను చదివేటప్పుడు కీలక భావనలు, సాంకేతిక పదాలు,సిద్ధాంతాలు–సూత్రాలు, ప్రతిపాదించిన శాస్త్రవేత్తలు, వారి గ్రంథాలు తదితర విషయాలను విశ్లేషణాత్మకంగా అధ్యయనం చేయాలి. పెడగాజి అంటే బోధన శాస్త్రం. ఇందులో సహిత విద్య, శిశువు విద్యా ప్రణాళిక, బోధన పద్ధతులు, మూల్యాంకనం–నాయకత్వం–గైడెన్స్–కౌన్సెలింగ్ గురించి అవగాహన పెంచుకోవాలి. ఎడ్యుకేషన్‌కు సంబంధించిన చట్టాల గురించి తెలుసుకోవాలి. పెడగాజీలోని భావనలు, సిద్ధాంతాలు, నిబంధనలను విశ్లేషిస్తూ అధ్యయనం చేస్తేనే.. ఏ కోణంలో ప్రశ్న అడిగినా సమాధానం ఇచ్చే సన్నద్ధత లభిస్తుంది.

లాంగ్వేజ్ పేపర్లకు ఇలా

లాంగ్వేజ్–1, లాంగ్వేజ్–2 పేపర్‌లలో రాణించేందుకు సంబంధిత భాషా విభాగాలపై స్కూల్ స్థాయి పాఠ్య పుస్తకాలను పూర్తిగా చదవాలి. లాంగ్వేజ్–2కు సంబంధించి ఎక్కువ మంది అభ్యర్థులు ఇంగ్లిష్‌ను ఎంచుకుంటున్నారు. ఇంగ్లిష్‌లో పార్ట్స్ ఆఫ్ స్పీచ్, ఆర్టికల్స్, డైరెక్ట్ అండ్ ఇన్ డైరెక్ట్ స్పీచ్, డిగ్రీస్ ఆఫ్ కంపేరిజన్, వొకాబ్యులరీ.. ఇలా అన్ని అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి. పెడగాజీకి సంబంధించి టీచింగ్ మెథడ్స్, అప్రోచెస్, టెక్నిక్స్, లాంగ్వేజ్ స్కిల్స్, ఇంగ్లిష్ నేపథ్యంపై ప్రశ్నలు వస్తాయి.

మ్యాథమెటిక్స్

ఇందులో రాణించేందుకు పేపర్–1లో ఒకటి నుంచి అయిదో తరగతి వరకు పుస్తకాలను చదవాలి. ఈ సబ్జెక్టులో ప్రాథమిక అంశాలపై పూర్తి స్థాయి పట్టు సాధించాలి. పేపర్–2లో ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు ఉండే కాన్సెప్టులపైనే ఎక్కువగా ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నల క్లిష్టత ఇంటర్ స్థాయిలో ఉంటుంది.

ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్

ఈ విభాగంలో రాణించేందుకు బోటనీ బేసిక్స్‌తో పాటు, పర్యావరణ అంశాలు, సైన్స్ ఇన్ డైలీ లైఫ్ వంటి వాటిపై దృష్టి పెట్టాలి.

సైన్స్

ఈ సబ్జెక్ట్‌లో మంచి మార్కులు పొందాలంటే.. మూడు నుంచి ఎనిమిదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలను ఔపోసన పట్టాలి. పేపర్–2 కోసం ప్రత్యేకంగా ఆరు నుంచి పదో తరగతి వరకు పుస్తకాలు చదవాలి. గత టెట్‌లో ఈ విభాగంలో అడిగిన ప్రశ్నలు కొంత క్లిష్టంగానే ఉన్నాయి. కాబట్టి అభ్యర్థులు ఆయా అంశాల బేసిక్స్, అప్లికేషన్స్ వంటి వాటిని ప్రత్యేకంగా అధ్యయనం చేయాలి.

సోషల్ స్టడీస్

ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలను క్షుణ్నంగా చదవాలి. భూగోళ శాస్త్రంలో ఒక ప్రాంతం గురించి చదువుతున్నప్పుడు ఆ ప్రాంతానికి సంబంధించిన వాతావరణం, భౌగోళిక పరిస్థితులు, నదులు వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి. అదేవిధంగా సివిక్స్, ఎకనామిక్స్ అంశాలను సమకాలీన అంశాలతో అప్‌డేట్ చేసుకుంటూ అధ్యయనం చేయాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 26.05.2023
- **సీటెట్ పరీక్ష తేదీ:** జూలై/ఆగస్టు నెలల్లో
- **వివరాలకు వెబ్‌సైట్:** https://ctet.nic.in

క్లుప్తంగా...

కోడిగుడ్డుపై 'అంగన్‌వాడీ' ముద్ర!

దుర్వినియోగం కాకుండా చర్యలు



సాక్షి, కామారెడ్డి : అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే కోడిగుడ్లు దుర్వినియోగం కాకుండా ఉండేందుకు వాటిపై అంగన్‌వాడీ గుడ్డు, తెలంగాణ ప్రభుత్వం పేరుతో రౌండ్ సీల్ వేయాలని టి.సర్కార్ నిర్ణయించింది. రాష్ట్రంలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 4,57,643 మంది గర్భిణులు, బాలింతలు, 10,34,562 మంది ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లలు, 6,67,783 మంది మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు పిల్లలు ఉన్నారు. వీరందరికీ నెలకు ఈ కేంద్రాల ద్వారా 25 రోజుల పాటు పోషకాహారాన్ని అందిస్తారు. అందులో భాగంగా కోడిగుడ్లను కూడా ఇస్తారు. అయితే బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు మాత్రమే చేరాల్సిన కోడిగుడ్లను అమ్ముకుంటున్నారని విమర్శలు అధికంగా వస్తుండటం, అక్కడక్కడా గొడవలు కూడా జరుగుతుండటం వంటి ఘటనలతో రాష్ట్ర ప్రభుత్వం కోడిగుడ్లపై ముద్ర వేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అందించే ప్రతి కోడిగుడ్డుపై ముద్ర వేస్తుండడంతో బయట అమ్ముకునేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆస్కారం ఉండదు. ఒకవేళ గుడ్లను పక్కదారి పట్టిస్తే వాటిపై ఉన్న ముద్ర ఆధారంగా తెలిసిపోతుంది.

ఆ అధికారులకు జరిమానా

భవన నిర్మాణ అనుమతుల్లో జాప్యానికి కారణమైన 13 మంది అధికారులు

సాక్షి, హైదరాబాద్: భవన నిర్మాణాల కోసం టీఎస్–బీపాస్ చట్టం కింద దరఖాస్తు చేసుకున్న వారికి నిర్ణీత గడువులోగా అనుమతులు మంజూరు చేయని అధికారులపై ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. టీఎస్–బీపాస్ చట్టం స్ఫూర్తిని కొనసాగించడంలో భాగంగా పెండింగ్ దరఖాస్తుల తీరును పర్యవేక్షిస్తున్న ప్రభుత్వం అనుమతుల్లో జాప్యం చేసిన అధికారులకు జరిమానాలు విధించింది. ఇందులో భాగంగా టీఎస్–బీపాస్ కింద చేసుకున్న దరఖాస్తులకు సకాలంలో అనుమతులు మంజూరు చేయని 13 మంది అధికారులకు రూ.1,000 నుంచి రూ.3,000 జరిమానా విధించాలని ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. భవిష్యత్తులో భవన నిర్మాణ అనుమతుల్లో జాప్యం లేకుండా దరఖాస్తులను సమీక్షించాలని జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం సూచించింది.

హజ్ యాత్ర-2023 షెడ్యూల్ విడుదల

వచ్చే నెల 7 నుంచి యాత్రికుల ప్రయాణం షురూ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర హజ్-2023 యాత్ర షెడ్యూల్‌ను కేంద్ర హజ్ కమిటీ మంగళవారం విడుదల చేసింది. వచ్చే నెల 7వ తేదీ నుంచి 22 వరకు యాత్రికుల ప్రయాణం షెడ్యూల్ ఉంటుంది. ఈ ఏడాది రాష్ట్ర హజ్ కమిటీ నుంచి దాదాపు 6800 మంది యాత్రికులు వెళ్లనున్నట్లు అధికారులు తెలిపారు. యాత్రికులను 16 రోజుల్లో 45 విమానాల్లో సౌదీ అరేబియాలోని మదీనా నగరానికి చేరవేయనున్నారు. రాష్ట్ర, నగర యాత్రికులు తమ షెడ్యూల్ కంటే 48 గంటల ముందే నాంపల్లి హజ్‌హౌస్‌లో రిపోర్ట్ చేయాలని అధికారులు సూచించారు. 20 కేజీల రెండు లగేజ్ బ్యాగ్‌లు, 7 కేజీల హ్యాండ్ బ్యాగ్ మాత్రమే క్యారీ చేయాలని ప్రయాణికులకు సూచించారు. యాత్రకు సంబంధిన ప్రక్రియలు పూర్తి చేయడానికి హజ్ హౌస్‌లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. లగేజ్, కరెన్సీ, ఇమిగ్రేషన్, కస్టమ్స్‌తోపాటు బోర్డింగ్ పాస్‌లు కూడా అక్కడే అందజేస్తారు.

గిలోయ్ ఔషధం జీవామృతం

పతంజలి పరిశోధన సంస్థ

సాక్షి, హైదరాబాద్: ఎప్పటికైనా నిజమే గెలుస్తుందని తమ ఆయుర్వేద మెడిసిన్ గుడుచి (గిలోయ్) విషయంతో మరోసారి రుజువైందని పతంజలి విద్యాపీఠ్ తెలిపింది. ఆయుర్వేద ఔషధం గిలోయ్ గురించి గందరగోళం సృష్టించారని, కానీ కోవిడ్ సమయంలో అది కొన్ని లక్షల మంది ప్రాణాలు కాపాడిందని వెల్లడించింది. గిలోయ్ ఔషధం ఎలాంటి హానీ కలిగించదని ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పరిశోధన జర్నల్ ఫ్రంటైర్స్ ఇన్ ఫార్మకాలజీ ప్రచురించిందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నది.

నేడు ఆచార్య 'కేతు' అంత్యక్రియలు

కడప కల్చరల్: ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి అంత్యక్రియలు బుధవారం జరగనున్నాయి. బుధవారం ఉదయం ఆయన కుమారుడు, కుమార్తె విదేశాల నుంచి వచ్చాక అంత్యక్రియలు కడపలోగానీ, ఆయన స్వగ్రామంలోగానీ నిర్వహిస్తారు. ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి భౌతికకాయాన్ని మంగళవారం కడపలోని సింగపూర్ టౌన్‌షిప్‌లో ఉన్న ఆయన స్వగృహానికి కుటుంబీకులు చేర్చారు. భౌతికకాయానికి రైల్వేకోడూరు మాజీ శాసనసభ్యులు పెంచలయ్య దంపతులు, సాహిత్యాభిమానులు నివాళులర్పించారు.



- వచ్చే మార్చి కల్లా డిజైన్లు ఖరారు చేసి రైల్ కోచ్‌ల తయారీ ప్రారంభించాలని నిర్ణయం
- ప్రస్తుత వందేభారత్ రైళ్లతో పోలిస్తే స్పీడ్ ఎక్కువ, రూపు కూడా కొత్తగా
- దూర ప్రాంత నగరాల మధ్య రాత్రింబవళ్లు తిరిగేలా అందుబాటులోకి
- క్రమంగా ప్రీమియం రైళ్లను వాటితో రీప్లేస్ చేసే కసరత్తు

సాక్షి, హైదరాబాద్: విదేశాల్లోని ఆధునిక రైళ్లతో పోటీపడే రీతిలో రూపుదిద్దుకుని సూపర్ సక్సెస్ అయిన వందే భారత్ రైళ్ల తదుపరి వర్షన్ తయారీకి రైల్వే సిద్ధమైంది. ప్రస్తుతం చైర్ కార్ కోచ్‌లతో నడుస్తున్న ఈ రైళ్లలో స్లీపర్ కోచ్‌లను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి డిజైన్లు రూపొందించేందుకు రైల్వే చర్యలు ప్రారంభించింది. వచ్చే ఏడాది మార్చికల్లా డిజైన్లు ఖరారు చేసి రైల్ కోచ్‌ల తయారీ ప్రారంభించాలని నిర్ణయించింది.

ఇక వందే భారత్ స్లీపర్

ప్రస్తుత రైలుకు భిన్నంగా..

ప్రస్తుతం దేశవ్యాప్తంగా దాదాపు 800 కి.మీ. లోపు దూరం ఉన్న ప్రధాన నగరాల మధ్య వందే భారత్ రైళ్లను ప్రారంభిస్తున్న విషయం తెలిసిందే. దక్షిణ మధ్య రైల్వేకు సంబంధించి సంక్రాంతి రోజున సికింద్రాబాద్–విశాఖపట్నం మధ్య నడిచే తొలి వందేభారత్ రైలును, ఏప్రిల్‌లో రెండో వందే భారత్ సర్వీసుగా సికింద్రాబాద్–తిరుపతి మధ్య నడిచే రైలును ప్రారంభించిన విషయం తెలిసిందే. పగటి వేళ నడిచే రైళ్లు అయినప్పటికీ ఈ రెండు సర్వీసులు విజయవంతమయ్యాయి. వాటిల్లో ఆక్యుపెన్సీ రేషియో 110 శాతం నుంచి 140 శాతంగా నమోదవుతోంది. ఇలా దేశవ్యాప్తంగా చాలా వందేభారత్ రైళ్లు విజయవంతంగా నడుస్తున్నాయి. అయితే, వీటిల్లో బెర్తులు లేకపోవటంతో ప్రయాణికులు కూర్చునే వెళ్లాల్సి వస్తోంది. దీంతో ఎనిమిది గంటల్లో గమ్యం చేరేలా సమయాలను సెట్ చేశారు. దూర ప్రాంత నగరాల మధ్య నడపాలంటే, సమయం ఎక్కువ పడుతుంది, అంతసేపు కూర్చోవటం సాధ్యం కానందున కేవలం దగ్గరి నగరాల మధ్యనే తిప్పుతున్నారు. అయితే వీటిల్లో బెర్తులు ప్రవేశపెట్టి దూర ప్రాంత నగరాల మధ్య రాత్రింబవళ్లు తిప్పాలని రైల్వే నిర్ణయించింది.

మరింత వేగంగా....

గతంలో పగటి వేళ చైర్ కార్‌తో తిరిగేలా డబుల్ డెక్కర్ రైళ్లను ప్రవేశపెట్టారు. అన్ని వసతులు మెరుగ్గానే ఉన్నప్పటికీ వీటి వేగం సాధారణ రైళ్లలాగే ఉండేది. దీంతో గంటల తరబడి పగటి వేళ కూర్చుని ప్రయాణించేందుకు ప్రయాణికులు విముఖత చూపటంతో ఆ కేటగిరీ విజయం సాధించలేదు. వందేభారత్ రైళ్లు మాత్రం శతాబ్ది లాంటి ప్రీమియం రైళ్ల కంటే ఎక్కువ వేగంతో ప్రయాణించే వీలుండటంతో వీటి ప్రయాణ సమయం బాగా తక్కువగా ఉంది. ఈ కేటగిరీ సక్సెస్‌కు ఇదే ప్రధాన కారణం. దీంతో తదుపరి స్లీపర్ కేటగిరీ రైళ్లు మరింత వేంగంగా ప్రయాణించేలా ప్లాన్ చేస్తున్నారు. వాటి గరిష్ట వేగం దాదాపు 200 కి.మీ. మించి ఉంటుందని తాజాగా రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించటం ఆసక్తిని రేపుతోంది. అంత వేగంతో దూసుకుపోయేలా దీని డిజైన్‌ను రూపొందించనున్నారని, ఇది ప్రస్తుత వందేభారత్ రైళ్లకు భిన్నంగా ఉంటుందని పేర్కొంటున్నారు. ఇప్పటికే దేశంలోని అన్ని కోచ్ ఫ్యాక్టరీల్లో వందేభారత్ రైళ్లను రూపొందిస్తున్న విషయం తెలిసిందే. వాటిల్లో కొత్త రైలు నమూనాలను రూపొందించే పని ప్రారంభించినట్టు సమాచారం. మార్చి నాటికి నమూనా రైలును కూడా సిద్ధం చేసి కొన్ని నెలల పాటు ప్రయోగాత్మకంగా తిప్పాలని భావిస్తున్నారు. వందేభారత్ రైలు 2018లో రూపొందినా.. దాదాపు ఏడాదిన్నర పాటు దాన్ని పరిశీలించి పలు మార్పులు చేస్తూ వచ్చారు. కొత్త రైలుకు కూడా అలా పరిశీలించి మార్పులు చేసి, లోపాలు లేకుండా ప్రారంభించాలని భావిస్తున్నారు.

సాధారణ రైళ్లను రీప్లేస్ చేసేలా..

ప్రస్తుతం దేశవ్యాప్తంగా సంప్రదాయ నమూనా రైళ్లే నడుస్తున్నాయి. ప్రీమియం కేటగిరీ రైళ్లుగా పిలుచుకునే శతాబ్ది, తేజస్, రాజధాని, దురంతో లాంటివి కూడా సంప్రదాయ రూపులోనే ఉంటున్నాయి. ఇటీవల కోచ్‌లను మాత్రం ఐసీఎఫ్ బదులు ఎల్‌హెచ్‌బీవి జత చేస్తున్నారు. కొత్త వందేభారత్ రైలు పట్టాలెక్కటం ప్రారంభించాక ఇక ప్రీమియం కేటగిరీ రైళ్లను కొత్త వందేభారత్‌తో రీప్లేస్ చేయాలని భావిస్తున్నారు. ఆ తర్వాత సాధారణ రైళ్లను కూడా కొత్త రూపు రైళ్లతో మార్చే యోచనలో రైల్వే ఉంది.

6.84 లక్షల మందికి కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లు

24 జిల్లాల్లోని 111 కేంద్రాల్లో పంపిణీకి ఏర్పాట్లు: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 6.84 లక్షల గర్భిణులకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లు అందజేస్తామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు. మంగళవారం జిల్లా కలెక్టర్లు, జిల్లా వైద్యాధికారులతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. 14–26 వారాల సమయం (రెండో ఏఎన్‌సీ)లో, 27–34 వారాల సమయం (మూడో ఏఎన్‌సీ)లో కిట్లు పంపిణీ చేస్తామన్నారు. 24 జిల్లాల్లోని 111 కేంద్రాల్లో కిట్ల పంపిణీకి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. 21 రోజుల ఉత్సవాల్లో భాగంగా వైద్య,ఆరోగ్యశాఖకు కేటాయించిన రోజున ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. మాతృ మరణాలు తగ్గించడంలో దేశంలో మూడో స్థానంలో నిలిచామని, ఈ సంఖ్యను మరింత తగ్గించేందుకు న్యూట్రిషన్ కిట్ల పథకానికి రూపకల్పన చేసినట్లు తెలిపారు.

ఇప్పటికే తొమ్మిది జిల్లాల్లో అమలు

రక్తహీనత అధికంగా ఉన్న 9 జిల్లాల్లో ప్రభుత్వం ఇప్పటికే న్యూట్రిషన్ కిట్ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తోందని హరీశ్‌రావు తెలిపారు. ఇదిచ్చిన ఫలితాల స్ఫూర్తితోనే మిగతా 24 జిల్లాల్లోనూ కిట్ల పంపిణీని ప్రారంభిస్తున్నామని చెప్పారు. ఒక్కో కిట్ విలువ రూ.రెండు వేలు కాగా, మొత్తం రూ. 277 కోట్లుగా ప్రభుత్వం అంచనా వేసిందన్నారు. కాగా, కంటివెలుగు కింద 80 పని దినాల్లో 21.46 లక్షల మందికి రీడింగ్ గ్లాసెస్, 13 లక్షల మందికి ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ ఇచ్చినట్లు చెప్పారు.

జూన్ 9న చేప ప్రసాదం పంపిణీ

- వృద్ధులు, దివ్యాంగులు, చిన్న పిల్లలకు ప్రత్యేక కౌంటర్లు
- బత్తిని సోదరులు, అధికారులతో మంత్రి తలసాని సమీక్ష



సాక్షి, హైదరాబాద్ : మృగశిరకార్తె సందర్భంగా నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జూన్ 9న చేప ప్రసాదం పంపిణీ చేయనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో మంగళవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్, నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్, మత్స్యశాఖ కమిషనర్ లచ్చిరాం భూక్యా, చేప ప్రసాదం పంపిణీ చేసే బత్తిని సోదరులు గౌరీ శంకర్‌గౌడ్, శివశంకర్‌గౌడ్, అమర్నాథ్‌గౌడ్, అలకానందతో మంత్రి తలసాని సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడారు. చేప ప్రసాదం పంపిణీ కోసం చేప పిల్లలను ప్రభుత్వమే సరఫరా చేస్తుందన్నారు. చేప ప్రసాదం కోసం ఇతర రాష్ట్రాల నుంచి కూడా వస్తుంటారని, కాబట్టి వృద్ధులు, వికలాంగులు, చిన్న పిల్లలకు వేర్వేరుగా ప్రత్యేక కౌంటర్లు చేయాలని ఆదేశించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా బారికేడ్లు, తాగునీటి, వైద్య సేవలు, అంబులెన్స్‌లను అందుబాటు ఉంచాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భోజన సౌకర్యం ఉంటుందన్నారు. చేప ప్రసాదంపై మరోసారి ఈ నెల 25న వివిధ శాఖల అధికారులతో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

జీవ వైవిధ్య పరిరక్షణ అందరి బాధ్యత

బయో డైవర్సిటీ బోర్డు చైర్మన్ రజత్‌కుమార్



గన్‌ఫౌండ్రీ: జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలంగాణ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ రజత్‌కుమార్ అన్నారు. జీవ వైవిధ్య మండలి ఆధ్వర్యంలో అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవ వేడుకలు ఆదర్శ్‌నగర్‌లోని బిర్లా సైన్స్ సెంటర్లో మంగళవారం జరిగాయి. ఇందులో భాగంగా 'జీవ వైవిధ్యం-పునర్జీవనం' అంశంపై నిర్వహించిన సదస్సులో రజత్‌కుమార్ మాట్లాడారు. పర్యావరణాన్ని కాపాడుకోకపోతే భావి తరాలు మనల్ని క్షమించబోవన్నారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రీయ పద్ధతిలో అధిక దిగుబడులు వచ్చేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో బిల్డ్ బ్యాక్ బయోడైవర్సిటీ అనే అంశంపై విడబ్ల్యూఎఫ్ ఇండియా కన్సర్వేషన్ ప్రోగ్రామ్ డైరెక్టర్ డా.సేజల్ వారాహ ప్రసంగించారు. అలాగే బోర్డ్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ వేదికగా వ్యాసరచన, చిత్రలేఖనం, సంప్రదాయ నృత్యాల్లో పాఠశాల, కళాశాల విద్యార్థులు, ప్రజలకు పోటీలు నిర్వహించారు. తృణ ధాన్యాల వినియోగాన్ని పెంచేందుకు వంటల పోటీనీ నిర్వహించారు. 'మిల్లెట్స్ ఆఫ్ తెలంగాణ' ప్రదర్శన ఏర్పాటు చేశారు. పలు పుస్తకాలను ఆవిష్కరించారు.

దుబాయ్ కేంద్రంగా చైనీయుల దందా

ఇన్వెస్టిమెంట్ ఫ్రాడ్స్‌లో ఆ దేశీయులే కీలకం

- అనేక కొత్త ఎత్తులు వేస్తున్న సూత్రధారులు
- బాధితులుగా మారిన వారి నుంచి బ్యాంకు ఖాతాలు
- వీటిని వినియోగించే మరికొంత మందికి టోకరాలు
- కేసుల దర్యాప్తులో గుర్తించిన సైబర్ క్రైమ్ పోలీసులు



సాక్షి, హైదరాబాద్: టెలిగ్రామ్ యాప్ ద్వారా ఇన్వెస్టిమెంట్ ఫ్రాడ్‌లో చిక్కుకున్న ఓ మహిళ దాదాపు రూ.10 లక్షలు నష్టపోయింది. ఈమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు బ్యాంకు ఖాతాల ఆధారంగా దర్యాప్తు చేశారు. ఉత్తరాదికి చెందిన నలుగురి ఖాతాల్లోకి ఆ డబ్బు వెళ్లినట్లు గుర్తించారు. అక్కడకు వెళ్లిన ప్రత్యేక బృందం వారిని పట్టుకోగా.. వాళ్లంతా నిందితులుగా మారిన బాధితులని వెల్లడైంది.

ప్రత్యేక ప్రోగ్రామింగ్‌తో వ్యవహారం...

వివిధ రకాలైన సోషల్ మీడియా లింకుల ద్వారా వర్క్ ఫ్రమ్ హోమ్ పేరుతో ఎర వేస్తున్న నేరగాళ్లు తమ మోసాల కోసం ఆయా యాప్స్‌లో ప్రత్యేక ప్రోగ్రామింగ్ చేస్తున్నారు. ఒకటి రెండుసార్లు బాధితులు పెట్టిన పెట్టుబడికి 50 నుంచి 80 శాతం లాభాలు రావడంతో పాటు ఆ మొత్తం డ్రా చేసుకోవచ్చు. ఈ తర్వాత నుంచి లాభం వచ్చినట్లు యాప్‌లో కనిపించినా డ్రా చేసుకోవడానికి అవకాశం ఉండదు. ప్రతిసారీ పెట్టుబడి మొత్తాన్ని కూడా పెంచుతూ పోవాల్సిందే. ఇన్వెస్ట్ చేయగానే నిర్ణీత కాలంలో ఆ మొత్తం రెట్టింపు అయినట్లు యాప్‌లో కనిపిస్తుందే తప్ప తీసుకునే అవకాశం ఉండదు.

హఠాత్తుగా కనిపించకుండా పోతూ...

ఇలా బాధితుడి నుంచి కొంత మొత్తం వచ్చిన తర్వాత యాప్‌లో పెట్టుబడి ఆగిపోతుంది. ఆపై హఠాత్తుగా ఆ యాప్‌లోని బాధితుడి ఖాతా ఇక ఓపెన్ కాకుండా అదృశ్యమైపోతుంది. రోజూ రూ.లక్షలు కాజేస్తున్న ఈ ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్‌లో చైనీయులే సూత్రధారులుగా ఉంటున్నారు.

బాధితులను సంప్రదించి ఖాతాలు కావాలంటూ.. పావులుగా మార్చి

ఈ మోసగాళ్లు తమ వలలో పడి ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌లో రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు నష్టపోయిన వారినే పావులుగా చేసుకుంటున్నారు. బాధితులతో సంప్రదింపులు జరుపుతూ పోగొట్టుకున్న డబ్బు వెనక్కురావాలంటే తమకు కొన్ని బ్యాంకు ఖాతాలు కావాలంటూ కోరుతున్నారు. ఒక్కోఖాతాను రూ.25 వేల నుంచి రూ.30 వేలు ఇస్తామంటూ ఆశపెడుతున్నారు. పోగొట్టుకున్న సొమ్ముల్లో ఎంతో కొంత వస్తుందని ఆశ పడిన బాధితులు ఇందుకు అంగీకరించి తమ కుటుంబీకులు, బంధువులు, స్నేహితుల పేర్ల మీదా ఖాతాలు తెరుస్తున్నారు.

అక్కడ నుంచే వీటిని ఆపరేట్ చేస్తూ..

ఈ బ్యాంకు ఖాతాలకు సంబంధించిన నెట్ బ్యాంకింగ్ యూజర్ ఐడీలు, పాస్‌వర్డ్‌లను వాట్సాప్ ద్వారా బాధితులు సూత్రధారులకు పంపిస్తున్నారు. ఆపై వాళ్లు చెప్పే చిరునామాలకు లింకై ఉన్న ఫోన్ నంబర్లకు సంబంధించిన సిమ్‌కార్డులను కొరియర్ చేస్తున్నారు. వీటిని దగ్గర ఉంచుకుంటున్న సూత్రధారులు ఇక్కడ టార్గెట్ చేసిన వారితో నగదు ఈ ఖాతాల్లోనే వేయించుకుంటున్నారు. కేసు నమోదై, పోలీసులు దర్యాప్తు చేపట్టినా బ్యాంకు ఖాతా వివరాలు పంపిన నాటి బాధితుల వద్దకే వెళ్లి ఆగిపోవాల్సి వస్తోంది. ఇటీవల కాలంలో ఈ ఇన్వెస్టిమెంట్ ఫ్రాడ్స్ పెరిగిపోయాయని చెప్తున్న సైబర్ క్రైమ్ పోలీసులు అప్రమత్తంగా ఉండాలని చెప్తున్నారు. పరిచయం లేని వారితో ఆర్థిక లావాదేవీలు, ఇన్వెస్టిమెంట్స్ వద్దని స్పష్టం చేస్తున్నారు.

డీసీపీ వర్సెస్ డింపుల్



ముదిరిన ఐపీఎస్, సినీ నటి పార్కింగ్ వివాదం

- అధికారంతో నిజాన్ని దాచలేరంటూ నటి ట్వీట్
- దర్యాప్తులో అన్నీ వెలుగులోకి వస్తాయన్న హెగ్డే
- న్యాయపోరాటం చేస్తామంటూ హయతి సందేశం




కారు దిగివచ్చి కోన్లను తన్నుతున్న హయతి

సాక్షి, హైదరాబాద్/బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ జర్నలిస్ట్ కాలనీలోని ఎస్‌కేఆర్ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్‌లో పార్కింగ్ విషయంలో హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీ–1 రాహుల్ హెగ్డే, సినీ నటి డింపుల్ హయతి మధ్య తలెత్తిన వివాదం ముదిరింది. ఈ నెల 14న చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు సోమవారం డింపుల్‌తోపాటు ఆమె సన్నిహితుడు డేవిడ్‌కు నోటీసులు జారీ చేశారు. దీనిపై మంగళవారం డింపుల్ ట్వీట్ చేయడంతోపాటు ఆడియో సందేశాన్ని విడుదల చేశారు. మరోపక్క రాహుల్ సైతం తన వాదనను సందేశం రూపంలో మీడియాకు పంపారు. అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో జరిగిన ఈ వ్యవహారానికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్ కూడా మంగళవారం బయటకొచ్చింది.

కేసు పూర్వాపరాలు

ఎస్‌కేఆర్ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్స్‌లో రాహుల్ హెగ్డేతోపాటు డింపుల్ హయతి కూడా అద్దెకు ఉంటున్నారు. డీసీపీ అధికారిక వాహనాన్ని డింపుల్ తరచూ కాలితో తన్నడమే కాకుండా డేవిడ్‌తో కలిసి బెంజ్ కారును రివర్స్‌లో తీసుకొచ్చి ఢీ కొట్టడం, కారుకు భద్రతగా ఏర్పాటు చేసిన కోన్స్‌ను పడేయడం, పోలీసులను కించపరిచేలా ప్రవర్తించడం, గన్‌మెన్లను బెదిరించడం తదితర ఆరోపణలతో డ్రైవర్ చేతన్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా పోలీసులు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన ఘటనకు సంబంధించి ఐపీసీ సెక్షన్ 353, 341, 279 కింద కేసు నమోదు చేసి విచారణకు రావాలని డింపుల్, డేవిడ్‌లకు నోటీసులు జారీ చేశారు.



డింపుల్ ట్వీట్‌తో ముదిరి..

ఈ వ్యవహారంపై డింపుల్ మంగళవారం వరుస ట్వీట్లు చేయడంతో వివాదం ముదిరింది. ఎవరైనా సరే తమ అధికారాన్ని ఉపయోగించి తప్పులను దాచలేరన్నారు. సాయంత్రానికి ఆమెకు సంబంధించిన మరో ఆడియో సందేశం బయటకొచ్చింది. గన్‌మెన్లను పెట్టుకొని ఉన్న అంత పెద్ద ఆఫీసర్లను తానేం చేస్తానని అందులో వ్యాఖ్యానించారు. తన మీద తప్పుడు కేసు పెట్టారన్నారు. ట్రాఫిక్ కోన్స్‌ను ప్రైవేట్ అపార్ట్‌మెంట్‌లో ఎలా పెడతారని ప్రశ్నించారు. తాము కారుతో డీసీపీ వాహనాన్ని ఢీకొట్టలేదని, ఆ కారుకు ఎక్కడైనా ప్రమాదం జరిగి ఉండొచ్చని చెప్పారు. తాము ఢీ కొడితే తమ వాహనమూ డ్యామేజ్ అయి ఉండాలి కదా? అని ప్రశ్నిస్తూ, తానూ తెలుగు అమ్మాయినే అని పేర్కొన్నారు.

హయతిని చాలాసార్లు రిక్వెస్ట్ చేశా..

డింపుల్ ట్వీట్‌పై డీసీపీ రాహుల్ హెగ్డే స్పందించారు. 'అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో ఆమె నా కారుకు ఎదురుగా తన కారును పార్క్ చేస్తున్నారు.నేను అర్జంటుగా బయటికి వెళ్లాలనుకున్నప్పుడు కారు తీయలేక ఇబ్బంది పడుతున్నా. దీనిపై నేనే స్వయంగా వెళ్లి పలుమార్లు ఆమెను రిక్వెస్ట్ చేశా. నా కారును కాలితో గట్టిగా తన్నడమే కాకుండా ఢీకొట్టింది. ప్రభుత్వ కారును ధ్వంసం చేసినందుకు మా డ్రైవర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని తప్పును కప్పిపుచ్చుకుంటున్నారంటూ ఆమె ట్వీట్ చేశారు. పోలీసుల విచారణలో నిజానిజాలు బయటికి వస్తాయి' అంటూ మీడియాకు సందేశం పంపారు.

పీఆర్ ఇంజనీరింగ్ శాఖ పునర్వ్యవస్థీకరణ

- 87 కొత్త కార్యాలయాల మంజూరు
- ఉత్తర్వులు జారీచేసిన సర్కార్

సాక్షి, హైదరాబాద్: పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ పునర్వ్యవస్థీకరణకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ఆరు నెలలుగా జరుగుతున్న కసరత్తు.. మంగళవారం జారీ చేసిన జీవోలతో కొలిక్కి వచ్చినట్లయింది. కొత్తగా 87 కార్యాలయాలు మంజూరు చేసింది. ఈమేరకు పీఆర్, ఆర్‌డీ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మంగళవారం ఉత్తర్వులిచ్చారు. ఆయా హోదాల్లో ఉన్న ఇంజనీర్లకు అధికారాల బదలాయింపు సైతం చేపట్టారు. దీనికోసం మరో జీవో(నంబర్ 19)ను జారీ చేశారు. దీంతో పీఆర్ ఇంజనీరింగ్ విభాగం మరింత చురుగ్గా పనిచేసేందుకు అవకాశం ఏర్పడుతుంది. విద్యుత్, ఆర్ అండ్ బీ, సాగునీటి పారుదల శాఖ తరహాలోనే పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖను బలోపేతం చేయాలని సీఎం కేసీఆర్ భావించారు. ఈమేరకు ప్రతిపాదనలను పంపాలని గత నవంబరులో ఇంజనీర్ ఇన్ చీఫ్ ఏజీ సంజీవరావును ఆదేశించారు. సంజీవరావు సమగ్ర నివేదిక పంపగా, దీన్ని పరిశీలించే బాధ్యతను కేసీఆర్ పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావుకు అప్పగించారు. వీరు పంపిన ప్రతిపాదలపై చర్చించి తాజాగా ఆమోదముద్ర వేశారు.


పనులు మంజూరు చేసే అధికారం

ఈ జీవో ప్రకారం, కొత్తగా 4 చీఫ్ ఇంజనీర్, 12 సర్కిల్ ఇంజనీర్ కార్యాలయాలు, 11 డివిజనల్ ఇంజనీర్ కార్యాలయాలు, 60 సబ్ డివిజనల్ కార్యాలయాలు, ఇంజనీర్ పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. వివిధ స్థాయిల్లో ఇంజనీర్లకు పనులు మంజూరు చేసే అధికారం కల్పించింది. డీఈఈకి ఏడాదికి రూ.5 లక్షలు, ఈఈకి ఏడాదికి రూ.25 లక్షలు, ఎస్‌ఈకి రూ.కోటి, సీఈకి రూ.2.5 కోట్లు, ఈఎన్సీకి రూ.5 కోట్ల వరకు పరిపాలన అనుమతులు ఇచ్చే అధికారం కల్పించారు. పోస్టులు మంజూరు చేసినందుకు సీఎం కేసీఆర్‌కు ఈఎన్సీ సంజీవరావు కృతజ్ఞతలు తెలిపారు. ఎర్రమంజిల్‌లోని ఇంజినీరింగ్ శాఖ ప్రధాన కార్యాలయంలో ఇంజినీర్లు, ఉద్యోగులు సంబరాలు చేసుకున్నారు. టపాసులు పేల్చారు.

విద్య, ఉపాధి కోసం వెళ్లే వారికి ప్రాధాన్యం

రీ షెడ్యూల్డ్ చేసుకునే వారు డాక్యుమెంట్లు పరిశీలించుకోవాలి

- అపాయింట్‌మెంట్లు వృథా కానీయొద్దు
- రీజనల్ పాస్‌పోర్టు అధికారి దాసరి బాలయ్య



సాక్షి, హైదరాబాద్/రాంగోపాల్‌పేట్: స్పెషల్ డ్రైవ్‌లో పాస్‌పోర్టు అపాయింట్‌మెంట్లు రీషెడ్యూల్ చేసుకునే వారు సరైన డాక్యుమెంట్లు ఉండేలా చూసుకోవాలని హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి దాసరి బాలయ్య సూచించారు. సరైన పత్రాలు సమర్పించలేని కారణంగా రోజూ 10–15 శాతం దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్య, ఉపాధి, వైద్య అవసరాల కోసం వెళ్లే వారికే రీషెడ్యూల్ చేసుకోవడానికి ప్రాధాన్యత ఇస్తామని వివరించారు. వీరు మినహా ఇతరుల ప్రీ అపాయింట్‌మెంట్ అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు. తీర్థయాత్రలు, పర్యాటకం నిమిత్తం వెళ్లే వారు కూడా రీషెడ్యూల్ చేసుకుంటున్నారని, దరఖాస్తుదారులు, వారిపై ఆధారపడిన వారి పాస్‌పోర్టు చెల్లుబాటును చూసుకోకుండా వస్తున్నందున వారి దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయని చెప్పారు. తత్కాల్ దరఖాస్తులను ప్రాసెస్ చేయడానికి అపాయింట్‌మెంట్ సమయంలో ధ్రువీకరణ కోసం ప్రభుత్వ సంస్థలు జారీ చేసిన మూడు చిరునామా గుర్తింపు కార్డులనూ తప్పనిసరిగా చూపించాలన్నారు. తత్కాల్‌లో అపాయింట్‌మెంట్ బుక్ చేసుకోవడానికి ముందే www.passportindia.gov.in వెబ్‌సైట్‌లో అవసరమైన ధ్రువపత్రాల గురించి తెలుసుకోవాలని కోరారు.

అవి శనివారమూ పనిచేస్తాయి

తదుపరి ఆదేశాలు వచ్చేవరకు 14 పోస్టాఫీస్ పాస్‌పోర్టు సేవాకేంద్రాలు ప్రతి శనివారం పనిచేస్తాయని బాలయ్య తెలిపారు. ప్రతి బుధవారం సాయంత్రం 4–4.30 గంటల మధ్యలో 700 అపాయింట్‌మెంట్లు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. మే 31 వరకు మొత్తం 12,650 అదనపు అపాయింట్‌మెంట్లను రోజుకు 550 చొప్పున ఆర్పీవో పరిధిలోని 5 పాస్‌పోర్టు సేవా కేంద్రాల్లో ప్రతి శుక్రవారం సాయంత్రం 4–4.30 గంటల మధ్య విడుదల చేస్తున్నామన్నారు.

చెన్నైలో ముగిసిన శరత్‌బాబు అంత్యక్రియలు

తమిళ సినిమా: సినీ నటుడు శరత్‌బాబు భౌతిక కాయానికి మంగళవారం చెన్నైలోని గిండిలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. హైదరాబాద్ నుంచి ఆయన పార్థీవదేహాన్ని ఉదయం చెన్నైకి తరలించారు. నటులు రజనీకాంత్, సూర్య, కార్తీ, భానుచందర్, రాజేశ్, భాగ్యరాజ్, పూర్ణిమా భాగ్యరాజ్, శరత్‌కుమార్, రాధిక దంపతులు, నటి సుహాసిని, దర్శకుడు సురేశ్‌కృష్ణ, నిర్మాత పుష్పా కందసామి దంపతులు మొదలగు ప్రముఖులు భౌతికకాయానికి నివాళులర్పించారు. మెగాస్టార్ చిరంజీవి షూటింగ్ కారణంగా విదేశాల్లో ఉండటంతో అంత్యక్రియల్లో పాల్గొనలేకపోతున్నట్లు ఫోన్ ద్వారా తెలియజేశారని, నటుడు కమల్‌హాసన్ షూటింగ్ కారణంగా రాలేకపోతున్నట్లు బుధవారం వచ్చి శరత్‌బాబు కుటుంబ సభ్యులను పరామర్శిస్తానని చెప్పినట్లు సుహాసిని మీడియాకు చెప్పారు. శరత్‌బాబు పార్థీవ దేహానికి ఆయన కుటుంబ సభ్యులు శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు.



శరత్‌బాబు అంతిమ యాత్ర

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.